

'గ్రామాల్లో సంపద పెరగాలి.
పెరిగిన సంపద గ్రామీణ ప్రజలకే చెందాలి'

సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹6.50

సంపుటి: 15
సంచిక: 251

SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | DELHI | VIJAYAWADA | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

ఫ్యాషన్











# పాకెట్ స్టైల్

ప్యాంట్, షర్ట్‌కి పాకెట్స్ ఉండటం తెలిసిందే
కానీ, ఎవర్‌గ్రీన్ డ్రెస్‌గా కితాబులు అందుకునే శారీ కట్టుకుంటే..
వెంట పర్స్ లేదా బ్యాగ్ తప్పనిసరి అనుకునేవారికి
పాకెట్ శారీస్ ఈ కాలానికి అనువుగా ఉంటున్నాయి.
హుందాతనం, స్టైలిష్ లుక్‌తో ఆకట్టుకుంటున్నాయి.
ఫోన్, మనీ వెంట తీసుకెళ్లడానికి
ఉపయోగకరంగానూ ఉంటున్నాయి.

### ప్యాచ్ వర్క్
చీరకు తగినంత పరిమాణంలో కాంట్రాస్ట్ కలర్ క్లాత్ తీసుకొని, దానిని నడుము భాగాన జత చేస్తే పాకెట్ రెడీ అవుతుంది.

### ఎంబ్రాయిడరీ వర్క్
పూసలు, అద్దాలు, జరీ దారాలతో పాకెట్ క్లాత్‌కు ఎంబ్రాయిడరీ వర్క్ చేసి, దానిని చీరకు జత చేయచ్చు.

### మ్యాచింగ్
జాకెట్, పాకెట్ ఒకే ఫ్యాబ్రిక్‌తో మ్యాచ్ చేయడం వల్ల చీరకట్టుకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి.

న్యూ ట్రెండ్

# స్టార్స్ స్టాకింగ్ క్రేజ్





ఒకప్పుడు మల్టీపుల్ రింగ్స్ వేళ్లకు ధరించడం అనేది ప్రత్యేక శుభసందర్భాలకు మాత్రమే పరిమితమైన విషయం. అయితే ఇప్పుడు మల్టీ రింగ్ కల్చర్ లేదా స్టాకింగ్ రింగ్ క్రేజ్ ‘ఎవ్రీ డే వేర్’గా మారింది.

‘రింగ్’ అనేది అలంకారప్రాయమైనదే కాదు స్టేట్‌మెంట్ పీస్ కూడా.

శుభసందర్భాలు, సాంస్కృతిక ప్రత్యేకతలు, జ్ఞాపకాలు, జ్ఞాపకాలతో ఆ ముడిపడిన అనుబంధాలు, భౌగోళిక అందాలు, ఆలోచనల తీరు... ఇలా ఎన్నో కోణాలలో రింగ్ ప్రతిఫలిస్తుంది.

స్టాకింగ్ రింగ్ క్రేజ్‌ను దృష్టిలో పెట్టుకొని ప్రపంచవ్యాప్తంగా ఎంతో మంది డిజైనర్‌లు రకరకాల కాన్సెప్ట్‌లతో స్టాకింగ్ రింగ్‌లను డిజైన్ చేశారు.

‘బెస్ట్ స్టాకింగ్ రింగ్ ఐడియాలు’ అంతర్జాలంలో హల్‌చల్ చేస్తున్నాయి.

స్టాకింగ్ రింగ్స్ డిజైన్‌కు సంబంధించి క్రియేటివిటీకి ఆకాశమే హద్దు.

బాలీవుడ్ అందాల తారలు జాన్వి కపూర్ నుంచి ప్రియాంకచోప్రా వరకు ఎంతోమంది ఈ ‘స్టాకింగ్ రింగ్ క్రేజ్’ను ‘లవ్ యా’ అంటున్నారు. అభిమానులు కూడా వారిని అనుసరిస్తున్నారు.

కళ

# నటరాజు దీవించిన నాట్య సుధా నిధులు



● అశ్విని, అపర్ణల నృత్య కౌశలం

భావం, రాగం, తాళం...
ఈ మూడు నృత్య కళాంశాల
సమ్మేళనం భరతనాట్యం.
అరవై నాలుగు ముఖ,
హస్త, పాద కదలికల
అపురూప విన్యాసం భరతనాట్యం.
మూడు దశాబ్దాల క్రిందట అమెరికాలో
‘రాగమాల డ్యాన్సింగ్ కంపెనీ’ మొదలు పెట్టి
ఆ నాట్య వైభవాన్ని దశదిశలా
తీసుకువెళుతోంది రాణీ రామస్వామి.
తానే ఒక సైన్యంగా మొదలైన
రాణీ రామస్వామికి ఇప్పుడు
ఇద్దరు కూతుళ్ల రూపంలో
శక్తిమంతమైన సైనికులు తోడయ్యారు....

‘మేము గత జన్మలు, పునర్జన్మల గురించి తరచుగా మాట్లాడుకుంటూ ఉంటాం. మా పెద్ద అమ్మాయి అపర్ణకు మూడు సంవత్సరాల వయసు నుంచే నృత్యంపై అనురక్తి ఏర్పడింది. ఆమె పూర్వజన్మలో నృత్యకారిణి అని నా నమ్మకం’ అంటుంది రాణీ రామస్వామి.

చెన్నైలో పుట్టిన రాణీ రామస్వామికి ఏడు సంవత్సరాల వయసులో భరతనాట్యంతో చెలిమి ఏర్పడింది.

డెబ్బై ఒకటో యేట ఆమెకు ఆ నాట్యం శ్వాసగా మారింది. ఈ వయసులోనూ చురుగ్గా ఉండడానికి అవసరమైన శక్తిని, ఉత్సాహాన్ని ఇస్తోంది.

మూడు దశాబ్దాల క్రితం ఆమె అమెరికాలోని మినియాపొలిస్‌లో ‘రాగమాల డ్యాన్స్ కంపెనీ’కి శ్రీకారం చుట్టింది. ఈ కంపెనీ ద్వారా అమెరికాలో నృత్యాభిమానులైన ఎంతో మందికి ఆత్మీయురాలిగా మారింది. భరతనాట్యాన్ని ముందుకు తీసుకువెళ్లే ఇంధనం అయింది.

‘రాగమాల’ ద్వారా ప్రసిద్ధ జాతీయ, అంతర్జాతీయ కళాకారులు, సంస్థలతో కలిసి పనిచేస్తోంది రాణీ రామస్వామి.

‘రాగమాల ట్రైనింగ్ సెంటర్’ ద్వారా ఏడు సంవత్సరాల వయసు నుంచే భరతనాట్యంలో శిక్షణ పొందుతున్నారు ఎంతోమంది పిల్లలు.

‘అమ్మా, నేను, అక్క ఒక దగ్గర ఉంటే అపురూపమైన శక్తి ఏదో మా దరి చేరినట్లు అనిపిస్తుంది. ప్రేక్షకుల్లో కూర్చొని వేదికపై వారి నృత్యాన్ని చూసినప్పుడు, డ్యాన్స్ చేస్తూ ప్రేక్షకుల్లో కూర్చున్న వారిని చూస్తున్నప్పుడు, మేము ముగ్గురం కలిసి నృత్యం చేస్తున్నప్పుడు....అది మాటలకందని మధురభావన’ అంటోంది అశ్వినీ రామస్వామి.

పాశ్చాత్య ప్రేక్షకులకు భరతనాట్యంలోని సొగసు అర్థమయ్యేలా, ఆకట్టుకునేలా చేయడంలో రాణీ రామస్వామి విజయం సాధించింది.

‘క్రియేటివ్ పర్సన్ లేదా ఆర్టిస్ ప్రయాణం ఒంటరిగానే మొదలవుతుంది. ఆ ప్రయాణంలో వేరే వాళ్లు తోడైనప్పుడు ఎంతో శక్తి వస్తుంది. అమ్మ విషయంలోనూ ఇదే జరిగింది. ఇప్పుడు మాతో పాటు ఎంతోమంది ఆమె వెంట ప్రయాణం చేస్తున్నాం’ అంటుంది అపర్ణ రామస్వామి.

భరతనాట్యానికి సంబంధించి ఈ ముగ్గురికి 3డీలు అంటే ఇష్టం. డీప్ లవ్, డెడికేషన్, డిసిప్లిన్.

‘ప్రశంసల సంగతి సరే, విమర్శల సంగతి ఏమిటి?’ అనే ప్రశ్నకు వీరు ఇచ్చే సమాధానం...

‘విమర్శ కోసం విమర్శ అని కాకుండా హానెస్ట్ ఫీడ్ బ్యాక్ అంటే ఇష్టం. దీని ద్వారా మనల్ని మనం మరింతగా మెరుగుపరుచుకోవడానికి అవకాశం ఏర్పడుతుంది.

హిందూ, సూఫీ తత్వాన్ని మేళవిస్తూ రూపొందించిన ‘రిటెన్ ఇన్ వాటర్’ నృత్య రూపకం భౌగోళిక సరిహద్దులను చెరిపేసి అందరినీ ఒకే ప్రపంచంలోకి తీసుకువచ్చింది.

‘రాగమాల డ్యాన్సింగ్ కంపెనీ’ ద్వారా మూడు దశాబ్దాల ప్రయాణం సులువైన విషయం ఏమీ కాదు.

ప్రయాణంలో...కొందరు కొన్ని అడుగుల దూరంతో వెనుదిరుగుతారు. కొందరు కొన్ని కిలోమీటర్ల దూరంలో వెనుతిరుగుతారు. కొందరు మాత్రం వందలాది కిలోమీటర్లు అలుపెరగకుండా ప్రయాణిస్తూనే ఉంటారు. రాణీ రామస్వామి ఆమె కూతుళ్లు అపర్ణ, అశ్వినిలు అచ్చంగా ఈ కోవకు చెందిన కళాకారులు.



● కూతుళ్లతో రాణీ రామస్వామి

### నోట్స్ రెడీ

ఇద్దరు కూతుళ్లు అపర్ణ, అశ్విని తల్లితో పాటు కూర్చుంటే కబుర్లకు కొరత ఉండదు. అయితే అవి కాలక్షేపం కబుర్లు కాదు. కళతో ముడిపడి ఉన్న కబుర్లు. అమ్మ రాణీ రామస్వామి తన సుదీర్ఘ ప్రయాణానికి సంబంధించిన విలువైన అనుభవం ఒకటి ఆ సంభాషణలలో మెరిసి ఉండవచ్చు. ఈతరానికి నాట్యాన్ని ఎలా దగ్గర చేయాలి అనేదాని గురించి పిల్లలిద్దరూ తల్లితో చర్చించి ఉండవచ్చు. ఇలా ఎన్నెన్నో ఉండవచ్చు. ఈ కబుర్లు వృథాగా పోవడం ఎందుకని అర్చన, అశ్విన్‌లు నోట్స్‌తో రెడీగా ఉన్నారు.

# తురుముదాం తరుగుదాం

వంటిల్లు



### ఆనియన్ పరాఠా



**కావలసినవి:** గోధుమ పిండి - 400 గ్రా; ఉల్లిపాయ ముక్కలు - 150 గ్రా; చీజ్- 100 గ్రా (తురమాలి); మిరియాల పొడి- టీ స్పూన్; నూనె- టేబుల్ స్పూన్; నెయ్యి- టేబుల్ స్పూన్; ఉప్పు- అర టీ స్పూన్ లేదా రుచిని బట్టి.

**తయారీ:** ● పెనంలో టీ స్పూన్ నూనె వేడి చేసి ఉల్లిపాయ ముక్కలను వేయించి పక్కన పెట్టుకోవాలి. ● పెద్ద పాత్రలో గోధుమపిండి, ఉప్పు, చీజ్, మిరియాల పొడి, నెయ్యి, వేయించిన ఉల్లిపాయ ముక్కలు వేసి తగినంత నీటితో ముద్దగా కలుపుకోవాలి. ● ఈ పిండిని పెద్ద గోళీలంత ముద్దలు చేసి చపాతీ పీట మీద వత్తాలి. ● పెనం వేడి చేసి కొద్దిగా నూనె వేసి ఒక్కో పరాఠాను రెండు వైపులా ఎరుపు రంగు వచ్చే వరకు మీడియం మంట మీద కాల్చాలి. ఈ పరాఠాలను వేడిగా వడ్డించాలి. ఇది సింధీ వంట. ఆ భాషలో కోకి అంటారు. ఎండాకాలంలో చపాతీలు తింటే వేడి చేస్తుందనిపిస్తే ఈ ఆనియన్ పరాఠాలు చేసుకోవచ్చు.

### ఆనియన్ క్యారట్ సూప్



**కావలసినవి:** క్యారట్ ముక్కలు- 300 గ్రాములు; ఉల్లిపాయ ముక్కలు - 100 గ్రాములు; నూనె - టీ స్పూన్; యాపిల్ ముక్కలు - అర కప్పు; ఉప్పు - అర టీ స్పూన్ లేదా రుచిని బట్టి; కొత్తిమీర తురుము- టీ స్పూన్; పుదీన ఆకులు - పది; మెంతి ఆకులు- గుప్పెడు; పాలు - అర కప్పు; నీరు - ఒకటిన్నర కప్పు; మిరియాల పొడి- అర టీ స్పూన్.

**తయారీ:** ● ప్రెషర్ పాన్‌లో నూనె వేడి చేసి అందులో ఉల్లిపాయ ముక్కలను వేసి రెండు నిమిషాల సేపు మగ్గనివ్వాలి. ఆ తరవాత అందులో క్యారట్ ముక్కలు, యాపిల్ ముక్కలు, నీరు పోసి బాగా కలిపి మూత పెట్టి మూడు విజిల్స్ వచ్చే వరకు ఉడికించాలి.
● చల్లారిన తరవాత మొత్తాన్ని మిక్సీ జార్‌లో వేసి మెత్తగా గ్రైండ్ చేయాలి. ● ఈ మిశ్రమాన్ని మరొక బాణలిలో పోసి అందులో కొత్తిమీర, పుదీన ఆకులు, మెంతి ఆకు, పాలు, ఉప్పు, మిరియాల పొడి వేసి మూడు నిమిషాల సేపు మీడియం మంట మీద ఉడికించి దించేయాలి. ● క్యారట్- ఆనియన్ సూప్‌ని వేడిగా సర్వ్ చేయాలి.


### మినీ ఆనియన్ సమోసా



**కావలసినవి:** సమోసా పిండి కోసం; గోధుమ పిండి లేదా మైదా- 150 గ్రా; నూనె- 2 టీ స్పూన్‌లు; జీలకర్ర - అర టీ స్పూన్; ఉప్పు - చిటికెడు.
**సమోసా వేయించడానికి:** నూనె- దాదాపుగా పావు కేజీ; **సమోసా లోపల స్టఫింగ్ కోసం:** ఉల్లిపాయ ముక్కలు - కప్పు (సన్నగా తరగాలి) నూనె- 2 టీ స్పూన్‌లు; జీలకర్ర- అర టీ స్పూన్; ఉప్పు- పావు టీ స్పూన్ ; మిరప్పొడి - టీ స్పూన్; గరం మసాలా పొడి- అర టీ స్పూన్; ఆమ్‌చూర్ లేదా నిమ్మరసం - అర టీ స్పూన్ (ఎండిన మామిడి చూర్ణం); పసుపు - పావు టీ స్పూన్; కొత్తిమీర - 2 టేబుల్ స్పూన్‌లు (సన్నగా తరగాలి); శనగ పిండి- టేబుల్ స్పూన్.

**తయారీ:** ● సమోసా పిండి కోసం తీసుకున్న అన్నింటినీ ఒక పాత్రలో వేసి తగినంత నీటితో చపాతీల పిండిలా కలిపి తడి వస్త్రాన్ని కప్పి పక్కన ఉంచుకోవాలి. ● ఇప్పుడు స్టఫింగ్ సిద్ధం చేసుకోవాలి. బాణలిలో నూనె వేడి చేసి జీలకర్ర వేయించిన తర్వాత ఉల్లిపాయ ముక్కలు వేసి రెండునిమిషాల సేపు మగ్గనిచ్చి స్టవ్ మీద నుంచి దించేయాలి. అందులో మిరప్పొడి, గరం మసాలా, ఆమ్‌చూర్ లేదా నిమ్మరసం, పసుపు, కొత్తిమీర తరుగు, శనగపిండి, ఉప్పు వేసి బాగా కలిపి పక్కన పెట్టాలి. ● సమోసాల పిండిని చిన్న గోళీలు చేసుకుని ఒక్కో గోళీని చిన్న చపాతీలా వత్తి, ఒక్కో చపాతీని రెండుగా కట్ చేయాలి. ఇలా చేయడం వల్ల వలయాకారంగా ఉన్న చపాతీ అర్ధవలయాకారపు ముక్కలవుతుంది. ఒక్కో ముక్కను కోన్‌లా చుట్టి అందులో స్టఫింగ్ మిశ్రమాన్ని ఒక స్పూన్ పెట్టి అంచులు మూసేసి అతుక్కునేటట్లు వేళ్లతో నొక్కాలి. ఇలా పిండినంతటినీ చేసుకోవాలి. ఇక్కడ తీసుకున్న కొలతలతో దాదాపుగా 20 సమోసాలు చేయవచ్చు. ● బాణలిలో నూనె వేడి చేసి సమోసాలను దోరగా వేయించాలి.

### ఆనియన్ ఊతప్పం



**కావలసినవి:** పిండి కోసం; మినప్పప్పు - కప్పు; మెంతులు- టేబుల్ స్పూన్; పచ్చి బియ్యం - 2 కప్పులు; ఉప్పుడు బియ్యం (బాయిల్డ్ రైస్) - 2 కప్పులు; అటుకులు - కప్పు; ఉప్పు- టీ స్పూన్.
**ఊతప్పం కోసం:** ఉల్లిపాయ ముక్కలు -2 కప్పులు (సన్నగా తరగాలి); కొత్తిమీర - కప్పు (సన్నగా తరగాలి); ఉప్పు - చిటికెడు; నూనె- టేబుల్ స్పూన్.

**తయారీ:** ● దోశ పిండితో ఊతప్పం చేసుకోవచ్చు. కానీ ఊతప్పం కోసం పైన చెప్పిన కొలతలు పాటిస్తే ఊతప్పం మృదువుగా, రుచిగా ఉంటుంది. మినప్పప్పు, మెంతులు, బియ్యాన్ని కడిగి ఆరు గంటల సేపు నానబెట్టాలి. రుబ్బేటప్పుడు అటుకులు, ఉప్పు వేయాలి. మెత్తగా రుబ్బిన ఈ మిశ్రమాన్ని రాత్రంతా నాననివ్వాలి. ఉదయానికి పిండి బాగా పొంగి ఉంటుంది. ● ఉల్లిపాయ ముక్కలు, కొత్తిమీర తరుగు, ఉప్పు ఒక పాత్రలో వేసి కలిపి సిద్ధం చేసుకోవాలి. ● పెనాన్ని వేడి చేసి ఒక గరిటె పిండితో మందంగా దోశ వేసి పైన ఉల్లిపాయ ముక్కల మిశ్రమం ఒక టీ స్పూన్ వేసి సమంగా సర్ది చుట్టూ కొద్దిగా నూనె వేయాలి. ఒకవైపు కాలిన తర్వాత ఉల్లిపాయ ముక్కలు రాలిపోకుండా జాగ్రత్తగా తిరగేసి రెండవ వైపు కూడా కాల్చాలి. అవసరమనిపిస్తే రెండో వైపు కాలేటప్పుడు కూడా కొద్దిగా నూనె వేసుకోవచ్చు.

**గమనిక:** ఎండాకాలం నూనెతో తింటే దాహం పెరుగుతుందనిపిస్తే పెనం మీద ఊతప్పం వేసిన తర్వాత మూత పెట్టి సన్న మంట మీద ఆవిరికి ఉడకనివ్వాలి. రెండవ వైపు కాలేటప్పుడు మూత పెట్టకూడదు.


'అన్నం పెట్టే రైతన్నను రుణ విముక్తుణ్ని చేయడమే నా ముందున్న లక్ష్యం'

సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15 సంచిక: 251

శుక్రవారం 26-5-2023

SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | DELHI | VIJAYAWADA | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL






**చెన్నైతో ఢీకొట్టేదెవరు?**

ఐపీఎల్ టోర్నీలో నేడు ముంబై, గుజరాత్ మధ్య రెండో క్వాలిఫయ్యర్ - 11లో



**పటిష్టంగా లాభదాయకత**

ఆస్తుల నాణ్యతలోనూ బ్యాంకులు మెరుగు: ఎస్‌అండ్‌పీ రేటింగ్స్ - 11లో



**మరో రెండు చీతా కూనలు మృతి**

మధ్యప్రదేశ్‌లోని కునో జాతీయవనంలో మరో రెండు చీతా కూనలు మరణించాయని అటవీ శాఖ అధికారులు తెలిపారు.

వివరాలు 6లో ▸



**కుల ఓటు.. తారుమారు**

కర్ణాటక ఎన్నికల్లో లింగాయత్‌లు బీజేపీకి షాక్ ఇవ్వగా.. వొక్కలిగలు జేడీ(ఎస్)కు దూరమయ్యారని తేలింది.

వివరాలు 6లో ▸



**జైల్లో కుప్పకూలిన జైన్**

లిక్కర్ స్కామ్ కేసులో జైలులో ఉన్న ఢిల్లీ మాజీ మంత్రి సత్యేంద్ర జైన్ కళ్లు తిరిగి పడిపోవడంతో ఆస్పత్రికి తరలించారు.

వివరాలు 6లో ▸



**శ్రీకాంత్ జోరు..**

మలేసియా మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్ 500 బ్యాడ్మింటన్ టోర్నీలో కిడాంబి శ్రీకాంత్ క్వార్టర్ ఫైనల్‌లోకి దూసుకెళ్లాడు.

వివరాలు 11లో ▸

## న్యూస్‌రీల్

### సచివాలయ ఉద్యోగులకు బదిలీలు



గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల బదిలీలకు ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. మెడికల్ గ్రౌండ్స్, భార్యభర్తలిద్దరూ ప్రభుత్వ ఉద్యోగులు, సింగిల్ ఉమెన్ కేటగిరీలో జిల్లా పరిధిలో బదిలీని కోరవచ్చు.

వివరాలు 2లో ▸

### విలువ ఆధారిత ఉత్పత్తులతో ఆరోగ్యం



అనకాపల్లిలో ఇంక్యుబేషన్(బెల్లం, చిరుధాన్యాలు, పనస) సెంటర్‌కు ఎంపీ డాక్టర్ బి.వి.సత్యవతితో కలిసి మంత్రి అమర్‌నాథ్ శంకుస్థాపన చేశారు. విలువ ఆధారిత ఉత్పత్తులు తీసుకోవడం ద్వారా ఆరోగ్యకరంగా జీవించవచ్చని మంత్రి చెప్పారు.

వివరాలు 12లో ▸

### విద్యార్థుల ఆరోగ్యం ముఖ్యం



విద్యార్థుల మానసిక, శారీరక ఆరోగ్య శ్రేయస్సుపై ఉన్నత విద్యా సంస్థలు దృష్టి సారించాలని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ ఇప్పటికే సూచించింది. తాజాగా విద్యార్థుల సమస్యలను అధ్యయనం చేయడానికి ప్రత్యేక నిపుణుల కమిటీని నియమించనుంది.

వివరాలు 3లో ▸

### కేంద్ర నిధులు రాబట్టడంలో సీఎం జగన్ సఫలం



కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులను రాబట్టడంలో గతంలో టీడీపీ ప్రభుత్వం విఫలం కాగా.. ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సఫలీకృతమైందని ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ అన్నారు.

వివరాలు 3లో ▸

# ఉద్యోగాల వెల్లువ

## 1,000 గ్రూప్-1, గ్రూప్-2 పోస్టుల భర్తీకి సీఎం జగన్ గ్రీన్‌సిగ్నల్

**గ్రూప్-1లో 100 పోస్టులు**
**గ్రూప్-2లో 900 పోస్టులు**

- వీలైనంత త్వరగా భర్తీ చేయాలని ముఖ్యమంత్రి ఆదేశాలు
- అతి త్వరలో నోటిఫికేషన్లు విడుదల
- ఇప్పటికే 1.34 లక్షల సచివాలయ ఉద్యోగాల భర్తీ
- గతంలో 4.5 లక్షల ఉద్యోగులు.. ఇప్పుడు వారి సంఖ్య 6 లక్షలకు..
- ఇవి కాకుండా ఎంఎస్ఎంఈల్లో 20 లక్షల మందికి పైగా ఉపాధి



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో మరోసారి ఉద్యోగాల జాతరకు రాష్ట్ర ప్రభుత్వం నగారా మోగించింది. కీలకమైన గ్రూప్-1, గ్రూప్-2కు సంబంధించి మొత్తం 1,000 పోస్టులను భర్తీ చేయాలని నిర్ణయించింది. ఇందులో గ్రూప్-1 పోస్టులు 100కాగా గ్రూప్-2 పోస్టులు 900 ఉన్నాయి. ఈ మొత్తం పోస్టుల భర్తీకి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఈ పోస్టులకు అతి త్వరలోనే ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) నోటిఫికేషన్లు విడుదల చేయనుంది. ఈ మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ గురువారం ఉదయం గ్రూప్-1, 2 పోస్టుల భర్తీపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ పోస్టులకు సంబంధించి ఇప్పటికే వివిధ శాఖల నుంచి ఖాళీల వివరాలు తెప్పించుకున్నామని అధికారులు సీఎంకు వివరించారు. త్వరితగతిన ఈ పోస్టులను భర్తీ చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. నోటిఫికేషన్ల జారీకి అవసరమైన కసరత్తు తుదిదశలో ఉందని అధికారులు ఆయనకు తెలిపారు. వీలైనంత త్వరగా నోటిఫికేషన్లు జారీ చేయాలని సీఎం సూచించారు. పరీక్షల నిర్వహణ, ఫలితాల వెల్లడి

మిగతా 2వ పేజీలో ▶

**అధికారంలోకి వచ్చీరావడంతోనే..**

2019లో అధికారంలోకి వచ్చాక సీఎం జగన్ విప్లవాత్మక సంస్కరణలకు శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. ప్రజల ముంగిటకే ప్రభుత్వ పాలనను తీసుకువెళ్లి.. వారి సమస్యలను తీర్చడానికి గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టారు. వీటిలో విధులు నిర్వర్తించడానికి లక్షలాది ఉద్యోగాల భర్తీకి శ్రీకారం చుట్టారు. రాష్ట్ర చరిత్రలో గతంలో ఎన్నడూ ఎరుగని రీతిలో ఒకేసారి 1.34 లక్షల మందికి ప్రభుత్వ ఉద్యోగాలను ఇచ్చారు.

# తెలంగాణ ఎంసెట్‌లో ఏపీ స్వీప్

## టాప్ ర్యాంకులు ఆంధ్రా విద్యార్థులకే

- ఇంజనీరింగ్, మెడికల్ రెండు విభాగాల్లోనూ రాష్ట్ర విద్యార్థులకే మొదటి ర్యాంకులు
- ప్రథమ ర్యాంకులు సాధించిన అనిరుధ్, సత్యరాజ్ జశ్వంత్
- ఇంజనీరింగ్ విభాగంలో టాప్ టెన్‌లో 8 ర్యాంకులు ఏపీకే
- అగ్రికల్చర్ అండ్ మెడికల్ విభాగంలో టాప్ టెన్‌లో ఆరుగురికి ర్యాంకులు



జశ్వంత్ (1వ ర్యాంక్, అగ్రి అండ్ మెడికల్)



అనిరుధ్ (1వ ర్యాంక్, ఇంజనీరింగ్)

సాక్షి, నెట్‌వర్క్: తెలంగాణలో బీటెక్, బీఎస్సీ అగ్రికల్చర్, బీఎస్సీ హార్టికల్చర్, బీవీఎస్సీ, బీఎస్సీ ఫారెస్ట్రీ, బీఫార్మసీ, బయోటెక్నాలజీ, ఫార్మ్‌డీ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించిన ఆ రాష్ట్ర ఎంసెట్‌లో ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు దుమ్మురేపారు. అటు ఇంజనీరింగ్ విభాగంలోనూ, ఇటు మెడికల్ అండ్ అగ్రికల్చర్ విభాగంలోనూ టాప్ ర్యాంకులు కొల్లగొట్టి సత్తా చాటారు. ఇంజనీరింగ్ విభాగంలో సనపల అనిరుధ్, అగ్రికల్చర్ అండ్ మెడికల్ విభాగంలో బూరుగుపల్లి సత్యరాజ్ జశ్వంత్ తెలంగాణ స్థాయిలో ఫస్ట్ ర్యాంకులతో భళా అనిపించారు. ఇంజనీరింగ్ విభాగంలో 2, 3, 5, 6, 8, 9, 10 ర్యాంకులు మన రాష్ట్ర విద్యార్థులకే దక్కాయి. అదేవిధంగా అగ్రికల్చర్ అండ్ మెడికల్ విభాగంలోనూ 2, 4, 5, 7, 8 ర్యాంకులు

మిగతా 5వ పేజీలో ▶

**కార్డియాలజిస్టును అవుతా..**

మాది రాజమహేంద్రవరం దగ్గర కాతేరు. నాన్న సాయిరామకృష్ణ రైతు, అమ్మ.. రజని గృహిణి. ఇంటర్ బైపీసీలో 985 మార్కులు వచ్చాయి. నీట్‌లోనూ మంచి ర్యాంకు సాధిస్తా నన్న నమ్మకం ఉంది. మంచి కాలేజీలో ఎంబీబీఎస్ చదివి కార్డియాలజీలో స్పెషలైజేషన్ చేస్తా.

– బూరుగుపల్లి సత్యరాజ్ జశ్వంత్, ఫస్ట్ ర్యాంకర్, (అగ్రి అండ్ మెడికల్ విభాగం)

**ఐఐటీ-బాంబేలో ఇంజనీరింగ్ చేస్తా..**

మాది శ్రీకాకుళం జిల్లాలోని దిమిలాడ. ఇటీవల జేఈఈ మెయిన్‌లో ఆలిండియాలో 122వ ర్యాంకు వచ్చింది. నాన్న ఖగేశ్వరరావు విశాఖపట్నంలో ఎస్సైగా పనిచేస్తున్నారు. అమ్మ ఝాన్సీ గృహిణి. వచ్చే నెలలో జరగనున్న జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో మంచి ర్యాంకు సాధించడమే నా లక్ష్యం. తర్వాత ఐఐటీ బాంబేలో కంప్యూటర్ సైన్స్‌లో ఇంజనీరింగ్ చేస్తా.

– సనపల అనిరుధ్, ఫస్ట్ ర్యాంకర్, (ఇంజనీరింగ్ విభాగం)

# ప్రజాస్వామ్య స్ఫూర్తి అంటే వారిదే

## ఆస్ట్రేలియాలో అధికార, ప్రతిపక్షాలపై ప్రధాని మోదీ ప్రశంసలు

**పార్లమెంటు ప్రారంభోత్సవాన్ని బహిష్కరించిన పార్టీలపై పరోక్ష విమర్శలు**

పార్లమెంటు కొత్త భవనం ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని బహిష్కరించిన విపక్ష పార్టీలపై ప్రధాని మోదీ పరోక్షంగా విరుచుకుపడ్డారు. 'ప్రజాస్వామ్య స్ఫూర్తి అంటే ఎలా ఉంటుందో ఆస్ట్రేలియా పర్యటనలో తెలిసింది. సిడ్నీలో భారత సంతతికి చెందిన సదస్సులో ఆస్ట్రేలియా ప్రధాని అల్బనీస్‌తో పాటు ప్రతిపక్ష నాయకులు, మాజీ ప్రధాని కూడా హాజరయ్యారు. ప్రజాస్వామ్య స్ఫూర్తిని, బలాన్ని అలా చాటారు' అని ప్రధాని మోదీ అన్నారు.



6లో

## హోమం, సర్వమత ప్రార్థనలు..



**పార్లమెంటు ప్రారంభోత్సవానికి సర్వం సిద్ధం**

**బహిష్కరించిన 20 విపక్ష పార్టీలు, పాల్గొంటున్నవి 25**

6 లో



తాడేపల్లి ముగ్గురోడ్డులో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న స్థానికులు



మందడం వద్ద సీఎం జగన్, వైఎస్సార్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న ప్రజలు

# పట్టాల పండుగ నేడే..

## సీఆర్డీఏలో 50,793 మంది పేదలకు పంపిణీ

- రూ.2,000 కోట్లతో 'వైఎస్సార్ జగనన్న కాలనీల' నిర్మాణం కూడా..
- ఇది అక్కచెల్లెమ్మల విజయం..
- రూ.443.71 కోట్లతో నిర్మించిన 5,024 టిడ్కో ఇళ్లు కూడా అందజేత
- రాష్ట్రవ్యాప్తంగా 1,43,600 మందికి రూ.1కే 300 చ.అ. టిడ్కో ఇళ్లు
- గత ప్రభుత్వంలో ఇదే ఇంటికి రూ.7.20 లక్షలు చెల్లించాల్సిన దుస్థితి
- టిడ్కో ఇళ్ల ద్వారా పేద అక్కచెల్లెమ్మలకు రూ.9,406 కోట్ల లబ్ధి
- వెంకటాయపాలెంలో పట్టాలు అందజేయనున్న సీఎం జగన్

సాక్షి, అమరావతి/సాక్షి ప్రతినిధి గుంటూరు/తాడికొండ: సీఆర్డీఏ (రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ) పరిధిలో 50,793 మంది అక్కచెల్లెమ్మలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం (నేడు) ఇళ్ల పట్టాలు పంపిణీ చేయనున్నారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం వెంకటాయపాలెంలో ఏర్పాటుచేసిన వేదిక వద్ద 'నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు' పథకం కింద ఈ పట్టాలను అందజేయనున్నారు. ఈ ప్రాంతంలో 1,402.58 ఎకరాల్లో ఆర్-5 జోన్ ఏర్పాటుచేసి 50,793 ప్లాట్లను సిద్ధంచేశారు. వీటితో పాటు సీఆర్డీఏ ప్రాంతంలో రూ.443.71 కోట్లతో నిర్మించిన 5,024 టిడ్కో ఇళ్లను కూడా లబ్ధిదారులకు ముఖ్యమంత్రి అందజేస్తారు. ఈ పట్టాల పంపిణీ కార్యక్రమానికి

మిగతా 2వ పేజీలో ▶


**'అమరావతి' పట్టాల పంపిణీని హర్షిస్తూ**

## భారీ ర్యాలీ

- పాల్గొన్న లబ్ధిదారులు, బహుజన పరిరక్షణ సమితి నాయకులు, ఎంపీ నందిగం సురేష్
- పలు ప్రాంతాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్, వైఎస్సార్ చిత్రపటాలకు క్షీరాభిషేకాలు

2 లో





ఇప్పుడిప్పుడే విపక్షాలు దగ్గరవుతున్నాయి.. ఈ టైంలో ఈ స్టేట్‌మెంట్ అవసరమా?

# వేగంగా బల్క్ డ్రగ్ పార్క్ పనులు



## ఏపీ బల్క్ డ్రగ్ ఇన్‌ఫ్రా కార్పొరేషన్ పేరుతో ప్రత్యేక కంపెనీ ఏర్పాటు

- బల్క్ డ్రగ్ పార్క్ నిర్మాణ పర్యవేక్షణ కోసం ప్రత్యేకంగా పీఎంసీ
- కాకినాడ సమీపంలో రూ.వెయ్యి కోట్లతో బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటు
- 16 రాష్ట్రాలతో పోటీపడి టెండర్ దక్కించుకున్న ఏపీ
- రూ.14,340 కోట్ల పెట్టుబడులు, 30 వేల మందికి ఉపాధి

సాక్షి, అమరావతి: కాకినాడ సమీపంలోని తొండంగి మండలం కేపీ పురం-కోదండ గ్రామాల మధ్య బల్క్ డ్రగ్ పార్క్ పనులు వేగంగా జరుగుతున్నాయి. 16 రాష్ట్రాలతో పోటీపడి ఆంధ్రప్రదేశ్ దక్కించుకున్న ఈ పార్క్‌ను 2,000.23 ఎకరాల్లో నెలకొల్పేందుకు ఏపీఐఐసీ ఏపీ బల్క్ డ్రగ్ ఇన్‌ఫ్రా కార్పొరేషన్ పేరుతో అనుబంధ కంపెనీని ఏర్పాటు చేసింది. ఈ ప్రాజెక్ట్‌ను త్వరితగతిన పూర్తి చేసేందుకు ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ కన్సల్టెంట్‌ను ఏర్పాటు చేస్తోంది. ఇందుకోసం ఆసక్తి గల సంస్థల నుంచి బిడ్లను ఆహ్వానిస్తూ టెండర్లు పిలిచింది. ఆసక్తి గల సంస్థలు జూన్ 8లోగా బిడ్లను దాఖలు చేయాల్సి ఉంటుంది.

**ముడిసరుకు దిగుమతుల్ని తగ్గించుకునే లక్ష్యంతో**

చైనా నుంచి ఫార్మా ముడి పదార్థాల దిగుమతులను తగ్గించుకోవాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం

మిగతా 3వ పేజీలో ▶

# పోలవరం నిధులపై ముందడుగు

- తొలిదశ సవరించిన అంచనాలపై పీపీఏ, సీడబ్ల్యూసీ అధికారులతో కేంద్ర జల్‌శక్తి శాఖ కార్యదర్శి పంకజ్‌కుమార్ సమావేశం
- తొలిదశ పూర్తికి ప్రతిపాదనను పరిశీలించి నివేదిక ఇవ్వండి
- దాని ఆధారంగా కేంద్ర కేబినెట్‌కు ప్రతిపాదన పంపుతాం
- అక్కడ ఆమోదముద్ర వేస్తే నిధుల విడుదలకు మార్గం సుగమం
- అప్పుడు ప్రాజెక్టు షెడ్యూలు ప్రకారం పూర్తికి అవకాశం
- పోలవరం పనులపై కేంద్ర జల్‌శక్తి శాఖ కార్యదర్శి సంతృప్తి

3 లో

# మహిళే మహారాణి

## ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నేతృత్వంలో మహోన్నత గౌరవం

**అక్కచెల్లెమ్మలే కేంద్ర బిందువుగా సంక్షేమాభివృద్ధి పథకాలు**

బ్రాండ్ ఏపీ




- ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో అగ్రతాంబూలం.. నామినేటెడ్ పదవులు, నామినేటెడ్ పనుల్లో 50%
- సొంత కాళ్లపై నిలబడేలా ఆర్థికంగా ప్రోత్సాహం
- శాశ్వత ఉపాధికి ఊతమిచ్చేలా బహుళ జాతి కంపెనీలతో ఒప్పందాలు
- పిల్లల ఉన్నత చదువులకు అడుగడుగునా భరోసా.. అమ్మ ఒడి, విద్యా కానుక, గోరుముద్ద, విద్యా దీవెన, వసతి దీవెనతో కొండంత అండ
- సొంతింటి కల సాకారం చేస్తూ వేగంగా అడుగులు.. దేశ చరిత్రలోనే మహిళా సాధికారితలో రాష్ట్రం అరుదైన రికార్డు

5 లో

## క్లుప్తంగా...

### జమ్మూలో శ్రీవారి ఆలయ మహా సంప్రోక్షణకు ఆహ్వానం

**సీఎం వైఎస్ జగన్‌కు ఆహ్వానపత్రిక అందించిన టీటీడీ చైర్మన్**



సీఎం జగన్‌కు ఆహ్వానపత్రిక అందిస్తున్న వైవీ సుబ్బారెడ్డి, ప్రశాంతిరెడ్డి

**సాక్షి, అమరావతి:** జమ్మూలో టీటీడీ నూతనంగా నిర్మించిన శ్రీవారి ఆలయ మహాసంప్రోక్షణకు హాజరుకావాలని సీఎం వైఎస్ జగన్‌ను టీటీడీ ఆహ్వానించింది. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో సీఎంను గురువారం టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఎస్వీ గ్రూప్ ఆఫ్ టెంపుల్స్, న్యూఢిల్లీ ప్రెసిడెంట్ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కలిశారు. జూన్ 3–8 వరకు జమ్మూలోని శ్రీవారి ఆలయంలో మహా సంప్రోక్షణ, 8న మిధున లగ్నంలో కళావాహన, ఆరాధన అనంతరం ధ్వజారోహణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమాలకు హాజరుకావాలని వారు సీఎంకు ఆహ్వాన పత్రికను అందించారు.

### సీఎంకు నిరుద్యోగ జేఏసీ కృతజ్ఞతలు

**సాక్షి, అమరావతి:** రాష్ట్రంలో నిరుద్యోగుల ఆకాంక్షలకు అనుగుణంగా గ్రూప్–1, గ్రూప్–2లో 1,000 పోస్టుల భర్తీకి అనుమతించిన సీఎం వైఎస్ జగన్‌కు ఏపీ నిరుద్యోగ జేఏసీ అధ్యక్షుడు హేమంత్ కుమార్ గురువారం ఓ ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ/వార్డు సచివాలయాల్లోనూ బదిలీలకు అవకాశం కల్పించడంపై హర్షం వ్యక్తం చేశారు. గతంలో సచివాలయాల్లో చేపట్టినట్టే భారీ ఉద్యోగ నియామకాలకు నోటిఫికేషన్ ఇవ్వాలని కోరారు. ఇటీవల పరీక్షలు రాసిన ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులకు ప్రశ్నాపత్రంలోని దోషాలను అధిగమించేలా గ్రేస్ మార్కులు ఇవ్వాలని అభ్యర్థించారు.

### సచివాలయ ఉద్యోగులకు బదిలీలు

**సాక్షి, అమరావతి:** గ్రామ/వార్డు సచివాలయాల ఉద్యోగుల బదిలీలకు రాష్ట్ర ప్రభుత్వం గురువారం మార్గదర్శకాలు జారీ చేసింది. జిల్లా పరిధిలో 3 కేటగిరిల ప్రాతిపదికన బదిలీలు జరుగుతాయి. మెడికల్ గ్రౌండ్స్, భార్యభర్తలు ఇద్దరూ ప్రభుత్వ ఉద్యోగులు, సింగిల్ ఉమెన్ కేటగిరిల్లో జిల్లా పరిధిలో బదిలీని కోరవచ్చు. అయితే ఇవి 20 శాతం మించకూడదు. ఇతర జిల్లాకు వెళ్లాలంటే మాత్రం పరస్పర అంగీకారం, భార్యాభర్తలు కేటగిరిలో దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ బదిలీలు పూర్తిగా పారదర్శకంగా ఉండేందుకు అంతా ఆన్‌లైన్‌లోనే నిర్వహించనున్నారు. ఎనర్జీ అసిస్టెంట్లకు ఈ బదిలీ నిబంధనలు వర్తించవు. పాత జిల్లా యూనిట్ ప్రాతిపదికనే బదిలీలు జరుగుతాయని రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ ఉత్తర్వులిచ్చారు.

**జూన్ 10 వరకు బదిలీలకు అవకాశం: ఏపీ గవర్నమెంట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్**

గ్రామ/వార్డు సచివాలయం ఉద్యోగుల బదిలీలు జూన్ 10 వరకు జరుగుతాయని ఏపీ గవర్నమెంట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ చైర్మన్ కె.వెంకటరామిరెడ్డి చెప్పారు. రెండేళ్ల సర్వీస్ పూర్తి చేసుకుని ప్రొబేషన్ డిక్లేర్ అయిన ఉద్యోగులందరూ బదిలీలకు అర్హులని చెప్పారు. గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీలకు అవకాశం కల్పించిన సీఎం జగన్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

### శ్రీకృష్ణుడి రూప ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటుకు నో

**స్టే పొడిగించిన తెలంగాణ హైకోర్టు**

**సాక్షి, హైదరాబాద్:** ఖమ్మంలోని లకారం చెరువులో శ్రీకృష్ణుడి రూపంలోని ఎన్టీఆర్ విగ్రహ ప్రతిష్టాపనకు హైకోర్టు అనుమతి నిరాకరించింది. గతంలో ఇచ్చిన స్టేను పొడిగిస్తూ తదుపరి విచారణను జూన్ 6కు వాయిదా వేసింది. ఎన్టీఆర్ శత జయంతి వేడుకలను పురస్కరించుకుని లకారం చెరువులో 54 అడుగుల ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం విదితమే. ఈ విగ్రహావిష్కరణను ఈ నెల 28న నిర్వహించాలని ఇప్పటికే ఖరారు చేశారు. తానా ఈ విగ్రహాన్ని అందిస్తోంది. అయితే శ్రీకృష్ణుడి రూపంలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటును సవాల్ చేస్తూ భారత యాదవ సమితి, ఆదిభట్ల శ్రీకళా పీఠం, బహుజన జాయింట్ యాక్షన్ కమిటీ పిటిషన్లు దాఖలు చేశాయి.

**ప్రధాన కేంద్రాల్లో గురువారం నమోదైన గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు (డిగ్రీల్లో)**

| కేంద్రం | గరిష్టం | కనిష్టం |
|---|---|---|
| రెంటచింతల | 43.8 | 30.4 |
| రాజమహేంద్రవరం | 43.0 | 29.0 |
| గుంటూరు | 41.0 | 29.0 |
| కర్నూలు | 39.5 | 28.3 |
| విజయవాడ | 41.0 | 29.0 |
| నెల్లూరు | 41.6 | 30.8 |
| కడప | 40.1 | 28.2 |
| శ్రీకాకుళం | 37.0 | 26.0 |
| విశాఖపట్నం | 36.4 | 26.2 |
| ఏలూరు | 41.0 | 28.0 |
| ఒంగోలు | 40.0 | 26.0 |

# పట్టాల పండుగ నేడే..

మొదటి పేజీ తరువాయి

లబ్ధిదారులకు వలంటీర్లు, సచివాలయ సిబ్బంది వివిధ శాఖ అధికారులు, యానిమేటర్లు, డ్వాక్రా మహిళలు ఆహ్వానం అందించారు. వారి ఇళ్లకు వెళ్లి బొట్టుపెట్టి మరీ కార్యక్రమానికి రావాలని పిలిచారు.

**న్యాయపరమైన అడ్డంకులు అధిగమించి..**

తాము మాత్రమే బాగుండాలనే పెత్తందారులు న్యాయపరమైన అడ్డంకులు సృష్టించి పట్టాల పంపిణీ ప్రక్రియను అడ్డుకునే ప్రయత్నం చేశారు. అమరావతిలో పేదలకు స్థానంలేదని తక్కువచేసి మాట్లాడి, ఇక్కడ పేదలకు ఇళ్లిస్తే సామాజిక సమతుల్యత దెబ్బతింటుందని వక్రభాష్యాలు చెప్పారు. ప్రభుత్వం ఇస్తున్న సెంటు స్థలాలను సమాధులని కూడా అవహేళన చేశారు. ఇలా ఎన్ని అడ్డంకులు సృష్టించినా పేద అక్కచెల్లెమ్మలకు మంచి జరగాలని, వారి ముఖాల్లో సంతోషం చూడాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సంకల్పించారు. నిలువ నీడలేని వారికి సొంత గూడు ఇవ్వాలని నిర్ణయించారు. వారి భవిష్యత్తు బాగుండాలన్న కృతనిశ్చయంతో అడ్డంకులన్నీ అధిగమించి శుక్రవారం 50,793 మంది అక్కచెల్లెమ్మలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేయనున్నారు.



సిద్ధమైన సభా ప్రాంగణం

**రూ.2 వేల కోట్లతో కాలనీల నిర్మాణం**

ఇక సీఆర్డీఏ పరిధిలో సిద్ధంచేసిన 25 లేఅవుట్లలో గుంటూరు జిల్లాకు చెందిన 23,762 మంది, ఎన్టీఆర్ జిల్లాకు చెందిన 27,031 మంది నిరుపేద లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు కేటాయించారు. ప్రతి ప్లాట్‌కు హద్దులు నిర్ణయిస్తూ 80 వేల హద్దు రాళ్లు ఏర్పాటుచేశారు. అంతర్గత రవాణా కోసం 95.16 కి.మీ పరిధిలో గ్రావెల్ రోడ్లు వేశారు.

**ఒక్కో లేఅవుట్ ఒక్కో కాలనీగా..**

ఒక్కో లేఅవుట్‌ను ఓ కాలనీగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. రూ.1,280 కోట్లతో ఇళ్ల నిర్మాణం, మరో రూ.700 కోట్లతో మౌలిక సదుపాయాలు మొత్తంరూ.1,980కోట్ల వ్యయంతో 'వైఎస్సార్ జగనన్న కాలనీలు నిర్మించనుంది. అక్కచెల్లెమ్మలకు సాధికారత కల్పించడమే లక్ష్యంగా వారి పేరు మీద రాష్ట్ర ప్రభుత్వం రిజిస్ట్రేషన్లు చేసి ఇళ్ల పట్టాలు ఇస్తోంది. ఇలా రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే 30.60 లక్షల ఇళ్ల స్థలాల పంపిణీ చేయడంతో పాటు 21 లక్షలకు పైగా ఇళ్ల నిర్మాణం చేపట్టింది. వీటిద్వారా ప్రతి పేద అక్కచెల్లెమ్మకు సగటున రూ.5 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు లబ్ధి చేకూరింది. రాష్ట్రవ్యాప్తంగా గత నాలుగేళ్లలో రూ.2 లక్షల కోట్ల నుంచి 3 లక్షల కోట్ల సంపద వారికి అందించడం విశేషం.

**సీఎం పర్యటన ఇలా..**

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం ఉ.9.50 గంటలకు తాడేపల్లి నుంచి బయల్దేరి వెంకటాయపాలెం చేరుకుంటారు. లేఅవుట్స్‌కు సంబంధించిన ఫొటో గ్యాలరీని తిలకిస్తారు. దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తారు. జిల్లా కలెక్టర్, లబ్ధిదారులు, ఇతర వక్తలు మాట్లాడిన తర్వాత సీఎం జగన్ బహిరంగసభను ఉద్దేశించి ప్రసంగిస్తారు. అనంతరం పేదలకు పట్టాలు పంపిణీ చేస్తారు. తిరిగి మ.12.30కు ఆయన తాడేపల్లి నివాసానికి చేరుకుంటారు.

**లేఅవుట్లు, సభ ఏర్పాట్ల పరిశీలన**

మరోవైపు.. లేఅవుట్లు, సభ ఏర్పాట్లను మంత్రులు జోగి రమేశ్, ఆదిమూలపు సురేశ్, మేరుగ నాగార్జున, విడదల రజిని, బాపట్ల ఎంపీ నందిగం సురేశ్, సీఎం కార్యక్రమాల కోఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్, ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, దువ్వాడ శ్రీనివాస్, ప్రణాళికా బోర్డు వీసీ మల్లాది విష్ణు, పురపాలక శాఖ ప్రధాన కార్యదర్శి వై శ్రీలక్ష్మి, సీఆర్డీఏ కమిషనర్ వివేక్ యాదవ్, జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాల్‌రెడ్డి, గృహ నిర్మాణ సంస్థ ఎండీ శ్రీలక్ష్మి, జేసీ జి.రాజకుమారి, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మందపాటి శేషగిరిరావు, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి, మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్‌లు పరిశీలించారు.



కృష్ణాయపాలెంలోని లేఅవుట్



నవులూరులోని లేఅవుట్

**టిడ్కో లబ్ధిదారులకు ఇళ్ల పంపిణీ**

నిడమర్రు, మందడం, అనంతవరం, దొండపాడు, ఐనవోలు, పెనుమాక, తుళ్లూరు, నవులూరులో అన్ని వసతులతో రూ.443.71 కోట్లతో నిర్మించిన 5,024 టిడ్కో ఇళ్లను కూడా సీఎం జగన్ నేడు పంపిణీ చేయనున్నారు.

- రాష్ట్రవ్యాప్తంగా 1,43,600 మంది నిరుపేద లబ్ధిదారులకు 300 చ.అడుగుల టిడ్కో ఇళ్లను అన్ని హక్కులతో కేవలం రూ.1కే రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తోంది. తద్వారా వారికి రూ.9,406 కోట్ల మేర లబ్ధి చేకూరనుంది.
- ఇదే ఇంటికి గత టీడీపీ ప్రభుత్వం అసలు, వడ్డీతో కలిపి రూ.7.20 లక్షలు చెల్లించాల్సిన దుస్థితిని కల్పించింది. ఆ భారం లేకుండా కేవలం రూ.1కే ఇవ్వడం గమనార్హం.
- దీంతోపాటు ఇతర టిడ్కో లబ్ధిదారులు చెల్లించాల్సిన ముందస్తు వాటా సొమ్ములో 50 శాతం రాయితీ కూడా ఇచ్చింది.
- ఇక 365 చ.అ. లబ్ధిదారులు ఒక్కొక్కరికి రూ.25 వేల చొప్పున 44,304 మందికి, 430 చ.అ. లబ్ధిదారులకు రూ.50 వేల చొప్పున 74,312 మందికి మేలు చేసింది.
- తద్వారా వారు చెల్లించాల్సిన రూ.482 కోట్ల భారాన్ని కూడా వైఎస్ జగన్ ప్రభుత్వం భరించింది.
- టిడ్కో ఇళ్లకు ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయడం ద్వారా ఒక్కో లబ్ధిదారునికి రూ.60 వేల లబ్ధిచేకూరింది.
- అలాగే, 2.62 లక్షల మంది టిడ్కో లబ్ధిదారులకు సబ్సిడీ రూపంలో రూ.14,514 కోట్లు, ఉచిత రిజిస్ట్రేషన్ల కోసం మరో రూ.1,200 కోట్లు, మౌలిక సదుపాయాలకు రూ.3,000 కోట్లు మొత్తం రూ.18,714 కోట్ల లబ్ధిని రాష్ట్ర ప్రభుత్వం చేకూర్చింది.
- కానీ, గత టీడీపీ ప్రభుత్వం ఈ టిడ్కో ఇళ్లలో మంచినీటి సదుపాయాలు, రోడ్లు, విద్యుత్, డ్రైనేజీ వంటి మౌలిక వసతులను నిర్లక్ష్యం చేస్తే, ప్రస్తుత జగన్ ప్రభుత్వం అన్ని మౌలిక సదుపాయాలతో ఇళ్లను అందిస్తోంది.
- ఇక ఈ ఇళ్ల పట్టాలు పంపిణీలో ఏమైనా ఇబ్బందులుంటే 1902 టోల్‌ఫ్రీ నంబర్‌లో సంప్రదించవచ్చు.

## 'అమరావతి' పట్టాల పంపిణీని హర్షిస్తూ భారీ ర్యాలీ

- పాల్గొన్న ఎంపీ నందిగం సురేష్
- పలు ప్రాంతాల్లో సీఎం జగన్, వైఎస్సార్ చిత్రపటాలకు క్షీరాభిషేకం



భారీ ర్యాలీలో పాల్గొన్న ఎంపీ నందిగం సురేష్, కత్తెర సురేష్ కుమార్, లబ్ధిదారులు

**వెంకటపాలెం(తాడికొండ)/తాడేపల్లిరూరల్:** అమరావతి రాజధాని ప్రాంతంలో పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీని హర్షిస్తూ బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్ నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీలో బాపట్ల ఎంపీ నందిగం సురేష్, తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ పాల్గొని వెంకటపాలెం టీటీడీ ఆలయం వరకు పాదయాత్రగా వెళ్లి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీని అడ్డుకుంటామంటూ చంద్రబాబు, రాజధాని రైతుల ముసుగులో ఉన్న టీడీపీ నాయకులు, కులవాదులు ప్రకటన చేస్తున్న నేపథ్యంలో బాబు ఆయన అనుయాయుల మనసు మార్చాలని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు బహుజన పరిరక్షణ సమితి నాయకులు తెలిపారు. పలువురు బహుజన పరిరక్షణ సమితి నాయకులు పాల్గొన్నారు.

**నాడు పెత్తందారుల పసుపు నీళ్లు.. నేడు పేదల క్షీరాభిషేకం**


అమరావతి ప్రాంతంలో సీఎం వైఎస్ జగన్ పర్యటిస్తే నాడు 'పచ్చ' పెత్తందారులు పసుపు నీళ్లు చల్లి కుట్రలకు తెరదీస్తే.. నేడు అదే ప్రాంతంలో పేదలు జగనన్నకు క్షీరాభిషేకం చేసి అభిమానం చాటుకుంటున్నారు. అమరావతిలో నిరుపేదలకు పట్టాలు పంపిణీ చేస్తున్న నేపథ్యంలో అమరావతి గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా గురువారం ఆ ప్రాంతంలో పేదలతో కలిసి వైఎస్సార్‌సీపీ నాయకులు శృంగారపాటి సందీప్, పలువురు 11 గ్రామాల్లోని 25 లే అవుట్‌లలో 2000 లీటర్ల పాలతో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి చిత్రపటాలకు, ప్లాట్లకు క్షీరాభిషేకం చేశారు.

**తాడేపల్లి ప్రాంతంలో..**

కొండపోరంబోకులోనూ, రైల్వే స్థలాల్లోనూ బిక్కుబిక్కుమంటూ 40–50 సంవత్సరాల నుంచి నివాసముంటున్న పేదలకు సొంతింటి కల నెరవేరడంతో ఆనందంతో తాడేపల్లి పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షుడు ముదిగొండ ప్రకాష్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఇత్తడి పందు, ఎం. మార్తమ్మ, జమ్ములముడి సునీత తదితరులు పాల్గొన్నారు.

## నేడు రాష్ట్రంలో సామాజికన్యాయ పండుగ

- ఒకే ప్రాంతంలో 50 వేలకుపైగా ఇళ్ల పట్టాలివ్వడం చరిత్ర
- అంబేడ్కర్ భావజాలాన్ని భుజాన వేసుకున్న నేత సీఎం జగన్
- చంద్రబాబు రియల్ ఎస్టేట్ బ్రోకర్
- మంత్రులు మేరుగు నాగార్జున, జోగి రమేశ్





**సాక్షి, అమరావతి:** రాష్ట్రంలో శుక్రవారం (నేడు) సామాజికన్యాయ పండుగ (ఫెస్టివల్ ఆఫ్ సోషల్ జస్టిస్) జరుగుతోందని రాష్ట్ర మంత్రులు మేరుగు నాగార్జున, జోగి రమేశ్ చెప్పారు. సీఎం వైఎస్ జగన్ చేతుల మీదుగా రాజధాని ప్రాంతంలో 50 వేలకుపైగా కుటుంబాలు ఇళ్లపట్టాలు అందుకోబోతున్నాయని తెలిపారు. ఈ పండుగకు అమరావతి రైతులు సహా అందరూ రావాలని ఆహ్వానించారు. ఇళ్లపట్టాల పంపిణీని అడ్డుకోవాలని చంద్రబాబు కుట్రలు చేస్తున్నాడని, అరునూరైనా ఇళ్లపట్టాల పంపిణీ జరుగుతుందని స్పష్టం చేశారు. వారు గురువారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో వేర్వేరుగా మీడియాతో మాట్లాడారు. పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వకూడదని చంద్రబాబు పెత్తందారుల పక్షాన నిలబడితే.. సీఎం వైఎస్ జగన్ పేదల పక్షాన నిలబడి విజయం సాధించారని తెలిపారు. రాజధాని పేరుతో పక్కా రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసిన చంద్రబాబు బ్రోకర్‌లా పనిచేస్తున్నారని విమర్శించారు. పేదలకు రాజధానిలో స్థలాలు ఇవ్వకూడదని కోట్లాది రూపాయలు వెచ్చించి కృత్రిమ ఉద్యమాలు చేయించారని, సుప్రీంకోర్టు వరకు వెళ్లారని చెప్పారు. అమరావతిలో నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తే, సామాజిక సమతుల్యం దెబ్బతింటుందన్నారని గుర్తుచేశారు. అమరావతిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు నివసిస్తే రాజధానిలో అంటరానితనం వస్తుందా? అని ప్రశ్నించారు. అంబేడ్కర్ భావజాలాన్ని భుజాన వేసుకున్న సీఎం జగన్ పేదలు సమాజంలోని అన్ని కులాలతో సమానంగా బతకాలని భావించి వారి అభ్యున్నతికి తోడ్పడుతున్నారని తెలిపారు. ఒకే ప్రాంతంలో 50 వేలకు పైగా ఇళ్ల పట్టాలిస్తున్నారని, ఇదొక చరిత్ర అని పేర్కొన్నారు. ఒక్కో పట్టా దాదాపు రూ.10 లక్షల విలువ చేస్తుందన్నారు. రాజధాని ప్రాంత రైతులు బాబును నమ్మి మోసపోయారని చెప్పారు. సీఎం జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత రాజధాని ప్రాంతంలో ప్రజలందరూ బాగుండాలని కోరుకున్నారన్నారు. ఉద్యమాలు అని చెప్పుకొనేవారు, అంబేడ్కర్ పేరు చెప్పి పార్టీలు పెట్టుకున్న కొంత మంది నీచులు పేదవారికి ఇళ్ల పట్టాలిస్తుంటే అడ్డుకోవడం ఎంత సిగ్గుచేటని ప్రశ్నించారు.

**3,618 మంది కాంట్రాక్టు లెక్చరర్ల**

## సేవల పునరుద్ధరణ

**జూన్ 1 నుంచి వచ్చే ఏప్రిల్ 30 వరకు కొనసాగింపు**

**సాక్షి, అమరావతి:** రాష్ట్రంలో పలు జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న 3,618 మంది కాంట్రాక్ట్ ఫ్యాకల్టీల సేవలను ప్రభుత్వం పునరుద్ధరించింది. 2023–24 విద్యాసంవత్సరానికిగాను వీరి సేవలను జూన్ ఒకటి నుంచి వచ్చే ఏడాది ఏప్రిల్ 30 వరకు కొనసాగిస్తూ గురువారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్‌ప్రకాష్ ఉత్తర్వులు జారీచేశారు. ఈ మేరకు తదుపరి చర్యలు తీసుకోవాలని ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ కమిషనర్‌ను ఆదేశించారు.

**1,074 మంది గెస్ట్ ఫ్యాకల్టీ నియామకానికి ఆదేశాలు**

2023–24 విద్యాసంవత్సరంలో ఇంటర్మీడియట్ బోధనకు 1,074 మంది గెస్ట్ ఫ్యాకల్టీ నియామకానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. గత విద్యాసంవత్సరంలో పనిచేసిన 783 మంది గెస్ట్ ఫ్యాకల్టీ సేవలను పునరుద్ధరించడంతో పాటు కొత్తగా 291 మంది గెస్ట్ ఫ్యాకల్టీని నియమించేందుకు గురువారం ఉత్తర్వులు జారీచేసింది. ఈ మేరకు చర్యలు తీసుకోవాలని ఇంటర్మీడియట్ బోర్డు కమిషనర్‌ను ఆదేశించింది. గంటకు రూ.150 చొప్పున, గరిష్టంగా నెలకు రూ.10 వేల వరకు చెల్లించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది.

# ఉద్యోగాల వెల్లువ

మొదటి పేజీ తరువాయి



తదితర అంశాలపైనా దృష్టి సారించాలని ఆదేశించారు.

**బాబు పాలనంతా బూటకమే..**

గతంలో చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలో ఐదేళ్లపాటు ఎలాంటి నోటిఫికేషన్లు ఇవ్వలేదు. సరిగ్గా సాధారణ ఎన్నికలకు ముందు 2018 డిసెంబర్‌లో మాత్రమే నోటిఫికేషన్లు ఇచ్చారు. వీటి భర్తీకి పరీక్షలు కూడా నిర్వహించే సమయం లేకుండా కేవలం ఎన్నికల్లో ఓట్లు దండుకునేందుకు ఈ వ్యవహారమని అప్పట్లోనే విద్యావేత్తలు, అభ్యర్థుల నుంచి పెద్ద ఎత్తున విమర్శలు వ్యక్తమయ్యాయి. ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరుద్యోగుల ఆశలు నెరవేర్చేలా తొలి రోజు నుంచే అడుగులు ముందుకు వేశారు. ఏపీపీఎస్సీ ద్వారా కూడా వేలాది పోస్టులను ఈ నాలుగేళ్లలో భర్తీ చేయించారు. గత ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్లన్నీ న్యాయవివాదాల్లో చిక్కుకొని.. నిరుద్యోగులకు ఉద్యోగాలు అందని ద్రాక్షలా మారగా వాటన్నింటినీ పరిష్కరింపజేశారు. అంతేకాకుండా వాటిని భర్తీ చేయించారు. ఏపీపీఎస్సీ ద్వారానే ఈ నాలుగేళ్లలో 5 వేలకు పైగా ఉద్యోగాలు భర్తీ అయ్యాయి. కీలకమైన గ్రూప్–1తో సహా ఇతర పోస్టులూ వీటిలో ఉన్నాయి. గతంలో రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో 4.5 లక్షల ఉద్యోగులు ఉండగా ఇప్పుడు వారి సంఖ్య 6 లక్షలకు పెరిగిందంటే ఏ మేరకు ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ జరిగిందో ఇట్టే తెలుసుకోవచ్చు. ఇవి మాత్రమే కాకుండా ఈ నాలుగేళ్లలో రాష్ట్రంలో వివిధ పరిశ్రమలు, ఇతర సంస్థల్లో 15 నుంచి 20 లక్షల ఉద్యోగాలు యువతకు లభించేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంది. ముఖ్యంగా సూక్ష్మ, చిన్నతరహా, మధ్యతరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈ ) రంగంలో ఉద్యోగాలు వెల్లువెత్తాయి. రాష్ట్రంలో 1.10 లక్షల ఎంఎస్ఎంఈ యూనిట్లు ఉండగా ఒక్కోదానిలో కనీసం 10 మందికి ఉపాధి, ఉద్యోగావకాశాలు లభించాయి.

**వలంటీర్లు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ పోస్టుల్లోనూ..**

గ్రామాల్లోని ప్రజలకు ప్రభుత్వ పథకాల లబ్ధిని అందించడానికి ప్రతి 50 ఇళ్లకు ఒకరు చొప్పున ప్రభుత్వం గ్రామ, వార్డు వలంటీర్లను నియమించింది. మొత్తం 2.65 లక్షల మందికి గౌరవ వేతనం అందిస్తూ ఉపాధి కల్పించింది. అలాగే గతంలో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది పరిస్థితి అగమ్యగోచరంగా ఉండేది. ప్రైవేటు సంస్థలకు గుత్తాధిపత్యం ఇవ్వడం వల్ల వారికి ఉద్యోగ భద్రత, సరైన వేతనాలు అందేవి కావు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఈ కాంట్రాక్టు పోస్టులతో పాటు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల కోసం ప్రత్యేకంగా ఒక విభాగాన్నే ఏర్పాటు చేయించారు. బ్రోకర్లు, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా వారికి పూర్తి వేతనాలు చెల్లించడంతోపాటు ఈఎస్ఐ వంటి సదుపాయాలూ కల్పించారు. వీరికి అరకొర వేతనాలు ఉండగా జీతాలను భారీగా పెంచారు. కాంట్రాక్టు ఉద్యోగులకు ఏకంగా మినిమమ్ టైమ్ స్కేల్‌ను అమల్లోకి తెచ్చారు. ఫలితంగా ఆ ఉద్యోగులకు ఎంతో న్యాయం జరిగింది.

**చదువులు పూర్తవగానే ఉద్యోగాలు సాధించేలా శిక్షణ**

రాష్ట్రంలో విద్యార్థులను పూర్తి నైపుణ్యాలతో తీర్చిదిద్ది.. వారు చదువులు పూర్తిచేసి బయటకు రాగానే ఉద్యోగాలు సాధించేలా సీఎం వైఎస్ జగన్ చర్యలు తీసుకున్నారు. విద్యార్థులు చదువుతున్నప్పుడే వారికి అనేక ప్రతిష్టాత్మక సంస్థలతో శిక్షణ ఇప్పించి నిష్ణాతులుగా తీర్చిదిద్దుతున్నారు. డిగ్రీ కోర్సుల్లోనూ ఇంటర్న్‌షిప్‌ను తప్పనిసరి చేయించారు. డిగ్రీలో చేరే విద్యార్థులు కూడా పది నెలలు ఇంటర్న్‌షిప్ పూర్తి చేసేలా కోర్సులను అమలు చేయిస్తున్నారు. విద్యార్థులు పూర్తిస్థాయిలో నైపుణ్యం పొందేలా అధికారులు క్షేత్రస్థాయిలో శిక్షణ ఇస్తున్నారు. ఇందుకు రాష్ట్రంలోని అన్ని కళాశాలలను వివిధ పరిశ్రమలు, ఐటీ సంస్థలు, ప్రముఖ వాణిజ్య సంస్థలతో సహా కోర్సులతో సంబంధమున్న 27,119 సంస్థలతో అనుసంధానించారు.

**శిక్షణ సమయంలోనే ఉద్యోగాలు..**

విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ కోసం రాష్ట్రంలోని మైక్రో స్థాయి నుంచి మెగా పరిశ్రమల వరకు ఉన్నత విద్యా మండలి వాటిని విద్యా సంస్థలతో అనుసంధానం చేసింది. తయారీ, సేవా రంగాల్లో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు. శిక్షణ సమయంలో మంచి పనితీరు కనబరిచేవారికి ఆ కంపెనీలే ఉద్యోగాలు ఇచ్చేలా చర్యలు తీసుకున్నారు. ఫలితంగా 2018లో రాష్ట్రంలో ఏడాదికి 37 వేల మందికి మాత్రమే అవకాశాలు దక్కగా ఆ తర్వాత నుంచి ప్లేస్‌మెంట్స్‌లో భారీ వృద్ధి నమోదైంది. 2019–20లో 52 వేలకు, 2020–21లో 69 వేలకు, 2021–22లో 85 వేలకు ప్లేస్‌మెంట్లు పెరిగాయి. ఇక ఈ విద్యాసంవత్సరంలో 1.20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అలాగే ట్రిపుల్ ఐటీల్లో చదువుతున్న విద్యార్థులకు కూడా భారీగా డిమాండ్ పెరిగింది. గతంలో ఎన్నడూ లేని రీతిలో వీరికి ఉద్యోగావకాశాలు దక్కుతున్నాయి. 2020–21 వరకు మొత్తం 13,208 మంది విద్యార్థులు నియామకాల కోసం నమోదు చేసుకున్నారు. వీరిలో 5,111 మందికి వివిధ సంస్థల్లో ఉద్యోగావకాశాలు లభించాయి. ట్రిపుల్ ఐటీ నూజివీడు క్యాంపస్‌లో 2,610 మందికి, ఆర్కే వ్యాలీలో 2,501 మందికి ఐటీ కంపెనీలు కొలువులు ఇచ్చాయి. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్), ఇన్ఫోసిస్, విప్రో, అలక్రిటీ, ఏడీపీ, అచలా, పర్పుల్ టాక్, పర్పుల్ కామ్, సెలెక్ట్, నుక్కడ్ షాప్స్, సెవ్యా, సినాప్సిస్, టెక్సాస్ ఇన్‌స్ట్రుమెంటేషన్, రాంకీ, ఆర్వీ, హెటిరో, అటిబిర్, అమర్ రాజా తదితర కంపెనీల్లో విద్యార్థులకు ఉద్యోగాలు దక్కాయి. అనలాగ్ డివైసెస్, ఫ్రెష్ డెస్క్, టెక్సాస్ ఇన్‌స్ట్రుమెంట్స్, సినాప్సిస్, జీవోటీటీఈఆర్, థాట్ వర్క్స్, ఏడీపీ, మేథ్ వర్క్స్, గోల్డెన్ హిల్స్ సంస్థలు అత్యధిక వేతనాలు అందించాయి.

## నేటితో కులవాదుల కుట్రలు పటాపంచలు

**670వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు**



హర్షధ్వానాలు చేస్తున్న బహుజన నేతలు

**తాడికొండ:** నేడు రాజధానిలో పండుగలా పేదలకు పట్టాల పంపిణీ జరుగనున్న నేపథ్యంలో కులవాదుల కుట్రలు పటాపంచలు కానున్నాయని బహుజన పరిరక్షణ సమితి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 670వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో గురువారం పలువురు మాట్లాడారు. డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ సూచించిన బహుజన రాజ్యాధికారం దిశగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో ఏపీ ముందడుగులు వేస్తుందనేందుకు నేడు పేదల పట్టాల పండుగే నిదర్శనమన్నారు. చెడుపై మంచి ఎప్పుడూ విజయం సాధిస్తుందనేందుకు ఇది నిదర్శనంగా మిగిలిపోతుందన్నారు. రాజ్యాంగబద్ధంగా పేదలకు రావాల్సిన హక్కులను అడ్డుకుంటూ కులవాదులంతా ఏకమై రూ.లక్షల కోట్లు ఖర్చుపెట్టి చేసిన యత్నాలు బెడిసికొట్టాయని చెప్పారు. న్యాయం పేదల వైపే నిలిచిందని, ఇకనైనా బాబు బుద్ధి తెచ్చుకుని మసలుకోవాలని హితవు పలికారు. బాబుకు వత్తాసు పలుకుతూ పేదలకు జానెడు జాగా రాకుండా చేసేందుకు సూట్ కేసులు తీసుకున్న వామపక్షాలు, పవన్ కళ్యాణ్, ఇతర పార్టీల నాయకులు ఇకనైనా కళ్లు తెరిచి వాస్తవంలోకి రావాలన్నారు.

న్యాయస్థానాల తీర్పులను సైతం వ్యతిరేకిస్తూ రాజధాని ప్రాంతంలో కులవాదులు చేస్తున్న అలజడి చూస్తుంటే పేదలకు వీరిపై ఎంత అక్కసు ఉందో ఇట్టే తెలుస్తుందని చెప్పారు. నాయకులు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, ఇందుపల్లి సుభాషిణి, మల్లవరపు సుధారాణి, పెరికె వరప్రసాద్, ఈపూరి ఆదాం, పులి దాసు, పల్లె బాబు, బేతపూడి సాంబయ్య, కారుమూరి పుష్పరాజ్, బొలిమేర శ్యామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

## ఎప్పటి నీటి లెక్కలు అప్పటికే

**సాక్షి, అమరావతి:** ఒక నీటి సంవత్సరం (జూన్ 1 నుంచి మే 31 వరకు)లో ఒక రాష్ట్రం వాడుకోని కోటా జలాలను మరుసటి నీటి సంవత్సరంలో వాడుకోవడానికి ఆ రాష్ట్రానికే అనుమతిస్తే.. మరో రాష్ట్రం హక్కులను దెబ్బతీసినట్లవుతుందని తెలంగాణ సర్కార్‌కు కృష్ణాబోర్డు తేల్చిచెప్పింది. కోటాలో వాడుకోకుండా మిగిలిన నీళ్లు క్యారీ ఓవర్ జలాలే అవుతాయని స్పష్టం చేసింది. బచావత్ ట్రిబ్యునల్ అవార్డు ప్రకారం క్యారీ ఓవర్ జలాలపై రెండు రాష్ట్రాలకు హక్కు ఉంటుందని తెగేసిచెప్పింది. రెండు రాష్ట్రాలు సంప్రదింపులు జరుపుకొని.. ఏకాభిప్రాయం ద్వారా వాటిని వాడుకోవడానికి అవకాశం ఉంటుందని సూచించింది. గతేడాది జూన్ 6న ఇదే అంశాన్ని అటు తెలంగాణ సర్కార్‌కు.. ఇటు కృష్ణా బోర్డుకు సీడబ్ల్యూసీ తేల్చిచెప్పింది. అయినా సరే.. తెలంగాణ సర్కార్ కోటాలో మిగిలిన నీటిని వచ్చే ఏడాది వాడుకుంటామంటూ వితండవాదన మళ్లీ తెరపైకి తెస్తూ వివాదం రాజేస్తుండటం గమనార్హం.

**నీటి నిల్వపై నేరుగా ప్రభావం**

నాగార్జునసాగర్‌లో కోటాలో వాడుకోని జలాలను మరుసటి సంవత్సరం వాడుకుంటామని తెలంగాణ సర్కార్ ఇటీవల కృష్ణాబోర్డును కోరింది. తెలంగాణ సర్కార్ ప్రతిపాదనకు కృష్ణాబోర్డు అంగీకరిస్తే.. సాగర్‌లో నీటినిల్వపై నేరుగా ప్రభావం చూపుతుంది. కొత్త నీటి సంవత్సరంలో వచ్చే వరద జలాలతో నిండాక.. మిగులు జలాలను దిగువకు వదిలేయాల్సి ఉంటుంది. అంటే తెలంగాణ సర్కార్ కోటాలో వాడుకోని నీటిని మరుసటి సంవత్సరం వాడుకోవడానికి అనుమతిస్తే ఏపీ హక్కులను దెబ్బతీసినట్లవుతుందన్నది స్పష్టమవుతోంది.

**కేంద్ర జలసంఘం తెగేసిచెప్పినా సరే..**

కృష్ణాజలాల్లో 2021–22లో కోటాలో వాడుకోకుండా మిగిలిన 47.79 టీఎంసీలను 2022–23లో నాగార్జునసాగర్ కింద వినియోగించుకుంటామని గతేడాది తెలంగాణ సర్కార్ కృష్ణాబోర్డును కోరింది. దీనిపై కృష్ణాబోర్డు సీడబ్ల్యూసీని సంప్రదించింది. కోటాలో వాడుకోని నీళ్లన్నీ క్యారీ ఓవర్ జలాలే అవుతాయని సీడబ్ల్యూసీ స్పష్టం చేసింది. బచావత్ ట్రిబ్యునల్ అవార్డు ప్రకారం వాటిపై రెండు రాష్ట్రాలకు హక్కు ఉంటుందని తేల్చిచెప్పింది. అయినా తెలంగాణ సర్కార్ అదే ప్రతిపాదనను తెరపైకి తేవడంపై కృష్ణాబోర్డు అసహనం వ్యక్తం చేస్తోంది.

## డ్రెడ్జింగ్ కార్పొరేషన్ లాభం రూ.15.18 కోట్లు

సాక్షి, విశాఖపట్నం: 2022–23 ఆర్థిక సంవత్సరానికి గానూ డ్రెడ్జింగ్ కార్పొరేషన్ రూ.15.18 కోట్ల లాభాల్ని ఆర్జించినట్లు డీసీఐ ఎండీ కెప్టెన్ ది వాకర్ చెప్పారు. గడిచిన ఆర్థిక సంవత్సరంలో రూ.1,165 కోట్ల అత్యధిక వార్షిక టర్నోవర్ నమోదు చేసినట్లు తెలిపారు. 2022–23లో ఆదాయం రూ.178.24 కోట్లు వచ్చిందన్నారు. మునుపటి ఏడాది ఒక్కో షేరుపై ఆదాయం రూ.1.90 మాత్రమే ఉండగా 2022–23 లో ఇది రూ.5.428 చేరుకుందన్నారు. ప్రస్తుతం ఒప్పందాలు కుదుర్చుకున్న ప్రాజెక్ట్లని నిర్ణీత వ్యవధిలో పూర్తి చేసి మరింత ముందుకు వెళ్లేందుకు ప్రణాళిక రూపొందించుకున్నామన్నారు.

## వేగంగా బల్క్ డ్రగ్ పార్క్ పనులు

▶ మొదటి పేజీ తరువాయి

మూడు బల్క్ డ్రగ్ పార్క్ల ఏర్పాటుకు ముందుకొచ్చింది. అందులో ఒకటి ఏపీలో ఏర్పాటవుతోంది. ఈ బల్క్ డ్రగ్ పార్క్ అభివృద్ధికి రూ.1,500 కోట్లు అవసరం అవుతాయని అంచనా వేస్తుండగా.. మౌలిక వసతుల కల్పనకు కేంద్ర ప్రభుత్వం గరిష్ఠంగా రూ.1,000 కోట్ల వరకు ఇవ్వనుంది. ఈ బల్క్ డ్రగ్ పార్క్ ద్వారా కాకినాడ ఫార్మా హబ్గా తయారు కావడమే కాకుండా సుమారు రూ. 14,340 కోట్ల పెట్టుబడులను ఆకర్షిస్తుందని అంచనా. ఈ పార్క్ద్వారా 30 వేల మందికి ప్రత్యక్షంగా, 40వేల మందికి పరోక్షంగా ఉపాధి లభిస్తుందని అంచనా. ఏపీలోని 200కుపైగా ఫార్మా యూనిట్లు ఉంటే ఇప్పుడు ఈ ఒక్క పార్క్ ద్వారానే 100కు పైగా యూనిట్లు అదనంగా రావచ్చని బల్క్ డ్రగ్ మాన్యుఫాక్చరర్స్ అసోసియేషన్ అంచనా వేస్తుంది.

## 40 గిరిజన తెగల ఫొటో ప్రదర్శన



బొండా గిరిజన మహిళలకు ఫొటోలు అందిస్తున్న ఫొటోగ్రాఫర్ సతీష్లాల్

ముంచంగిపుట్టు: అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఆంధ్ర ఒడిశా సరిహద్దు ప్రాంతంలోని ఒనకఢిల్లీ వారపు సంతలో గురువారం గిరిజనుల ఫొటో ప్రదర్శన జరిగింది. హైదరాబాద్కు చెందిన ఫొటోగ్రాఫర్ సతీష్లాల్ 12 ఏళ్లుగా 18 రాష్ట్రాల్లో తీసిన 40 గిరిజన తెగ జాతుల ఫొటోలతో ఈ ప్రదర్శన ఏర్పాటు చేశారు. గతంలో ఒనకఢిల్లీలో తీసిన బొండా ఆదిమజాతి గిరిజనుల ఫొటోలను సైతం ప్రదర్శనలో ఉంచారు. దీంతో వారపు సంతకు వచ్చిన బొండా గిరిజనులు వారి ఫొటోలను చూసుకుని మురిసిపోయారు. ఫొటోగ్రాఫర్ సతీష్లాల్ మాట్లాడుతూ వివిధ రాష్ట్రాల్లో తాను తీసిన గిరిజన తెగ ఫొటోల ద్వారా వారి సంస్కృతి, సంప్రదాయాలు తెలియజేయాలన్న ఉద్దేశంతోనే ఈ ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అనంతరం కొంతమంది బొండా గిరిజన మహిళలకు తీసిన ఫొటోలను ఉచితంగా ఇచ్చారు.

## కాలువలోకి ప్రైవేటు బస్సు బోల్తా

### 63 మంది ప్రయాణికులకు గాయాలు

మదనపల్లి: ఓ ప్రైవేట్ బస్సు అతివేగంగా వస్తూ కారును తప్పించబోయి అదుపు తప్పి రోడ్డు పక్కన కాలువలోకి బోల్తా కొట్టింది. ఈ ఘటన అన్నమయ్య జిల్లా వేంపల్లె పంచాయతీ కూకటిమానుగడ్డ సమీపంలో గురువారం జరిగింది. ప్రమాదంలో 63 మంది గాయపడ్డారు. వీరిలో 11 మందికి తీవ్ర గాయాలయ్యాయి.ఆరుగురి పరిస్థితి విషమంగా ఉంది. బెంగళూరుకు చెందిన విజయేంద్ర, రాఘవేంద్ర, నితిన్, సుశీంద్రలు వేంపల్లె చెన్నకేశవస్వామి ఆలయంలో మొక్కు నిమిత్తం బెంగళూరు నుంచి బయలుదేరారు. మార్గంమధ్యలో వేంపల్లె క్రాస్ దాటుకుని వచ్చేయడంతో తమ కారును కూకటిమానుగడ్డ వద్ద రోడ్డు పక్కన ఎడమవైపు ఖాళీ స్థలంలోకి మళ్లించి వెనుకకు తిప్పేందుకు యత్నిస్తున్నారు. ఆ ప్రాంతంలో కొద్దిగా మలుపు ఉంది. అదే సమయంలో బెంగళూరు నుంచి తిరుపతి వెళుతున్న ప్రైవేట్ బస్సు అతివేగంగా వస్తోంది. రోడ్డు మీదకు రివర్స్లో వస్తున్న కారును బస్సు డ్రైవర్ రాఘవ గమనించాడు. కారును తప్పించే క్రమంలో బస్సు నియంత్రణ కోల్పోయి కారును వెనుక వైపు ఢీకొట్టి.. రోడ్డు పక్కన గల కాలువలోకి బోల్తా కొట్టింది. స్థానికులు బస్సులోంచి ఒక్కొక్కరినీ రోడ్డు మీదకు చేర్చారు. క్షతగాత్రులను మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

# 30న వైఎస్సార్ రైతుభరోసా సాయం

## తొలివిడత పెట్టుబడి సాయం పంపిణీకి ఏర్పాట్లు

- 2023–24లో తొలివిడతగా 52.31 లక్షలమందికి రూ.3,934.25 కోట్లు
- 2022–23లో 51.41 లక్షలమందికి రూ.6,944.50 కోట్ల లబ్ధి
- మార్చి, ఏప్రిల్, మే నెలల్లో అకాల వర్షాలకు పంటలు దెబ్బతిన్న 48 వేల మంది రైతులకు రూ.46.39 కోట్ల ఇన్పుట్ సబ్సిడీ కూడా..
- 30న కర్నూలు జిల్లా పత్తికొండలో బటన్ నొక్కి జమచేయనున్న సీఎం వైఎస్ జగన్



సాక్షి, అమరావతి: వైఎస్సార్ రైతుభరోసా 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి తొలివిడత పెట్టుబడి సాయం, ఇటీవలి అకాల వర్షాలకు నష్టపోయిన రైతులకు ఇన్పుట్ సబ్సిడీ పంపిణీకి రంగం సిద్ధమైంది. ఈ నెల 30వ తేదీన కర్నూలు జిల్లా పత్తికొండలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి బటన్ నొక్కి ఈ సొమ్మును రైతుల ఖాతాల్లో జమచేయనున్నారు. పెట్టుబడి సాయం కింద గతేడాది 51.41 లక్షలమంది రైతులు లబ్ధిపొందగా.. ఈ ఏడాది 52.31 లక్షలమంది లబ్ధిపొందనున్నారు. వీరికి తొలివిడతలో రూ.7,500 చొప్పున రూ.3,934.25 కోట్లను ముఖ్యమంత్రి జమచేయనున్నారు. పెట్టుబడిసాయంతో పాటు మార్చి, ఏప్రిల్, మే నెలల్లో కురిసిన అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతు కుటుంబాలకు ఇన్పుట్ సబ్సిడీ కూడా అందించనున్నారు.

### ఏటా పెరుగుతున్న లబ్ధిదారులు

వైఎస్సార్ రైతుభరోసా కింద ఇచ్చిన మాటకంటే మిన్నగా అర్హులైన రైతు కుటుంబాలకు ఏటా మూడువిడతల్లో రూ.13,500 చొప్పున పెట్టుబడి సాయం అందిస్తున్న విషయం తెలిసిందే. వెబ్ల్యాండ్ ఆధారంగా అర్హులైన భూయజమానులతో పాటు దేవదాయ, అటవీ (ఆర్వోఎఫ్ఆర్) భూములు సాగుచేసేవారే కాకుండా సెంటు భూమి కూడా లేని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన కౌలుదారులకు తొలివిడతగా మే నెలలో రూ.7,500, రెండోవిడతగా అక్టోబర్లో రూ.4 వేలు, మూడోవిడతగా జనవరిలో రూ.2 వేలు చొప్పున పెట్టుబడి సాయం అందిస్తున్నారు. ఇలా 2019–20లో 46,69,375 మందికి రూ.6,173 కోట్లు, 2020–21లో 51,59,045 మందికి రూ.6,928 కోట్లు, 2021–22లో 52,38,517 మందికి రూ.7,016.59 కోట్లు, 2022–23లో 51,40,943 మందికి రూ.6,944.50 కోట్ల పెట్టుబడి సాయాన్ని నేరుగా వారి ఖాతాలకు జమచేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 52,30,939 మంది అర్హత పొందారు. వీరికి తొలివిడతగా రూ.3,934.25 కోట్ల సాయం అందించనున్నారు. గతేడాది 49,26,041 మంది భూయజమానులు కాగా, 1,23,871 మంది కౌలురైతులు, 91,031 మంది అటవీ భూ సాగుదారులు లబ్ధిపొందారు. ఈ ఏడాది తొలి విడత సాయం కోసం అర్హత పొందిన 52,30,939 మందిలో భూ యజమానులు 50,19,187 మంది, అటవీ భూ సాగుదారులు 91,752 మంది, భూమి లేని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సాగుదారులు 1.20 లక్షల మంది ఉన్నారు. ఈ నెలలో అందించనున్న సాయంతో కలిపి ఈ నాలుగేళ్లలో సగటున 52.30 లక్షల మందికి వైఎస్సార్ రైతుభరోసా కింద రూ.30,996.34 కోట్ల పెట్టుబడి సాయం ఇచ్చినట్లవుతుంది.

### 48,032 మందికి రూ.46.39 కోట్ల ఇన్పుట్ సబ్సిడీ

ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటలు దెబ్బతిన్న రైతులకు సీజన్ ముగియకముందే పంట నష్టపరిహారం (ఇన్పుట్ సబ్సిడీ) నేరుగా వారి ఖాతాల్లోనే జమచేస్తూ బాధిత రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది. అదేరీతిలో గతేడాది డిసెంబర్లో మాండూస్ తుపాన్తో పంటలు దెబ్బతిన్న 91,237 మంది రైతులకు రూ.76.99 కోట్ల నష్టపరిహారాన్ని ఫిబ్రవరిలో అందజేసిన విషయం తెలిసిందే. మార్చి, ఏప్రిల్, మే నెలల్లో కురిసిన అకాల వర్షాలకు 78,510 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. వీటిలో 59,230 ఎకరాల్లో వ్యవసాయ పంటలు, 19,280 ఎకరాల్లో ఉద్యాన పంటలు ఉన్నాయి. ఈ మేరకు పంటలు దెబ్బతిన్న 48,032 మంది రైతులకు రూ.46.39 కోట్ల పంట నష్టపరిహారాన్ని ఈ నెల 30వ తేదీన ముఖ్యమంత్రి జమచేయనున్నారు. ఇప్పటికే ఈ నాలుగేళ్లలో 22.22 లక్షలమందికి రూ.1,911.79 కోట్ల ఇన్పుట్ సబ్సిడీని జమచేశారు. తాజాగా జమచేయనున్న సాయంతో కలిసి 22.70 లక్షల మంది రైతులకు రూ.1,958.18 కోట్ల పంట నష్టపరిహారం అందించినట్లవుతుంది.

## ఏపీలో వైద్య విధానాలు భేష్

- జర్మనీ వైద్య సాంకేతికతను ఏపీకి అందిస్తాం
- విశాఖ మెడ్టెక్ జోన్లో జర్మనీ కంపెనీల పెట్టుబడులను ప్రోత్సహిస్తాం
- జర్మనీ కాన్సుల్ జనరల్ మైకేలా కుచ్లర్



మంత్రి విడదల రజనీతో మాట్లాడుతున్న జర్మనీ కాన్సుల్ జనరల్ మైకేలా కుచ్లర్

సాక్షి, అమరావతి: వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తున్న ఏపీ ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు జర్మనీ కాన్సుల్ జనరల్ మైకేలా కుచ్లర్ చెప్పారు. విజ్ఞాన సముపార్జనలో భాగంగా వైద్య విద్యార్థుల పరస్పర మార్పిడి, వైద్య పరిశోధనల్లో సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. గురువారం మంగళగిరిలోని వైద్యారోగ్యశాఖ ప్రధాన కార్యాలయంలో ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజనితో ఆమె భేటీ అయ్యారు. కుచ్లర్ మాట్లాడుతూ..కోవిడ్ సమయంలో భారత్ అందించిన సహాయానికి జర్మనీ రుణపడి ఉంటుందన్నారు. ఏపీలోనూ కోవిడ్ బాధితులకు వైద్యం అందించిన తీరును ప్రశంసించారు. యోగ, ఆయుర్వేదం వంటి ప్రాచీన వైద్య విధానాలను తమ దేశంలో అమలు చేసేలా.. అక్కడి వైద్య సాంకేతికతను ఏపీకి అందించేలా ఒప్పందాలకు ప్రతిపాదించారు. మంత్రి రజిని మాట్లాడుతూ..రూ.16వేల కోట్లకుపైగా ఖర్చు చేస్తూ ఏపీని హెల్త్ హబ్గా తీర్చిదిద్దేందుకు సీఎం జగన్ అవిశ్రాంతంగా కృషి చేస్తున్నారని తెలిపారు. వైద్య పరికరాల తయారీలో మెడ్ టెక్ జోన్ టాప్లో నిలుస్తోందన్నారు. ఏపీలోని నర్సింగ్ విద్యార్థులు వృత్తి నిర్వహణకు జర్మనీ వైపు మొగ్గు చూపుతున్నారని..వారికి కళాశాలల్లో జర్మన్ భాష నేర్పించేలా ఆలోచిస్తున్నామన్నారు. జర్మనీ వెళ్లే తమ విద్యార్థులకు నాలుగేళ్ల కాలపరిమితితో వీసాలు ఇవ్వాలని కోరారు. దేశంలోనే తొలిసారిగా తమ ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని అమలు చేస్తోందన్నారు. జర్మనీ వైద్య రంగంలో మానవ వనరుల కొరతను భారత్ సాయంతో అధిగమిస్తామని మైకేలా చెప్పగానే..ఇప్పటికిప్పుడు 10వేల మంది నర్సింగ్ సిబ్బందిని జర్మనీకి పంపేందుకు ఏపీ సిద్ధంగా ఉందన్నారు. విశాఖలోని మెడ్టెక్ జోన్లో జర్మనీ కంపెనీలు పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించగా మైకేలా సానుకూలంగా స్పందించారు. వైద్యారోగ్య శాఖ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు, ఏపీవీవీపీ కమిషనర్ వెంకటేశ్వర్లు, డీఎంఈ నర్సింహం పాల్గొన్నారు.

## టీటీడీ ఆధ్వర్యంలో అత్యాధునిక క్యాన్సర్ ఆస్పత్రి

- సీఎం జగన్మోహన్రెడ్డి ఆదేశాలతో శ్రీకారం
- టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి



అంకాలజీ భవనానికి భూమి పూజ చేస్తున్న వైవీ సుబ్బారెడ్డి, ఎంపీ గురుమూర్తి తదితరులు

తిరుపతి (తుడా): టీటీడీ ఆధ్వర్యంలో అత్యాధునిక క్యాన్సర్ ఆస్పత్రిని అందుబాటులోకి తీసుకొస్తామని టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి తెలిపారు. స్విమ్స్ ఆస్పత్రికి అనుబంధంగా శ్రీ బాలాజీ ఇన్స్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ భవనానికి ఎంపీ మద్దెల గురుమూర్తి, టీటీడీ సభ్యుడు అశోక్కుమార్, జేఈవో సదాభార్గవితో కలిసి సుబ్బారెడ్డి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు క్యాన్సర్ ఇన్స్టిట్యూట్ తీసుకొస్తున్నట్టు చెప్పారు. అత్యాధునిక వైద్య పరిజ్ఞానంతో శ్రీ బాలాజీ ఇన్స్టిట్యూట్ ఆఫ్ అంకాలజీని అందుబాటులోకి తీసుకొస్తున్నట్టు తెలిపారు. రూ.124 కోట్ల వ్యయంతో ఆధునిక భవనాన్ని డిసెంబర్ నాటికి పూర్తి చేస్తామన్నారు. రూ.200 కోట్ల వ్యయంతో అత్యాధునిక వైద్య పరికరాలను సమకూర్చనున్నట్టు చెప్పారు. క్యాన్సర్ నిర్ధారణ, అవగాహన, చికిత్సల కోసం పింక్ బస్సు వైద్య సేవలను విస్తరించినట్టు చెప్పారు. పింక్ బస్ సేవలను ప్రతి జిల్లాకు విస్తరించాలని సీఎం ఆదేశించారన్నారు. కార్యక్రమంలో టీటీడీ చీఫ్ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ ఆఫీసర్ నరసింహ కిషోర్, స్విమ్స్ డైరెక్టర్ బి.వెంగమ్మ, బాలాజీ ఇన్స్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ ప్రత్యేక అధికారి ఎం.జయచంద్రారెడ్డి, టీటీడీ చీఫ్ ఇంజనీర్ నాగేశ్వరరావు, స్విమ్స్ అధికారులు రామ్, కోటిరెడ్డి, అపర్ణ పాల్గొన్నారు.

## బలిమెల నీటి వినియోగంపై సమావేశం

సీలేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా): ఆంధ్ర, ఒడిశా సరిహద్దు బలిమెల జలాశయం నీటి నిల్వలపై గురువారం ఇరురాష్ట్రాల అధికారులు సమావేశమయ్యారు. బలిమెల జలాశయంలో 24 టీఎంసీలు ఉండగా, అందులో ఒడిశాకు 18 టీఎంసీలు, ఏపీకి 6 టీఎంసీలు కేటాయించారు. ప్రస్తుతమున్న నీటిలో విద్యుత్ ఉత్పత్తి, వ్యవసాయానికి ఉపయోగించుకునేందుకు, ఒడిశాకు 1,500 క్యూసెక్కులు, ఏపీ 2,000 క్యూసెక్కులు ఉపయోగించుకునేలా నిర్ణయించారు. గతేడాది జూలై నుంచి ఈ ఏడాది ఏప్రిల్ వరకు బలిమెలలో ఉన్న నీటిని 38 టీఎంసీలు ఉపయోగించుకున్నారని, అలాగే ఏపీ 2021–2022లో వాడుకున్న 5 టీఎంసీలు నీటితో కలిసి 50 టీఎంసీలు ఉపయోగించుకున్నట్లుగా తెలిపారు. ఏపీ జెన్కో సూపరింటెండెంట్ ప్రశాంత్కుమార్, ఈఈ శ్రీధర్ పాల్గొన్నారు.

## సూరత్కల్లో రామ్రాజ్ షోరూం ప్రారంభం



మంగళూరు: కర్ణాటకలోని సూరత్కల్లో రామ్రాజ్ కంపెనీ తన నూతన వస్త్ర షోరూంను ఏర్పాటు చేసింది. స్థానిక శివగంగాయ ప్రాంతంలోని శ్రీకంఠేరి దూమవతి ఆలయం ఎదురుగా కుదువాస్ గ్రాండ్యూర్లో జీ2, 6–108/6లో షోరూంను ప్రారంభించినట్లు గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ షోరూంను ప్రముఖ దర్శకుడు, నటుడు దేవదాస్కపికడ్ ప్రారంభించారు. ఇక్కడ అన్ని రకాల నాణ్యమైన కాటన్ వస్త్రాలను అందరికీ అందుబాటులో ఉండే ధరల్లో లభించనున్నట్లు షోరూం నిర్వాహకులు తెలిపారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో శ్రీకంఠేరి దూమవతీ ఆలయ అధ్యక్షుడు పీటీ రాయ్ మంజు కవా తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర నిధులు రాబట్టడంలో సీఎం సఫలం

### ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్

సాక్షి, అమరావతి: కేంద్రంతో రాష్ట్ర ప్రభుత్వం సత్సంబంధాలు కొనసాగిస్తూ రాష్ట్ర విభజనకు సంబంధించిన పెండింగ్ సమస్యలను పరిష్కరించుకుంటోందని ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ చెప్పారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులను రాబట్టడంలో గతంలో టీడీపీ ప్రభుత్వం విఫలం కాగా.. ప్రస్తుతం వైఎస్సార్సీపీ ప్రభుత్వం సఫలీకృతమైందన్నారు. 2014–15 ఆర్థిక సంవత్సరానికిగాను సుదీర్ఘకాలంగా పెండింగులో ఉన్న రెవెన్యూ లోటు గ్రాంటు రూ.10,460.87 కోట్లను కేంద్ర ఆర్థిక శాఖ రాష్ట్ర ప్రభుత్వానికి విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీచేసిందని ఆయన వెల్లడించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి గత ఢిల్లీ పర్యటనల్లో జరిపిన చర్చలు ఫలించి నిధుల విడుదలకు కేంద్ర ప్రభుత్వం ఆర్థిక శాఖను ఆదేశించిందని ఆయన గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

### ఎప్పటికప్పుడు యుటీలు ఇవ్వాలి

ఇక రెవెన్యూ లోటు ఉపయోగించి చేపట్టే అన్ని ప్రాజెక్టులకు చట్టబద్ధమైన అనుమతులు ఉండాలని, పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ ఉండాలని, ఖర్చుల విషయంలో సాధారణ ఆర్థిక నియమాలు–2017 పాటించాలని, యుటిలైజేషన్ సర్టిఫికెట్లను ఎప్పటికప్పుడు సమర్పించాలని ఆ ఉత్తర్వుల్లో కేంద్రం పేర్కొందని మంత్రి బుగ్గన వివరించారు. నిధులు డూప్లికేట్ కాకుండా జాగ్రత్తపడేందుకు కేంద్ర ప్రభుత్వమిచ్చే ప్రతి ఉత్తర్వులోనూ ఆ విషయాలను పొందుపరుస్తుందని ఆయన చెప్పారు. నిజానికి.. టీడీపీ ప్రభుత్వం విభజన హామీలతోపాటు 2014–15 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన రెవెన్యూ లోటును కూడా సాధించలేకపోయిందని ఆయన విమర్శించారు. అప్పటికే కేంద్ర ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్నప్పటికీ కూడా రెవెన్యూ లోటును సాధించలేక చేతులెత్తేసిందన్నారు. అదే.. వైఎస్సార్సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి తరచూ ఢిల్లీ వెళ్లి రాష్ట్రానికి రావాల్సిన ఆర్డీజీ నిధులు, రాష్ట్ర ప్రగతి గురించి ప్రధానమంత్రి, హోంమంత్రి, ఆర్థిక మంత్రి, నీతి ఆయోగ్ సభ్యులకు వివరిస్తూ వచ్చిందన్నారు. దక్షిణ జోనల్ కౌన్సిల్ సమావేశాల్లో కూడా ఈ విషయాలను ప్రస్తావించిందన్నారు. ఆర్డీజీ నిధుల కోసం కేంద్ర ప్రభుత్వం కోరిన విధంగా సమాచారాన్ని సమర్పించి చట్టప్రకారం రావాల్సిన రెవెన్యూ లోటు కోసం ఒత్తిడి చేస్తూ వచ్చిందని బుగ్గన గుర్తుచేశారు.

# విద్యార్థుల ఆరోగ్యం ముఖ్యం

### విద్యార్థుల మానసిక, శారీరక ఆరోగ్యంపై యూజీసీ దృష్టి

- ఉన్నత విద్యాసంస్థల్లో విద్యార్థులు ఒత్తిడిని అధిగమించేలా కౌన్సెలింగ్
- ప్రఖ్యాత వైద్యసంస్థలు ఎయిమ్స్, నిమ్హాన్స్తో ఒప్పందాలు
- విద్యార్థుల ఫిట్నెస్ కోసం జిమ్, యోగా క్లాసులు
- కళాశాలల్లో ఆత్మహత్యల నివారణ, డ్రాపౌట్లు తగ్గించేలా ప్రణాళిక



సాక్షి, అమరావతి: విద్యార్థుల మానసిక, శారీరక ఆరోగ్య శ్రేయస్సుపై ఉన్నత విద్యాసంస్థలు దృష్టి సారించాలని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) సూచిస్తోంది. ఇందులో భాగంగా కళాశాలలు, వర్సిటీలు, ఉన్నత విద్యాసంస్థల్లో విద్యార్థి సేవాకేంద్రాలను (ఎస్ఎస్సీలను) ఏర్పాటు చేయాలని ఇప్పటికే మార్గదర్శకాలు జారీచేసింది. తాజాగా విద్యార్థుల సమస్యలను సమగ్రంగా అధ్యయనం చేయడానికి ప్రత్యేక నిపుణుల కమిటీని నియమించనుంది. అనంతరం విద్యార్థులకు మేలు చేసేలా కమిటీ సిఫారసులను ఎస్ఎస్సీల ద్వారా అమలు చేయాలని యోచిస్తోంది.

### సంపూర్ణ సహకారం అందించేలా..

వివిధ భాషలు, మతాలు, సంస్కృతులతో పాటు గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థుల్లో సామాజిక వైవిధ్యాన్ని అర్థం చేసుకుని వారి భావోద్వేగాలను పరస్పరం గౌరవించేలా ఎస్ఎస్సీలు పనిచేస్తాయి. ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులపై శ్రద్ధ తీసుకోవడంతో పాటు ఒత్తిడిని అధిగమించేలా విద్యార్థులకు మార్గనిర్దేశం చేయడానికి ఆరోగ్య సలహాదారులు, శారీరక, మానసిక ఆరోగ్య నిపుణుల సేవలను అందుబాటులో ఉంచుతారు. ఈ మేరకు కళాశాలలకు సమీపంలోని అంకితభావం కలిగిన మానసిక వైద్యనిపుణులతో పాటు ప్రఖ్యాత వైద్యసంస్థలు ఎయిమ్స్, నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ అండ్ న్యూరోసైన్సెస్ (ఎన్ఐఎంహెచ్ఏఎన్ఎస్–నిమ్హాన్స్)తో ఒప్పందాలు చేసుకోవాలని యూజీసీ సూచించింది. ఆయా కళాశాలల్లోని సైకాలజీ, ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగాల నిపుణుల సేవలను ప్రాజెక్టు డ్రివెన్మోడ్లో వినియోగించుకోవాలని పేర్కొంది.

### సింగిల్ విండో సేవలు

సైకాలజీ, ఫిజికల్ ఎడ్యుకేషన్, స్పోర్ట్స్, సైకియాట్రీ, సోషల్ వర్క్, సోషియాలజీ విభాగాల్లో అనుభవం గడించిన ప్రొఫెసర్లు విద్యార్థి సేవాకేంద్రాన్ని డైరెక్టర్/డీన్ హోదాలో నిర్వహించనున్నారు. పరిస్థితులకు అనుగుణంగా ఆన్లైన్, వ్యక్తిగతంగా, టెలిఫోన్, గ్రూప్ కాలింగ్ కౌన్సెలింగ్ సెషన్ల ద్వారా విద్యార్థులకు శారీరక, మానసిక ఆరోగ్యసేవలను అందించనున్నారు. కళాశాలల్లో విద్యార్థుల ఆత్మహత్యలు అరికట్టడంతోపాటు డ్రాపౌట్ రేట్లను తగ్గించే లక్ష్యంతో సింగిల్ విండో పద్ధతిలో ఈ కేంద్రాలు పనిచేస్తాయి. విద్యార్థుల్లో ఫిట్నెస్ సామర్థ్యాన్ని పెంచడానికి జిమ్లు, యోగా సెంటర్లు నిర్వహించడంతోపాటు ఇండోర్, ఔట్డోర్ క్రీడా ప్రాంగణాల్లో మౌలిక వసతులు కల్పిస్తూ, బాలికలకు ఆత్మరక్షణ శిక్షణ తప్పనిసరిగా ఇవ్వాలని యూజీసీ మార్గదర్శకాల్లో పేర్కొంది.

## పోలవరం సవరించిన అంచనాపై ముందడుగు

సాక్షి, అమరావతి: పోలవరం ప్రాజెక్టు సవరించిన అంచనా వ్యయాన్ని ఆమోదించే ప్రక్రియలో ముందడుగు పడింది. ప్రాజెక్టు తొలిదశ పూర్తికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రూ.16,952.07 కోట్లతో పంపిన సవరించిన అంచనా వ్యయ ప్రతిపాదనను మదింపు చేసి.. త్వరితగతిన నివేదిక ఇవ్వాలని పీపీఏ (పోలవరం ప్రాజెక్టు అథారిటీ), సీడబ్ల్యూసీ (కేంద్ర జలసంఘం) అధికారులను కేంద్ర జల్శక్తి శాఖ కార్యదర్శి పంకజ్కుమార్ ఆదేశించారు. ఆ నివేదిక ఆధారంగా కేంద్ర మంత్రిమండలికి సవరించిన అంచనా వ్యయ ప్రతిపాదనను పంపుతామన్నారు. దానిపై కేంద్ర మంత్రిమండలి ఆమోదముద్ర వేస్తే నిధుల విడుదలకు మార్గం సుగమమవుతుందని చెప్పారు. నిధుల సమస్యను పరిష్కరించడం ద్వారా పోలవరం ప్రాజెక్టును గడువులోగా పూర్తిచేయడానికి అవకాశం ఉంటుందన్నారు. పోలవరం ప్రాజెక్టు తొలిదశ సవరించిన అంచనా వ్యయ ప్రతిపాదనపై గురువారం ఢిల్లీలో కేంద్ర జల్శక్తి శాఖ కార్యాలయంలో పీపీఏ సీఈఓ శివ్నందన్కుమార్, సభ్య కార్యదర్శి రఘురాం, సీడబ్ల్యూసీ చైర్మన్ కుశ్విందర్సింగ్ వోరా, సీడబ్ల్యూసీ వాటర్ ప్లానింగ్, ప్రాజెక్ట్స్ విభాగం సభ్యులు నవీన్కుమార్ తదితరులతో ఆ శాఖ కార్యదర్శి పంకజ్కుమార్ సమీక్ష సమావేశం నిర్వహించారు.

### షెడ్యూలు ప్రకారం పనులు..

తొలుత ప్రాజెక్టు పనుల పురోగతిని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పీపీఏ సీఈఓ శివ్నందన్కుమార్ వివరించారు. ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్లు, స్పిల్ వే, స్పిల్ ఛానల్ను పూర్తిచేసి.. గోదావరి ప్రవాహాన్ని 2021, జూన్ 11న స్పిల్ వే మీదుగా ఏపీ ప్రభుత్వం మళ్లించిందన్నారు. ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్ల మధ్య ప్రధాన డ్యామ్ నిర్మాణ ప్రాంతంలో గోదావరి వరదల ఉధృతికి ఇసుక తిన్నెలు కోతకు గురై ఏర్పడిన అగాధాలను పూడ్చివేసి, యథాస్థితికి తెచ్చే పనులు ప్రారంభమయ్యాయని.. వరదలు వచ్చేలోగా ఆ పనులు పూర్తి చేసే దిశగా చర్యలు చేపట్టారని వివరించారు. ఆ తర్వాత ప్రధాన డ్యామ్ గ్యాప్–2లో డయాఫ్రమ్ వాల్ దెబ్బతిన్న చోట్ల సమాంతరంగా కొత్తగా డయాఫ్రమ్ వాల్ నిర్మించే పనులు ప్రారంభిస్తారని.. వాటికి సమాంతరంగా గ్యాప్–1లో ప్రధాన డ్యామ్ పనులు చేపడతారని చెప్పారు. షెడ్యూలు ప్రకారం ప్రభుత్వం ప్రాజెక్టు పనులు చేస్తోందన్నారు. 41.15 మీటర్ల కాంటూర్ పరిధిలోని నిర్వాసితులకు పునరావాసం కల్పించే పనులను కూడా వేగవంతం చేసిందన్నారు. నిర్ణయించిన షెడ్యూలు ప్రకారం ప్రాజెక్టు పనులు జరుగుతుండటంపై పంకజ్కుమార్ సంతృప్తి వ్యక్తం చేశారు.

### సమగ్రంగా పరిశీలించి నివేదిక..

పోలవరం ప్రాజెక్టు తొలిదశ పూర్తికి రాష్ట్ర ప్రభుత్వం పంపిన సవరించిన అంచనా వ్యయ ప్రతిపాదనను సమగ్రంగా పరిశీలించి నివేదిక ఇవ్వాలని పీపీఏ, సీడబ్ల్యూసీ అధికారులను కేంద్ర జల్శక్తి శాఖ కార్యదర్శి పంకజ్కుమార్ ఆదేశించారు. ప్రధానంగా 41.15 మీటర్ల కాంటూర్ పరిధిలో ముంపునకు గురయ్యే గ్రామాల సంఖ్యను పక్కాగా తేల్చి.. ఆ గ్రామాల్లో నిర్వాసితులకు పునరావాసం కల్పించడం, భూసేకరణకు ఎంత నిధులు అవసరమో తేల్చాలని దిశానిర్దేశం చేశారు. ప్రధాన డ్యామ్, కుడి, ఎడమ కాలువలు.. తొలిదశలో ఆయకట్టుకు నీళ్లందించడానికి చేపట్టాల్సిన డిస్ట్రిబ్యూటరీలకు ఎంత వ్యయం అవసరమో తేల్చాలని సూచించారు. భూసేకరణ, నిర్వాసితులకు పునరావాసం కల్పించడం.. ప్రధాన డ్యామ్, కాలువల పనులకు అయ్యే వ్యయాన్ని విడివిడిగా లెక్కించి, త్వరగా నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. దీనిపై సీడబ్ల్యూసీ చైర్మన్ వోరా పీపీఏ సీఈఓ శివ్నందన్కుమార్లు స్పందిస్తూ.. సవరించిన అంచనా వ్యయాన్ని తేల్చి, నివేదిక ఇస్తామన్నారు.

## ఉద్యాన వర్సిటీలో ఇంటర్న్షిప్

- పది విభాగాల్లో శిక్షణ
- రెండు నెలలపాటు తర్ఫీదు
- విద్యార్థి లోకానికి ఉపయుక్తం



ఉద్యాన వర్సిటీ ముఖద్వారం

తాడేపల్లిగూడెం: ఆధునిక నర్సరీల గురించి అలవోకగా అధ్యయనం చేయవచ్చు. ఎండు పూలకు విలువను ఎలా జోడించవచ్చో తెలుసుకోవచ్చు. సేంద్రియ వ్యవసాయాన్ని ఆకళింపు చేసుకోవడంతో పాటు తేనెటీగల పెంపకాన్ని ఎలా చేపట్టాలో నేర్చుకోవచ్చు. అందమైన ఆకృతులతో ల్యాండ్ స్కేపింగ్ ఎలా చేయాలో ఇట్టే తెలుసుకోవచ్చు. ఉపయుక్తమైన అంశాలపై ఇంటర్న్షిప్ పేరిట ప్రకృతి ఒడిలో విషయ పరిజ్ఞానాన్ని సముపార్జించవచ్చు. విద్యార్థులకు ఇలాంటి సువర్ణావకాశాన్ని అందించేందుకు పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం వెంకట్రామన్నగూడెంలోని వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం సన్నాహాలు చేసింది. రాష్ట్రంలోని వివిధ యూనివర్సిటీల్లో డిగ్రీ కోర్సులు అభ్యసించే విద్యార్థులు ఇకపై ఉద్యాన వర్సిటీ ద్వారా ఇంటర్న్షిప్ చేయవచ్చు. డిగ్రీ కోర్సుల చివరి సంవత్సరం విద్యార్థులకు పది అంశాలపై రెండు నెలలపాటు ఇంటర్న్షిప్ చేసే అవకాశం ఈ నెల నుంచి అందుబాటులోకి వచ్చింది. ఇంటర్న్షిప్నకు సంబంధించి పలు విద్యాసంస్థలు సంప్రదిస్తున్నాయని ఉద్యాన వర్సిటీ విస్తరణ సంచాలకులు ఇ.కరుణశ్రీ చెప్పారు. ఏ అంశంపై ఎక్కడ శిక్షణ ఇస్తారంటే..

**ఆధునిక నర్సరీ యాజమాన్యం:** అన్నమయ్య జిల్లా అనంతరాజుపేట, అనంతపురం, సీఆర్ఎస్ తిరుపతి, నెల్లూరు జిల్లా పెట్లూరు, మహానంది, బాపట్ల, అంబాజీపేట, అల్లూరి జిల్లా పందిరిమామిడి, చింతపల్లి, పశ్చిమ గోదావరి జిల్లా వెంకట్రామన్నగూడెం, ఏలూరు జిల్లా విజయరాయి ఉద్యాన వర్సిటీ పరిశోధన శాలలు, వైఎస్సార్ జిల్లా వనిపెంట, తిరుపతి జిల్లా పెరియవరం, అల్లూరి జిల్లా పందిరిమామిడి, పశ్చిమ గోదావరి వెంకట్రామన్నగూడెం కృషి విజ్ఞాన కేంద్రాల్లో శిక్షణ ఇస్తారు.

**ఎండిన పూలకు విలువ జోడింపు:** అనంతరాజుపేట, వెంకట్రామన్నగూడెం, పార్వతీపురం, చినలాటరపి ఉద్యాన కళాశాలలు, తిరుపతి పరిశోధన శాల, వనిపెంట, పెరియవరం, పందిరిమామిడి, వెంకట్రామన్నగూడెం కృషి విజ్ఞాన కేంద్రాల్లో శిక్షణ.

**పంట కోత అనంతరం యాజమాన్యం:** అనంతరాజుపేట, వెంకట్రామన్నగూడెం, పార్వతీపురం, చినలాటరపి ఉద్యాన కళాశాలలు, వెంకట్రామన్నగూడెం పరిశోధన శాల, వనిపెంట, పెరియవరం, పందిరిమామిడి, వెంకట్రామన్నగూడెం కృషి విజ్ఞాన కేంద్రాల్లో శిక్షణ.

**పుట్టగొడుగుల పెంపకం:** అనంతరాజుపేట, వెంకట్రామన్నగూడెం ఉద్యాన కళాశాలలు, వనిపెంట, పెరియ
వరం, పందిరిమామిడి, వెంకట్రామన్నగూడెం కృషి విజ్ఞాన కేంద్రాల్లో శిక్షణ.

**సేంద్రియ వ్యవసాయం సర్టిఫికేషన్:** అనంతరాజుపేట ఉద్యాన కళాశాల, వనిపెంట, పెరియవరం, పందిరి మామిడి, వెంకట్రామన్నగూడెం కృషి విజ్ఞాన కేంద్రం.

**తేనెటీగల పెంపకం:** వెంకట్రామన్నగూడెం ఉద్యాన కళాశాల, వెంకట్రామన్నగూడెం, పందిరిమామిడి, పెరియవరం, వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రాలు.

**ల్యాండ్ స్కేపింగ్:** అనంతరాజుపేట, వెంకట్రామన్నగూడెం, పార్వతీపురం, చినలాటరపి ఉద్యాన కళాశాల.

**రక్షిత సాగు:** అనంతరాజుపేట, వెంకట్రామన్నగూడెం ఉద్యాన కళాశాలలు.

**ఆర్గానిక్ బయో ఇన్పుట్స్:** వెంకట్రామన్నగూడెం, అంబాజీపేట ఉద్యాన పరిశోధన స్థానాలు..

**లైవ్స్టాక్ ఆక్వాకల్చర్:** వెంకట్రామన్నగూడెం, పందిరిమామిడి కృషి విజ్ఞాన కేంద్రాల్లో శిక్షణ ఇస్తారు.

### ఇంటర్న్షిప్.. అర్హతలు

- ➤ బీఎస్సీలో బోటనీ, జువాలజీ, మైక్రోబయాలజీ, హార్టికల్చర్, అగ్రికల్చర్, ఫుడ్ టెక్నాలజీ, సీడ్ టెక్నాలజీ, బయోటెక్నాలజీ కోర్సు చదువుతున్నవారు అర్హులు.
- ➤ ఇంటర్న్షిప్ కోసం నెలకు రూ.3 వేల చొప్పున రెండు నెలల పాటు చెల్లించాలి.
- ➤ విద్యార్థుల హాజరు 75 శాతం ఉండాలి. ఆఖరి పరీక్షల్లో 75 శాతం మార్కులు పొందాలి.
- ➤ శిక్షణ ప్రాంగణంలో ఎటువంటి వసతి కల్పించరు.
- ➤ ఇంటర్నెట్, పరిశోధన శాలలకు హార్డు కాపీలు ఇస్తారు.
- ➤ ఆడియో, విజువల్, గ్రూపు ప్యానల్ డిస్కషన్స్, గ్రూప్ వర్క్, స్కిల్ ప్రాక్టీస్, క్విజ్, అసైన్మెంట్ వంటివి ఉంటాయి.
- ➤ 75 శాతం మార్కులతో ఇంటర్న్షిప్ పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్లు ఇస్తారు.

ఓ విశ్వాసులారా! అతిగా అనుమానించడం నుండి దూరంగా ఉండండి. ఎందుకంటే కొన్ని అనుమానాలే నిశ్చయంగా పాపాలు. మీరు మీ పరస్పర రహస్యాలను తెలుసుకోవటానికి ప్రయత్నించకండి. చాడీలు చెప్పకోకండి.

– ఇస్లాం ధర్మం



సాక్షి

శుక్రవారం, 26 మే 2023

## ఇది మోదీ ఎక్స్‌ప్రెస్!

గమనించాలి... గ్రహించాలే కానీ సంఘటనలన్నీ ఏదో ఒక సంకేతమిస్తాయి. భారత ప్రధాని నరేంద్ర మోదీ అయిదు రోజుల పాటు జరిపిన మూడు దేశాల పర్యటన చూస్తే అదే అనిపిస్తుంది. ప్రపంచ దేశాధినేతల ప్రత్యేక ప్రశంసలు, ప్రవాస భారతీయుల నుంచి జయ జయ ధ్వానాలు మోదీకే కాదు... భారత్‌కు పెరిగిన ప్రాధాన్యాన్నీ, ప్రతిష్ఠనూ సూచిస్తున్నాయి. జపాన్‌లో 'జీ7' దేశాల సదస్సులో అతిథిగా హాజరైనప్పుడూ, పాపువా న్యూ గినియా నేత ఏకంగా పాదాభివందనం చేసినప్పుడూ, ఆస్ట్రేలియాలో ప్రవాస భారతీయుల 'మోదీ' నాదాలు చూసినప్పుడూ వెలువడ్డ సంకేతం అదే. కర్ణాటకలో పదే పదే పర్యటించి, భారీ సభలు, ఊరేగింపులు నిర్వహించినప్పటికీ ఆ రాష్ట్రంలో అధికారం చేజార్చుకున్న బీజేపీ నేతగా స్వదేశంలో సన్నాయి నొక్కులు వినిపిస్తూ ఉండవచ్చు. ప్రధానిగా బాహ్య ప్రపంచంలో మాత్రం మోదీ సమ్మోహన మంత్రానికి తరుగు, తిరుగు లేదని అర్థమవుతుంది. అభివృద్ధి చెందుతున్న దేశాల నుంచి అగ్ర రాజ్యాల దాకా అన్నీ.. అతిపెద్ద మార్కెటైన నవభారతంతో భుజాలు రాసుకోవడానికి ఉత్సాహం చూపుతున్నాయని తెలుస్తుంది.

హిరోషిమాలో 'జీ7' సదస్సుకు హాజరైన ప్రధాని ఆ పైన ద్వీపదేశమైన పాపువా న్యూ గినియాను తొలిసారి సందర్శించారు. 'భారత – పసిఫిక్ ద్వీపదేశాల సహకార వేదిక' (ఎఫ్ఐపీఐసీ) మూడో సదస్సుకు సహాధ్యక్షత వహించారు. ఆ దేశానికి ఒక భారత ప్రధాని వెళ్ళడం ఇదే ప్రథమం. ఏడాది క్రితం పదవి చేపట్టిన లేబర్ పార్టీ నేత, ఆస్ట్రేలియా ప్రధాని ఆంథొనీ అల్బనీస్ ఆహ్వానంపై మోదీ సిడ్నీలో పర్యటించారు. అల్బనీస్‌తో ద్వైపాక్షిక సమావేశం, వ్యాపార బృందాల రౌండ్ టేబుల్‌తో తన మూడు దేశాల పర్యటనను విజయవంతంగా ముగించి, స్వదేశానికి తిరిగొచ్చారు. స్వదేశంలోని రాజకీయ చిక్కులతో అమెరికా అధ్యక్షుడు బైడెన్ రాలేనందున ఆస్ట్రేలియాలో జరగాల్సిన 'క్వాడ్' సదస్సును లఘువుగా జపాన్‌లోనే అధినేతలు జరిపేశారు. ఆస్ట్రేలియాతో పటిష్ఠ బంధానికి అవకాశం వదులుకోని మోదీ తన పర్యటనను సమయానికి తగ్గట్టు ద్వైపాక్షిక సందర్శన చేసేశారు. గత ఏడాది కాలంలో ఆరోసారి అల్బనీస్‌తో భేటీ. ఈ ఆర్థిక, వాణిజ్య సహకార దోస్తీ ప్రాంతీయ శాంతి సుస్థిరతలకూ కీలకమన్నారు. 'డెమోక్రసీ, డయాస్పొరా, దోస్తీ'– ఈ మూడు 'డి'లు కీలకమంటూ, శరవేగంతో మెరుగవుతున్న ఇరుదేశాల సంబంధాలకు టీ20 మ్యాచ్‌లతో పోలిక తెచ్చారు.

అదే సమయంలో ఆస్ట్రేలియాలో ఆలయాలపై దాడులు, వేర్పాటువాద శక్తుల విజృంభణను మార్చిలో అల్బనీస్‌తో ప్రస్తావించినా ఇప్పుడూ ఆ ఊసెత్తడం స్నేహదేశానికి ఒకింత ఇబ్బందికరమే. అది అటుంచితే, భారత ప్రధానికి సాదర స్వాగతం పలుకుతూ ఆ దేశంలోని అతి పెద్ద వినోద, క్రీడా ప్రాంగణంలో సాగిన భారీ సంబరం ప్రవాసుల్లో పెరిగిన జాతీయవాదానికి మచ్చు తునక. 'మోదీ ఎయిర్‌వేస్', 'మోదీ ఎక్స్‌ప్రెస్' లాంటి పేర్లతో ఆస్ట్రేలియా నలుమూలల నుంచి ప్రత్యేక విమానాల్లో, రైళ్ళలో అభిమాన జనం తరలివచ్చారు. భారత ఆర్థిక వ్యవస్థలోకి లక్షల కోట్ల రూపాయలను ప్రవహింపజేస్తున్న ప్రవాస భారత ప్రపంచానికి ఒక భరోసా ఇవ్వాలని ప్రధాని భావించినట్టున్నారు. అందుకే, క్రిక్కిరిసిన స్టేడియమ్‌లో ముప్పావుగంట సేపు మాటల మోళీ చేశారు. తొమ్మిదేళ్ళలో తొలిసారి ఆస్ట్రేలియాలో పర్యటిస్తున్న ప్రియతమ నేత పట్ల భారతీయ డయాస్పొరా స్పందన చూసి, అక్కడి పాలకులు సైతం అబ్బురపడ్డారు.

2014 నవంబర్‌లో మోదీ ఆస్ట్రేలియా పర్యటించినప్పుడు ఆయన అప్పుడప్పుడే విశ్వవేదికపై నిలదొక్కుకునే ప్రయత్నం చేస్తున్న భారత ప్రధాని. నాడు బ్రిస్బేన్‌లో 'జీ20' సదస్సులో ఇతర దేశాలతో స్నేహానికి ఆయన శ్రమిస్తే, నేడు 2023లో అదే భారత్ 'జీ20'కి అధ్యక్ష పీఠం దాకా ఎదిగింది. పోటీ దేశాల కన్నా వేగంగా పెరుగుతున్న దేశమైంది. అప్పట్లో ఆస్ట్రేలియన్ పార్లమెంట్‌లో బెరుకుగా మాట్లాడిన అదే వ్యక్తి ఇప్పుడు విదేశీ పర్యటనలు, డజన్ల కొద్దీ శిఖరాగ్ర సదస్సుల్లో ఆరితేరిన ఆత్మవిశ్వాసం ప్రదర్శిస్తున్నారు. ఆస్ట్రేలియా సహచరుడు 'మోదీ... ది బాస్' అని మైకులో అంటే, వచ్చే అమెరికా పర్యటనలో భారత ప్రధాని వైట్‌హౌస్ విందుకు అప్పుడే టికెట్లు అమ్ముడైపోయాయంటూ, ఆటోగ్రాఫ్ కావాలని అగ్రరాజ్య అధినేత బైడెన్ చమత్కరించడం గమనార్హం. మోదీ మాటల్లోనే చెప్పాలంటే, 'నేను కలసిన నేతలందరూ 'జీ20'కి భారత సారథ్యం పట్ల ప్రశంసలు కురిపిస్తున్నారు. ఇది భారత్‌కు గర్వకారణం.'

ఇవాళ భారత్ ప్రపంచంలోని అయిదో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థ. జనాభాలో చైనాను దాటి ప్రపంచంలో ప్రథమ స్థానానికి దూసుకుపోతున్న మన గడ్డపై ఈ మానవ వనరులకు తోడు అపార ప్రతిభ, అరచేతిలో సాంకేతికత ఉన్నాయి. వాణిజ్యం, ఆటోమొబైల్ ఉత్పత్తులు, మొబైల్ తయారీ, అందివచ్చిన అంకుర సంస్థల ఉద్యమం లాంటి అనేక సానుకూలతలతో పురోగమిస్తున్న భారత్ వైపు ప్రపంచం చూస్తున్నది. హరిత ఉదజని టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు ఖరారు చేసుకోవడం మొదలు వలసలు – రాకపోకల భాగస్వామ్య ఒప్పందం (ఎంఎంపీఏ) దాకా ఆస్ట్రేలియా – భారత్‌లు తాజాగా సంతకాలు చేయడం ఆ ధోరణికి కొనసాగింపే! ఇవన్నీ విద్యార్థులు, వృత్తి నిపుణులు, పరిశోధకులు, విద్యావేత్తల రాకపోకలను సులభతరం చేస్తాయి. ఆర్థిక, దౌత్య సంబంధాలైనా, అత్యంత కీలకమైన భౌగోళిక వ్యూహాత్మక దోస్తీలైనా బాగుండాలంటే మనుషుల మధ్య ఆత్మీయ బంధాలు ప్రధానం. ప్రజాస్వామ్య దేశాలతో, ప్రవాస భారతీయులతో కలసి అడుగులు వేస్తున్న నమో భారత్ అనుసరిస్తున్న మార్గమూ అదే!

# కృత్రిమ మేధ విసరనున్న సవాళ్లు

విశ్లేషణ



నితిన్ దేశాయి

ఛాట్ జీపీటీ, బార్డ్, బింగ్, డాల్–ఈ! ఈ మధ్యకాలంలో బాగా ప్రాచుర్యంలోకి వచ్చిన కృత్రిమ మేధ ఆధారిత టెక్నాలజీల పేర్లు ఇవి. వాణిజ్యం, భద్రత విషయాల్లో ఈ సాఫ్ట్‌వేర్ల ప్రభావం ఏమిటన్న విషయంపై ఇప్పుడు విస్తృత చర్చ జరుగుతోంది. జనరేటివ్ ఏఐ సాఫ్ట్‌వేర్లు ఎంత పురోగతి సాధించినా... వాటికి మనిషికున్న విచక్షణ జ్ఞానం ఉండదు. కాబట్టి వాటంతట అవే మనిషికి చెడు చేయలేకపోవచ్చు కానీ... చెడుబుద్ధి కలిగిన మనిషి వల్ల మాత్రం జరిగే ప్రమాదం ఉంది. కంప్యూటర్ల రాకతో మేలూ జరిగింది, సైబర్ మోసాలూ పెరిగాయి. జనరేటివ్ ఏఐ విషయంలోనూ రాగల అపార అవకాశాలకు రానున్న తరాలను సిద్ధం చేయడం, ఎదురుకాగల ప్రమాదాలను వీలైనంత వరకూ తగ్గించడం ఇప్పుడు మనం చేయాల్సిన పని!

సాధారణంగా మనం ఉపయోగించే సాఫ్ట్‌వేర్ ఏదైనా సొంతంగా సృష్టించేది ఏమీ ఉండదు. అయితే కొన్ని సాధారణ కృత్రిమ మేధ(ఏఐ) సాఫ్ట్‌వేర్లు మన రాతల్లోని తప్పులను దిద్దడమే కాకుండా... తరువాత ఉపయోగించగల పదాలను సూచించగలవు. ఛాట్‌జీపీటీ వంటివి వీటికంటే అత్యాధునికమైనవి. సొంతంగా వ్యాసాలు, కవితలు రాసి పెట్టగలవవు. ఈ లాంగ్వేజ్ జనరేటెడ్ కృత్రిమ మేధ సాఫ్ట్‌వేర్లు మనం వేసిన ప్రశ్నలను సమర్థంగా అర్థం చేసుకోవడమే కాకుండా ఇంటర్నెట్‌లో అందుబాటులో ఉన్న సమాచారం మొత్తాన్ని మథించి సవివరమైన సమాధానాన్ని సిద్ధం చేయగలవు. ఇతరుల గొంతులను అనుకరించేందుకు, గ్రాఫిక్స్ కోసం కూడా వీటిని వాడుకోవచ్చు. గత ఏడాది అక్టోబరులో సామాన్యులకూ అందుబాటులోకి వచ్చిన ఛాట్ జీపీటీ చాలా తక్కువ కాలంలో వ్యాప్తి చెందింది. సెకన్ల కాలంలోనే సంక్లిష్టమైన ప్రశ్నలకూ జవాబులు చెబుతూ అందరినీ ఆకట్టుకుంది. అదే సమయంలో చాలామందిలో కృత్రిమ మేధపై ఆందోళన వ్యక్తమయ్యేందుకూ కారణమైంది.

ఈ నేపథ్యంలో నేనూ ఛాట్ జీపీటీకి ఒక ప్రశ్న సంధించా. ఉద్యోగాలపై అత్యాధునిక కృత్రిమ మేధ సాఫ్ట్‌వేర్ల ప్రభావం ఎలా ఉంటుందన్న ప్రశ్నకు ఛాట్ జీపీటీ సంతులనంతో కూడిన జవాబిచ్చింది. డేటా ఎంట్రీ, అసెంబ్లీ లైన్, కస్టమర్ కేర్ వంటి రంగాల్లోని రిపిటీటివ్ పనులు (ఒకే పనిని పదేపదే చేయడం) చేయడంలో కృత్రిమ మేధకు అపారమైన సామర్థ్యముందని చెబుతూనే... గ్రాఫిక్ డిజైనింగ్, అడ్వర్టైజ్‌మెంట్, కంటెంట్ క్రియేషన్ వంటి సృజనాత్మక విషయాల్లోనూ జనరేటివ్ ఏఐ మంచి ప్రభావం చూపగలదని తెలిపింది. ఈ సమాధానంలోనే ఛాట్ జీపీటీ ప్రపంచవ్యాప్తంగా పెరిగిపోతున్న ధనిక, పేద అంతరాన్ని కూడా ప్రస్తావించడం గమనార్హం. నైపుణ్య లేమి లేదా మధ్యమ స్థాయి నైపుణ్యాలు మాత్రమే ఉన్న పనివారికి నష్టం జరిగే అవకాశముందని తేల్చి చెప్పింది. మెషీన్ లెర్నింగ్, డేటా అనాలసిస్, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ వంటి ప్రత్యేక నైపుణ్యాలున్న వారికి కొత్త, వినూత్న ఉద్యోగాలను సృష్టించగల సామర్థ్యం కూడా జనరేటివ్ ఏఐకి ఉందని వివరించింది.

సాంకేతిక పరిజ్ఞానంలో జరిగే మార్పులు అప్పటికే ఉన్న ఉద్యోగాలపై ప్రతికూల ప్రభావం చూపుతాయి. అదే సమయంలో కొత్త కొత్త ఉద్యోగాలను కూడా సృష్టిస్తాయి. ఎడ్లబండ్ల స్థానంలో మోటారు వాహనాలు వచ్చినట్లు అన్నమాట! భారతదేశంలో జనరేటివ్ ఏఐ దానికున్న సృజనాత్మక సామర్థ్యాన్ని బట్టి చూస్తే బిజినెస్ ప్రాసెసింగ్, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ రంగాల్లోని ఉద్యోగాలపై కచ్చితంగా ప్రతికూల ప్రభావం చూపనుంది. ఈ రంగాల్లోని పనులను జనరేటివ్ ఏఐ ప్రోగ్రామ్స్ చాలా సులువుగా చేయగలవు. కాకపోతే వీటితో పని చేయించేందుకు కొంత సాయం, ప్రాంప్టింగ్ అవసరం. మన ఐటీ, బీపీవో కంపెనీలు ఈ సామర్థ్యాలను అందుకోవడంపై శ్రద్ధ పెట్టాలి.



ఆసక్తికరమైన విషయం ఏమిటంటే... జనరేటివ్ ఏఐ ఈ విషయంలోనూ మనకు సాయపడగలదు. తక్కువ నైపుణ్యం ఉన్నవారికి తగిన శిక్షణ ఇవ్వగలదు. ఉదాహరణకు ఇంగ్లీషు భాషా నైపుణ్యాన్ని పెంచుకునేందుకు, తద్వారా మార్కెటింగ్ లేదా మరే ఇతర రంగంలోనైనా రాణించేందుకు ఏఐని వాడుకోవచ్చు.

### ఇప్పుడు చర్చ మొత్తం భద్రత పైనే...

జనరేటివ్ ఏఐ విషయంలో ఇప్పుడు చర్చ మొత్తం భద్రతాంశాల పైనే. ఛాట్ జీపీటీ రాక నేపథ్యంలో ఇది మరింత ముదురుతోంది. మనుషుల ప్రమేయం లేకుండానే ఈ జనరేటివ్ ఏఐ సాఫ్ట్‌వేర్లు ఇమేజెస్, వీడియో, టెక్స్ట్‌లను సృష్టించగలవు. ప్రఖ్యాత రచయిత యువాన్ హరారి అభిప్రాయం ప్రకారం, మానవ సంస్కృతికి భాష అనేది ప్రాథమిక ప్రాతిపదిక. భాష విషయంలో ప్రావీణ్యం కలిగి ఉన్న జనరేటివ్ ఏఐ... సంస్కృతి వృద్ధి, విశ్వాసాలను తన చేతుల్లోకి తీసుకోగలదని యువాన్ అంటారు. అయితే జనరేటివ్ ఏఐకి తనదైన చేతన ఉండదు. ఏదో సాధించాలన్న కాంక్ష కూడా కరవు. స్పష్టంగా చెప్పాలంటే... కొంతమంది మనుషులు ఇతరులపై తమ ప్రభావాన్ని మరింత పెంచుకునేందుకు జనరేటివ్ ఏఐ వంటివాటిని ఉపయోగించుకునే అవకాశం ఉంది.

ఈ జనరేటివ్ ఏఐ సాఫ్ట్‌వేర్లు చాలా వరకూ ఓపెన్ సోర్స్. అందరికీ అందుబాటులో ఉండేవి. అంటే రకరకాల అభిప్రాయాలు, నమ్మకాలు ప్రచారంలోకి వచ్చేందుకు అవకాశమున్నవి. కాబట్టి సమస్య అంత పెద్దగా ఏమీ ఉండకపోవచ్చు. కానీ అసలైన సవాలు కృత్రిమ మేధను మానసిక ప్రకోపాలతో ఉపయోగించడంతోనే ఉంది. ఛాట్ జీపీటీ ఇచ్చిన సమాధానం ప్రకారమే... కృత్రిమ మేధ ఆధారంగా నిఘా వ్యవస్థలను ఏర్పాటు చేయడం, సంప్రదాయ భద్రత ఏర్పాట్లను తప్పించుకుని సైబర్ దాడులకు తెగబడేలా ఏఐని వాడుకోవడం, కృత్రిమ మేధను ఉపయోగించుకుని మానవులపై ఆయుధ దాడి చేయడం వంటివాటికి అవకాశం ఉంది. అంతేకాకుండా... నకిలీ వార్తలు, మోసాల వంటివాటిని మరింత తీవ్రతరం చేసేందుకు కూడా ఈ జనరేటివ్ ఏఐ అక్కరకొచ్చే ప్రమాదముంది. గొంతులను అనుకరించే సామర్థ్యం కూడా ఉండటం వల్ల భవిష్యత్తులో మన కుటుంబ సభ్యుల గొంతులోనే డబ్బులడిగే మోసాలకు తెరలేవవచ్చు.

### దుర్వినియోగాన్ని అరికట్టడం ఎలా?

జనరేటివ్ ఏఐ కారణంగా ఒకవేళ ఉద్యోగాలు తగ్గిపోతే సార్వత్రిక కనీస ఆదాయం వంటి వాటి ద్వారా జరిగే నష్టాన్ని కొంతైనా తగ్గించవచ్చునని ఛాట్ జీపీటీ సృష్టికర్త సామ్ ఆల్ట్‌మ్యాన్ అంటారు. కానీ భద్రతపరమైన అంశాలతోపాటు ఏఐ దుర్వినియోగాన్ని అరికట్టడం ఎలా అన్నదే ఇప్పుడు అసలు ప్రశ్న. కృత్రిమ మేధ వాడకానికి, నియంత్రణకు ప్రత్యేక సంస్థ ఒకదాన్ని ఏర్పాటు చేయాలన్న ఏకాభిప్రాయం కూడా ఇప్పుడిప్పుడే ఏర్పడుతోంది. ఈ విషయమై జీ7 దేశాలు ఓ వర్కింగ్ గ్రూప్ ఏర్పాటుకు ప్రయత్నాలు చేస్తూండగా, యూరోపియన్ యూనియన్ ఇప్పటికే నియంత్రణ మార్గదర్శకాల తయారీలో నిమగ్నమైంది. అయితే ఈ నియంత్రణ ప్రభుత్వాల ఆధ్వర్యంలో జరిగితే రాజకీయ దుర్వినియోగమన్న ప్రశ్న ఉత్పన్నమవుతుంది. కృత్రిమ మేధ అభివృద్ధిపై చైనా ఇప్పటికే కొన్ని నియంత్రణలను అమల్లో పెట్టిన విషయం ప్రస్తావనార్హం.

### భారత్ సిద్ధం కావాలి

దశాబ్దాల క్రితం కంప్యూటరీకరణ మాదిరిగానే... జనరేటివ్ ఏఐ రేపటితరం టెక్నాలజీ అన్న విషయాన్ని భారత్ అంగీకరించాల్సిన అవసరముంది. కాబట్టి అలాంటి సాఫ్ట్‌వేర్లను స్థానికంగా అభివృద్ధి చేయాలి, వాడటాన్ని ప్రోత్సహించాలి. జనరేటివ్ ఏఐకి భాషే ప్రాతిపదిక కాబట్టి.. బోలెడన్ని భాషలు మాట్లాడే భారత్‌లో వాటి వినియోగం పెద్ద సవాలే. పైగా ఏఐ సర్వీసులకు పెద్ద పెద్ద సర్వర్ వ్యవస్థల అవసరం ఉంటుంది. ఇది పెద్ద పెద్ద కంపెనీలకు అనుకూలమైన అంశం. అలాగే... వీలైనంత తొందరగా ఇన్స్‌టిక్ పరిశ్రమను, ఏఐని అనుసంధానించాల్సిన అవసరముందని... తద్వారా మాత్రమే ఏఐ మార్కెట్‌లో స్థానం సంపాదించవచ్చునని తాజా అంచనా. కంప్యూటర్ల రాకతో కష్టతరమైన లెక్కలు వేసే బాధ తప్పి అంతకంటే ఎక్కువ ప్రయోజనకరమైన పనులపై దృష్టి పెట్టడం సాధ్యమైంది. సైబర్ మోసాలూ పెరిగాయి. ఇదే విధంగా జనరేటివ్ ఏఐ కూడా భవిష్యత్తు తరాలకు కూడా కొంత మంచి, కొంత చెడు అనుభవాలను చూపించనుంది. ఈ పరిణామాలకు, రాగల అపార అవకాశాలకు రానున్న తరాలను సిద్ధం చేయడం... ఎదురు కాగల ప్రమాదాలను వీలైనంత వరకూ తగ్గించడం ఇప్పుడు మనం చేయాల్సిన పని!

వ్యాసకర్త ఆర్థికవేత్త

('ద బిజినెస్ స్టాండర్డ్' సౌజన్యంతో)

## సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

### మొత్తం ఒకదానికే!



ప్రాచీన హోదా కలిగిన భారతీయ భాషల కోసం మోదీ ప్రభుత్వం ఇలా ఖర్చు చేసింది (2017-20):
సంస్కృతం – రూ. 643 కోట్లు.
తమిళం – 23 కోట్లు. కన్నడ – 3 కోట్లు.
తెలుగు – 3 కోట్లు. ఒడియా – 0 కోట్లు.
మలయాళం – 0 కోట్లు.

– అద్వైద్, చరిత్రకారుడు

### అంతా ఆయనే!



వందే భారత్ రైళ్ల నుంచి నూతన పార్లమెంట్ భవనం వరకు ప్రతిదీ ప్రధాని మోదీ ఆవిష్కరించాల్సిందే. కోవిడ్ సర్టిఫికెట్ల మీదా ఆయన ఫొటో ఉండాల్సిందే. ఏ మంత్రిత్వ శాఖ చేసిన పనికైనా ఆయనకు క్రెడిట్ ఇవ్వాల్సిందే. ఇట్లాంటి మహాత్వోన్మాదం... అధికారవాదుల అభద్రతకు ప్రమాణ చిహ్నం.

– సాకేత్ గోఖలే, తృణమూల్ జాతీయ ప్రతినిధి

### మర్యాద కాదు!



ఇండియాలో ఏం జరుగుతోంది? ఇండియాను ప్రపంచం గౌరవించడం మొదలుపెట్టినప్పుడే – మనం మన జాతీయ చిహ్నాలను, సంస్థలను అప్రతిష్ఠపాలు చేయడానికి ప్రయత్నిస్తున్నాం; పరస్పరం అగౌరవాన్ని చూపుకొంటున్నాం.

– వేద్ మాలిక్, భారత ఆర్మీ మాజీ చీఫ్

### మళ్లీ మొదలా?



కోవిడ్ 19 కన్నా ప్రమాదకరమైన వ్యాధికి సిద్ధంగా ఉండాలని ప్రపంచ నాయకులను ప్రపంచ ఆరోగ్య సంస్థ డైరెక్టరు హెచ్చరించారు. నేను మళ్లీ మరొక మహమ్మారికి సిద్ధంగా లేను. మీ సంగతేంటి?

– తస్లీమా నస్రీన్, రచయిత్రి

### ఉండొద్దా?



పాలస్తీని యన్లకూ, ఇజ్రాయిలీలకూ ఘర్షణ పాలస్తీనా దేశం ఏర్పాటు గురించి కానేకాదు; మొత్తంగా అసలు ఒక యూదు దేశం ఉనికిలో ఉండటం గురించి.

– ఆర్సెన్ ఓస్ట్రోవ్‌స్కీ, హక్కుల న్యాయవాది

# ఈ సంకేతాన్ని ప్రతిపక్షాలు అందిపుచ్చుకోవాలి!

అభిప్రాయం



ఐ.వి. గోవిందరెడ్డి

దాదాపు అందరి అంచనాలనూ తలకిందులు చేస్తూ కర్ణాటక ప్రజలు కాంగ్రెస్‌కు అత్యధిక స్థానాలు అందించి అందలం ఎక్కించారు. ఆ ఘన విజయం కారు చీకటిలో క్షణకాలం తళుక్కున మెరిసి మాయమయ్యే కాంతిరేఖ వంటిదేనా? కేవలం కర్ణాటకకే పరిమితమైన రాజకీయాల ప్రభావం తప్ప అందులో మరేదీ లేదా? దేశ ప్రజల్లో గత దశాబ్ద కాలంగా గూడుకట్టుకుంటున్న ఆగ్రహావేశాలకు అదేమీ సంకేతం కాదా? ఈ ప్రశ్నలు కర్ణాటక ఫలితాలు వెలువడిన మే 13 మొదలుకొని చానెళ్లలోనూ, పత్రికల్లోనూ, సామాజిక మాధ్యమాల్లోనూ పదే పదే వినిపిస్తున్నాయి. ఆ ప్రశ్నలకు ఎవరికి తోచినట్టు వారు వివరణ ఇస్తున్నారు. ఇవన్నీ 'తెలిసినవారికి పలుకు లేదు... పలికేవారికి తెలివి లేదు' అన్నట్టు ఉన్నాయి.

కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో సాగిన ప్రచారం అసాధారణమైనది. ప్రధానంగా బీజేపీ వైపునుంచి సాగిన ఈ ప్రచారాన్ని చూసి ఒక దశలో విపక్షాలన్నీ బెంబేలెత్తాయి. కానీ తెలివైన కర్ణాటక ఓటర్లు 'జనాదేశం' ఎలా ఉందో చూపారు. 'కర్ర వంకర పొయ్యి తీర్చినట్టు' లెక్క సరిచేశారు. దీనికి ముందు పంజాబ్ ఓటర్లు సైతం విచక్షణ ప్రదర్శించారు. కాంగ్రెస్ పాలన బాగులేదనుకున్నప్పుడు ఆ రాష్ట్ర ప్రజలు ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) గెలిపించారు తప్ప కమలం పార్టీ వైపు చూడనే లేదు. తాము గెలిపించుకోకపోయినా ప్రలోభాల ఫిరాయింపులతో గద్దెనెక్కి స్వారీ చేసిన బీజేపీ పోకడలను కర్ణాటక ప్రజలు గమనించారు. ఇక నిరుడు డిసెంబర్‌లో జరిగిన ఎన్నికల్లో హిమాచల్ ప్రదేశ్ అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో కూడా కాంగ్రెస్‌కు ప్రజలు పట్టం గట్టి బీజేపీని కాదనుకున్నారు.

దేశవ్యాప్తంగా ప్రజల్లో వర్తమాన ఎన్డీఏ పాలనపై ఒక పునరాలోచన ప్రారంభమైందనడానికి ఈ మూడు రాష్ట్రాల ప్రజలు ఇచ్చిన తీర్పులు స్పష్టమైన సంకేతం. దీన్ని ప్రతిపక్షాలు అందిపుచ్చుకుని తమకు అనుకూలంగా మలుచుకుంటాయా లేక బీజేపీయే జాగ్రత్తపడి తన బలాన్ని కాపాడుకునే ప్రయత్నం చేస్తుందా అన్నది రానున్న కాలం చెబుతుంది. ఒకటైతే వాస్తవం. ఈ రెండు రాష్ట్రాలూ బీజేపీ సొంత ఇలాకాలు కావు. కానీ ఈ ఏడాది చివరి నాటికి రాజస్థాన్, మధ్యప్రదేశ్, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, మిజోరాంలలో ఎన్నికలు జరుగుతాయి. ఇందులో రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌లు కాంగ్రెస్ చేతిలో ఉన్నాయి. ఆ రెండుచోట్లా కాంగ్రెస్‌లో అంతర్గత కుమ్ములాటలున్నాయి. కాంగ్రెస్ నేతలే పార్టీ పనితీరు బాగులేదంటూ బాహాటంగా విమర్శిస్తున్నారు. మధ్యప్రదేశ్‌లో బీజేపీ ఫిరాయింపులతో అధికార పీఠాన్ని అందుకుంది. బీజేపీ మౌలిక సిద్ధాంతాలైన హిందుత్వ, రామ మందిరం, జాతీయత వంటివి హిందీ బాగా మాట్లాడే ప్రాంతాల్లో బాగా పనికొస్తాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో ఆ ఉద్వేగపు విభజన రాజకీయాలు పనిచేయవు. సామాజికంగా, ఆర్థికంగా వెనకబడిన వర్గాల సంక్షేమాన్ని చూస్తూ సాగునీటి ప్రాజెక్టుల కోసం, ప్రపంచ ప్రఖ్యాత కార్పొరేట్ సంస్థల రాక కోసం కృషి చేస్తూ, దూసుకెళ్తున్న కేసీఆర్ ముందు బీజేపీ నెత్తినెత్తుకునే ఇలాంటి అంశాలు ఎందుకూ ఉపయోగపడవు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో విపక్షాలు ఐక్యంగా ఉంటే, వాటిమధ్య పొత్తులు కుదిరితే బీజేపీని ఓడించడం కష్టమేమీ కాదు.



కానీ ఈ రెండే విపక్షాలను ఒడ్డుకు తీసుకెళ్లగలవని అనుకోవడం భ్రమ. ఒకటైతే నిజం... అందరూ కలిసి అన్నిచోట్లా ద్విముఖ పోరు ఉండేలా చూడగలిగితే బీజేపీ బలాన్ని 220 లోక్‌సభ స్థానాలకు పరిమితం చేయడం సాధ్యపడొచ్చు. కానీ అంతకన్నా కిందికి నెట్టాలంటే మాత్రం బీజేపీ ప్రతిపాదించే, అమలు చేసే నమూనాకు భిన్నమైన ప్రత్యామ్నాయ ప్రతిపాదనను ప్రజల ముందుకు బలంగా తీసుకురావడంలో విపక్షాలు కార్యదీక్షను ప్రదర్శించాల్సి ఉంటుంది. తన గుత్త సొత్తుగా బీజేపీ తరచు ప్రకటించుకునే జాతీయ భద్రత విషయంలో నెలకొన్న అస్తవ్యస్త స్థితిని, చైనాను నిలువరించడంలో వైఫల్యాలను చెప్పగలగాలి. కుల, మత, ప్రాంతీయ విభేదాలు లేని స్థితి నిజమైన జాతీయ భద్రతకు తోడ్పడుతుందని ఎలుగెత్తాలి.

మొత్తం 543 లోక్‌సభ సీట్లలో 322 బీజేపీయేతర రాష్ట్రాల్లో ఉన్నాయి. కాబట్టి ప్రస్తుత పరిస్థితిని ప్రతిపక్షాలు క్యాష్ చేసుకోవాలి. ఇందుకు ప్రతిపక్షాలు ముందు ప్రత్యర్థి బలహీనతను గుర్తెరగాలి. ముస్లింలకు సీట్లు ఇవ్వకపోవడం బీజేపీకి ఉన్న అతి పెద్ద బలహీనత. తెలంగాణలో ముస్లిం జనాభా 20 శాతం ఉంటే, బెంగాల్లో 30 శాతం పైగా ఉంది. ఇక కర్ణాటకలో వారి వాటా దాదాపు 13 శాతం. యూపీ వంటి ఉత్తరాది రాష్ట్రాల్లోనూ ముస్లిం జనాభా గణనీయంగా ఉన్న విషయం తెలిసిందే. ఇటువంటి రాష్ట్రాలో నేర్పుగా వ్యవహరించి బీజేపీ బలాన్ని గణనీయంగా తగ్గించవచ్చు. ద్విముఖ పోటీ మాత్రమే ఉండేలా చూసుకోవడం, వైవిధ్యభరితమైన సంక్షేమ నమూనాలతో ప్రజలను ఒప్పించడం ప్రతిపక్షాల వ్యూహంలో ప్రధాన అంశాలుగా ఉండాలి. ప్రజలు ప్రత్యామ్నాయం కోరుకుంటున్నారన్నది నిజం. 'ధైర్యం లేనివాడికే దయ్యాలు కనబడతాయ'ని నానుడి. ఇప్పుడు కావలసింది ధైర్యంతో, ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేసే చేవ. అది విపక్షాలకుందా అన్నదే ప్రశ్న!

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

# పొత్తులతో పార్టీ ఎదగదు!

అభిప్రాయం



పురిఘళ్ల రఘురామ్

మరో ఏడాదిలో ఏపీలో అసెంబ్లీ ఎన్నికల నగారా మోగనున్న నేపథ్యంలో పొత్తుల లెక్కలపై కొత్త ప్రశ్నలు ఉదయిస్తున్నాయి. 'వచ్చే ఎన్నికల్లో బీజేపీ– టీడీపీ – జనసేన కలిసి ఎన్నికల్లో పోటీ చేస్తాయం'టూ పవన్ కల్యాణ్ వ్యాఖ్యలతో మళ్లీ పొత్తు చర్చలు మొదలయ్యాయి. వాస్తవానికి భారతీయ జనతా పార్టీ ఏపీలో పొత్తుల వల్ల లాభపడిందా? నష్టపోయిందా అన్న చర్చ ఈ సందర్భంగా అత్యవసరమని అనిపిస్తోంది. ఏపీలో పొత్తులతో ఇన్నాళ్ల బీజేపీ నష్టపోయిందన్న గణాంకాలను చూస్తే మైండ్ బ్లాంక్ అవుతుంది.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోగానీ, విభజన తర్వాత గానీ పొత్తుల వల్ల బీజేపీ ఏ మాత్రం లబ్ధి పొందింది లేదు. పైపెచ్చు రాజకీయంగా బీజేపీ ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొంది. దేశమంతటా బీజేపీ ప్రభంజనం వీస్తున్న తరుణంలో... పొత్తు ఆలోచనల్లోంచి బయటకు వచ్చినప్పుడే, ఏపీ, తెలంగాణలో బీజేపీ బలపడుతోందని గత ఎన్నికల్లో పార్టీకి వచ్చిన ఓట్లు, సీట్లు స్పష్టం చేస్తున్నాయి.

కొన్ని పార్టీలు పొత్తు కుదుర్చుకుంటూ పలు రాష్ట్రాల్లో కనుమరుగయ్యాయి. కమ్యూనిస్టులు మంచి ఉదాహరణ. ఒక్క కేరళలో తప్పించి, దేశంలో కమ్యూనిస్టుల ప్రభావం శూన్యమని చెప్పాల్సి ఉంటుంది. పొత్తుల వల్ల బీజేపీ పంజాబ్, హరియాణా, బిహార్, తెలుగు రాష్ట్రాల్లో పెద్ద ఎత్తున నష్టపోయింది. పంజాబ్‌లో అకాలీదళ్‌తో పొత్తు పెట్టుకొని గడిచిన పాతికేళ్లుగా పార్టీ ఒకటీ అరా సీట్లలో గెలవడం తప్పించి, పెద్దగా ఎదిగిన దాఖలాలు కూడా లేవు. బీజేపీ కొంత కాలంగా అకాలీదళ్‌కు దూరంగా ఉండి ఒంటరిగా రెండు సీట్లు సంపాదించింది. అలాగే హరియాణాలో బీజేపీ 2015కి ముందు అనేక ఏళ్లు 'హరియాణా వికాస్' పార్టీ, 'ఐఎన్ఎల్డీ' వంటి పార్టీలతో పొత్తు పెట్టుకోవడం వల్ల దాన్నాళ్లు ఇబ్బందిపడి... 4 సీట్లున్న స్థాయి నుంచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే బలమైన పార్టీగా ఎదిగింది. బిహార్‌లో నితీష్ కుమార్ పార్టీ జేడీయూతో పొత్తు పెట్టుకొని భారీగా నష్టపోయింది. ఎప్పుడూ నితీష్ కుమార్‌ను ముఖ్యమంత్రి చేసి ముందుకు వెళ్లలేకపోయింది. పొత్తులో తక్కువ సీట్లు వచ్చిన బీజేపీ నష్టపోయింది. ఇది పొత్తు ధర్మాన్ని పాటించడ వల్లే. తెలుగు రాష్ట్రాల్లో బాగా నష్టపోయింది బీజేపీయేనని చెప్పకతప్పదు.

పొత్తుల్లేకుండా బీజేపీ ఏం సాధించిందన్నది ఒకసారి పరిశీలించాల్సి ఉంటుంది. బీజేపీలోకి వచ్చిన నేతలు కూడా ఎన్నికల్లో గెలిచిన తర్వాత, తిరిగి రాజకీయ ప్రయోజనాల కోసం మరో పార్టీలోకి మారిన సందర్భాలు కూడా అనేకం కన్పిస్తున్నాయి. ఆంధ్రా, తెలంగాణ రెండు చోట్ల కూడా పార్టీ గణనీయమైన విజయాలు సాధించింది. 1998లో బీజేపీ ఉమ్మడి ఏపీలో బలంగా ఉన్న సమయంలో 1999లో పొత్తు పెట్టుకోవడంతో భారీగా దెబ్బతింది. పొత్తులో బీజేపీ సాధించింది 12 స్థానాలే. ఇక్కడ సొంతంగా పోటీ చేసి ఉంటే బీజేపీ మరిన్ని సీట్లు గెలుచుకునేదని పార్టీ నేతలు బలంగా చెప్తారు. పొత్తు పెట్టుకున్నందువల్ల బీజేపీకి సీట్లు పెరిగినప్పటికీ ఓట్లు తగ్గాయ్. మొత్తం 24 స్థానాల్లో పార్టీ పోటీ చేస్తే గెలిచింది 12 మాత్రమే. వి. రామారావు బీజేపీ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో గ్రామగ్రామాన పార్టీని విస్తృతం చేశారు. 1994 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఒంటరిగా పోటీ చేసి 2 శాతానికి పైగా ఓట్లతో మూడు అసెంబ్లీ సీట్లను గెలుచుకొంది. నాడు బీజేపీ సొంతంగా ఎదుగు తున్న సమయంలో, పొత్తులతో ఏర్పడిన బ్రేక్ నేటికి, పార్టీకి ప్రజల్లో పూర్తి స్థాయిలో రెస్పాన్స్ రాకుండా ఉండటానికి కారణమవుతోంది. 2004లో బీజేపీ 2 స్థానాలకు పరిమితమైపోయింది. అవసరం ఉన్నప్పుడు బీజేపీ పొత్తుతో గెలిచిన పార్టీ ఆ తర్వాత సొంత రాజకీయ ప్రయోజనాల కోసం ఇతర పార్టీలతో పొత్తుకు వెళ్లడం వల్ల బీజేపీ ఓటు బ్యాంక్ తగ్గడం మొదలు పెట్టింది. 2004 ఎన్నికల్లో బీజేపీ 2 స్థానాలు మాత్రమే గెలుచుకొంది. కిషన్ రెడ్డి అంబర్ పేట నుంచి, పెండెం దొరబాబు పిఠాపురం నుంచి విజయం సాధించారు. 2009లో ప్రజారాజ్యం పార్టీ వచ్చినప్పటికీ బీజేపీ ఓటు బ్యాంక్ పెంచుకోగలిగింది. 2 సీట్లనే గెలుచుకున్నప్పటికీ పార్టీ పూర్తి స్థాయిలో ప్రజల్లోకి వెళ్లేందుకు ప్రయత్నించింది. కిషన్ రెడ్డి, యెండల లక్ష్మీ నారాయణ ఎమ్మెల్యేలుగా విజయం సాధించారు. ఇక ఆ తర్వాత రాష్ట్ర విభజన సమయంలో టీడీపీతో పొత్తు పెట్టుకొని అటు ఏపీలోనూ, ఇటు తెలంగాణలోనూ పార్టీ కోలుకోలేకుండా పోయింది. ఏపీలో 4, తెలంగాణలో 5 స్థానాలకే పార్టీ పరిమితమైంది. ఓట్ షేర్ పెరిగినప్పటికీ సీట్లు లభించలేదు.



ఒంటరిగా పోటీ చేసి హరియాణాలో పార్టీ సాధించిన విజయాలు... ఏపీ, తెలంగాణల్లో పార్టీకి ఉజ్వల భవిష్యత్తు లభిస్తోందని కార్యకర్తలు విశ్వసించడానికి కారణమయింది. వారు పొత్తుల వల్ల నష్టపోయింది చాలంటున్నారు. ఒంటరిగా పోరాటం చేయడం ద్వారా పార్టీకి ఎక్కువ లాభం కలుగుతుందన్న విశ్లేషణలూ ఉన్నాయి. కార్యకర్తలు, నేతలంతా పార్టీ బలోపేతమే ముఖ్యమని భావిస్తున్నారు.

వ్యాసకర్త బీజేపీ సీనియర్ నాయకులు

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, జ్యేష్ఠ మాసం, తిథి: శు.సప్తమి తె.5.11 వరకు (తెల్లవారితే శనివారం), తదుపరి అష్టమి, నక్షత్రం: ఆశ్లేష రా.7.01 వరకు, తదుపరి మఖ, వర్జ్యం: ఉ.6.33 నుండి 8.22 వరకు, దుర్ముహూర్తం: ఉ.8.04 నుండి 8.54 వరకు, తదుపరి ప.12.23 నుండి 1.14 వరకు, అమృతఘడియలు: సా.5.14 నుండి 6.58 వరకు; రాహుకాలం: ఉ.10.30 నుండి 12.00 వరకు, యమగండం: ప.3.00 నుండి 4.30 వరకు, సూర్యోదయం: 5.29, సూర్యాస్తమయం: 6.24.

# మహిళే మహారాణి

## దేశ చరిత్రలోనే మహిళా సాధికారతలో రాష్ట్రం అరుదైన రికార్డు

"అమ్మ కడుపులోని బిడ్డ మొదలు.. చేతలుడిగిన అవ్వ వరకు.. ప్రతి ఒక్కరి అవసరాలను గుర్తించి అందుకు తగ్గ పథకాలను అమలు చేస్తున్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్. మహిళలు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని నమ్మి.. దాదాపు ప్రతి పథకంలోనూ వారినే లబ్ధిదారులుగా గుర్తించి అడుగులు ముందుకు వేస్తోంది. చిన్న చిన్న వ్యాపారాలతో లక్షలాది మందికి శాశ్వత ఉపాధి కలిగేలా చర్యలు తీసుకుంది. ఫలితంగా నాలుగేళ్లలో మహిళా సాధికారత ఏ మేరకు సాధ్యమైందో ఊరూరా కళ్లెదుటే కనిపిస్తోంది. ప్రతి ఇంట్లోనూ మహిళలకు గౌరవం పెరిగింది."



వైఎస్సార్ ఆసరా మూడో విడత ఆర్థిక సాయం అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి (ఫైల్ ఫోటో)

సాక్షి, అమరావతి : ఎక్కడ మహిళలకు గౌరవం దక్కుతుందో అక్కడ దేవతలు కొలువై ఉంటారన్న నానుడిని నిజం చేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్‌లో ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో మహిళామణులకు అగ్ర తాంబూలం ఇస్తున్నారు. సీఎం వైఎస్ జగన్ విప్లవాత్మక నిర్ణయాలతో రాష్ట్రంలోని మహిళలు ప్రగతిబాటలో పయనిస్తున్నారు. మహోన్నతంగా మహిళా సంక్షేమం అమలవుతుండటంతో ఆంధ్రప్రదేశ్ పురోగమిస్తోంది. 21వ శతాబ్దపు ఆధునిక భారతీయ మహిళ ఆంధ్రప్రదేశ్‌లోనే ఆవిర్భవించే దిశగా వడివడిగా అడుగులు పడుతున్నాయి. రాష్ట్రంలో మహిళలే కేంద్ర బిందువుగా సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారు. నవరత్నాలు వంటి అనేక పథకాల్లో 90 శాతం పైగా మహిళలే లబ్ధిదారులున్నారు. తద్వారా ప్రతి ఇంటిలో మహిళకు అత్యంత ప్రాధాన్యత పెరగడానికి ప్రభుత్వం దోహదం చేస్తోంది. అమ్మ ఒడి, విద్యా దీవెన, వసతి దీవెన, చేయూత, సున్నా వడ్డీ, ఈబీసీ నేస్తం, కాపు నేస్తం, కళ్యాణమస్తు, ఇళ్ల పట్టాలు.. ఇలా అన్ని పథకాల లబ్ధి అక్కచెల్లెమ్మలకే దక్కుతుండటం గమనార్హం. వృద్ధాప్య, వితంతు పింఛన్లు, మహిళల రక్షణ కోసం దిశ బిల్లు, దిశ యాప్, దిశ పోలీస్ స్టేషన్లు లాంటి ఎన్నో కార్యక్రమాలు కచ్చితత్వంతో అమలు చేస్తున్నారు. రాష్ట్రంలో మహిళల దశ, దిశ మార్చిన పథకాల్లో ప్రధానమైనవి ఇలా ఉన్నాయి.

### కళ్లెదుటే రాజకీయ సాధికారత

- ఆంధ్రప్రదేశ్‌లో మహిళా సాధికారతలో సాధించిన అద్భుతాలు గమనిస్తే దేశంలో మరే రాష్ట్రం మనకు సాటిలేదని గర్వంగా చెప్పొచ్చు. రాజకీయ సాధికారత విషయమే తీసుకుంటే.. దేశ వ్యాప్తంగా మహిళలకు చట్టసభల్లో 33 శాతం సీట్లు కేటాయించాలని 1998 నుంచి పార్లమెంటులో బిల్లులు పెడుతూనే ఉన్నారు. కానీ ఇప్పటి వరకు ఆ బిల్లు చర్చకు వచ్చిన దాఖలాలు లేవు.
- కానీ, రాష్ట్రంలో ఏ డిమాండ్లు, ఉద్యమాలు లేకపోయినా వైఎస్సార్‌సీపీ అధికారం చేపట్టిన తర్వాత ఎవరూ అడగకుండానే పదవుల్లో మహిళలకు సమున్నత వాటా దక్కింది. నామినేటెడ్ పోస్టులు, నామినేషన్ విధానంలో ఇచ్చే కాంట్రాక్టుల్లో మహిళలకే 50 శాతం కేటాయించేలా ఏకంగా చట్టం చేసిన సీఎం వైఎస్ జగన్ దేశానికి ఆదర్శంగా నిలిచారు.
- నామినేటెడ్ పదవుల్లో 51 శాతంపైగా పదవులు ఇచ్చిన తొలి ప్రభుత్వం వైఎస్ జగన్ ప్రభుత్వమే. గ్రామాల్లో వార్డు మెంబర్, పట్టణాల్లో కౌన్సిలర్, కార్పొరేటర్ దగ్గర్నుంచి రాష్ట్ర మంత్రి వరకు మహిళలకు పెద్దపీట వేయడం దేశంలోనే రికార్డు.
- రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా శాసనమండలి వైస్ చైర్మన్‌గా జకియా ఖానంను నియమించారు. రాష్ట్ర తొలి మహిళా చీఫ్ సెక్రటరీగా, ఆ తర్వాత రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌గా నీలం సాహ్నిని నియమించారు. ఏపీ మహిళా కమిషన్ చైర్మన్‌గా వాసిరెడ్డి పద్మ, సభ్యుల నియామకం ద్వారా మహిళల సమస్యల పరిష్కారం పట్ల చిత్తశుద్ధిని చాటారు.
- గతంలో మహిళలకు తొలిసారిగా హోం మంత్రి ఇచ్చిన ఘనత దివంగత సీఎం వైఎస్సార్‌దే. ఆ తర్వాత ఆయన తనయుడు సీఎం వైఎస్ జగన్.. మరో రెండడుగులు ముందుకు వేస్తూ రాష్ట్ర హోం మంత్రిగా దళిత వర్గానికి చెందిన మేకతోటి సుచరితతో పాటు తొలి మంత్రివర్గంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా గిరిజన మహిళ పాముల పుష్పశ్రీవాణిని, మలి విడతలో రాష్ట్ర హోం మంత్రిగా దళిత వర్గానికి చెందిన తానేటి వనితతోపాటు మరో ముగ్గురు మహిళలకు కీలక మంత్రి పదవులు అప్పగించారు.
- రాష్ట్రంలో 13 జడ్పీ చైర్మన్ పదవుల్లో ఏడుగురు.. 26 జడ్పీ వైస్‌చైర్మన్ పదవుల్లో 15 మంది మహిళలే. 12 మేయర్ పోస్టులు, 24 డిప్యూటీ మేయర్ పదవులు కలిపి మొత్తంగా 36 పదవుల్లో 18 మంది మహిళలే ఎన్నికయ్యేలా చేశారు. స్థానిక సంస్థల నుంచి నామినేటెడ్ పదవుల్లోను మహిళలకు అగ్రపీఠం దక్కింది. దాదాపు 2.60 లక్షల వలంటీర్ ఉద్యోగాల్లో 53 శాతం.. గ్రామ, వార్డు సచివాలయాల్లో పని చేస్తున్న ఉద్యోగుల్లో 51 శాతం మహిళలే ఉండటం గమనార్హం.

బ్రాండ్ ఏపీ

### సున్నా వడ్డీ పథకానికి మళ్లీ జీవం

- గ్రామీణ ప్రాంతాల్లో మైక్రో ఫైనాన్స్ సంస్థల అధిక వడ్డీ ఆగడాల నుంచి మహిళలను ఆదుకునేందుకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 2004లో పావలా వడ్డీ పథకాన్ని తొలిసారి ప్రవేశపెట్టారు. ఆ తర్వాత అది సున్నా వడ్డీ పథకంగా మారింది. పొదుపు సంఘాల పేరుతో బ్యాంకు నుంచి తీసుకునే రుణం సకాలంలో చెల్లించే మహిళలకు ఈ పథకం ద్వారా ప్రభుత్వమే బ్యాంకులకు వడ్డీ చెల్లిస్తుంది.
- 2014 తర్వాత విభజన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఆ పథకానికి నిధులు విడుదల చేయడం ఆపేశారు. దాంతో పొదుపు సంఘాల మహిళలపై కొత్తగా వడ్డీ భారం పడింది. తద్వారా సుమారు 18.36 శాతం పొదుపు సంఘాలు బ్యాంకుల్లో డిఫాల్టర్లుగా మిగిలిపోయాయి. అప్పటి దాకా బాగా నడుస్తున్న 'ఎ' కేటగిరిలో ఉండే సంఘాలు కూడా 'సి', 'డి' గ్రేడ్లలోకి పడిపోయాయి.
- 2019లో అధికారంలోకి వచ్చిన సీఎం వైఎస్ జగన్.. సున్నా వడ్డీ పథకానికి తిరిగి జీవం పోశారు. ఈ పథకం ద్వారా మహిళా సంఘాలకు చెందిన 1,02,16,410 ఖాతాల రుణాలకు సంబంధించి బ్యాంకులకు ప్రభుత్వం వడ్డీ రూపేణా రూ.3,615.28 కోట్లు చెల్లించింది. ప్రస్తుతం 99.6 శాతానికి పైగా పొదుపు సంఘాలు తిరిగి 'ఎ' గ్రేడ్‌లో చేరాయి.

### ఆసరాతో కొండంత భరోసా

- గత చంద్రబాబు ప్రభుత్వం మోసపూరిత హామీలతో అప్పుల పాలైన పొదుపు సంఘాల మహిళలను 'వైఎస్సార్ ఆసరా' పథకం ద్వారా సీఎం వైఎస్ జగన్ ఆదుకున్నారు. అసెంబ్లీ ఎన్నికలు జరిగిన 2019 ఏప్రిల్ 11వ తేదీ నాటికి మహిళా స్వయం సహాయక సంఘాల పేరిట ఉండే బ్యాంకు రుణం మొత్తాన్ని ఈ పథకం కింద నాలుగు విడతల్లో ఆయా సంఘాల ఖాతాల్లో జమ చేస్తున్నారు.
- రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ (ఎస్ఎల్‌బీసీ) వివరాల ప్రకారం ఎన్నికలు జరిగిన ఆ తేదీ నాటికి రాష్ట్రంలో 7.97 లక్షల పొదుపు సంఘాల పేరిట రూ.25,517 కోట్ల అప్పులు ఉన్నాయి. ఇప్పటి వరకు ఆయా పొదుపు సంఘాలకు చెందిన 78,94,169 మందికి వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా ప్రభుత్వం రూ.19,178.17 కోట్ల లబ్ధి చేకూర్చింది.

### శాశ్వత ఉపాధికి 'చేయూత'

- రాష్ట్రంలో 45-60 ఏళ్ల మధ్య వయస్సు ఉండే బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ అక్కచెల్లెమ్మలకు సైతం ఆర్థిక దన్ను కల్పించేందుకు సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం వైఎస్సార్ చేయూత పథకం ప్రవేశపెట్టింది. అర్హులైన లబ్ధిదారులకు వివిధ కార్పొరేషన్ల ద్వారా నాలుగు విడతల్లో రూ.75 వేలు అందిస్తోంది. ఈ పథకం ద్వారా ఇప్పటి వరకు 26,39,703 మంది మహిళలకు రూ.14,129.12 కోట్లు అందించింది.
- మహిళలకు శాశ్వత జీవనోపాధి కలిగేలా అమూల్, హిందూస్థాన్ యూనీ లీవర్, ఐటీసీ, ప్రొక్టర్ అండ్ గాంబుల్, రిలయెన్స్ రిటైల్, అజియో బిజినెస్ వంటి సంస్థలతో ఒప్పందం కుదిర్చింది. ఆయా మల్టీ నేషనల్ సంస్థల సహకారం, ప్రభుత్వం అందించిన తోడ్పాటుతో రాష్ట్రంలో 5,28,662 కుటుంబాలు వివిధ రకాల వ్యాపారాలు, ఇతర ఆదాయ మార్గాలను ఏర్పాటు చేసుకొని శాశ్వత జీవనోపాధి పొందుతున్నాయి.

### వైఎస్సార్ సంపూర్ణ పోషణ.. జగనన్న గోరుముద్ద

- రాష్ట్రంలోని 55,607 అంగన్‌వాడీ కేంద్రాల్లో వైఎస్సార్ సంపూర్ణ పోషణ, వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్ ద్వారా గర్భిణులు, బాలింతలకు మంచి ఆహారం అందిస్తున్నారు. ఆర్నెల్లలోపు పిల్లలకు పౌష్టికాహారం ఇవ్వడంతో పాటు, అంగన్‌వాడీలను ప్రీ ప్రైమరీ స్కూళ్లుగా మార్చి విద్యతో పాటు వారికి అవసరమైన బలమైన ఆహారం, వైద్యం అందిస్తున్నారు. వారికి ఇంగ్లిష్ మీడియం ప్రారంభిస్తున్నారు.
- వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకంలో 43,26,782 మందికి రూ.3,590 కోట్లు ఖర్చు చేశారు. ఈ పథకానికి గత ప్రభుత్వ హయాంలో ఏటా కేవలం రూ.600 కోట్లు మాత్రమే ఖర్చు చేయగా, ప్రస్తుత ప్రభుత్వం ఏటా రూ.2 వేల కోట్లు ఖర్చు చేస్తోంది. బడిల్లో పిల్లలకు జగనన్న గోరుముద్ద పథకం ద్వారా బలమైన ఆహారాన్ని అందిస్తున్నారు.

### లక్షాధికారి అవుతున్న పేదింటి మహిళ

- సొంతిల్లు అనేది సామాన్య, నిరుపేద ప్రజల కల. సీఎం జగన్ ఈ స్వప్నం నెరవేర్చే మహత్తర యజ్ఞానికి శ్రీకారం చుట్టారు. 'నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు' పథకం కింద రాష్ట్ర వ్యాప్తంగా మూడు దశల్లో 30,76,675 మందికి రూ.75,670.05 కోట్ల విలువైన ఇళ్ల స్థలాలు పంపిణీ చేశారు. అంతటితో ఆగకుండా ఇళ్లు నిర్మించే కార్యక్రమాన్ని మహా యజ్ఞంలా చేపట్టారు. ఇప్పటి వరకు 21,31,564 మంది ఇళ్ల నిర్మాణానికి రూ.9,151.79 కోట్లు ఖర్చు చేశారు.
- మరోవైపు వైఎస్సార్, జగనన్న కాలనీల్లో పేదలపై భారం వేయకుండా కనీస మౌలిక సదుపాయాలను ప్రభుత్వమే ఉచితంగా కల్పిస్తోంది. ఒక్కో మహిళకు రూ.7 లక్షల నుంచి రూ.10 లక్షల విలువైన ఇంటిని ప్రభుత్వం అందించడం ద్వారా పేదింటి మహిళలను లక్షాధికారులుగా తీర్చిదిద్దుతోంది. మొత్తంగా రాష్ట్రంలోని 31 లక్షల మంది మహిళలకు రూ.2 లక్షల కోట్ల నుంచి రూ.3 లక్షల కోట్ల సంపదను సమకూరుస్తున్నారు.
- వైఎస్సార్ ఈబీసీ నేస్తం ద్వారా దేశంలోనే తొలిసారిగా పేద ఓసీ మహిళలకు ఆర్థిక సహాయం అందిస్తున్నారు. 45 నుంచి 60 ఏళ్ల మధ్య ఉన్న దాదాపు 4,39,098 మంది ఈ వర్గం నిరుపేద అక్క చెల్లెమ్మలకు రూ.1,257.04 కోట్లు అందించారు. కాపు నేస్తం, లా నేస్తం వంటి అనేక పథకాల్లోనూ ఓసీ మహిళలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మేలు చేస్తోంది.
- పేద తల్లిదండ్రులు తమ ఆడబిడ్డ పెళ్లి చేయడానికి పడే ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని సీఎం వైఎస్ జగన్ ప్రత్యేక శ్రద్ధతో వైఎస్సార్ కళ్యాణమస్తు, షాదీ తోఫా పథకాలను అందిస్తున్నారు. ఇప్పటి వరకు 16,668 మంది ఆడబిడ్డల తల్లుల ఖాతాల్లో రూ.125.50 కోట్లు జమ చేశారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, దివ్యాంగులు, భవన నిర్మాణ కార్మికులకు ఈ పథకాలను వర్తింపజేయడం ద్వారా ఆ వర్గాల్లో సంతోషం నింపారు.

### అమ్మ ఒడి.. చదువులమ్మ గుడి

- ప్రతి తల్లి తన పిల్లలు మంచి చదువులు చదువుకోవాలని, వారికి మంచి భవిష్యత్తు ఇవ్వాలని ఆకాంక్షిస్తుంది. అటువంటి తల్లుల ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చేలా రాష్ట్రంలో విద్యా రంగ అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్ ఏటా రూ.వేల కోట్లు ఖర్చు చేస్తున్నారు. ప్రతి దశలో విద్యార్థుల చదువుల భారం తల్లిదండ్రులపై పడకుండా మొత్తం ప్రభుత్వమే భరించేలా పథకాలు అమలు చేస్తున్నారు.
- మూడేళ్ల వయసులో అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే దశ నుంచి పాఠశాల విద్య, ఇంటర్ విద్య, ఉన్నత విద్యను పూర్తి చేసుకొనే వరకు పేద వర్గాల కుటుంబాల్లోని పిల్లల చదువులకు అయ్యే మొత్తం వ్యయాన్ని ప్రభుత్వమే భరించేలా పలు పథకాలు ప్రవేశపెట్టారు. పాఠశాల విద్యార్థులకు డిజిటల్ విద్యను అందించేందుకు వీలుగా 8వ తరగతిలోకి వచ్చే పిల్లలకు ప్రతి ఏటా ఉచితంగా ప్రభుత్వం ట్యాబులు అందిస్తోంది.
- ఈ నాలుగేళ్లలో జగనన్న అమ్మ ఒడి ద్వారా 44,48,865 మంది తల్లుల ఖాతాలకు రూ.19,674.34 కోట్లు జమ చేశారు. జగనన్న వసతి దీవెన ద్వారా 25,17,245 మందికి రూ.4,275.76 కోట్లు ఖర్చు చేశారు. జగనన్న విద్యా దీవెన ద్వారా 26,98,728 మందికి రూ.10,636.67 కోట్లు లబ్ధి చేకూర్చారు. జగనన్న విదేశీ విద్యా దీవెన పథకం ద్వారా 1,858 మందికి రూ.132.41 కోట్లు ఇచ్చారు.



## పర్యావరణహిత ప్యాకింగ్‌పైనా దుష్ప్రచారమే

ఫ్యాక్ట్ చెక్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో మద్యం అమ్మకాలపై టీడీపీ మరోసారి దుష్ప్రచారానికి తెగబడింది. ప్రజలను తప్పుదారి పట్టించడమే లక్ష్యంగా సోషల్ మీడియా వేదికగా దుష్ప్రచారానికి పాల్పడుతోంది. అమెరికాకు చెందిన బ్రూ క్రాఫ్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ తమ బ్లాక్ బస్టర్ బీర్‌ను పర్యావరణహితమైన నూతన స్లీవ్ ప్యాకేజింగ్‌తో ప్రవేశపెట్టింది. పర్యావరణ పరిరక్షణ కోసం 2030 వరకు నెట్‌జీరో కార్యకలాపాలు చేయాలనే లక్ష్యంతో ఈ ఆధునిక ప్యాకేజింగ్ విధానాన్ని రూపొందించింది. తమ వినియోగదారులకు అత్యుత్తమ బీర్ ఉత్పత్తులను పర్యావరణహితమైన ప్యాకింగ్‌తో ఇవ్వాలనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆ కంపెనీ ప్రకటించింది. కానీ ఆ ప్యాకింగ్‌పై ఆరోపణలు చేస్తూ టీడీపీ సోషల్ మీడియాలో దుష్ప్రచారానికి పాల్పడుతుండటంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

## లోకేశ్ ఎదుట తమ్ముళ్ల తన్నులాట

జమ్మలమడుగు: వైఎస్సార్ జిల్లాలో నిర్వహిస్తున్న నారా లోకేశ్ పాదయాత్రలో ప్రొద్దుటూరు టికెట్ ఆశిస్తున్న టీడీపీ నాయకులు ఇద్దరూ పరస్పరం కొట్టుకున్నారు. గురువారం ఎన్.కొట్టాలపల్లి గ్రామం నుంచి పెద్దపసుపుల మీదుగా జమ్మలమడుగు బైపాస్‌రోడ్డు వరకు లోకేశ్ పాదయాత్ర కొనసాగించారు. ఈ పాదయాత్రకు జిల్లాలోని పలు నియోజకవర్గ నాయకులు హాజరై సంఘీభావం ప్రకటించారు. మధ్యాహ్నం పాదయాత్ర ముగింపు అనంతరం నాయకులతో సెల్ఫీలు దిగుతున్న సమయంలో ప్రొద్దుటూరు టికెట్ ఆశిస్తున్న మాజీ ఎమ్మెల్యే లింగారెడ్డి, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి మధ్య మాటా మాటా పెరిగింది. లోకేశ్ ముందే కంటైనర్‌లో పిడిగుద్దులతో ఒకరిపై ఒకరు విరుచుకుపడ్డట్లు సమాచారం. కాగా, రాజమండ్రిలో మహానాడు కార్యక్రమం ఉండటంతో పాదయాత్రకు ఈ నెల 30వ తేదీ వరకు తాత్కాలిక బ్రేక్ వేశారు.

## 'శ్రీచైతన్య' విజయభేరి

నగరంపాలెం : తెలంగాణ ఎంసెట్–2023 ఫలితాల్లో శ్రీ చైతన్య విద్యా సంస్థల విద్యార్థులు ఇంజనీరింగ్, అగ్రికల్చర్ విభాగాల్లో 1, 2, 3, 4, 5, 5, 6, 7, 7, 8, 8, 9, 10 ర్యాంకులు సాధించారని యాజమాన్యం తెలిపింది. గుంటూరు శ్రీచైతన్య విద్యా సంస్థల విద్యార్థులు ఇంజనీరింగ్, అగ్రికల్చర్ విభాగంలో 1,000 లోపు 93 ర్యాంకులు, 2,000 లోపు 136 ర్యాంకులు, 5,000 లోపు 338 ర్యాంకులు సాధించారు. విద్యార్థులను ఎగ్జిక్యూటివ్ ఏజీఎం దుర్గాప్రసాద్, డీన్లు కిషోర్, చంద్రశేఖర్ తదితరులు అభినందించారు.

## 'నారాయణ' హవా

నగరంపాలెం : తెలంగాణ ఎంసెట్– 2023 ఫలితాల్లో గుంటూరు జిల్లాలోని నారాయణ విద్యార్థులు విజయాలు సాధించినట్టు యాజమాన్యం తెలిపింది. బైపీసీ అగ్రికల్చరల్ విభాగంలో జి.అలేఖ్యదేవి 54వ ర్యాంక్ సాధించింది. ప్రతిభ చూపిన విద్యార్థులను అకడమిక్ ఇన్‌చార్జి తార్నాక చంద్రశేఖర్, డీజీఎం శ్రీనివాసరెడ్డి, కోర్ డీన్ వీరగంధం శ్రీనివాసరావు, డీన్లు వల్లభరావు, కోటేశ్వరరావులు అభినందించినట్టు ఏజీఎం తెలిపారు.

## 'భాష్యం' జయకేతనం

నగరంపాలెం : తెలంగాణ ఎంసెట్–2023 ఫలితాల్లో తమ విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారని భాష్యం విద్యా సంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ తెలిపారు. యక్కంటి వెంకటమణిందర్‌రెడ్డి రెండో ర్యాంక్, సీహెచ్ ఉమేష్‌వరుణ్ మూడో ర్యాంక్, ఎ.వెంకటశివరామ్ 15వ ర్యాంక్, కె.లక్ష్మీసూర్య 17వ ర్యాంక్, వై.దీపేష్ 20వ ర్యాంక్, పి.నిశ్చల్‌సుభాష్ 28వ ర్యాంక్, పి.రూపేష్ 32వ ర్యాంక్, ఐ.హర్షిత 38వ ర్యాంక్ సాధించినట్టు చెప్పారు. విద్యార్థులను రామకృష్ణ, భాష్యం డైరెక్టర్ హనుమంతరావు అభినందించారు.

## ఆదిత్య విద్యార్థుల ప్రతిభ

బాలాజీచెరువు (కాకినాడ సిటీ) : తెలంగాణ ఎంసెట్–23 ఫలితాల్లో కాకినాడ జిల్లా కాకినాడ ఆదిత్య విద్యా సంస్థలకు చెందిన విద్యార్థులు ప్రతిభ చూపారు. ఎ.లిఖిత్ 56వ ర్యాంక్, టీఎస్ఎస్ తేజస్విని 62వ ర్యాంక్ సాధించారు. వీరితో పాటు 162, 293, 350, 386, 394 ర్యాంకులను ఆదిత్య విద్యార్థులు సాధించారు. ప్రతిభ చూపిన విద్యార్థులను ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ ఎన్.శేషారెడ్డి, కార్యదర్శి దీపక్‌రెడ్డి అభినందించారు.

## 'తిరుమల' విజయకేతనం

రాజమహేంద్రవరం రూరల్ : తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన ఎంసెట్ అగ్రికల్చర్ అండ్ మెడికల్ ఫలితాల్లో తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని తమ విద్యా సంస్థ ఐఐటీ అండ్ మెడికల్ అకాడమీ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారని విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. బూరుగుపల్లి సత్యరాజ్ జశ్వంత్ ప్రథమ ర్యాంకు, కె.సుహాంత్ 41వ ర్యాంకు, కేజీఎం శంకర్ అజయ్ 52వ ర్యాంకు, ఎస్‌హెచ్‌డీ అనిరుద్ 90వ ర్యాంకు సాధించినట్టు చెప్పారు.

# తెలంగాణ ఎంసెట్‌లో ఏపీ స్వీప్

▶ మొదటి పేజీ తరువాయి
ఎగరేసుకుపోయారు. తెలంగాణ విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి గురువారం హైదరాబాద్‌లో తెలంగాణ ఎంసెట్ ఫలితాలను విడుదల చేశారు. కాగా ఇంజనీరింగ్ ర్యాంకర్లందరూ ఐఐటీల్లో చేరతామని, మెడికల్ విభాగం ర్యాంకర్లంతా వైద్య వృత్తిలో స్థిరపడతామని వెల్లడించారు.

### వైద్య రంగంలో ఉన్నతవిద్యనభ్యసిస్తా..



మాది చీరాల. నాన్న నాసిక సుధాకర్‌బాబు, అమ్మ శ్రీదేవి మగ్గం నేస్తారు. విజయవాడలోని ప్రైవేటు కాలేజీలో ఇంటర్మీడియెట్ చదివాను. వైద్య రంగంలో ఉన్నత విద్యనభ్యసించడమే నా లక్ష్యం.
– నాసిక వెంకటతేజ, సెకండ్ ర్యాంకర్, తెలంగాణ ఎంసెట్ (అగ్రి అండ్ మెడికల్ విభాగం)

### కార్డియాలజిస్ట్ లేదా న్యూరాలజిస్టునవుతా..



మాది తెనాలి. నాకు ఇంటర్ బైపీసీలో 983 మార్కులు వచ్చాయి. వైద్య రంగంలో స్థిరపడాలనేది నా ఆకాంక్ష. ఇప్పటికే నీట్ రాశాను. ఎంబీబీఎస్ చేసి ఆ తర్వాత కార్డియాలజిస్ట్, న్యూరాలజిస్ట్ లేదా గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్‌గా స్థిరపడాలనేదే నా కోరిక.
– దుర్గెంపూడి కార్తికేయరెడ్డి, నాలుగో ర్యాంకర్, తెలంగాణ ఎంసెట్ (అగ్రి అండ్ మెడికల్ విభాగం)

### వైద్య రంగంలో స్థిరపడతా..



మాది శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట. అమ్మానాన్న ఇద్దరూ ప్రభుత్వ ఉపాధ్యాయులే. నాకు నీట్‌లోనూ మంచి ర్యాంకు వస్తుందనే నమ్మకం ఉంది. వైద్య రంగంలో స్థిరపడాలనేది నా కోరిక.
– బోర వరుణ్ చక్రవర్తి, ఐదో ర్యాంకర్, తెలంగాణ ఎంసెట్ (అగ్రి అండ్ మెడికల్ విభాగం)

### మంచి వైద్య కళాశాలలో మెడిసిన్ చేస్తా..



మాది నెల్లూరు. అమ్మానాన్న హారతి, శంకర్ వైద్యులుగా పనిచేస్తున్నారు. మంచి మెడికల్ కళాశాలలో మెడిసిన్ చదవడమే నా లక్ష్యం.
– హర్షల్‌సాయి, ఏడో ర్యాంకర్, తెలంగాణ ఎంసెట్ (అగ్రి అండ్ మెడికల్ విభాగం)

### కష్టపడి చదివా..



మాది గుంటూరులోని ఏటీ అగ్రహారం. అమ్మానాన్న ఇద్దరూ ప్రభుత్వ ఉపాధ్యాయులే. కష్టపడి చదవడంతో తెలంగాణ ఎంసెట్‌లో ఎనిమిదో ర్యాంక్ సాధించాను.
– సాయి చిద్విలాస్‌రెడ్డి, 8వ ర్యాంకర్, తెలంగాణ ఎంసెట్ (అగ్రి అండ్ మెడికల్ విభాగం)

### కంప్యూటర్ సైన్స్ చదువుతా..



మాది గుంటూరు. నాన్న శ్రీనివాసరెడ్డి రైతు. ఇంటర్ ఎంపీసీలో 971 మార్కులు వచ్చాయి. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ర్యాంక్ సాధించి ఐఐటీ బాంబేలో సీటు సాధించడమే లక్ష్యం.
– యక్కంటి ఫణి వెంకట మణీందర్‌రెడ్డి, సెకండ్ ర్యాంకర్, తెలంగాణ ఎంసెట్

### జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ర్యాంకు సాధించడమే లక్ష్యం



మాది ఎన్టీఆర్ జిల్లా నందిగామ. ఇంటర్మీడియెట్ ఎంపీసీలో 983 మార్కులు సాధించాను. ఇటీవల జేఈఈ మెయిన్‌లో ఓపెన్ కేటగిరీలో 263వ ర్యాంక్ వచ్చింది. వచ్చే నెలలో జరగనున్న జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు సిద్ధమవుతున్నా. ఇందులో మంచి ర్యాంక్ సాధించడమే నా లక్ష్యం.
– చల్లా ఉమేష్ వరుణ్, థర్డ్ ర్యాంకర్, తెలంగాణ ఎంసెట్ (ఇంజనీరింగ్ విభాగం)

### సివిల్స్ సాధించి ప్రజలకు సేవ చేయడమే లక్ష్యం



మాది అనంతపురం జిల్లా తాడిపత్రి. ఇటీవల జేఈఈ మెయిన్‌లో ఆలిండియాలో 97వ ర్యాంకు సాధించాను. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లోనూ ర్యాంకు సాధించి ఐఐటీ బాంబేలో చేరతా. తర్వాత సివిల్స్ రాసి ప్రజలకు సేవ చేయాలన్నదే నా లక్ష్యం.
– పొన్నతోట ప్రమోద్ కుమార్‌రెడ్డి, ఐదో ర్యాంకర్, తెలంగాణ ఎంసెట్ (ఇంజనీరింగ్ విభాగం)

### ఐఐటీ బాంబేలో చేరతా..




మాది విశాఖపట్నం జిల్లా గాజువాక. నాన్న బిజినెస్‌లో ఉండగా అమ్మ ఫార్మసిస్టుగా పనిచేస్తున్నారు. ఇంటర్ ఎంపీసీలో 987 మార్కులు వచ్చాయి. జేఈఈ మెయిన్‌లో ఆలిండియాలో 110వ ర్యాంకు వచ్చింది. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లోనూ మంచి ర్యాంకు సాధించి ఐఐటీ బాంబేలో కంప్యూటర్ సైన్స్‌లో చేరతా.
– మరదాన ధీరజ్‌కుమార్, ఆరో ర్యాంకర్, తెలంగాణ ఎంసెట్ (ఇంజనీరింగ్ విభాగం)

### జేఈఈ మెయిన్స్‌లోనూ మంచి ర్యాంక్



మాది శ్రీకాకుళం జిల్లాలోని అరసవల్లి. నాన్న గణేష్ వ్యాపారి, అమ్మ జ్యోతి గృహిణి. జేఈఈ మెయిన్స్‌లో 729వ ర్యాంక్ సాధించాను. వచ్చే నెలలో నిర్వహించే జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు సిద్ధమవుతున్నా. ఐఐటీ బాంబేలో ఇంజనీరింగ్‌లో చేరాలనేదే నా లక్ష్యం.
– బోయిన సంజన, 8వ ర్యాంకర్, తెలంగాణ ఎంసెట్ (ఇంజనీరింగ్ విభాగం)

### కంప్యూటర్ ఇంజనీర్‌నవుతా..



మాది నంద్యాల. ఇంటర్ ఎంపీసీలో 956 మార్కులు వచ్చాయి. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ర్యాంకు సాధించి మంచి ఐఐటీలో కంప్యూటర్ సైన్స్‌లో చేరతా. కంప్యూటర్ ఇంజనీర్‌ను కావడమే లక్ష్యం.
– ప్రిన్స్ బ్రహ్మంరెడ్డి, తొమ్మిదో ర్యాంకర్, తెలంగాణ ఎంసెట్ (ఇంజనీరింగ్ విభాగం)

### అడ్వాన్స్‌డ్‌లోనూ ర్యాంక్ సాధిస్తా..



మాది విజయనగరం జిల్లా గుర్ల. నాన్న అప్పలనాయుడు రైల్వే కానిస్టేబుల్, అమ్మ ప్రభుత్వ టీచర్‌గా పనిచేస్తున్నారు. ఇటీవల జేఈఈ మెయిన్‌లో 99 శాతం పర్సంటైల్ సాధించాను. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ర్యాంక్ సాధించి ఐఐటీ బాంబేలో చేరతా.
– మీసాల ప్రణతి శ్రీజ, పదో ర్యాంకర్, తెలంగాణ ఎంసెట్ (ఇంజనీరింగ్ విభాగం)

## అవినాశ్ ముందస్తు బెయిల్ పిటిషన్‌పై వాదనలు నేటికి..

### వాయిదా వేసిన తెలంగాణ హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: మాజీమంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్యకేసులో సీబీఐ అరెస్టు చేయకుండా ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతూ ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై వాదనలను తెలంగాణ హైకోర్టు శుక్రవారానికి వాయిదా వేసింది. గురువారం ఈ పిటిషన్ జస్టిస్ ఎం.లక్ష్మణ్ ధర్మాసనం ముందు విచారణకు వచ్చింది. అవినాశ్‌రెడ్డి తరఫున ఉమామహేశ్వర్‌రావు, సీబీఐ తరఫున అనిల్, ఇంప్లీడ్ పిటిషన్ వేసిన సునీత తరఫున ఎల్.రవిచందర్ వాదనలు వినిపించేందుకు సిద్ధమయ్యారు. అప్పటికే దాదాపు సాయంత్రం 6.30 గంటలు కావొస్తుండటంతో.. వాదనలకు ఎవరెవరికి ఎంత సమయం పడుతుందని న్యాయమూర్తి ప్రశ్నించారు. ఐదారు గంటలకుపైగా పడుతుందని న్యాయవాదులు తెలపడంతో విచారణను శుక్రవారం ఉదయం 10.30 గంటలకు చేపడతామని న్యాయమూర్తి చెప్పారు.

**సుప్రీం ఆదేశాల నేపథ్యంలో**

వివేకా హత్యకేసులో ముందస్తు బెయిల్ కోరుతూ ఏప్రిల్‌లో అవినాశ్‌రెడ్డి తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై సెలవుల ముందు రోజు వరకు విచారణ చేపట్టిన న్యాయస్థానం.. జూన్ 5కు వాయిదా వేసింది. దీంతో ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు. పిటిషన్‌పై వాదనలు విన్న సర్వోన్నత న్యాయస్థానం.. అవినాశ్‌రెడ్డి వాదనలు విని తగు నిర్ణయం తీసుకోవాలని తెలంగాణ హైకోర్టును ఆదేశించింది. ఈ నేపథ్యంలో పిటిషన్‌ను వెకేషన్ బెంచ్ విచారణకు స్వీకరించింది.

## భూదాన్ బోర్డు చైర్మన్ బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరిస్తున్న విజయభాస్కర్‌రెడ్డి

సాక్షి, అమరావతి: ఏపీ భూదాన్ యజ్ఞ బోర్డు చైర్మన్‌గా తాడి విజయ భాస్కర్ రెడ్డి గురువారం బాధ్యతలు చేపట్టారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని సీసీఎల్ఏ ప్రధాన కార్యాలయంలో తన చాంబర్లో ఆయన బాధ్యతలు స్వీకరించారు. సీఎం జగన్ ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తానని విజయభాస్కర్ రెడ్డి చెప్పారు. భూదాన్ భూములకు సంబంధించిన అంశాలను అందరి సహకారంతో పరిష్కరించడానికి ప్రయత్నిస్తానన్నారు. కార్యక్రమంలో సీఎం ముఖ్య సలహాదారు అజయ్ కల్లం, మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, మాజీ మంత్రి పిల్లి సుభాష్ చంద్రబోస్, ఎమ్మెల్సీ, సీఎం ప్రోగ్రామ్స్ కోఆర్డినేటర్ తలశిల రఘురాం, రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వానికి చంద్రబాబు శుభాకాంక్షలు

సాక్షి, అమరావతి: పార్లమెంట్ నూతన భవన ప్రారంభోత్సవం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీకి, కేంద్ర ప్రభుత్వానికి టీడీపీ అధినేత నారా చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ట్వీట్ చేశారు. పేదరిక నిర్మూలనకు అవసరమయ్యే పాలసీల రూపకల్పనకు ఈ పార్లమెంట్ వేదిక కావాలని చంద్రబాబు ట్విట్టర్‌లో పేర్కొన్నారు.

## మాజీ ఐఏఎస్ అధికారి ఎంవీఎస్ ప్రసాద్ మృతి

సాక్షి, హైదరాబాద్: రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, సమాచార శాఖ మాజీ కమిషనర్ ఎంవీఎస్ ప్రసాద్ గురువారం మృతిచెందారు. 1977 బ్యాచ్ ఐఏఎస్ అధికారి అయిన ఆయన గతంలో రంగారెడ్డి, విజయనగరం జిల్లాల కలెక్టర్‌గా, టీటీడీ ఈవోగా, ఏపీఐఐసీ వీసీ–ఎండీగా, సాధారణ పాలన శాఖ ముఖ్య కార్యదర్శిగా సేవలందించారు. కుటుంబ ట్రస్టు మేళ్లచెరువు ఫౌండేషన్ ద్వారా పేద విద్యార్థుల ఉన్నత విద్యకి సహకారం అందించారు. ఈ నెల 27న అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

తెలంగాణ

## 'మళ్లీ పెళ్లి'.. ఆపండి

### కోర్టులో నరేష్ మూడో భార్య రమ్యా రఘుపతి పిటిషన్

హైదరాబాద్ : నరేష్, పవిత్ర లోకేష్ నటించిన 'మళ్లీ పెళ్లి' చిత్రం శుక్రవారం విడుదల కానున్న నేపథ్యంలో.. ప్రదర్శించకుండా ఆపాలని కోరుతూ నరేష్ మూడో భార్య రమ్యా రఘుపతి కూకట్‌పల్లి ఫ్యామిలీ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆ సినిమాలో కొన్ని సన్నివేశాలు తన ప్రతిష్ట కించపరిచేలా ఉన్నాయని ఆమె పేర్కొన్నారు. కాగా, ఇదే కోర్టులో వారి మధ్య కేసు నడుస్తోంది. రమ్యా రఘుపతి న్యాయవాది ఆమె తరఫున పిటిషన్ దాఖలు చేశారు. కానీ, నరేష్ తరఫు న్యాయవాది కోర్టుకు హాజరుకాలేదు. పిటిషన్‌ను స్వీకరించిన న్యాయస్థానం విచారణను జూన్ 28కి వాయిదా వేసింది.

## క్లుప్తంగా

### అమూల్ వర్సెస్ అవిన్

- తమిళనాడులోనూ మిల్క్ వార్
- అమిత్ షాకు సీఎం స్టాలిన్ లేఖ

చెన్నై: కర్ణాటక ఎన్నికల సమయంలో అమూల్ వ్యవహారం ఆ రాష్ట్రంలో ప్రకంపనలు సృష్టిస్తే, ఇప్పుడు తమిళనాడు వంతు వచ్చింది. తమిళనాడులో పాల సేకరణకు అమూల్ సంస్థ ప్రయత్నాలు మొదలుపెట్టడం రాష్ట్ర కోఆపరేటివ్ డెయిరీ అవిన్‌పై తీవ్ర ప్రభావం చూపిస్తుందన్న ఆందోళన మొదలైంది. రాష్ట్ర ముఖ్యమంత్రి స్టాలిన్ గురువారం ఈ మేరకు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాకు లేఖ రాశారు. అమూల్ సంస్థ పాల సేకరణను వెంటనే నిలిపివేసేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. 'అమూల్‌కు చెందిన కైరా జిల్లా సహకార పాల ఉత్పత్తిదారుల యూనియన్ రాష్ట్రంలోని కృష్ణగిరి జిల్లాలో పాల సేకరణ కోసం రైతులతో చర్చిస్తోంది. రాష్ట్ర సహకార డెయిరీ అవిన్ కంటే ఎక్కువ ధర ఇచ్చి పాలను కొనుగోలు చేయడానికి ఒప్పందాలు కుదుర్చుకుంది. తనకున్న బహుళ రాష్ట్రాల సహకార లైసెన్స్‌లను వినియోగించి పాల శీతలీకరణ కేంద్రాలను, ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తోంది. కృష్ణ నగర్, ధర్మపురి, వెల్లూరు సహా వివిధ జిల్లాల్లో పాల సేకరణ చేయడానికి సన్నాహాలు చేస్తోంది. ఇది ఆపరేషన్ శ్వేత విప్లవం నిబంధనలకు విరుద్ధం. రాష్ట్ర డెయిరీ అవిన ప్రయోజనాలను అణచివేయడమే. వెంటనే అమూల్ పాల సేకరణ చేయకుండా చర్యలు తీసుకోవాలి' అని స్టాలిన్ పేర్కొన్నారు. అమూల్ తన చర్యలతో డెయిరీ సంస్థల మధ్య అనారోగ్యకరమైన పోటీకి తెర తీస్తోందని స్టాలిన్ విమర్శించారు.

### అధ్యక్ష అభ్యర్థిత్వ రేసులోకి డీశాంటీస్



మియామీ: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ తరఫున అభ్యర్థిత్వం కోసం పోటీకి దిగుతున్నట్లు ఆ పార్టీ నేత, ఫ్లోరిడా రాష్ట్ర గవర్నర్ రాన్ డీశాంటీస్ ప్రకటించారు. 'అమెరికా ప్రగతి నేల చూపులు చూస్తోంది. దీన్ని ఆపడం అసాధ్యమైతే కాదు. మనకింకా సువర్ణావకాశం ఉంది. మళ్లీ మనం దేశ ప్రగతిని పైకి ఎగసేలా చేద్దాం. ఇది అమెరికా పునర్వైభవానికి బాటలువేస్తుంది' అని కుబేరుడు ఎలాన్ మస్క్‌తో కలిసి ఆన్‌లైన్ ఆడియో చర్చావేదిక 'ట్విట్టర్ స్పేసెస్'లో డీశాంటీస్ మాట్లాడారు. అయితే ఒక్కసారిగా వేలాదిగా స్ట్రీమింగ్‌లోకి రావడంతో సాంకేతిక సమస్య తలెత్తింది. దీంతో డీశాంటీస్ మాట్లాడింది ఎవరికీ వినపడలేదు. కాగా, పార్టీ తరఫున అధ్యక్ష అభ్యర్థిత్వం కోసం పలువురు పోటీ పడుతుండటం తెల్సిందే. వీరిలో ట్రంప్, నిక్కీ హేలీ, భారతీయ మూలాలున్న వ్యాపారి వివేక్ రామస్వామి, టిమ్ స్కాట్, హట్చిన్సన్ ఉన్నారు.

# కుల వోటు తారుమారు

**కర్ణాటక ఓటర్లలో స్పష్టమైన మార్పు**

## లింగాయత్‌లు, వొక్కలిగలు, ఎస్సీల్లో కాంగ్రెస్‌కే ఆదరణ


## దాంతో అసెంబ్లీ ఎన్నికల్లో ఘనవిజయం

కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో దశాబ్దాలుగా కొనసాగుతూ వస్తున్న సంప్రదాయ ఓటింగ్ ధోరణి ఈసారి రూటు మార్చుకుంది. ముఖ్యంగా కులాల వారీ ఓటు బ్యాంకు తారుమారైంది. మూడు దశాబ్దాల పాటు కాంగ్రెస్ పార్టీకి దూరమై బీజేపీకి అండదండగా నిలుస్తూ వచ్చిన లింగాయత్‌లు మనసు మార్చుకున్నారు. ఓట్లపరంగా అత్యంత ప్రాబల్యమున్న సామాజిక వర్గమైన లింగాయత్‌లలో బాహుబలి నేత యడియూరప్పను పక్కన పెట్టినందుకు బీజేపీ భారీ మూల్యమే చెల్లించింది. ఆ పార్టీకి దశాబ్దాలుగా పెట్టని కోటలా ఉంటూ వచ్చిన లింగాయత్‌లు ఆగ్రహించి దూరమయ్యారు. 1990లో లింగాయత్ నాయకుడైన నాటి ముఖ్యమంత్రి వీరేంద్ర పాటిల్‌ను కాంగ్రెస్ అధ్యక్షుడు రాజీవ్ గాంధీ అవమానకరంగా సీఎం పదవి నుంచి తప్పించడంతో ఆ పార్టీ లింగాయత్‌ల ఆగ్రహ జ్వాలలకు గురైంది. నెమ్మదిగా లింగాయత్ ఓటుబ్యాంకు బీజేపీకి మళ్లింది. 30 ఏళ్ల తర్వాత సరిగ్గా మళ్లీ అదే సీన్ రిపీటైంది. ఈసారి బీజేపీ వంతు వచ్చింది. యడియూరప్పను సీఎం పదవి నుంచి తప్పించడమే గాక అభ్యర్థుల ఎంపిక మొదలుకుని ప్రచారం దాకా పెద్దగా ప్రాధాన్యమివ్వని ప్రభావం ఫలితాల్లో స్పష్టంగా కనిపించింది. లింగాయత్‌లు, వొక్కలిగలు, ఎస్సీల్లో ఐదేసి శాతం మంది కాంగ్రెస్ వైపు మళ్లడంతో ఆ పార్టీ అనూహ్య విజయాన్ని సాధించగలిగింది. కేంద్ర ఎన్నికల సంఘం, సీ-ఓటరు వెల్లడించిన పార్టీలవారీ ఓట్లు, సీట్ల సరళిని పరిశీలిస్తే కులాల ఓటుబ్యాంకుల్లో మార్పు స్పష్టంగా తెలుస్తోంది...


**సాక్షి, నేషనల్ డెస్క్**

### లింగాయత్‌లు: బీజేపీకి షాక్

లింగాయత్‌లు బీజేపీకి దూరం కావడం ఇది తొలిసారేం కాదు. బీజేపీ యడియూరప్పను దూరం పెట్టినప్పుడు ఆయన బీజేపీకి గుడ్‌బై కొట్టి 2012లో కర్ణాటక జనతా పక్ష పేరుతో వేరు కుంపటి పెట్టారు. 2013 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి చేతుల కాలాయి. అప్పుడే ఆ పార్టీకి యడియూరప్ప, లింగాయత్‌ల ఓట్ల ప్రాధాన్యం ఏమిటో తెలిసింది. ఆ తర్వాత యడియూరప్పను అక్కున చేర్చుకున్నప్పటికీ, మళ్లీ తాజాగా ఎన్నికల ముందు యడియూరప్పను సీఎం పదవి నుంచి తప్పించి అదే తప్పు చేసింది. 2018 ఎన్నికల్లో లింగాయత్ ప్రాబల్యం ఉన్న స్థానాల్లో 41.8% ఓటు షేర్ బీజేపీకి వస్తే, ఈసారి కాస్త స్వల్పంగా 39.5 శాతానికి తగ్గింది. కానీ సీట్లు మాత్రం ఏకంగా 20 స్థానాలను కోల్పోవలసి వచ్చింది. జేడీ(ఎస్)కు వచ్చిన ఓట్ల శాతంలో పెద్దగా మార్పు లేదు. కాంగ్రెస్‌కు ఓట్లు 5 శాతమే పెరిగినా సీట్లు మాత్రం రెట్టింపు పెరిగాయి.





### వొక్కలిగలు: జేడీ(ఎస్)కు షాక్




జేడీ(ఎస్)కు అండగా ఉంటూ ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ప్రధాని హెచ్‌డీ దేవెగౌడను తమ పితగా కొలిచే వొక్కలిగలు కూడా షాకిచ్చే నిర్ణయాలే తీసుకున్నారు. దేవెగౌడ కుటుంబ పెత్తనంపై ఓటర్లలో ఓ రకమైన కసి కనిపించింది. 2018 ఎన్నికల్లో వొక్కలిగ ప్రాబల్యమున్న మొత్తం 51 స్థానాల్లో జేడీ(ఎస్) 23 గెలుచుకుంటే ఈసారి కేవలం 12 సీట్లకు పరిమితమవ్వాల్సి వచ్చింది. పీసీసీ డీకే శివకుమార్ వొక్కలిగ నేత కావడంతో వారికి ప్రత్యామ్నాయం కనిపించింది. కాంగ్రెస్ ఓల్డ్ మైసూర్ గ్రామీణ ప్రాంతంలో ఏకంగా 36 స్థానాల్లో విజయం సాధించింది. శివకుమార్ కనకపురలో లక్షా 20 ఓట్ల పైచిలుకు మెజార్టీతో గెలిచారంటేనే దేవెగౌడ గుప్పిట్లోంచి వొక్కలిగలు జారిపోతున్నట్టేనని భావిస్తున్నారు.

ఈసారి కాంగ్రెస్ పార్టీ విజయంలో ఎస్సీలు అత్యంత కీలకంగా వ్యవహరించారు. ఎస్సీ ప్రాబల్య అసెంబ్లీ స్థానాల్లో కాంగ్రెస్ గత ఎన్నికలతో పోల్చి చూస్తే అదనంగా 5.5శాతం ఓట్లు, 10 సీట్లు సంపాదించింది. దళిత నాయకుడు మల్లికార్జున ఖర్గే కాంగ్రెస్ అధ్యక్ష పదవి చేపట్టడం ఈసారి ఆ పార్టీకి బాగా కలిసొచ్చింది. సాధారణంగా దళితులు ఏ ఒక్క పార్టీ వైపు ఉండరు. కానీ ఈసారి ఖర్గే దళిత బ్యాంకుపై ప్రత్యేకంగా దృష్టి సారించి 40 ర్యాలీల్లో పాల్గొనడంతో ఎస్సీ ప్రాబల్య స్థానాల్లో సగానికి పైగా కాంగ్రెస్ ఖాతాలో పడ్డాయి. మొత్తమ్మీద కేవలం ఐదు శాతం ఓట్ల తేడాతోనే ఫలితాల్లో భారీగా మార్పులు కనిపించడమే మన ప్రజాస్వామ్యంలో వైచిత్రిగా ఎన్నికల విశ్లేషకులు అభివర్ణిస్తూ ఉంటారు.

### చెయ్యెత్తి జై కొట్టిన ఎస్సీలు




# చితికి చేరుతున్న చీతాలు

**దీహైడ్రేషన్‌తో మరో రెండు కూనల మృతి ● ఆరుకు చేరిన మరణాల సంఖ్య**



భోపాల్: భారత్‌లో అంతరించిపోయిన చీతాల సంతతిని పెంచేందుకు నమీబియా, దక్షిణాఫ్రికాల నుంచి చీతాలను తీసుకొచ్చిన కార్యక్రమంపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. మధ్యప్రదేశ్‌లోని కూనో జాతీయ వనంలో చీతాలు వరసబెట్టి మృత్యువాత పడుతున్నాయి. తాజాగా మరో రెండు చీతా కూనలు మరణించినట్లు అటవీశాఖ ఉన్నతాధికారి ఒకరు గురువారం వెల్లడించారు. మంగళవారం ఒక చీతా కూన చనిపోగా గురువారం మరో రెండు కూనలు చనిపోయినట్లు ప్రకటించారు. గురువారంనాటి మరణాలు మంగళవారమే సంభవించాయని తెలుస్తోంది. దీంతో విదేశాల నుంచి భారత్‌కు చీతాల తరలింపు ప్రాజెక్ట్ చేపట్టిననాటి నుంచి ఇప్పటిదాకా మూడు చీతాలు, మూడు చీతా కూనలు ప్రాణాలు కోల్పోయాయి. తాజాగా వీటి మరణాల సంఖ్య ఆరుకు పెరగడం ఆందోళకరం.

**డీహైడ్రేషన్..**

గత ఏడాది సెప్టెంబర్‌లో నమీబియా నుంచి తీసుకొచ్చిన సియాయా అనే ఆడ చీతాకు జ్వాల అని నామకరణం చేసి కూనో నేషనల్ పార్క్‌లో వదిలిపెట్టారు. అది మార్చి నెలలో నాలుగు కూనలకు జన్మనిచ్చింది. కాగా సూర్యప్రతాపం కారణంగా కూనో వనంలో పగటిపూట వేడి దాదాపు 47 డిగ్రీల సెల్సియస్‌గా ఉండటంతో డీహైడ్రేషన్ కారణంగా మే 23న తొలి కూన మృత్యువాత పడింది. దీంతో వాటిని వేరే చోటుకు తరలించాలని అధికారులు భావించారు. ఆలోపే అదేరోజు మరో రెండు కూనలు మరణించాయి. వాస్తవానికి ఆ రెండింటినీ ప్రత్యేక సంరక్షణలో ఉంచామని అయినా కాపాడలేకపోయామని, నాలుగో కూనను అత్యంత జాగ్రత్తగా చూసుకుంటున్నామని పర్యవేక్షక బృందం గురువారం ప్రకటించింది.

### మార్చిలో తొలి మరణం

నమీబియా నుంచి తీసుకొచ్చేటప్పుడే మూత్రపిండ సంబంధ వ్యాధితో బాధపడుతున్న సాశా అనే చీతా మార్చి 27న చనిపోయింది. తర్వాత దక్షిణాఫ్రికా నుంచి తీసుకొచ్చిన ఉదయ్ అనే చీతా ఏప్రిల్ 13న మరణించింది. దక్షిణాఫ్రికా నుంచి తెచ్చిన దక్ష అనే మరో చీతా కలయిక కోసం మరో మగ చీతాతో జరిగిన పోరాటంలో తీవ్ర గాయాలపాలై ఈనెల తొమ్మిదో తేదీన తుదిశ్వాస విడిచింది.

# జైల్లో కుప్పకూలిన జైన్

**హుటాహుటిన ఢిల్లీ ఆస్పత్రిలో చేర్పించిన పోలీసులు**

**ఐసీయూలో సత్యేందర్ జైన్‌కు కొనసాగుతున్న చికిత్స**



న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరెస్టై 2022 మే నుంచి తీహార్ జైల్లో ఉన్న మాజీ మంత్రి సత్యేంద్ర జైన్ గురువారం కుప్పకూలిపోయారు. జైల్లో కళ్లు తిరిగిపడిన జైన్‌ను పోలీసులు హుటాహుటిన దీన్‌దయాళ్ ఉపాధ్యాయ ఆస్పత్రిలో చేర్పించారు. శ్వాసతీసుకోవడంలో ఇబ్బందులు పడుతుండటంతో ఢిల్లీ ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ్ ఆస్పత్రి ఐసీయూకి మార్చారని ఆప్ వర్గాలు వెల్లడించాయి. గురువారం ఉదయం జైలు బాత్రూమ్‌లో జైన్ కాలుజారి పడిపోయారని జైలు అధికారి చెప్పారు. "కీలక అవయవాలకు గాయాలయ్యాయా అని వెంటనే వైద్యులు పరిశీలించి అంతా సాధారణంగా ఉందని తేల్చారు. వెనుకవైపు, ఎడమ కాలు, భుజం విపరీతంగా నొప్పి ఉన్నాయని చెప్పడంతో ఆస్పత్రికి తీసుకెళ్లాం" అన్నారు. స్నానాలగదిలో కళ్లు తిరిగి పడిపోవడంతో వెన్నెముకకు తీవ్ర గాయమైందని ఆప్ తెలిపింది. "ఢిల్లీ ప్రజలకు మంచి వైద్యం, ఆరోగ్యం అందించాలని చూసిన జైన్‌ను ఒక నియంత ఇలా శిక్షిస్తున్నాడు. దేవుడు అంతా చూస్తున్నాడు. అందరికీ న్యాయం జరుగుతుంది' అంటూ ఆప్ నేత, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ట్వీట్‌చేశారు. జైన్‌ను చెప్పడంతో జైలు అధికారులు సోమవారమే సఫ్దర్‌జంగ్ ఆస్పత్రిలో చూపించారు. "జైన మతవిశ్వాసాలను బాగా పాటించే జైన్ జైల్లో కేవలం పళ్లు, పచ్చి కూరగాయలు తింటున్నారు. దాంతో 35 కిలోలు తగ్గారు. రాత్రంతా బీపీఏపీ మెషీన్‌తో శ్వాస ఇవ్వాలి" అని ఆప్ తెలిపింది.

# హోమం సర్వమత ప్రార్థనలు..

**పార్లమెంటు ప్రారంభోత్సవానికి సర్వం సిద్ధం**

**20 పార్టీల బహిష్కారం, పాల్గొంటున్నవి 25**



న్యూఢిల్లీ: ముందుగా హోమం, తర్వాత సర్వమత ప్రార్థనలతో ఆదివారం పార్లమెంటు నూతన భవన ప్రారంభోత్సవ కార్యక్రమం మొదలుకానుంది. ప్రధాన కార్యక్రమంలో 18 ఎన్డీఏ పక్షాలు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీతో పాటు దాదాపు 25 పక్షాలు పాలుపంచుకోనున్నాయి. బిజు జనతాదళ్, జేడీ(ఎస్), అకాలీదళ్, బీఎస్పీ, లోక్ జనశక్తి పార్టీ (రాంవిలాస్), టీడీపీ వీటిలో ఉన్నాయి. కాంగ్రెస్ సారథ్యంలో దాదాపు 21 పార్టీలు కార్యక్రమాన్ని బహిష్కరించిన వేళ లోక్‌సభలో 50 మంది ఎంపీల బలమున్న ఈ ఏడు పార్టీల సంఘీభావం పాలక బీజేపీకి నైతిక స్థైర్యమిస్తుందని భావిస్తున్నారు. ప్రారంభోత్సవాన్ని పూర్తిగా అధికార పార్టీ కార్యక్రమంగా మార్చేస్తున్నారన్న విపక్షాల ఆరోపణలను తిప్పికొట్టేందుకు కూడా ఇది ఉపకరిస్తుందని బీజేపీ భావిస్తోంది.

**పాల్గొంటున్న బీఎస్పీ, టీడీపీ**


పార్లమెంటు భవనాన్ని మోదీ ప్రారంభించనుండటాన్ని స్వాగతిస్తున్నట్లు బీఎస్పీ అధినేత మాయావతి ప్రకటించారు. విపక్షాల బహిష్కరణ నిర్ణయం సరికాదన్నారు. ఆదివాసీ గౌరవం గురించి మాట్లాడుతున్న విపక్షాలకు రాష్ట్రపతి పదవి కోసం ద్రౌపదీ ముర్మును పోటీ పెట్టినప్పుడు ఆ విషయం గుర్తుకు రాలేదా అంటూ ఎద్దేవా చేశారు. టీడీపీ కూడా కార్యక్రమంలో పాల్గొంటున్నట్టు ప్రకటించింది. చరిత్రాత్మక సందర్భాన్ని రాజకీయం చేయకుండా హాజరై పెద్ద మనసు చూపాలని విపక్షాలకు బీజేపీ విజ్ఞప్తి చేసింది. ప్రధాని కూడా పార్లమెంటులో భాగమేనని ఆ పార్టీ నేత రవిశంకర్ ప్రసాద్ గుర్తు చేశారు. "రాష్ట్రపతి అంటే మనందరికీ గౌరవమే. ద్రౌపదీ ముర్ము గురించి కాంగ్రెస్ నేతలు ఎలా మాట్లాడారో గుర్తు చేసి ఆ పదవిని వివాదాల్లోకి లాగదలచుకోలేదు" అన్నారు.

### కార్యక్రమం ఇలా...

- పార్లమెంటు నూతన భవన ప్రాంగణంలో ఆదివారం ఉదయం ఏడింటికి హోమం జరుగుతుంది. తర్వాత సర్వమత ప్రార్థనలుంటాయి.
- అనంతరం హోమ వేదిక వద్దే తమిళనాడు తంజావూరు శైవ మత పెద్దలు చోళుల రాజదండమైన సెంగోల్‌ను ప్రధాని నరేంద్ర మోదీకి అందజేస్తారు.
- అనంతరం లోక్‌సభ చాంబర్‌ను మోదీ లాంఛనంగా ప్రారంభిస్తారు.
- మధ్యాహ్నం ప్రధాన కార్యక్రమం జరుగుతుంది. మోదీతో పాటు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్, మాజీ ప్రధాని దేవెగౌడ తదితరులు పాల్గొంటారు.
- మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్, లోక్‌సభ మాజీ స్పీకర్ శివరాజ్ పాటిల్, కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభలో విపక్ష నేత మల్లికార్జున ఖర్గేతో పాటు విపక్ష పార్టీల నేతలందరికీ ఇప్పటికే ఆహ్వానాలు వెళ్లాయి.

# రాకెన్ రోల్ క్వీన్ ఇకలేరు

**టీనా టర్నర్ కన్నుమూత**



న్యూయార్క్: తన పాట, ఆటతో 1960లు, 70ల్లో ప్రేక్షకులను ఉర్రూతలూగించిన రాకెన్ రోల్ క్వీన్, పాప్ సింగర్ టీనా టర్నర్ ఇక లేరు. సుదీర్ఘ అనారోగ్యం బారిన పడ్డ 83 ఏళ్ల టీనా జ్యూరిచ్ సమీపంలోని తన నివాసంలో మంగళవారం కన్నుమూశారు. మిక్ జాగర్ మొదలుకుని బేయాన్స్ దాకా రాక్ స్టార్లంతా టీనా వీరాభిమానులేనంటే ఆమె స్థాయి ఎంతటిదో అర్థం చేసుకోవచ్చు! ఎత్తుపల్లాలమయంగా సాగిన ఆమె జీవితం ఆద్యంతం ఆసక్తికరం. శారీరకంగా, మానసికంగా, ఆర్థికంగా తనను పూర్తిగా గుల్ల చేసిన 20 ఏళ్ల వైవాహిక బంధం తాలూకు దెబ్బను అధిగమించి మరీ పాప్ సంగీత ప్రపంచంలో మకుటం లేని మహారాణి స్థాయిని అందుకున్నారామె. ఏకంగా 12 గ్రామీ అవార్డులు ఆమెను వచ్చి వరించాయి. ఆమె ఆల్బంలు ప్రపంచవ్యాప్తంగా 15 కోట్లకు పైగా అమ్ముడవడమూ ఓ రికార్డే. టీనా స్ఫూర్తిమంతమైన జీవితం 'వాట్స్ లవ్ గాట్ టు డూ విత్ ఇట్' పేరిట 1993లో సినిమాగా వచ్చింది. భరించలేని బాధనంతా తనలోనే దాచుకుని ప్రపంచాన్ని మెరుగ్గా తీర్చిదిద్దేందుకు దాన్నే శక్తిమంతమైన ఆయుధంగా మలచుకున్న అంతటి మహనీయ వ్యక్తికి ఏమిచ్చినా రుణం తీర్చుకోలేమని అందులో టీనా పాత్ర పోషించిన నటి ఏంఎలా బాసెట్ అన్నారు.

# ప్రజాస్వామ్య స్ఫూర్తి అంటే వారిదే

**ఆస్ట్రేలియాలో అధికార, ప్రతిపక్షాలపై ప్రధాని మోదీ ప్రశంసలు**

**పార్లమెంటు ప్రారంభోత్సవాన్ని బహిష్కరించిన పార్టీలపై పరోక్ష విమర్శలు**



డెహ్రాడూన్-ఢిల్లీ వందేభారత్ రైలును ప్రారంభిస్తూ...

న్యూఢిల్లీ: పార్లమెంటు కొత్త భవనం ప్రారంభోత్సవంపై వివాదం కొనసాగుతూనే ఉంది. ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ప్రతిపక్ష పార్టీలు బహిష్కరించిన నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వారిపై పరోక్షంగా విరుచుకుపడ్డారు. ప్రజాస్వామ్య స్ఫూర్తి అంటే ఎలా ఉంటుందో ఆస్ట్రేలియా పర్యటనలో తెలిసిందంటూ విపక్షాల్ని విమర్శించారు. ఆరు రోజుల విదేశీ పర్యటన ముగించుకొని గురువారం స్వదేశానికి తిరిగి వచ్చిన ప్రధాని మోదీ ఢిల్లీలోని పాలం విమానాశ్రయం వెలుపల తనకు స్వాగతం పలికిన బీజేపీ కార్యకర్తలు, అభిమానులనుద్దేశించి మాట్లాడారు. సిడ్నీలో భారత సంతతికి చెందిన సదస్సులో పాల్గొన్నప్పుడు ఆస్ట్రేలియా ప్రధానమంత్రి ఆంటోనీ అల్బానెసెతో పాటుగా ప్రతిపక్ష పార్టీకి చెందిన నాయకులు, మాజీ ప్రధాని కూడా హాజరయ్యారన్నారు. "భారతీయులకు చెందిన ఒక కార్యక్రమానికి ప్రతీ ఒక్కరూ హాజరై తమ దేశానికి ప్రాధాన్యం ఇచ్చారు. ప్రజాస్వామ్య స్ఫూర్తిని, బలాన్ని అలా చాటారు" అని మోదీ కొనియాడారు. పార్లమెంటు ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని బహిష్కరించే విపక్ష పార్టీలపై ఆయన నేరుగా ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు. ఆస్ట్రేలియాలో భారతీయ ప్రతినిధులందరికీ అరుదైన గౌరవం దక్కిందంటే అది మోదీకున్న కీర్తిప్రతిష్టల వల్ల కాదని, భారత్‌కున్న పటిష్టమైన బలం వల్లనేనని ప్రధాని స్పష్టం చేశారు. భారత్ చెప్పేది విదేశాలన్నీ వింటున్నాయని, మెజార్టీ ప్రభుత్వం ఉండడమే దానికి కారణమని చెప్పారు. తాను వినిపించేది 140 కోట్ల భారతీయుల గళమేనని ప్రపంచ నాయకులందరికీ బాగా తెలుసునన్నారు. భారత్‌ను ప్రపంచంలో అగ్రగామిగా తీర్చిదిద్దడానికి ఎన్నో సవాళ్లు ఎదుర్కొంటున్నామన్నారు. అయితే సవాళ్లనే సవాల్ చేయడం తన స్వభావమని చెప్పుకొచ్చారు. కరోనా సంక్షోభ సమయంలో కోవిడ్ టీకాలు విదేశాలకు ఎందుకు పంపిణీ చేస్తున్నారని ప్రతిపక్షాలు అప్పట్లో నిలదీశాయని, కానీ ఎందరో ప్రాణాలు నిలిపినందుకు వారంతా భారత్‌కు కృతజ్ఞతగా ఉన్నారని అన్నారు. బుద్ధుడు, గాంధీ నడయాడిన నేలపై శత్రువులపైన కూడా కరుణ చూపిస్తామని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు.

### వారసత్వ రాజకీయాలు అభివృద్ధి నిరోధం

డెహ్రాడూన్: దేశాన్ని ఏళ్ల తరబడి పరిపాలించి హై స్పీడ్ రైళ్లను ప్రవేశపెట్టామని గొప్పలు చెప్పుకునే పార్టీలు వారసత్వ రాజకీయాల నుంచి బయటపడలేకపోతున్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విమర్శించారు. ఇలాంటి వారసత్వ రాజకీయాలే అభివృద్ధికి అడ్డంకిగా మారుతున్నాయని అన్నారు. ఉత్తరాఖండ్‌లో మొట్టమొదటి వందేభారత్ రైలుని మోదీ గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. ఈ డెహ్రాడూన్-ఢిల్లీ రైలు ప్రారంభోత్సవంలో కాంగ్రెస్‌పై పలు విమర్శలు చేశారు. ఉత్తరాఖండ్ రైల్వేలో మౌలిక సదుపాయాల కోసం బడ్జెట్‌ను పెంచామన్నారు. 2014కి ముందు రూ.200 కోట్ల కంటే తక్కువ ఉంటే, ప్రస్తుతం రూ.5 వేల కోట్లు ఉందన్నారు. రైల్వే శాఖలో మౌలిక సదుపాయాలను మెరుగుపరిచి, ట్రాకుల్ని ఆధునీకరిస్తే మరింత హై స్పీడ్ రైళ్లను ప్రవేశపెట్టవచ్చన్నారు. దశాబ్దాలుగా అధికారంలో ఉన్న పార్టీ దానిని గుర్తించకుండా అవినీతి, కుంభకోణాలతో మునిగిపోయిందని విమర్శించారు. వారసత్వ రాజకీయాల నుంచి ఆ పార్టీ బయటపడలేకపోవడంతో దేశాభివృద్ధికి అడ్డంకిగా మారిందన్నారు.

# మోదీ అహం, ప్రచార పిచ్చి

**అవే పార్లమెంటరీ వ్యవస్థను నాశనం చేశాయి**

**'మోదీ- పార్లమెంట్ ప్రారంభోత్సవం' రగడపై కాంగ్రెస్ విమర్శ**

న్యూఢిల్లీ: రాష్ట్రపతిని పక్కకునెట్టి ప్రధాని హోదాలో నూతన పార్లమెంట్ భవనాన్ని నరేంద్ర మోదీ ప్రారంభించడాన్ని కాంగ్రెస్ మరోమారు తీవ్రంగా తప్పుబట్టింది. "ఇదంతా ఒక్కరి అహంకారం, ప్రచార వ్యామోహం. ఆయనలోని ఈ దుర్గుణాలే రాష్ట్రపతికి రాజ్యాంగం ద్వారా దక్కాల్సిన గౌరవం దక్కకుండా చేస్తున్నాయి' అని మోదీపై మండిపడింది. మోదీ ప్రభుత్వ అహంకార వైఖరి మన పార్లమెంటరీ వ్యవస్థను నాశనం చేసిందంటూ కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే ట్వీట్ చేశారు. "పార్లమెంట్‌ను ప్రారంభించే హక్కును రాష్ట్రపతి నుంచి లాక్కుని మీరు ఏం చూపాలనుకుంటున్నారో 140 కోట్ల మంది ప్రజలు తెల్సుకోవాలనుకుంటున్నారు" అన్నారు. "బుధవారమే రాంచీలో జార్ఖండ్ హైకోర్టు నూతన భవనాన్ని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ప్రారంభించారు. ఢిల్లీలో మాత్రం ఒక వ్యక్తి అహంకారం పార్లమెంట్ భవనాన్ని ప్రారంభించాల్సిన రాష్ట్రపతి హక్కును ఎదిరిస్తోంది. అశోక ది గ్రేట్, అక్బర్ ది గ్రేట్, మోదీ ది ఇనాగరేట్ (ప్రారంభోత్సవాలు చేసే వ్యక్తి)' అంటూ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఎద్దేవా చేశారు.

**గిరిజనులను అవమానించడమే: ఆలిండియా ఆదివాసీ కాంగ్రెస్**

పార్లమెంటు భవన ప్రారంభోత్సవానికి రాష్ట్రపతిని ఆహ్వానించకపోవడం, మోదీయే ప్రారంభించనుండటం మహిళలను కించపరచడమేనని, గిరిజనులను అవమానించడమేనని ఆలిండియా ఆదివాసీ కాంగ్రెస్ విమర్శించింది. దీనిపై శుక్రవారం నిరసన చేపడతామని ప్రకటించింది.

### ప్రారంభోత్సవంపై సుప్రీంలో పిల్

పార్లమెంట్ భవనాన్ని ప్రధాని ప్రారంభించకూడదంటూ సుప్రీంకోర్టులో గురువారం ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. రాష్ట్రపతి ద్వారా ప్రారంభోత్సవం జరిగేలా లోక్‌సభ సచివాలయాన్ని ఆదేశించాలని పిటిషన్‌దారు న్యాయవాది జయ సుకిన్ కోరారు. పిల్‌లో పేర్కొన్నారు. పార్లమెంట్‌లో అంతర్భాగమైన రాష్ట్రపతికే ఆహ్వానం పంపలేదని ఆక్షేపించారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవాలని కోరారు.

# పవార్‌తో కేజ్రీవాల్ భేటీ

ముంబై: ఢిల్లీ రాష్ట్రంలో ఉన్నతాధికారుల నియామకం, బదిలీ నిర్ణయాలపై సర్వాధికారం లెఫ్టినెంట్ గవర్నర్‌కే దఖలుపరుస్తూ కేంద్రప్రభుత్వం తెచ్చిన ఆర్డినెన్స్‌పై ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ పోరాటం ముమ్మరంచేశారు. సంబంధిత బిల్లు రాజ్యసభలో ఓడిపోయేలా విపక్షాల మద్దతు కూడగట్టేందుకు విపక్ష నేతలను కలవడంలో బిజీగా మారారు. ఇందులోభాగంగా గురువారం ముంబైలో నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ(ఎన్సీపీ) చీఫ్ శరద్ పవార్‌ను కలిశారు. 'ఎన్డీఏయేతర పార్టీలు ఉమ్మడి నిర్ణయంతో ముందుకెళ్తే రాజ్యసభలో బిల్లు ఓడిపోవడం ఖాయం' అని కేజ్రీవాల్ అన్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఆ పార్టీ నేత రాహుల్ గాంధీలను శుక్రవారం కలిసేందుకు ప్రయత్నిస్తా' అని అన్నారు. ఈ సందర్భంగా పవార్ మాట్లాడారు. 'ప్రభుత్వాల పాలనా హక్కులను పరిరక్షించాల్సిందే. మేం ఆప్ వెంటే ఉంటాం. ఈ విషయంలో బీజేపీయేతర పార్టీలన్నీ ఆప్‌కు మద్దతు ప్రకటించాలి' అని అన్నారు. ఇప్పటికే కేజ్రీవాల్ శివసేన(యూబీటీ) చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే, టీఎంసీ చీఫ్ మమతా బెనర్జీలను కలిసి మద్దతు కోరడం తెల్సిందే. ఢిల్లీలో పాలనాధికారం లెఫ్టినెంట్ గవర్నర్‌కు కాకుండా ఎన్నికైన రాష్ట్ర సర్కార్‌కే ఉంటుందంటూ సుప్రీంకోర్టు ధర్మాసనం తీర్పు వెలువడిన కొద్దిరోజులకే కేంద్రం ఆర్డినెన్స్ తేవడం, రాజ్యసభలో దానిపై బిల్లును ఓడించేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేయడం విదితమే.



మైసూర్ పులిగా కీర్తించబడిన రాజు టిప్పు సుల్తాన్ వినియోగించిన ఖడ్గమిది. లండన్‌లోని బోహామ్స్ సంస్థ నిర్వహించిన వేలంపాటలో రికార్డుస్థాయిలో రూ.143 కోట్ల ధర పలికింది. టిప్పు సుల్తాన్ పడకగదిలో లభించిన దీనిని ఈస్టిండియా కంపెనీ వారు మేజర్ జనరల్ డేవిడ్ బేర్డ్‌కు బహుమతిగా ఇచ్చారు.

సాక్షి 24|7 తమిళనాడు
TAMILNADU
శుక్రవారం । 26 । మే । 2023



## అనుమతుల్లేని 214 టాస్మాక్ బార్లు సీజ్

కొరుక్కుపేట: చెన్నైలో టాస్మాక్ బార్ల కేటాయింపుపై ఇప్పటికే కోర్టుల్లో పలు కేసులు నడుస్తున్నాయి. ఈ నేపథ్యంలో చెన్నై, పరిసర ప్రాంతాల్లో అనుమతులు లేకుండానే టాస్మాక్ బార్లలో ఇష్టారాజ్యంగా మద్యం విక్రయాలు సాగుతున్నాయి. ఈ అంశంపై టాస్మాక్ అధికారులకు అనేక ఫిర్యాదులు అందాయి. దీంతో అధికారులు తనిఖీలను ముమ్మరం చేశారు. తాజాగా అంబత్తూరు, కొరట్టూరు, ఆవడి జిల్లాల్లో ప్రభుత్వ అనుమతి లేకుండా నిర్వహిస్తున్న 214 బార్లను గుర్తించి సీజ్ చేశారు. నిబంధనలను పాటించని వారిని ఇకపై ఉపేక్షించే ప్రసక్తే లేదని ఈ సందర్భంగా అధికారులు స్పష్టం చేశారు.

### న్యూస్‌రీల్

### విద్యార్థులకు పారిశ్రామిక నైపుణ్యాలపై శిక్షణ

సాక్షి, చెన్నై: ఇంజినీరింగ్‌లో సాధికారతను కొనసాగించే విధంగా విద్యార్థులకు అవసరమైన పారిశ్రామిక రంగంలో అభివృద్ధి, నైపుణ్యాలపై శిక్షణ అందించే కార్యక్రమం గురువారం స్థానికంగా జరిగింది. సీమాట్స్ వీసీ వీరయ్యన్ అధ్యక్షతన నిర్వహించిన ఈ శిక్షణలో కార్ టెక్నాలజీస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ నేతృత్వంలో 2024 గ్రాడ్యుయేట్లకు ప్లేస్‌మెంట్‌లో భాగంగా 150 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. వీరికి మరింతగా పారిశ్రామిక రంగంలోని నైపుణ్యాలను ఇందులో ఆ సంస్థ ప్రతినిధులు వివరించారు. పరివర్తనాత్మక అభ్యాసం, అనుభవం తదితర అంశాలతో పాటు డైనమిక్ గ్లోబల్ ల్యాండ్ స్కేప్‌లో విద్యార్థులు తమ నైపుణ్యం చాటేందుకు వీలుగా ఈ శిక్షణలో మెళకువలను తెలియజేశారు.

### వైద్య శిబిరానికి స్పందన


వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న మంత్రి ఏవీ వేలు

కొరుక్కుపేట: చెన్నైలోని గిండిలోని హైవే రీసెర్చ్ స్టేషన్ ప్రాంగణంలో హైవేస్ డిపార్టుమెంట్ అధికారులు, ఉద్యోగుల కోసం వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని రాష్ట్ర ప్రజా పనులు, హైవేలు, మైనర్ పోర్టుల శాఖ మంత్రి ఏవీ వేలు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ సలహా మేరకు ఈ వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. హైవేస్ డిపార్టుమెంట్‌లోని ఉద్యోగుల ఆరోగ్యాన్ని కాపాడేందుకు జనరల్ మెడిసిన్, కార్డియాలజీ, ఆర్థోపెడిక్స్, న్యూరాలజీ, డైటీషియన్లతో పాటు వైద్య నిపుణులతో ఈ శిబిరాన్ని నిర్వహించినట్లు తెలిపారు. కావేరి ఆసుపత్రి సహాయంతో చేపట్టిన వైద్య శిబిరంలో ఉద్యోగులు ఎలాంటి సందేహాలు లేకుండా సద్వినియోగం చేసుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో హైవేస్ అండ్ మైనర్ పోర్ట్సు డిపార్టుమెంట్ అడిషనల్ చీఫ్ సెక్రటరీ ప్రదీప్ యాదవ్, హైవేస్ ప్రిన్సిపల్ డైరెక్టర్ శాంతి, చీఫ్ ఇంజినీర్లు, అధికారులతోపాటు కావేరి ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ అయ్యప్పన్ పొన్నుస్వామి పాల్గొన్నారు.

### నకిలీ సిమ్‌కార్డు విక్రయదారుల అరెస్టు

కొరుక్కుపేట: రాష్ట్రవ్యాప్తంగా 55,982 నకిలీ సిమ్‌కార్డులను విక్రయించిన వ్యవహారంలో సైబర్ క్రైమ్ పోలీసులు రాష్ట్రవ్యాప్తంగా 12 కేసులు నమోదు చేశారు. ఐదుగురు విక్రయదారులను అరెస్టు చేశారు. వివరాలు.. తమిళనాడులో వేల సంఖ్యలో నకిలీ సిమ్‌కార్డులు అమ్ముడవుతున్నాయని, దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని కొన్ని నెలల క్రితం నేషనల్ సైబర్ క్రైమ్ తమిళనాడు స్టేట్ సైబర్ క్రైమ్‌కు నివేదిక పంపింది. రాష్ట్ర అదనపు డీజీపీ సంజయ్‌కుమార్ ఆదేశాల మేరకు సైబర్ క్రైమ్ ఎస్పీ దేవరాణి, స్టాలిన్, అశోక్‌కుమార్ నేతృత్వంలోని బృందం ఈ అంశంపై విచారణ చేపట్టింది. ఇందులో నకిలీ గుర్తింపు కార్డులను ఉపయోగించి వేల సంఖ్యలో సిమ్‌కార్డులు విక్రయిస్తున్నారని, దీనికి సంబంధించి టెలికాం రంగం ఫేషియల్ రికగ్నైజేషన్ సాఫ్ట్‌వేర్‌ను ప్రారంభించింది. డేటాను విశ్లేషించగా, దాదాపు 55,982 సిమ్‌కార్డులు నకిలీ చిరునామాల ద్వారా విక్రయించినట్లు తేలింది. దీంతో వీటన్నింటినీ తాజాగా బ్లాక్ చేశారు. తర్వాత కడలూరు, కోయంబత్తూరు, సేలం, తిరుచ్చి, తంజావూరు, తిరునెల్వేలి, తూత్తుకుడి, తిరుపూర్ జిల్లాల్లో 12 కేసులు నమోదయ్యాయి. అనంతరం నకిలీ సిమ్ కార్డులను విక్రయిస్తున్న ఐదుగురిని అరెస్టు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### సారా నియంత్రణలో నిర్లక్ష్యం

**ఎస్‌ఐ సహా ఐదుగురి పోలీసులపై సస్పెన్షన్ వేటు**

వేలూరు: విల్లుపురం జిల్లా మరకానం వద్ద కల్తీ సారా తాగి 20 మందికి పైగా మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా సారా విక్రయదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డీజీపీ శైలేంద్రబాబు పోలీసులను ఆదేశించారు. దీంతో ఎస్పీ కార్తికేయన్ జిల్లా వ్యాప్తంగా ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. ఈక్రమంలో ఈనెల 14వ తేదీ నుంచి మొత్తం 270 మంది సారా విక్రయదారులను అరెస్టు చేయడంతో పాటు పదిమందిపై గుండాయాక్ట్ నమోదు చేశారు. అలాగే జిల్లా వ్యాప్తంగా స్వాధీనం చేసుకున్న 4,450 లీటర్ల నాటు సారాని రెవెన్యూ అధికారుల సమక్షంలో ధ్వంసం చేశారు. ఇదిలా ఉండగా జిల్లావ్యాప్తంగా కల్తీసారా నియంత్రణలో జాప్యం చేసిన పోలీసుల జాబితాను ఎస్పీ సిద్ధం చేశారు. ఈ క్రమంలో అక్రమార్కులపై ఎలాంటి చర్యలు తీసుకోని కన్నమంగళం ఎస్‌ఐ ఆరున్, తానిపాడి హెడ్‌కానిస్టేబుల్ నిర్మల్, శివ, సెంగం పోలీస్ స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్‌తో పాటు మొత్తం ఐదుగురిని విధుల నుంచి సస్పెండ్ చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

# రాజదండం ఏర్పాటులో..
# రాజకీయాలకు తావులేదు

కొత్త పార్లమెంట్ భవనంలో ఏర్పాటు చేస్తున్న రాజదండం (సెంగోల్) విషయంలో ఎలాంటి రాజకీయం లేదని కేంద్ర ఆర్థిక శాఖమంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. ఈ చిహ్నం వెనుక ఉన్న చారిత్రక నేపథ్యాన్ని మరిచి పోకూడదని వ్యాఖ్యానించారు. పార్లమెంట్ భవన ప్రారంభోత్సవానికి ప్రతిపక్షాలన్నీ హాజరు కావాలని పిలుపునిచ్చారు. బహిష్కరణ నిర్ణయాన్ని పునఃసమీక్షించుకోవాలని కోరారు. అలాగే ఈ వేడుకకు హాజరు కావాలని తమిళనాడులోని 20 మంది అధీనంలను (పీఠాధిపతులను) ఆహ్వానించినట్లు తెలిపారు.



మీడియాతో మాట్లాడుతున్న కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్, చిత్రంలో కేంద్ర సహాయ మంత్రి ఎల్. మురుగన్, గవర్నర్‌లు ఆర్‌ఎన్ రవి, తమిళి సై, ఇలగణేషన్, రాష్ట్ర మంత్రి పీకే శేఖర్‌బాబు


గవర్నర్లతో భేటీ అయిన కేంద్ర మంత్రులు

- చోళ సంప్రదాయానికి ప్రతీక సెంగోల్
- స్పష్టం చేసిన కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్
- రాష్ట్రానికి చెందిన 20 మంది పీఠాధిపతులకు ఆహ్వానం
- రాష్ట్రపతి రబ్బర్‌స్టాంప్ కాదని వ్యాఖ్య
- ప్రతిపక్షాలు తమ నిర్ణయాన్ని పునః సమీక్షించుకోవాలని సూచన

సాక్షి, చెన్నై: కొత్త పార్లమెంట్ భవన ప్రారంభోత్సవం, చోళుల అధికార వైభవాన్ని చాటే సెంగోల్ (రాజదండం) ఏర్పాటు తదితర అంశాలపై గిండి రాజ్‌భవన్‌లో గురువారం కేంద్రమంత్రులు, గవర్నర్లు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఇందులో తమిళనాడు గవర్నర్ ఆర్‌ఎన్ రవి, పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ తమిళి సై సౌందరరాజన్, నాగాలాండ్ గవర్నర్ ఇలగణేషన్, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్, సహాయ మంత్రి ఎల్. మురుగన్, హాజరయ్యారు. ఈసందర్భంగా నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ, మరో రెండు వందల సంవత్సరాలు ఈ దేశానికి చిహ్నంగా ఉండే అత్యద్భుత పార్లమెంట్ భవనాన్ని ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలోని ప్రభుత్వం నిర్మించిందని గుర్తు చేశారు. ఈ వేడుకకు ప్రతి పక్షాలన్నీ హాజరు కావాలని పిలుపు నిచ్చారు. అయితే వారు బహిష్కరణ నినాదంతో ముందుకెళ్తుండడం శోచనీయమని వ్యాఖ్యానించారు.

**రాజకీయ అంశం కాదు..**

భారతదేశాన్ని వదిలి వెళ్లే సమయంలో అధికారాన్ని బదలాయించేందుకు బ్రిటీషు వారు అనుసరించిన ప్రక్రియే సెంగోల్ అని నిర్మలా సీతారామన్ వివరించారు. తిరువాడుతురై ఆధీనం (పీఠాధిపతి) దీనిని తయారు చేయించారని గుర్తు చేశారు. పరిపాలన న్యాయ, ధర్మబద్ధంగా నిర్వహించేందుకు సూచికగా ఈ రాజదండం సిద్ధం చేశారని పేర్కొన్నారు. ఇది చోళుల హయాం నుంచే వస్తున్న సంప్రదాయమని గుర్తు చేశారు. ఇందులో మత పరమైన అంశాలకు తావు లేదని, రాజకీయాలు చేయాల్సిన అవసరం కూడా లేదని స్పష్టం చేశారు. ఈ సెంగోల్‌ను కొత్త పార్లమెంట్ భవనంలో స్పీకర్ కుర్చీకి సమీపంలో ఏర్పాటు చేయనుండడం తమిళనాడుకు ఎంతో గర్వకారణం అని తెలిపారు. చోళ, పల్లవ, పాండ్య రాజులు, వారి పాలన , ఆ కాలపు రాజరిక అధికార సంప్రదాయం గురించి అందరికీ తెలుసు అని వివరించారు. మదురై మీనాక్షి అమ్మవారి పంగుణి ఉత్సవాలలో అమ్మ వారి చేతిలో రాజదండం తప్పనిసరిగా ఉంటున్నదని గుర్తు చేశారు. పలు దేశాలలోనూ ఈ సంప్రదాయాన్ని అనుసరిస్తున్నారని , సెంగోల్ ప్రజల శక్తి అని , అధికార బదిలీకి చిహ్నం అని అభిప్రాయపడ్డారు. ధర్మం, న్యాయం, అందరికీ సమానంగా ఉన్న సెంగోల్ వెనుక ఉన్న అసలు తత్వాన్ని మరిచి పోకూడదన్నారు. ఉండాల్సిన చోట దీనిని గతంలో ఉంచక పోవడంతోనే ప్రస్తుతం ప్రధాని నరేంద్ర మోదీ కొత్త పార్లమెంట్‌భవన్‌లో ఏర్పాటు చేయడానికి నిర్ణయించారని తెలిపారు.

**తమిళులకు గర్వకారణం..**

సెంగోల్ మన గళం అని, ఇందులో తమిళ అక్షరాలు సైతం ఉన్నాయని పేర్కొంటూ, ఈ వేడుకకు హాజరు కావాలని రాష్ట్రంలోని 20 మంది ఆధీనంలను ఆహ్వానించామని నిర్మలా సీతారామన్ వివరించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు తగిన గౌరవం ఇస్తున్నామని, ఆ పదవి రబ్బర్ స్టాంప్ కాదు అని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. రాష్ట్రపతి ఎన్నికల సమయంలో వ్యంగ్యంగా వ్యాఖ్యలు చేసిన వాళ్లు ఇప్పుడు, రాష్ట్రపతిని కేంద్రం అవమానిస్తున్నదని విమర్శలు చేయడం శోచనీయమన్నారు. ఈ భవనాన్ని ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభిస్తున్నారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమాన్ని బహిష్కరిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని పునఃసమీక్షించుకోవాలని ప్రతిపక్షాలకు సూచించారు. గోల్‌ను సిద్ధం చేసిన వారిని ఈ వేడుకలో సన్మానించబోతున్నామన్నారు. అలాగే దేవారం కూడా పాడబోతున్నట్లు చెప్పారు.

**తెలంగాణలో గవర్నర్‌ను ఆహ్వానించారా..?**

పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ తమిళి సై సౌందరరాజన్ మాట్లాడుతూ, ఇటీవల తెలంగాణలో భారీ సచివాలయం భవనాన్ని నిర్మించారని గుర్తు చేశారు. ఈ ప్రారంభోత్సవానికి గవర్నర్‌ను ఆహ్వానించారా..? అని పలువురు ప్రశ్నించారని పేర్కొన్నారు. అయితే, అక్కడ అధికారంలో ఉన్నది సీఎం అంటూ, ఆయనతోనే ప్రారంభోత్సవాన్ని ముగించారన్నారు. ప్రారంభోత్సవం మాట పక్కన పెడితే, తనకు కనీసం ఆహ్వానం కూడా లేదన్న విషయాన్ని ఈసందర్భంగా ప్రస్తావించారు. రాష్ట్రపతి రాజకీయాలకు సంబంధం లేని వారని గుర్తు చేశారు. అదేవిధంగా గవర్నర్‌లు కూడా రాజకీయాలకు అతీతం అనే విషయాన్ని గుర్తెరగాలని సూచించారు. కాగా, ఈ మీడియా సమావేశంలో రాష్ట్ర దేవదాయ శాఖమంత్రి పీకే శేఖర్‌బాబు సైతం పాల్గొనడం గమనార్హం. పార్లమెంట్‌భవన ప్రారంభోత్సవాన్ని డీఎంకే బహిష్కరించిన నేపథ్యంలో ఈ సమావేశానికి దేవాదాయ శాఖ మంత్రి హాజరు కావడం కొత్త చర్చకు దారి తీసింది.

### పర్యాటక సీమలో
## వేసవి ఉత్సవాలు

- నేటి నుంచి ప్రారంభం


కొడైక్కెనాల్‌లో పర్యాటకుల సందడి

సాక్షి, చెన్నై: రాష్ట్రంలోని పర్యాటక ప్రదేశాలలో అత్యంత ప్రసిద్ధి చెందిన కొడైక్కెనాల్‌లో వేసవి ఉత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందుకోసం రాష్ట్ర పర్యాటక, అటవీ, ఉద్యానవన శాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేశాయి. వివరాలు.. రాష్ట్రంలో ప్రకృతి రమణీయతలో రారాజుగా ఊటీ పేరుగడించిన విషయం తెలిసిందే. నీలగిరి జిల్లాల్లో పర్యాటకంగా ప్రసిద్ధి చెందిన ఊటీలో ఎల్లప్పుడూ ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. ఇక్కడి పర్యాటక అందాల్ని తిలకించేందుకు దేశ విదేశాల నుంచి నిత్యం సందర్శకులు వస్తుంటారు. ఇక్కడ వేసవి ఉత్సవాలు కనుల పండువగా సాగుతున్నాయి. పుష్ప ప్రదర్శనలు, క్రీడలు ఆకట్టుకుంటాయి. దీంతో ఊటీకి సందర్శకులు పోటెత్తుతున్నారు. ఇక దిండుగల్ జిల్లాలోని కొడైక్కెనాల్ ప్రకృతి సీమలో యువరాణిగా పేరుగడించింది. ఇక్కడికీ దేశ విదేశాల నుంచి పర్యాటకుల తాకిడి ఎక్కువగానే ఉంటోంది. ఇక్కడ కూడా ఏటా వేసవి ఉత్సవాలు నిర్వహిస్తారు. శుక్రవారం నుంచి వేసవి ఉత్సవాలలో భాగంగా పుష్ప, పండ్ల ప్రదర్శనలు, సంగీత, క్రీడా, ఉత్సవాలు కనుల పండువగా ఏర్పాటు చేస్తున్నారు. తొలి మూడు రోజులు పుష్ప ప్రదర్శనలు, ఆ తర్వాత మిగిలిన ఉత్సవాలు నిర్వహిస్తారు. పుష్ప ప్రదర్శన కోసం బ్రియాంట్ పార్క్‌లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అలాగే పేదల ఊటీగా పేరుగడించిన సేలం జిల్లా ఏర్కాడులోనూ వేసవి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. గురువారం పర్యాటకుల కోసం ఇక్కడ పడవ పోటీలు నిర్వహించారు. ఇందులో వివిధ నగరాల నుంచి వచ్చి క్రీడాకారులు పాల్గొన్నారు.

## సింగపూర్ నుంచి మదురైకు విమాన సేవలు

- సింగపూర్ మంత్రికి సీఎం స్టాలిన్ హామీ
- మన్నార్‌కుడిలో లీ క్వాన్ యూకు స్మారకం

సాక్షి, చెన్నై: సింగపూర్ నుంచి మదురైకు నేరుగా విమాన సేవలు అందిస్తామని సీఎం స్టాలిన్ హామీ ఇచ్చారు. సింగపూర్ హోం, న్యాయ వ్యవహారాల శాఖమంత్రి షణ్ముగం విజ్ఞప్తి మేరకు కేంద్రంతో చర్చలు జరిపి చర్యలు తీసుకుంటామని సీఎం పేర్కొన్నారు. అలాగే సింగపూర్ పితామహుడు లీ క్వాన్ యూకు తిరువారూర్‌జిల్లా మన్నార్‌కుడిలో స్మారక చిహ్నం ఏర్పాటు చేస్తామన్నారు. సింగపూర్ పర్యటనలో భాగంగా రెండో రోజు గురువారం సీఎం స్టాలిన్ ఆ దేశ హోం, న్యాయ వ్యవహారాల శాఖమంత్రి షణ్ముగంతో భేటీ అయ్యారు. ఈసందర్భంగా చెన్నైలో జరిగే పెట్టుబడుల మహానాడుకు రావాలని ఆహ్వానపత్రికను అందజేశారు. అలాగే, తమిళనాడులో పరిశ్రమలు, సేవలు, భద్రతా అంశాల గురించి ఇరువురు చర్చించారు. సైబర్ సెక్యూరిటీ విస్తరణ, ప్రభుత్వ ఏజెన్సీల కోసం సైబర్ సెక్యూరిటీ ఫ్రేమ్ వర్క్ అభివృద్ధి, డేటా గోప్యత తదితర అంశాల గురించి మాట్లాడుకున్నారు. సింగపూర్ నుంచి మదురైకు నేరుగా విమాన సేవలకు చర్యలు తీసుకోవాలని ఈసందర్భంగా సీఎం స్టాలిన్‌కు షణ్ముగం సూచించారు. ఇందుకు సీఎం స్టాలిన్ స్పందించారు. కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపి, చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో రాష్ట్ర మంత్రి టీఆర్‌బీ రాజా, సీఎస్ ఇరై అన్బు పాల్గొన్నారు. అనంతరం సింగపూర్ తమిళ ప్రొఫెసర్ దినప్పన్‌తో సీఎం సమావేశమయ్యారు. ఆయన సేవలను ఈసందర్భంగా సీఎం కొనియాడారు.


సింగపూర్ మంత్రి షణ్ముగంతో సీఎం స్టాలిన్

**అమూల్ సంస్థను నియంత్రించండి**

తమిళనాడు సరిహద్దు జిల్లాల్లో అమూల్ సంస్థ పాల సేకరణపై దృష్టి పెట్టిందని, వీరి చర్యలకు కళ్లెం వేయాలని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాకు సీఎం స్టాలిన్ గురువారం లేఖ రాశారు. గుజరాత్ కేంద్రంగా సాగుతున్న అమూల్ మిల్క్ తమిళనాడులోని ఆవిన్ పాలపై ప్రభావం చూపించే విధంగా వ్యవహరిస్తోందని తన లేఖలో సీఎం వివరించారు. తమిళనాడులో ఆవిన్ పాల ఉత్పత్తి, కొనుగోలు, విక్రయాలను గుర్తు చేస్తూ, రాష్ట్రాల మధ్య పాల సేకరణ నిబంధనలను ఉల్లంఘించే విధంగా అమూల్ వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమిళనాడులో ఆవిన్ పాల కొనుగోళ్లలో సమస్యలు సృష్టించే విధంగా కృష్ణగిరి, ధర్మపురి, వేలూరు, తిరుపత్తూరు, రాణి పేట, కాంచీపురం, తిరువళ్లూరు జిల్లాలో పాల కొనుగోళ్లపై అమూల్ సంస్థ దృష్టి పెట్టినట్టు, ఇందుకు చెక్ పెట్టాలని కోరారు. ఒక రాష్ట్రంలో ప్రభుత్వ రంగ సంస్థ పాల ఉత్పత్తిలో ఉన్నప్పుడు, మరో సంస్థ సరిహద్దులు దాటి వచ్చి సమస్యలు సృష్టించడాన్ని ఖండిస్తున్నామన్నారు. తక్షణం తమిళనాడులో పాల ఉత్పత్తి ప్రాంతాల్లో అమూల్ పాల సేకరణను నిలుపుదల చేయించాలని కోరారు.

## పాఠశాల బస్సును ఢీకొన్న కారు

- ఐదుగురు భక్తుల మృతి
- మరో ఐదుగురు విద్యార్థినులకు గాయాలు

అన్నానగర్: పనవడలి చత్రం సమీపంలో బుధవారం సాయంత్రం పాఠశాల బస్సును కారు ఢీకొనడంతో ఐదుగురు భక్తులు మృతి చెందారు. తిరుచెందూర్ ఆలయం నుంచి తిరిగి వస్తుండగా ఈ విషాద ఘటన చోటు చేసుకుంది. వివరాలు.. తెన్‌కాశి జిల్లా శంకరన్ కోవిల్ తాలూకా, కరివలం వందనల్లూరుకి చెందిన గురుస్వామి (45) రైతు. ఆయన కుటుంబ సమేతంగా బుధవారం ఉదయం కారులో తిరుచెందూర్ ఆలయానికి వెళ్లారు. అనంతరం అక్కడ స్వామి దర్శనం చేసుకుని సాయంత్రం కారులో స్వగ్రామానికి తిరుగు ప్రయాణమయ్యారు. కారును కరివలంవందనల్లూరు సత్యాపురానికి చెందిన అయ్యనార్ (42) నడుపుతున్నాడు. శంకరంకోటలోని ప్రైవేట్ పాఠశాలలో ప్రత్యేక తరగతిలో పాల్గొన్న ప్లస్-2 విద్యార్థులను వారి ఇళ్లకు తీసుకెళ్లేందుకు సాయంత్రం పాఠశాల బస్సు బయలుదేరింది. నెల్లై-శంకరంకోవిల్ ప్రధాన రహదారిపై పనవడలిచత్రం సమీపంలో వస్తున్నప్పుడు బస్సును కారు ప్రమాదవశాత్తూ ఢీకొంది. ఈ ఘోర ప్రమాదంలో కారు ముందు భాగం నుజ్జునుజ్జు అయ్యింది. పనవడలి చత్రం పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటనాస్థలికి చేరుకుని కారు శిథిలాల మధ్య చిక్కుకున్న వారిని రక్షించారు. ఈ ప్రమాదంలో గురుస్వామితో పాటు అతని భార్య వేలుత్తాయ్ (40), కుమారుడు మనోజ్ కుమార్ (21), గురుస్వామి తల్లి సీతాలక్ష్మి (60), డ్రైవర్ అయ్యనార్ అక్కడికక్కడే మృతి చెందినట్లు వెల్లడించారు. ప్రమాదానికి గురైన స్కూల్ బస్సులో విశాలిని, అభినయ సహా ఐదుగురు విద్యార్థినులకు స్వల్ప గాయాలయ్యాయి. వీరికి శంకరన్‌కోటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స అందించారు. మృతి చెందిన ఐదుగురి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. స్థానిక పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## రాష్ట్రపతి చెన్నై పర్యటన రద్దు

- ఆసుపత్రి ప్రారంభోత్సవం వాయిదా
- త్వరలో కొత్త తేదీ ప్రకటన

సాక్షి, చెన్నై: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చెన్నై పర్యటన రద్దయ్యింది. దీంతో మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ప్రారంభోత్సవం వాయిదా పడింది. వివరాలు.. చెన్నై గిండిలో రూ. 230 కోట్లతో వెయ్యి పడకలతో భారీ మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని రాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన విషయం తెలిసిందే. ఆరు అంతస్తులతో మూడు భవనాలను ఇక్కడ నిర్మించారు. డీఎంకే దివంగత నేత కరుణానిధి శత జయంతి ఉత్సవాలలో భాగంగా జూన్ 5వ తేదీన ఈ ఆసుపత్రిని ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేశారు. సీఎం స్టాలిన్ గత నెల స్వయంగా ఢిల్లీ వెళ్లి మరీ రాష్ట్రపతి ద్రౌపది ముర్మును ఈ వేడుకకు ఆహ్వానించారు. ప్రారంభోత్సవానికి తగ్గ ఏర్పాట్లు చేపడుతున్న సమయంలో రాష్ట్రపతి చెన్నై పర్యటన రద్దయినట్లు గురువారం వెలుగులోకి వచ్చింది. కొత్త పార్లమెంట్ భవనం ప్రారంభోత్సవాన్ని డీఎంకే బహిష్కరించిన నేపథ్యంలో రాష్ట్రపతి చెన్నై పర్యటన రద్దు కావడం చర్చకు దారితీసింది. అయితే, రాష్ట్రపతి జూన్‌మొదటి వారంలో విదేశీ పర్యటనకు వెళ్తున్నందున చెన్నైకు రాలేని పరిస్థితి నెలకొందని సమాచారం. ఈ విషయంపై ఆరోగ్యశాఖ మంత్రి ఎం. సుబ్రమణియన్‌ను ప్రశ్నించగా ప్రస్తుతం ప్రారంభోత్సవ తేదీని వాయిదా వేసుకోవాలని తమకు సమాచారం వచ్చిందన్నారు. రాష్ట్రపతి విదేశీ పర్యటన అనంతరం చెన్నైకు వచ్చి ఈ ఆసుపత్రిని ప్రారంభిస్తారని వెల్లడించారు. ఈ మేరకు కొత్త తేదీని త్వరలో ప్రకటిస్తామని పేర్కొన్నారు.


ద్రౌపది ముర్ము

## ఇన్‌చార్జ్ సీజేగా వైద్యనాథన్ బాధ్యతల స్వీకరణ


జస్టిస్ వైద్యనాథన్

సాక్షి, చెన్నై : మద్రాసు హైకోర్టు ఇన్‌చార్జ్ సీజేగా సీనియర్ న్యాయమూర్తి ఎస్. వైద్యనాథన్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు పలువురు న్యాయమూర్తులు, న్యాయవాద సంఘాల నేతలు శుభాకాంక్షలు, అభినందనలు తెలియజేశారు. వివరాలు.. గత ఏడాది సెప్టెంబర్‌లో హైకోర్టు సీజే మునీశ్వర్‌నాథ్ బండారీ పదవీ విరమణ పొందిన విషయం తెలిసిందే. ఆ తర్వాత పూర్తి స్థాయి ప్రధాన న్యాయమూర్తి నియామకం జరగలేదు. తొలుత దురైస్వామి , ఆ తర్వాత రాజ ఇన్‌చార్జ్ న్యాయమూర్తులుగా వ్యవహరించారు. ఇందులో దురైస్వామి గత ఏడాది , రాజ బుధవారం పదవీ విరమణ పొందారు. దీంతో కొత్త ప్రధాన న్యాయమూర్తి నియమించే వరకు ఇన్‌చార్జ్ ద్వారా హైకోర్టు వ్యవహారాలను పర్యవేక్షించాలని సుప్రీం కోర్టు కొలీజియం నిర్ణయించింది. దీంతో హైకోర్టులో సీనియర్‌గా ఉన్న ఎస్. వైద్యనాథన్‌కు ఇన్‌చార్జ్ సీజే బాధ్యతలను అప్పగిస్తూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఇన్‌చార్జ్ న్యాయమూర్తిగా గురువారం వైద్యనాథన్ బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు పలువురు న్యాయమూర్తులు, ప్రభుత్వ న్యాయవాది షణ్ముగసుందరం, న్యాయవాద సంఘం, బార్ కౌన్సిల్ వర్గాలు శుభాకాంక్షలు, అభినందనలు తెలియజేశాయి.

## ఇంజినీరింగ్‌లో తమిళ మీడియం రద్దు?

కొన్ని కళాశాలలో ఇంజినీరింగ్ తమిళ మీడియం కౌన్సెలింగ్‌ను రద్దు చేస్తున్నామని అన్నావర్సిటీ తీసుకున్న నిర్ణయం గురువారం తీవ్ర వివాదానికి దారి తీసింది. ఉన్నత విద్యాశాఖ మంత్రి పొన్ముడి ఈ వ్యవహారంపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. దీంతో కొన్ని గంటల్లో ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నారు. ఈ విషయంపై వర్సిటీ వీసీ వేల్ రాజ్ మీడియాకు వివరణ ఇచ్చారు.

- మంత్రి ఆగ్రహం వ్యక్తం చేయడంతో వెనక్కి తగ్గిన అధికారులు
- వివరణ ఇచ్చిన అన్నావర్సిటీ వైస్ చాన్స్‌లర్

సాక్షి, చెన్నై: రాష్ట్రంలో అన్నావర్సిటీ పరిధిలో 400 వందలకు పైగా ఇంజినీరింగ్ కళాశాలలు ఉన్న విషయం తెలిసిందే. అలాగే అన్నా వర్సిటీకి అనుబంధంగా తిరుచ్చి, కోయంబత్తూరుతో పాటు మరికొన్ని చోట్ల కళాశాలల క్యాంపస్‌లు ఉన్నాయి. ఈ అన్ని కళాశాలలో ప్రభుత్వ కోటా ఇంజినీరింగ్ సీట్లన్నీ సాంకేతిక విద్యా డైరెక్టరేట్ నేతృత్వంలో కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేస్తున్నారు. ఈ ఏడాది కౌన్సెలింగ్‌కు ముందుగా దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రస్తుతం శరవేగంగా సాగుతోంది. జూలైలో కౌన్సెలింగ్‌కు సిద్ధమవుతున్నారు. ఈ పరిస్థితులలో ఆయా కళాశాలలో సీట్లు, గత ఏడాది భర్తీకి నోచుకోని సీట్లు, తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని విద్యార్థుల సంఖ్యకు తగ్గట్టు కళాశాలలకు అనుమతుల వ్యవహారంపై అన్నా వర్సిటీ దృష్టి పెట్టింది.

**స్పందన కరువు**

ఇంజినీరింగ్‌లో మెకానికల్, సివిల్ కోర్సులను రాష్ట్రంలో అంగ్లంతో పాటు తమిళ మీడియంలోనూ పరిచయం చేసిన విషయం తెలిసిందే. అయితే అనేక కళాశాలలో తమిళ మీడియానికి స్పందన కరువైంది. ఒక్కో కళాశాలలో 60 సీట్లు ఉండగా, పది మంది కూడా ఆసక్తిచూపక పోవడాన్ని అన్నావర్సిటీ గుర్తించింది. గత ఏడాది కౌన్సెలింగ్ ఆధారంగా సేకరించిన వివరాలతో 10 మంది లోపు విద్యార్థులు ఉన్న కళాశాలలో తమిళ మీడియం కోర్సుల కౌన్సెలింగ్ ఈసారి నిలుపుదల చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఇందులో దిండుగల్, రామనాథపురం, అరియలూరు, పట్టుకోట్టై, బర్గూర్, తిరుకువళై, నాగర్ కోవిల్, తూత్తుకుడి, ప్రభుత్వ కళాశాలలో మెకానికల్, సివిల్ తమిళ మీడియం కోర్సుల ఇంజినీరింగ్ కౌన్సెలింగ్‌ను రద్దు చేసినట్టు ప్రకటన వెలువడింది. అలాగే, ఆరణి, విల్లుపురం కళాశాలలో మెకానికల్, దిండివనంలో సివిల్ కోర్సు కౌన్సెలింగ్‌ను రద్దు చేయడం వివాదానికి దారి తీసింది. ఈ సమాచారం గురువారం వెలుగులోకి రావడంతో ఉన్నత విద్యాశాఖ మంత్రి పొన్ముడి ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. దీంతో ఆ కళాశాలలో తమిళ మీడియం కౌన్సిలింగ్ రద్దు నిర్ణయాన్ని కొన్ని గంటల్లో వెనక్కు తీసుకున్నారు.


అన్నావర్సిటీ

**వీసీ వివరణ..**

ఒక్క తమిళ మీడియంను మాత్రం తాము రద్దు చేయలేదని, ఆంగ్లం మీడియాన్ని సైతం పైన పేర్కొన్న కళాశాలల్లో రద్దు చేయాలని నిర్ణయించామని అన్నా వర్సిటీ వీసీ వేల్ రాజ్ మీడియాకు వివరణ ఇచ్చారు. అన్నావర్సిటీ నిర్ణయంపై ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు వెళ్లాయన్నారు. గత ఏడాది అనుబంధ కళాశాలలో సీట్ల భర్తీ తక్కువగా ఉండటంతో ఈ ఏడాది ఆ కళాశాలలో ఆంగ్లం, తమిళ మీడియం కోర్సుల కౌన్సెలింగ్‌ను తాత్కాలికంగా నిలుపుదల చేయాలని నిర్ణయించామన్నారు. ఉన్నత విద్యాశాఖ మంత్రి ప్రస్తుతం తమతో మాట్లాడారని, ఈ దృష్ట్యా, ఈ ఏడాది కూడా ఆయా కళాశాలలో యథాప్రకారం తమిళం, ఆంగ్లం మీడియం కొనసాగుతాయని వివరించారు. ఒక్కో కళాశాలలో 60 సీట్లు ఉండగా, పది సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయని, ఈ దృష్ట్యా, తాత్కాలికంగా రద్దు చేసినటు పేర్కొన్నారు. అయితే ఈ ఏడాది ఆయా కళాశాలలో తమిళం, ఆంగ్లం మీడియం కోర్సుల్లో విద్యార్థులు చేరిక ఆధారంగా తదుపరి విద్యా సంవత్సరం స్పష్టమైన నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

## క్లుప్తంగా

### మొదలియార్ల సంఘం కార్యాలయం ప్రారంభం


సమావేశంలో మాట్లాడుతున్న కరుణ

**తిరుత్తణి:** తిరుత్తణిలో మొదలియార్ల సంఘం కార్యాలయం గురువారం ప్రారంభించారు. తిరుత్తణిలోని ఎగువ తిరుత్తణిలో తమిళనాడు మొదలియార్ల సంఘం కార్యాలయం ప్రారంభోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆ సంఘం అధ్యక్షుడు కరుణ పాల్గొని నూతన కార్యాలయం దీపం ప్రజ్వలన చేసి కార్యాలయం సేవలను ప్రారంభించారు. తిరుత్తణి, పళ్లిపట్టు, ఆర్కేపేట మండలాల నుంచి మొదలియార్లు పాల్గొన్నారు. తిరుత్తణి నియోజకవర్గంలో అధిక సంఖ్యలో మొదలియార్లు నివాశముంటున్నారు. చేనేత, మరమగ్గ పరిశ్రమలపై ఆధారపడి జీవిస్తున్న నేతన్నలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బ్యాంకు రుణాలు మంజూరు చేసి నేతన్నలు ఉత్పత్తి చేస్తున్న లుంగీలు ఎగుమతులకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ఆ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

### ఇంటి గోడ కూలి చిన్నారి మృతి

**అన్నానగర్:** తాలి సమీపంలో బుధవారం సాయంత్రం ఇంటి గోడ కూలి పడి 3 ఏళ్ల చిన్నారి మృతి చెందాడు. కృష్ణగిరి జిల్లా తేన్కనికోట సమీపంలోని బసవనతొట్టి గ్రామానికి చెందిన సురేష్ కార్మికుడు. ఇతని భార్య శశికళ. వీరికి రక్షిత్(3) అనే కుమారుడు ఉన్నాడు. గత 2 రోజులుగా తాలి పరిసర ప్రాంతాల్లో భారీ వర్షం కురుస్తోంది. దీని కారణంగా సురేష్ పురాతనమైన ఇంటి గోడలు తడిసిపోయాయి. ఈ క్రమంలో రక్షిత్ బుధవారం సాయంత్రం ఇంటి బయట ఆడుకుంటున్నాడు. ఆ సమయంలో ఒక్కసారిగా ఇంటి ముందు గోడ కూలి చిన్నారి రక్షిత్‌పై పడింది. ఈ ప్రమాదంలో అతడు తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతని తల్లిదండ్రులు రక్షించి తాలిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం హొసూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అయితే చిన్నారిని పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. తాలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# కార్పొరేషన్‌లో అభివృద్ధి శూన్యం


సమావేశంలో ప్రసంగిస్తున్న కమిషనర్ రత్నస్వామి

**వేలూరు:** వేలూరు కార్పొరేషన్‌లో ఎటువంటి అభివృద్ధి పనులు జరగడం లేదని తూతూమంత్రంగా సమావేశాలు, శంకు స్థాపనలు చేస్తున్నారని అధికార పార్టీకి చెందిన కార్పొరేటర్‌లు ధ్వజమెత్తారు. వేలూరు కార్పొరేషన్ సర్వసభ్య సమావేశం మేయర్ సుజాత అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా డీఎంకేకు చెందిన పలువురు కార్పొరేటర్‌లు తమ వార్డులో తాగునీటి ఎద్దడి ఉందని, భూగర్భ డ్రైనేజీ కోసం తవ్విన రోడ్లు రెండేళ్లు అవుతున్నా ఇంత వరకు పూర్తిచేసి రోడ్డు వేయలేదని, డ్రైనేజీ కాలువ మరమ్మతు పనులు చేపట్టలేదని వీటిపై పలుమార్లు మేయర్, కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినా ఎటువంటి చర్యలు తీసుకోవడంలేదని ఆరోపించారు. అదే విధంగా మూడు నెలలుగా పంప్ ఆపరేటర్‌లకు వేతనాలు ఇవ్వక పోవడంతో వార్డుల్లో నీరు విడుదలకు నిరాకరిస్తున్నారని తెలిపారు. తాము కార్పొరేటర్‌లుగా ఎన్నికైన నాటి నుంచి ఇంతవరకు ఎటువంటి అభివృద్ధి పనులు చేయలేదని దీంతో ప్రజల ముందుకు తాము వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. దీంతో కమిషనర్ రత్నస్వామి కార్పొరేటర్‌లను శాంతింప జేసి ప్రస్తుతం కార్పొరేటర్‌లు ఇచ్చిన ఫిర్యాదుపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో సభ్యులు శాంతించారు. అధికార పార్టీ సభ్యులకే ఈ పరిస్థితి ఉంటే ప్రతిపక్ష పార్టీలకు చెందిన వార్డుల్లో అభివృద్ధి ఏ విధంగా ఉంటుందో అని అన్నాడీఎంకే పార్టీకి చెందిన సభ్యులు తెలిపారు. డిప్యూటీ మేయర్ సునీల్‌కుమార్, కార్పొరేషన్ అధికారులు, కార్పొరేటర్‌లు పాల్గొన్నారు.

## జిల్లా ఇన్‌చార్జ్ మంత్రికి శుభాకాంక్షలు


మంత్రి గాంధీకి శుభాకాంక్షలు తెలుపుతున్న రవీంద్ర

**పళ్లిపట్టు:** తిరువళ్లూరు జిల్లా మంత్రిగా నియమితులైన ఆర్.గాంధీకి పళ్లిపట్టు మండల కార్యదర్శి జి.రవీంద్ర గురువారం శుభాకాంక్షలు తెలిపారు. తిరువళ్లూరు జిల్లాకు చెందిన నాజర్ మంత్రి పదవి నుంచి తొలగించడంతో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రిగా చేనేత పరిశ్రమ, టెక్స్‌టైల్ శాఖ మంత్రి రాణిపేట గాంధీ నియమితులరు. ఈ క్రమంలో రాణిపేటలోని మంత్రి నివాసం రువళ్లూరు వెస్ట్ జిల్లా మాజీ కార్యదర్శి భూపతి సమక్షంలో పళ్లిపట్టు మండల కార్యదర్శి జి.రవీంద్ర కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అతని తోపాటు తిరుత్తణి పట్టణ డీఎంకే నేతలు పాల్గొని మంత్రికి శుభాకాంక్షలు తెలిపారు. తిరువళ్లూరు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రిగా నియమితులైన ఆర్.గాంధీ ఆర్కేపేట మండలంలోని శెట్టివారిపల్లెలో తెలుగు కుటుంబానికి చెందిన వారు కావడం గమనార్హం.

## క్వారీలో ఘర్షణ

–లారీ డ్రైవర్ దారుణ హత్య


ప్రకాష్ (ఫైల్)

**తిరువళ్లూరు:** మట్టి క్వారీలో ఇద్దరు డ్రైవర్ల మధ్య జరిగిన ఘర్షణలో ఒకరు హత్యకు గురైన సంఘటన స్థానికంగా కలకలం రేపింది. తిరువళ్లూరు జిల్లా పెద్దపాళ్యం సమీపంలోని అక్రమంబాక్కం గ్రామంలో మట్టి క్వారీని గత నెల రోజుల నుంచి నిర్వహిస్తున్నారు. చెరువు కరకట్ట బలోపేతం కోసం రోజుకు మట్టిని వెలికి తీసి కొంత భాగాన్ని కరకట్టకు మరో కొంత మట్టిని రోడ్డు విస్తరణ పనుల కోసం ఉపయోగించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం యథావిధిగా అత్తుపాక్కం గ్రామానికి చెందిన ప్రకాష్(31), సూర్య(29) ఇద్దరు లారీ డ్రైవర్‌లు క్వారీకి వచ్చారు. లోడింగ్ చేసుకుని బయటకు వెళ్లే సమయంలో ఇద్దరి మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఆగ్రహం చెందిన సూర్య కత్తితో ప్రకాష్‌ను విచక్షణారహితంగా నరికాడు. ఈ ఘటనలో ప్రకాష్ మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఊత్తుకోట డీఎస్పీ గణేష్‌కుమార్ నేతృత్వంలోని పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపు చేశారు. పరారీలో వున్న నిందితుడు సూర్యను అరెస్టు చేయడానికి ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. ప్రాథమిక విచారణలో ఇద్దరి మధ్య నగదు, బంగారు నగలు ఇచ్చిపుచ్చుకునే వ్యవహారంలో మనస్పర్ధలు వున్నట్టు నిర్ధారించారు. ఇదే విషయంపై తరచూ ఇద్దరు ఘర్షణ పడేవారని పోలీసులు గుర్తించారు. లారీ డ్రైవర్ హత్యతో మట్టి తవ్వకాలను తాత్కాలికంగా నిలిపి వేశారు.

## కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల నిరాహారదీక్ష


నిరాహార దీక్ష చేస్తున్న కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు

**కొరుక్కుపేట:** వేతనాలు పెంచాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు మనాలి ఎరువుల ఫ్యాక్టరీ ఎదుట ఒకరోజు నిరాహార దీక్ష చేశారు. మనాలి హైవే వద్ద కేంద్ర ప్రభుత్వానికి చెందిన చెన్నై ఎరువుల కర్మాగారం ఉంది. ఈ ప్లాంట్‌లో 500 మంది శాశ్వత కార్మికులు పనిచేస్తున్నారు. ఇక్కడ యూరియా, ఎన్‌పీకే ఎరువులు ఆంధ్ర, కేరళ, కర్ణాటకకు గూడ్సుల ద్వారా పంపిస్తారు. ఈ పరిస్థితిలో ఇక్కడ పనిచేస్తున్న ఉద్యోగులకు 10 ఏళ్లగా వేతన పెంపుదల లేదు. జీతాలు పెంచాలని కార్మికులు ఎన్నో ఏళ్లుగా కోరుతున్నా యాజమాన్యం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ఈ సందర్భంలో గురువారం ఉదయం వంద మందికి పైగా కార్మికులు ఫ్యాక్టరీ ప్రవేశద్వారం ముందు గుమిగూడి ఒక రోజు నిరాహారదీక్షకు దిగారు. సమాచారం అందుకున్న మనలి ఇన్‌స్పెక్టర్ సుందర్, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. కార్మికులతో చర్చలు జరిపారు. ఈ ఘటనతో మనాలిలో ఉత్కంఠ నెలకొంది.

## అధికారిక భాషపై సెమినార్



ప్రసంగిస్తున్న కమిషనర్ రత్నస్వామి

**కొరుక్కుపేట:** చెన్నైలోని సదరన్ రైల్వే హెడ్ క్వార్టర్స్ కార్యాలయంలో హెచ్ఆర్ఎంఎస్ ఆధ్వర్యంలో ప్రిన్సిపల్ చీఫ్ ఇంజినీర్, ముఖ్య రాజభాషా అధికారి గౌతమ్ అధ్యక్షతన అధికారిక భాషపై టెక్నికల్ సెమినార్ నిర్వహించారు. కార్యక్రమానికి ప్రిన్సిపల్ చీఫ్ పర్సనల్ ఆఫీసర్ కె హరికృష్ణన్ హాజరయ్యారు. డిప్యూటీ చీఫ్ పర్సనల్ ఆఫీసర్ సెంథిల్ కుమార్, సిబ్బంది, 80మంది ఉద్యోగులు హాజరయ్యారు. సెమినార్‌లో ఆఫీస్ ఆర్డర్, ఆఫీస్ మెమొరాండం కింద వచ్చే పత్రాలను ద్విభాషా రూపంలో హెచ్ఆర్ఎంఎస్‌లో అప్‌లోడ్ చేసే విధానాన్ని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రదర్శించారు. ప్రధాన కార్యాలయం రాజభాష అధికారి డాక్టర్ ఏ శ్రీనివాసన్ పత్రాలను ద్విభాషలో ఎలా అప్‌లోడ్ చేయవచ్చో, అధికార భాష వినియోగానికి అందుబాటులో ఉన్న వివిధ ప్రోత్సాహక పథకాల గురించి వివరించారు.ఈ పత్రాలలో ఉపయోగించిన పద బంధాల ఏకీకృత జాబితాను సదరన్ రైల్వేకు చెందిన ఇంట్రానెట్ హోమ్ పేజీలో అప్‌లోడ్ చేశారని, ఇది ప్రధాన కార్యాలయ ఉద్యోగులకు మాత్రమే కాకుండా డివిజన్లు, వర్క్‌షాప్‌లలో పనిచేసే వారందరికీ ప్రయోజనకరంగా ఉంటుందని ఆయన తెలిపారు. వందన సమర్పణను సీనియర్ అనువాదకురాలు ఎస్ చిత్ర చేశారు

## చెత్త వేయొద్దంటూ వినూత్న నిరసన


తలకిందులుగా నిలబడి నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

**వేలూరు:** మా ప్రాంతంలో చెత్త వేయొద్దంటూ బాధితులు వినూత్న నిరసన తెలిపారు. తిరువణ్ణామలై జిల్లా పునల్‌కాడు గ్రామం సమీపంలోని కొండ కింద తిరువణ్ణామలై మున్సిపాలిటీలో సేకరించే చెత్తను వేసేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంది. ఇందుకు వ్యతిరేకంగా పునల్‌కాడు గ్రామస్తులు జిల్లా అధికారులకు పలుమార్లు వినతి పత్రం అందజేశారు. అయినా ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో ఈనెల 13వ తేదీ నుంచి జిల్లా కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్నారు. అందులో భాగంగా గురువారం ఉదయం స్థానికులు తలకిందులుగా నిలబడి అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మున్సిపాలిటీలో సేకరించే చెత్త పూర్తిగా తమ ప్రాంతంలో వేయడం వల్ల రానున్న రోజుల్లో తమ ప్రాంత వాసులు రోగాల బారిన పడే అవకాశం ఉందని వీటిపై అధికారులు విచారణ జరిపి నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు.

## తనిఖీలకు కొత్త కమిటీ

**కొరుక్కుపేట:** ఉన్నత విద్య సంస్థల్లో అధ్యాపకుల నియామకాలు, పీహెచ్‌డీ పట్టాల మంజూరులో అక్రమాలను అరికట్టేందుకు యూజీసీ కొత్త కమిటీని ఏర్పాటు చేసింది. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) 568వ సమావేశం బుధవారం జరిగింది. సమావేశం ముగింపు సందర్భంగా ఉన్నత విద్యాసంస్థల్లో ఉపాధ్యాయుల నియామకాలు, పీహెచ్‌డీ పట్టాల ప్రదానంలో అక్రమాలను అరికట్టేందుకు ఓ కమిటీని ఏర్పాటు చేశారు. విశ్వవిద్యాలయ విద్య, అధ్యాపకులను ఏకీకృతం చేయడం, ఎప్పటికప్పుడు నాణ్యత, పరిశోధన డిగ్రీల నాణ్యత హామీ కోసం నిబంధనలను నిర్దేశించింది. ఈ కమిటీ కొన్ని ఇన్‌స్టిట్యూట్‌లను ఎంపిక చేసి ఫ్యాకల్టీ రిక్రూట్‌మెంట్‌ను నిర్వహిస్తుంది. అలాగే పీహెచ్‌డి డిగ్రీలను ప్రదానం చేయడానికి సంబంధించిన సమాచారాన్ని సేకరిస్తుంది. అదేవిధంగా డాక్యుమెంట్లను వెరిఫై చేసి తగిన సిఫార్సులు చేస్తుంది. ఉల్లంఘనల విషయంలో తగిన చర్యలను కూడా సిఫారస్సును కమిటీ చేస్తుందని వెల్లడించారు.

## వి. క్రియేషన్స్‌లో చిత్రంలో కిచ్చా సుదీప్

**తమిళసినిమా:** భారీ చిత్రాల నిర్మాత కలైపులి ఎస్ థాను. ఈయన ఇటీవల నటుడు ధనుష్ కథానాయకుడిగా వరుసగా అసురన్, కర్ణన్, నానే వరువేన్ చిత్రాలు నిర్మించారు. అందులో అసురన్, కర్ణన్ చిత్రాలు సూపర్ హిట్ అయ్యాయి. నానే వరువేన్ చిత్రం మాత్రం ఆశించిన విజయాన్ని అందుకోలేకపోయింది. కాగా తాజాగా కలైపులి ఎస్. థాను తాజాగా తన వి.క్రియేషన్స్ పతాకంపై ఒక పాన్ ఇండియా చిత్రాన్ని నిర్మించడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఇందులో కన్నడ స్టార్ హీరో కిచ్చా సుదీప్ కథానాయకుడిగా నటించనున్నారు. ఈయన నాన్ ఈ చిత్రంలో ప్రతి నాయకుడిగా నటించి తమిళ ప్రేక్షకులకు దగ్గరైన విషయం తెలిసిందే. అదే విధంగా కిచ్చా సుదీప్ కథానాయకుడిగా నటించిన కన్నడం చిత్రం విక్రాంత్ రోణా చిత్రం తమిళంలోనూ మంచి వసూళ్లు రాబట్టింది. దీంతో ఈయన ఇప్పుడు నేరుగా తమిళ చిత్రంలో నటించడానికి సిద్ధమవుతున్నారు. ఇది ఈయన నటిస్తున్న 46వ చిత్రం అవుతుంది. ఈ చిత్రానికి సంబంధించిన అధికారిక ప్రకటనను చిత్ర వర్గాలు బుధవారం వెల్లడించారు. చిత్ర షూటింగ్ త్వరలోనే ప్రారంభం కానున్నట్లు అందులో పేర్కొన్నారు. అంతకు ముందుగా చిత్ర టీజర్ విడుదల చేయనున్నట్లు నిర్మాతలు పేర్కొన్నారు. అయితే ఈ చిత్రానికి దర్శకుడు, కథానాయకి, ఇతర నటీనటులు సాంకేతిక వర్గం వివరాలు వెలువడాల్సి ఉంది. అయితే వెల్ కమ్ టూ బాద్ షా అంటూ నిర్మాత బుధవారం నటుడు కిచ్చా సుదీప్‌ను స్వాగతిస్తూ ఓ వీడియోను విడుదల చేశారు. కాగా నటుడు సూర్య కథానాయకుడిగా వెట్రిమారన్ దర్శకత్వంలో వాడివాసల్ అనే భారీ చిత్రాన్ని నిర్మించనున్నట్లు నిర్మాత థాను ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే. మరి ఆ చిత్రం ఎప్పుడు మొదలవుతుందో తెలియాల్సి ఉంది.


కిచ్చా సుదీప్‌కు స్వాగతం పలుకుతున్న థాను

## కోలీవుడ్ టాక్స్

### శశికుమార్ హీరోగా నూతన చిత్రం ప్రారంభం


నూతన చిత్ర ప్రారంభోత్సవంలో యూనిట్ సభ్యులు

**తమిళసినిమా:** సుబ్రమణియపురం చిత్రం ద్వారా దర్శకుడిగా, కథానాయకుడిగా పరిచయమైన నటుడు శశికుమార్. ఆ చిత్రం సంచలన విజయం సాధించడంతో తరువాత కొన్ని చిత్రాలకు దర్శకత్వం వహించారు. కానీ ప్రస్తుతం నటన పైనే పూర్తిగా దృష్టి సారిస్తూ వస్తున్నారు. అలా నాడోడిగళ్, పోరాలి, సుందర పాండియన్, కుట్టిపులి, పేట వంటి పలు విజయవంతమైన చిత్రాలలో నటించారు. కాగా ఆయన ఇటీవల కథానాయకుడిగా నటించిన అయోత్తి చిత్రం మంచి విజయాన్ని సాధించడంతో పాటు ప్రశంసలను అందుకుంది. కాగా శశికుమార్ తదుపరి చిత్రం ఏమిటన్న ప్రశ్నకు బదులు ఇచ్చే విధంగా ఆయన నూతన చిత్రం గురువారం పూజా కార్యక్రమం ప్రారంభమైంది. ఇటీవల రుద్రన్ వంటి విజయవంతమైన చిత్రం ద్వారా దర్శకుడిగా పరిచయం అయిన నిర్మాత ఎస్.కదిరేశన్ తన ఫైవ్ స్టార్ పిక్చర్స్ పతాకంపై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. అదే విధంగా ఇంతకుముందు కావల్ తురై ఉంగళ్ నన్బన్ చిత్రాన్ని తెరకెక్కించిగా ఇందులో టాలీవుడ్ నటుడు నవీన్ చంద్ర ముఖ్యపాత్రలు పోషిస్తున్నట్లు వర్గాలు తెలిపారు. దీనికి సంబంధించిన పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడించినట్లు వారు తెలిపారు.

## జపాన్ మేడ్ ఇన్ ఇండియా




**తమిళసినిమా:** ఇటీవల పొన్నియిన్ సెల్వన్ చిత్రంలో వాందియదేవన్‌గా ప్రేక్షకులను అలరించిన నటుడు కార్తీ నటిస్తున్న తాజా చిత్రం జపాన్. నటి అను ఇమ్మానుయేల్ కథానాయకిగా నటిస్తున్న ఇందులో సునీల్ ముఖ్యపాత్రను పోషించడం విశేషం. ఇంతకుముందు పలు విజయవంతమైన చిత్రాలు నిర్మించిన డ్రీమ్ వారియర్స్ పిక్చర్స్ అధినేతలు ఎస్ఆర్ ప్రకాష్ బాబు, ఎస్ ఆర్. ప్రభు నిర్మిస్తున్న భారీ చిత్రం ఇది. ఈ నిర్మాతలు ఇంతకుముందు జోకర్ వంటి జాతీయ అవార్డును గెలుచుకున్న చిత్రాన్ని నిర్మించిన విషయం తెలిసిందే. ఆ చిత్ర దర్శకుడు రాజు మురుగన్‌నే ఈ జపాన్ చిత్రానికి దర్శకుడు కావడం గమనార్హం. కాగా పరుత్తి వీరన్ చిత్రంతో కథానాయకుడిగా పరిచయమైన కార్తి కథానాయకుడిగా నటిస్తున్న 25వ చిత్రం జపాన్. జీవీ ప్రకాష్ కుమార్ సంగీతాన్ని, రవి వర్మన్ ఛాయాగ్రహణం అందిస్తున్న ఈ చిత్రం షూటింగ్ చివరి దశకు చేరుకుంది. కాగా గురువారం నటుడు కార్తీ పుట్టినరోజు. ఈ సందర్భంగా జపాన్ చిత్ర ప్రత్యేక టీజర్ ను విడుదల చేశారు. అందులో ఒక రౌడీ ఎవర్రా నువ్వు అని అడగ్గా జపాన్ మేడ్ ఇన్ ఇండియా అంటూ కార్తీ బదులిచ్చారు సన్నివేశం ఆకట్టుకుంది. ఈ టీజర్‌కు కార్తి అభిమానులిప్పుడు ఫిదా అవుతున్నారు. ఇక జపాన్ చిత్రాన్ని దీపావళికి విడుదల చేస్తున్నట్లు నిర్మాతలు అధికారికంగా ప్రకటించారు.

## దిశా పటానికి మరో చాన్స్?


దిశా పటాని

**తమిళసినిమా:** బాలీవుడ్ బ్యూటీ, దిశా పటానికి కోలీవుడ్‌లో మరో చాన్స్ తలుపు తట్టిందా? అన్న ప్రశ్నకు కోలీవుడ్ వర్గాల నుంచి అవుననే సమాధానమే వస్తోంది. బాలీవుడ్‌లో సత్తాచాటిన ఈమె ఇప్పటికే తమిళంలో నటుడు సూర్య సరసన కంగువా చిత్రంలో నటిస్తున్న విషయం తెలిసిందే. శివ దర్శకత్వంలో సమకాలీన కథలో చారిత్రక అంశాలను జోడించి రూపొందుతున్న ఈ చిత్రం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. కాగా ఈ చిత్రం విడుదలకు ముందే నటి దిశా పటానికి మరో తమిళ చిత్రంలో నటించే అవకాశం వచ్చినట్లు సమాచారం. కమలహాసన్ తన రాజ్ కమల్ ఫిలిం ఇంటర్నేషనల్ పతాకంపై వరుసగా పలు చిత్రాలను నిర్మిస్తున్న విషయం తెలిసిందే. అందులో సంచలన నటుడు శింబు కథానాయకుడిగా నటించే చిత్రం చోటుచేసుకుంది. దీన్ని కన్నుమ్ కన్నుమ్ కొళ్లైయడిత్తాళ్ చిత్రం ఫేమ్ దేసింగు పెరియసామి తెరకెక్కించనున్నారు. వచ్చేనెల ప్రథమార్థంలో ఈ చిత్రం సెట్ పైకి వెళ్లనున్నట్లు సమాచారం. ఇది చారిత్రక కథాంశంతో తెరకెక్కనున్నట్లు సమాచారం. కాగా ఇందులో నటుడు శింబు ద్విపాత్రాభినయం చేయనున్నట్లు తెలుస్తోంది. అయితే ఇందులో శింబుతో జతకట్టే నటి ఎవరన్నదే ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ఇది భారీ బడ్జెట్లో రూపొందనున్న పాన్ ఇండియా కథాచిత్రం కావడంతో బాలీవుడ్ నటి దీపిక పదుకొనేను నాయకిగా నటింపజేసే ప్రయత్నాలు జరిగినట్లు తెలిసింది. అయితే ఆమె పారితోషికం ఎక్కువగా డిమాండ్ చేయడంతో చిత్ర వర్గాలు వేరే నటిని ఎంపిక చేసే పనిలో పడ్డట్టు ప్రచారం జరిగింది. ఆ తర్వాత కీర్తి సురేష్ నటించబోతున్నట్లు ప్రచారం సాగింది. బాలీవుడ్ బ్యూటీ దిశా పటానిని ఎంపిక చేసే ప్రయత్నాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. అయితే దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

## ఆ రోజు రావాలి



**తమిళసినిమా:** నటి శ్రుతిహాసన్ గురించి ఇప్పుడు ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం ఉండదు. తనకు అనిపించింది బయటకు చెప్పే బోల్డ్ అండ్ బ్యూటీ ఈమె. స్వయంకృషితో ఎదిగిన నటి శ్రుతిహాసన్. నిజ జీవితంలోనూ ఈమె ఒక సంచలనమే. ప్రముఖ నటుడు కమల్‌హాసన్ వారసురాలు అయినా, ఆయన పేరు ఏ విధంగానూ వాడుకోవడానికి ఇష్టపడని నటి. అయితే తన తల్లిదండ్రులు తమకు పూర్తి స్వేచ్ఛనిచ్చారని, తను మాత్రం వారి నుంచి ఎలాంటి ఆర్థికసాయాన్ని ఇప్పటి వరకు కోరలేదని బహిరంగానే చెప్పింది. తమిళం, తెలుగు, హిందీ భాషల్లో నటిస్తూ తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న శ్రుతిహాసన్ ఇటీవల తెలుగులో నటించిన రెండు చిత్రాలు మంచి విజయాన్ని అందించాయి. ఇకపోతే హీరో హీరోయిన్ల పారితోషికం విషయంలో సమానత్వం కోసం కొందరు హీరోయిన్లు బహిరంగంగానే తమ భావాలను వ్యక్తం చేస్తున్నారు. హీరోలకు తామేమి తక్కువ కాదని చిత్ర విజయాల విషయంలో తమ భాగం ఉంటుందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయాన్ని నటి శ్రుతిహాసన్ కూడా పేర్కొనడం విశేషం. ఆమధ్య ప్రియాంకచోప్రా తన కెరీర్ లో 20 ఏళ్ల తర్వాత హీరోకు సమానంగా తమ పారితోషికం తీసుకున్నట్లు వెల్లడించారు. దీనిపై స్పందించిన నటి శ్రుతిహాసన్ హీరోయిన్లకు హీరోలకు సమానంగా ఇవ్వాలని అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. అయితే నటి ప్రియాంక చోప్రా హాలీవుడ్‌లో హీరోకు సమానంగా అందుకున్నారని, ఇక్కడ కూడా ఆ రోజు రావాలని తాను ఎదురుచూస్తున్నానని పేర్కొంది.

## క్లుప్తంగా

### ప్రత్యేక ప్రతిభావంతులకు వైద్యశిబిరం


ప్రత్యేక ప్రతిభావంతులకు వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యులు

**తిరుత్తణి:** తిరుత్తణిలోని ప్రభుత్వ బాలికల మహోన్నత పాఠశాలలో సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం ప్రత్యేక ప్రతిభావంతులకు వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో 250 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా వైద్య ఉపకరణాలు పంపిణీ చేశారు. బీఆర్‌సీ సూపర్ వైజర్ శివకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్యశిబిరంలో మండల వ్యాప్తంగా నుంచి 250 మంది పాల్గొన్నారు. వైద్యుల బృందం అంగ వైకల్యంతో ఇబ్బందులు చెందుతున్న చిన్నారులకు వైద్యసేవలతో పాటు వారికి అంగవైకల్యం సర్టిఫికెట్లు పంపిణీ చేసి ఉచితంగా వైద్య ఉపకరణాలు పంపిణీ చేశారు.

### రూ.24 లక్షల బంగారం స్వాధీనం

**అన్నానగర్:** తిరుచ్చి విమానాశ్రయంలో గురువారం అక్రమంగా తీసుకొచ్చిన రూ.24.27 లక్షల విలువైన బంగారాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. తిరుచ్చి విమానాశ్రయానికి గురువారం వేకువజామున సింగపూర్ నుంచి స్కూట్ ఎయిర్‌లైన్స్ విమానం వచ్చింది. అందులో ప్రయాణీకుల వస్తువులను ఎయిర్‌పోర్టులోని ఎయిర్ ఇంటెలిజెన్స్ విభాగానికి చెందిన కస్టమ్స్ అధికారులు తనిఖీ చేశారు. అప్పుడు గ్రైండర్ మిషన్‌లో ఒక ప్రయాణికుడు బంగారాన్ని దాచినట్లు గుర్తించారు. ఆనంతరం ఎయిర్ ఇంటెలిజెన్స్ విభాగం కస్టమ్స్ అధికారులు రూ.21 లక్షల విలువచేసే 348 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆదేవిధంగా ఎయిర్‌పోర్టులోని టాయిలెట్‌లో ఉన్న రూ.3 లక్షల విలువచేసే 49 గ్రాముల బంగారాన్ని కూడా అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

### తనయుడిని హత్య చేసిన తండ్రి అరెస్ట్

**తిరువొత్తియూరు:** మద్యం తాగుతూ, జులాయిగా తిరుగుతున్న కుమారుడిని హత్య చేసిన తండ్రిని పోలీసులు అరెస్టు చేశారు. వివరాలు.. తిట్టకుడి సమీపంలోని కొట్టికలం అరుంధతియార్ వీధికి చెందిన వినాయకం(28) పనికి వెళ్లకుండా మద్యం తాగుతూ ఉండేవాడు. అతని తండ్రి అర్ముగం (60) అతన్ని పనికి వెళ్లమని కోరేవాడు. దీంతో ఇద్దరి మధ్య తరచూ గొడవలు జరుగుతూ వున్నట్లు తెలిసింది. బుధవారం అర్ధరాత్రి సమయంలో ఎప్పటిలాగే వినాయకం మద్యం తాగి ఇంటికి వచ్చాడు. ఆ సమయంలో తండ్రి కొడుకు గొడవపడ్డారు. ఆగ్రహం చెందిన తండ్రి అర్ముగం కత్తితో వినాయకంపై దాడి చేశాడు. దీంతో తీవ్ర గాయాలైన అతను అక్కడే కింద పడి మరణించాడు. సమాచారం అందుకున్న పోలీసులు నిందితుడు అర్ముగాన్ని అరెస్టు చేశారు.

### శ్రీవారి దర్శనానికి 24 గంటలు

**తిరుమల:** తిరుమలలో గురువారం భక్తుల రద్దీ నెలకొంది. క్యూకాంప్లెక్స్‌లో 29 కంపార్టుమెంట్‌ల్ నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 74,995 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 38,663 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో భక్తులు రూ.3.60 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టికెట్లు కలిగిన వారికి సకాలంలోనే దర్శనం లభిస్తోంది. దర్శన టిక్కెట్లు లేని వారికి 24 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

### లంచం కేసులో ఇద్దరు అరెస్ట్

**అన్నానగర్:** కారియాపట్టి సమీపంలో పట్టా మార్పు కోసం లంచం తీసుకున్న గ్రామ పరిపాలన అధికారిని ఏసీబీ అధికారులు గురువారం అరెస్ట్ చేశారు. విరుదునగర్ జిల్లా కారియాపట్టి సమీపంలోని మాందోప్పు గ్రామానికి చెందిన కృష్ణన్ పట్టా మార్పు కోసం దరఖాస్తు చేసుకున్నాడు. కృష్ణన్ పట్టా మార్పు కోసం మాందోప్పు రిజిస్ట్రార్ రాజేష్ కన్నన్‌ను సంప్రదించారు. తర్వాత తనకు, గ్రామ పరిపాలన అధికారి కుమార్‌ను కలిసి రూ.6 వేలు లంచం డిమాండ్ చేసినట్లు తెలిసింది. లంచం ఇవ్వడానికి ఇష్ట పడని కృష్ణన్ ఏసీబీ అధికారులు ఆశ్రయించాడు. అనంతరం గురువారం ఏసీబీ సలహా మేరకు రసాయనం పూసిన రూ.6వేలను రాజేష్ కన్నన్ ద్వారా గ్రామ పరిపాలన అధికారి కుమార్‌కు కృష్ణన్ అందజేశారు. ఆ సమయంలో అక్కడే ఉన్న ఏసీబీ అధికారులు గ్రామ పరిపాలన అధికారి కుమార్, రిజిస్ట్రార్ రాజేష్ కన్నన్ను రెడ్ హ్యాండెడ్‌గా అరెస్టు చేశారు.

### తిరుపతిలో గాలీవాన

**తిరుపతి తుడా:** తిరుపతిలో భారీ వర్షం నమోదైంది. గురువారం సాయంత్రం సుమారు గంటకు పైగా గాలీవాన బీభత్సం సృష్టించింది. పెనుగాలుల ధాటికి జనజీవనం అస్తవ్యస్తమైంది. రైల్వే అండర్ బ్రిడ్జిల వద్ద వర్షపు నీరు నిలిచిపోయింది. విద్యుత్ మోటార్ల ద్వారా నీటిని తొలగించారు. అలాగే మధురానగర్, రైల్వే కాలనీ, కొర్లకుంట, చంద్రశేఖర్‌రెడ్డి కాలనీ, అశోక్‌నగర్, కోరమేనుగుంట, ఎస్టీవీనగర్, గాంధీపురం లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు పెద్ద ఎత్తున చేరింది. కరకంబాడి రోడ్డు, హరేరామహరే కృష్ణరోడ్, ఎస్వీ యూనివర్సిటీ రోడ్, రుయా ప్రాంతాల్లో చెట్లు నేలకూలాయి. విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి.

# అభివృద్ధి పర్యవేక్షణకు సీనియర్ ఐఏఎస్‌లు


- 12 జిల్లాలకు నియామకం
- ఉత్తర్వులు జారీ చేసిన సీఎస్ ఇరైఅన్బు



సచివాలయం

**సాక్షి, చెన్నై:** జిల్లాల్లో అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల పర్యవేక్షణకు ప్రత్యేకంగా సీనియర్ ఐఏఎస్‌లను నియమిస్తూ సీఎస్ ఇరై అన్బు ఉత్తర్వులు జారీ చేశారు. 12 జిల్లాలకు తాజాగా పర్యవేక్షణాధికారులను నియమించారు. వివరాలు.. డీఎంకే ప్రభుత్వం ఇటీవల మూడో వసంతంలోకి అడుగు పెట్టిన విషయం తెలిసిందే. దీంతో మంత్రి వర్గంలో మార్పులు, ఐఏఎస్, ఐపీఎస్‌ల బదిలీలు అంటూ గత పదిరోజులుగా సీఎం స్టాలిన్ అనేక కీలక నిర్ణయాలు తీసుకున్నారు. అలాగే, జిల్లాలకు ఇన్‌చార్జ్‌లుగా మంత్రులను రంగంలోకి దింపారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ప్రజాహిత పాలనను విస్తృతం చేయడంతో పాటు పథకాలన్నీ సకాలంలో లబ్ధిదారుల దరిచేర్చే విధంగా సీఎం కార్యాచరణ రూపొందించినట్లు తెలిసింది. ఇందులో భాగంగా జిల్లాల్లో అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల పర్యవేక్షణకు ఐఏఎస్‌లను రంగంలోకి దింపారు. చెన్నై మినహా తక్కిన జిల్లాలకు వీరిని నియమించారు. 25 జిల్లాలకు ఇప్పటికే పర్యవేక్షణాధికారులుగా ఐఏఎస్‌లు ఉన్నారు. తాజాగా 12 జిల్లాలకు నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. వీరంతా సీనియర్ ఐఏఎస్‌లు కావడం గమనార్హం. ఇందులో అరియలూరుకు అరుణ్‌రాయ్, కోయంబత్తూరుకు జయశ్రీ మురళీధరన్, కళ్లకురిచ్చికి ప్రతాప్ యాదవ్, కాంచీపురానికి పి. సెంథిల్‌కుమార్, నాగపట్నానికి రమేష్ చంద్ మీన, నామక్కల్‌కు ఐ. కుమర గురుబరన్, పుదుకోట్టైకి ఎస్. నాగరాజన్, రామనాథపురానికి కె. నందకుమార్, రాణిపేటకు శిల్పా ప్రభాకర్ సతీష్, సేలానికి పి. శంకర్, తిరుపత్తూరుకి గగన్ దీప్ సింగ్ బేడీ, తిరుప్పూర్‌కు ఎస్. విజయకుమార్ పర్యవేక్షణాధికారులుగా వ్యవహరిస్తారు. జిల్లా కలెక్టర్లు, అన్ని విభాగాల అధికారులను సమన్వయం చేస్తూ వీరు అభివృద్ధి కార్యక్రమాలు, పథకాల అమలును పర్యవేక్షించనున్నారు.

## ఎంఎస్‌ఎంఈలకు అనువైన రాష్ట్రం తమిళనాడు



సమావేశంలో మాట్లాడుతున్న జేబీ సింగ్

**కొరుక్కుపేట:** ఎంఎస్‌ఎంఈలకు అనువైన రాష్ట్రం తమిళనాడని మూవిన్ ఎక్స్‌ప్రెస్ సంస్థ డైరెక్టర్ జేబీ సింగ్ తెలిపారు. ఈ మేరకు లాజిస్టిక్స్ సేవలను అందిస్తున్న మూవిన్ ఏడాది కార్యకలాపాలు పూర్తి చేసుకున్న సందర్భంగా గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న డాక్టర్ జేబీ సింగ్ మాట్లాడుతూ యూపీఎస్ అండ్ ఇంటర్ గ్లోబల్ ఎంటర్‌ప్రైజెస్ ,మూవిన్ జాయింట్ వెంచర్‌గా పనిచేస్తూ లాజిస్టిక్ సేవలను అందిస్తున్నట్టు తెలిపారు. చెన్నైతోపాటు హైదరాబాద్, పూనే, కలకత్తా, ముంబాయి, ఢిల్లీ–ఎన్‌సీఆర్, బెంగళూరులో కార్యకలాపాలు చేపడుతుందన్నారు. ప్రధానంగా ఐటీ, ఎలక్ట్రానిక్ హెల్త్‌కేర్ పరికరాలు, ఆటో కాంపోనెంట్స్, ఈ– కామర్స్ వస్తువులను ఆయా ప్రాంతాలకు రవాణా చేస్తున్నామన్నారు. ప్రధానంగా ఎంఎస్‌ఎంఈలకు దోహదపడేలా తమ సేవలను ఉన్నాయని తెలిపారు. సంస్థను స్థాపించిన ఏడాదిలోనే మొత్తం 49 నగరాల్లో తమ లాజిస్టిక్ సేవలను అందిస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

## అరియలూరు యువకుడికి బంగారం పతకం

**అన్నానగర్:** అరియలూరు యువకుడు అథ్లెటిక్స్‌లో బంగారు పతకం సాధించి రికార్డు సృష్టించాడు. అరియలూరు జిల్లా వడయార్ పాళైయం సమీపంలోని దత్తనూరు కీళవేలి గ్రామానికి చెందిన పళనిస్వామి, లక్ష్మీదంపతుల కుమారుడు వల్లరసు (20). జయం కొండం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో బీఏ మూడవ సంవత్సరం చదువుతున్నాడు. ఈ స్థితిలో గత 22న కశ్మీర్‌లో జరిగిన అథ్లెటిక్స్ పోటీల్లో భారత్ తరఫున 1,500 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నాడు. అనంతరం బుధవారం స్వగ్రామానికి చేరుకున్న వల్లరసుకు స్థానిక ప్రముఖులు, యువకులు, క్రీడాకారులు బాణసంచా దప్పులు వాయిస్తూ స్వాగతం పలికారు.

## బాధిత బాలికకు ఆర్థిక సాయం


చెక్కు అందజేస్తున్న కలెక్టర్

**తిరువళ్లూరు:** అంతుచిక్కని వ్యాధితో బాధపడుతూ ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ చొరవతో వైద్య సేవలు పొందుతున్న బాలికకు ఖర్చుల నిమిత్తం రూ.50 వేల చెక్కును కలెక్టర్ అల్బీజాన్‌వర్గీష్ గురువారం అందజేశారు. తిరువళ్లూరు జిల్లా ఆవడి వీరాపురం శ్రీవారి నగర్ ప్రాంతానికి చెందిన స్టీఫెన్‌రాజ్, సౌభాగ్య దంపతుల కుమార్తె డానియా. స్థానికంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలో చదువుతోంది. బాలిక ముఖంపై నల్లమచ్చలు రావడంతో బాలిక కుటుంబం డీలా పడింది. ముఖంపై వచ్చిన నల్లమచ్చను తల్లిదండ్రులు సాధారణ రక్తం గడ్డగానే భావించి ఎగ్మూర్ చిన్నపిల్లల వైద్యశాలలో చికిత్స అందించారు. ఆరేళ్లుగా ప్రభుత్వ, ప్రైవేటు వైద్యశాలల చుట్టూ తిరిగినా నయం కాకపోగా లక్షల్లో అప్పులు చేశారు. రోజులు గడిచే కొద్ది డానియా ముఖం పూర్తిగా మారిపోయింది. అంతుచిక్కని వ్యాధితో బాధపడుతున్న డానియా సీఎం స్టాలిన్ అంకుల్ ఆదుకోండి అంటూ చేసిన విజ్ఞప్తి సోషల్ మీడియాలో అప్పట్లో వైరల్‌గా మారి ముఖ్యమంత్రి దృష్టికి వెళ్లింది. విషయం తెలిసి సీఎం స్టాలిన్ వెంటనే పూందమల్లిలోని సవిత వైద్యశాలలో రెండు సార్లు ఆపరేషన్ చేయడానికి సాయం అందించారు. భవిష్యత్తులోనూ అండగా ఉండడంతో పాటు వైద్య ఖర్చులకు అయ్యే మొత్తాన్ని ప్రభుత్వం భరిస్తుందని సీఎం స్టాలిన్ హామీ ఇచ్చారు. ప్రస్తుతం ఇంటి వద్దే ఉంటున్న డానియా కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగా లేకపోవడంతో వైద్య ఖర్చుల నిమిత్తం రూ.50 వేలు అందించాలని సీఎం స్టాలిన్ కలెక్టర్ ఆల్బీజాన్‌వర్గీష్‌ను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ డానియా కుటుంబసభ్యులను పిలిపించి నగదును కలెక్టర్ అందించారు.

## ద్విచక్రవాహనాలు ఢీ

- యువకుడి మృతి

**తిరుత్తణి:** రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన కేజీ.కండ్రిగ సమీపంలో గురువారం ఉదయం చోటుచేసుకుంది. తిరుత్తణి సమీపం కేజీ.కండ్రిగకు చెందిన రాధాకృష్ణన్ కుమారుడు విజయ్(23) ద్విచక్రవాహనంలో ఆర్కేపేట మార్గంలో వెళుతున్నారు. ఆర్కేపేట మండలం అమ్మనేరి గ్రామానికి చెందిన మోహన్ కుమారుడు తనికాచలం(21). ఇతని స్నేహితుడు పెరుమాళ్(21) తిరుత్తణి మార్గంలో వెళుతుండగా వీకేఎన్ కండ్రిగ క్రాస్ రోడ్డు వద్ద ద్విచక్రవాహనాలు రెండు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో రెండు ద్విచక్రవాహనాల్లో వెళుతున్న ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. గాయపడ్డ వారిని స్థానికులు షోళింగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ విజయ్ మృతి చెందాడు. తిరుత్తణి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మరో సంఘటనలో కనకమ్మసత్రం పోలీస్‌స్టేషన్ పరిధిలోని కాంజిప్పాడి గ్రామానికి చెందిన వినాయకం(39) రేషన్ దుకాణంలో సేల్స్‌మన్. బుధవారం చెన్నై తిరుపతి జాతీయ రహదారిలో తిరువళ్లూరుకు వెళుతుండగా పుదూర్ వద్ద బైక్ అదుపుతప్పి రోడ్డుకు పక్కగా నడిచి వెళుతున్న అదే గ్రామానికి చెందిన యువరాజ్(15) అనే విద్యార్థిని ఢీకొంది. గాయపడ్డ యువరాజ్, వినాయకంను తిరువళ్లూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ యువరాజ్ మృతిచెందాడు. కనకమ్మసత్రం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## గాయపడ్డ తండ్రీకుమారుడు మృతి

**అన్నానగర్:** బైక్‌ను గుర్తుతెలియని వాహనం ఢీకొన్న ప్రమాదంలో గాయపడ్డ తండ్రీకుమారుడు చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతిచెందారు. పుదుకోట్టై జిల్లా అన్నవాసల్ సమీపంలోని కాదంబరాయన్‌పట్టి ఉసిలంబట్టికి చెందిన పళనియాండి (60). ఇతని కుమారుడు సంధ్య కుమార్ (30), చెఫ్. సంధ్యకుమార్‌కు అమ్మాయిని చూసేందుకు వారిద్దరూ రెండు రోజుల క్రితం ఉసిలంబట్టి నుంచి బైకులో వెళ్లారు. ఇలుపూర్ ఫ్లైఓవర్ వద్ద గుర్తుతెలియని వాహనం ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ఘటనలో తండ్రీకుమారుడు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన ఇద్దరిని తిరుచ్చి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న తండ్రీకొడుకులు బుధవారం రాత్రి మృతి చెందారు. తండ్రీకొడుకు మృతితో గ్రామంలో విషాదం నెలకొంది.

## వేలూరు కొత్త ఎస్పీ బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరిస్తున్న మణివణ్ణన్

**వేలూరు:** వేలూరు జిల్లా ఎస్పీగా మణివణ్ణన్ గురువారం ఉదయం ఆయన ఎస్పీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తాను ఇది వరకే వేలూరు జిల్లా ఎక్సైజ్ శాఖలో అడిషనల్ సూపరింటెండెంట్‌గా పనిచేశానని, ఈ జిల్లాపై తనకు అవగాహన ఉందన్నారు. ప్రజా సంక్షేమం కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో అక్రమ గంజాయి, మద్యం వ్యాపారులపై ప్రత్యేక నిఘా ఉంచి వారి బ్యాంకు ఖాతాలను సీజ్ చేయడంతో పాటు వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. వేలూరు జిల్లాలో ట్రాఫిక్ సమస్యపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. అనంతరం కొత్తగా పోలీస్ శాఖలో ఎంపికైన 28 మంది పురుషులు, 18 మంది మహిళా పోలీసులకు నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

### వృద్ధురాలు సజీవ దహనం

**తిరువళ్లూరు:** విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ఏర్పడిన అగ్నిప్రమాదంలో వృద్ధురాలు సజీవదహనమైన సంఘటన తిరువళ్లూరు జిల్లా గుమ్మిడిపూండిలో చోటుచేసుకుంది. తిరువళ్లూరు జిల్లా గుమ్మిడిపూండి సమీపంలోని సున్నాంబుకుళం గ్రామానికి చెందిన గోవిందరాజ్. ఇతని భార్య రాజమ్మాళ్(80). వీరు గుడిసెలో ఉంటున్నారు. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం 4 గంటలకు ఏర్పడిన విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా గుడిసెలో మంటలు చెలరేగి క్షణాల్లో పక్కనే ఉన్న ఉమాపతి ఇంటికి సైతం వ్యాపించాయి. మంటలను గుర్తించిన ఉమాపతి కుటుంబం అప్రమత్తమై బయటకు పరుగులు తీశారు. అయితే మంటల్లో చిక్కుకున్న రాజమ్మాళ్ సజీవదహనమైంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు జరుపుతున్నారు.

### మెరీనా తీరంలో ఇద్దరు దొంగల అరెస్ట్

**తిరువొత్తియూరు:** చోరీ చేసిన బైకును విక్రయించడానికి మెరీనా తీరానికి వచ్చిన ఇద్దరు దొంగలను పోలీసులు అరెస్టు చేశారు. వివరాలు.. చెన్నై మెరీనాతీరంలో స్విమ్మింగ్ పూల్ వద్ద ఇద్దరు యువకులు కూర్చొని గంజాయి తాగుతున్నారు. ఆ సమయంలో గస్తీలో కాస్తున్న అన్నానమాధి పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. విచారణలో వారు బైకు చోరీలకు పాల్పడుతున్న కేసులో నిందితులని తేలింది. వీరు చెన్నై తిరునిండ్రవూరుకు చెందిన 16 ఏళ్ల మైనర్ బాలుడు, సత్య ప్రదీప్(25) అని నిర్ధారించారు. దీంతో ఇద్దరినీ అరెస్టు చేసి వారి వద్ద నుంచి బైకు, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

### సెల్‌ఫోన్, నగదు చోరీ

**పళ్లిపట్టు:** రోడ్డులో నడిచి వెళుతున్న వ్యక్తిని అడ్డుకుని దోపిడీ ముఠా సెల్‌ఫోన్, రూ.2వేల నగదు దోచుకెళ్లారు. పళ్లిపట్టు సమీపం నెడియం కొత్త కాలనీకి చెందిన మోహన్ కూలీ. యథావిధిగా పనులు పూర్తి చేసుకుని ఇంటికి వెళుతుండగా నెడియం రోడ్డులో బైకులో వచ్చిన గుర్తు తెలియని వ్యక్తులు మోహన్‌ను అడ్డగించి బెదిరించి అతని చేతిలోని సెల్‌ఫోన్, రూ.2వేలు అపహరించుకుని పరారయ్యారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పళ్లిపట్టు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### కారు, బస్సు ఢీ

-30 మందికి గాయాలు

**తిరువొత్తియూరు:** శ్రీపెరంబదూరులో బుధవారం అర్ధరాత్రి 1.30 గంటల సమయంలో ప్రైవేటు సంస్థ ఉద్యోగులు తీసుకొస్తున్న బస్సు, కారు ఢీకొన్నాయి. ఈ ఘటనలో 30 మందికి గాయాలయ్యాయి. తూత్తుకుడి జిల్లాకు చెందిన మాడాస్వామి (34) ప్రైవేటు కంటైనర్ లారీ డ్రైవర్. ఇతను బుధవారం రాత్రి ఒక ప్రైవేటు సంస్థకు కారు ఉత్పత్తి విడిభాగాలను కంటైనర్ లారీలో ఎక్కించుకుని హోసూరుకు వెళుతున్నాడు. ఈ లారీ బెంగళూరు జాతీయ రోడ్డులో వెళుతోంది. శ్రీపెరంబదూరు ప్రాంతం వచ్చిన సమయంలో కంటైనర్ అదుపుతప్పి ప్రైవేటు సంస్థకు చెందిన ఉద్యోగులను ఎక్కించుకుని వస్తున్న బస్సును, కారును ఢీకొంది. ఈ ప్రమాదంలో బస్సు, కారులో ఉన్న 30 మందికి గాయాలయ్యాయి. శ్రీపెరంబదూరు పోలీసులు గాయపడ్డ 30 మందిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### టన్ను నిషేధిత ప్లాస్టిక్ వస్తువులు స్వాధీనం

**అన్నానగర్:** మార్తాండంలో గురువారం మున్సిపల్ అధికారులు జరిపిన దాడిలో టన్ను నిషేధిత ప్లాస్టిక్ వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. ఈ క్రమంలో 16 దుకాణాలకు రూ.50 వేలు జరిమానా విధించారు. కన్యాకుమారి జిల్లా కుళితురై మున్సిపాలిటీ పరిధిలోని మార్తాండం, కుళితురై ప్రాంతాల్లోని దుకాణాల్లో నిషేధిత ప్లాస్టిక్ ఉత్పత్తులను విక్రయిస్తున్నట్లు మున్సిపల్ అధికారులకు సమాచారం అందింది. అనంతరం మార్తాండం ఏరియాలోని మార్కెట్ రోడ్డు, మెయిన్‌రోడ్డు ప్రాంతాల్లోని దుకాణాల వద్ద కుళితురై మున్సిపల్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ గురుస్వామి, స్వచ్ఛభారత్ ప్రాజెక్ట్ వర్క్ పర్యవేక్షకులు, లాబీయిస్టుల నేతృత్వంలో గురువారం తనిఖీలు చేశారు. అనంతరం 16 దుకాణాల నుంచి టన్ను నిషేధిత ప్లాస్టిక్ వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. 16 దుకాణాలకు రూ.50 వేలు జరిమానా విధించారు.

## ఆటో బోల్తా: ఇద్దరు మహిళల మృతి


దేవి (ఫైల్),


శివగామి(ఫైల్)

**తిరువళ్లూరు:** ఆటో అదుపుతప్పి ఇద్దరు మహిళలు దుర్మరణం చెందారు. మరో ఐదుగురు గాయపడ్డారు. ఈ సంఘటన బుధవారం రాత్రి జరిగింది. రాణిపేట జిల్లా తక్కోలం జిల్లాకు చెందిన శివగామి, దేవి, కలైవాణి, మనోహరన్, గజలక్ష్మి, పూంగొడి కాంచీపురం జిల్లా సుంగువాసత్రం వారపుసంతలో వ్యాపారం ముగించుకుని రాత్రి 11 గంటలకు ఆటోలో తిరుగు ప్రయాణమయ్యారు. ఆటోను కొత్తకేశవపురం గ్రామానికి చెందిన సెల్వం నడిపాడు. తిరువళ్లూరు జిల్లా మప్పేడు సమీపంలోని పుదుపట్టు వద్ద రోడ్డు విస్తరణ పనులు సాగుతున్నాయి. పనులు సాగుతున్న ప్రాంతంలో ఆటోను వేగంగా నడపడంతో అదుపుతప్పి ఆటోబోల్తా పడి ఎదురుగా వచ్చిన ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంలో వచ్చిన వారు స్వల్పంగా గాయపడగా, ఆటోలో ప్రయాణిస్తున్న శివగామి(50), దేవి(46) తీవ్రంగా గాయపడ్డారు. గాయపడ్డ వీరిని తిరువళ్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యంలో శివగామి, దేవి మృతిచెందారు. ఆటోలో ప్రయాణిస్తున్న గజలక్ష్మి(40) తీవ్రంగా గాయపడగా ఆమెను చెన్నై రాజీవ్‌గాంధీ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కలైవాణి(40), పూంగొడి(50), ఆటోడ్రైవర్ సెల్వం(45) సహా ఐదుగురిని చెంగల్‌పట్టు వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### భార్య కళ్లెదుటే భర్త ..


మృతిచెందిన సురేష్

**తిరువళ్లూరు:** జాతరకు కుటుంబం సహా వెళ్లి తిరుగు ప్రయాణంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్య కళ్లెదుటే భర్త మృతి చెందిన సంఘటన విషాదాన్ని నింపింది. తిరువళ్లూరు జిల్లా ఆవడి వీరాపురం గ్రామానికి చెందిన సురేష్(44). భవన నిర్మాణ కార్మికుడు. భార్య సుధ, కుమారుడు మనోజ్‌తో కలిసి బందికుప్పంలో జరిగిన జాతరకు వెళ్లాడు. జాతర చూసుకుని తిరిగి ద్విచక్ర వాహనంలో ఇంటికి తిరుగు ప్రయాణమయ్యారు. ఈ నేపథ్యంలో తిరువళ్లూరు సమీపంలోని కనగవల్లిపురం గ్రామం వద్ద వెళుతుండగా తిరుత్తణి నుంచి తిరువళ్లూరు వెళుతున్న లారీ, తిరువళ్లూరు నుంచి తిరుత్తణి వైపు వెళుతున్న కొరియర్ వ్యాన్ ఎదురెదురుగా ఢీకొంది. హఠాత్తుగా జరిగిన ఈ పరిణామంతో సురేష్ నడుపుతున్న ద్విచక్రవాహనం అదుపుతప్పి కొరియర్ వాహనంపైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో సురేష్ అక్కడికక్కడే మృతిచెందాడు. సుధ, మనోజ్, కొరియర్ వ్యాన్ డ్రైవర్ జాన్‌మరియదాస్ తీవ్రంగా గాయపడ్డారు. గాయపడ్డ వీరిని స్థానికులు తిరువళ్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## లారీ ఢీకొని ఇద్దరు యువకులు..

**అన్నానగర్:** తిరువయారు సమీపంలో ఇసుక లారీ, ద్విచక్రవాహనం ఢీకొన్న ఘటనలో ఇద్దరు యువకులు మృతిచెందారు. తంజావూరు జిల్లా తిరువయారు సమీపం అందనార్ కురిచ్చి ఉత్తర వీధికి చెందిన రాజేంద్రన్. ఇతని కుమారుడు అర్జున్ (19). డిప్లొమా రెండో సంవత్సరం చదువుతున్నాడు. అదేవీధికి చెందిన శివానందం కుమారుడు బాలసుబ్రమణ్యం(23) డ్రైవర్. బుధవారం సాయంత్రం అర్జున్, బాలసుబ్రమణ్యం తంజావూరు మారియమ్మన్ ఆలయంలోని ఓ కల్యాణ మండపంలో సప్లయర్లుగా పనిచేస్తున్నారు. అనంతరం ఇద్దరూ బైకులో తిరువయారుకు తిరిగి వెళ్తున్నారు. అప్పుడు తిరువయారు నుంచి తంజావూరు వైపు ఇసుక లారీ వెళుతోంది. కండియూర్ సమీపంలోని అరసూర్ మెయిన్ రోడ్డు బైపాస్ సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న బైకు, ఇసుక లారీ ఢీకొన్నాయి. తీవ్రంగా గాయపడిన అర్జున్, బాలసుబ్రహ్మణ్యం అక్కడికక్కడే మృతిచెందారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తిరువయార్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. నడుకావేరి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## విద్యుదాఘాతంతో ఇద్దరు కూలీలు..

**అన్నానగర్:** త్యాగదుర్గం సమీపంలో విద్యుదాఘాతంతో ఇద్దరు కూలీలు మృతిచెందారు. కళ్లకురిచ్చి జిల్లా త్యాగదుర్గం సమీపంలోని వాళవందాన్ కుప్పం గ్రామానికి చెందిన సేతుపిళ్లై (71) రైతు. ఇతను అదే ప్రాంతంలో కేంద్ర ప్రభుత్వ పథకం కింద ఇల్లు నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఇంటి పైకప్పుకు తీగ వేసే పనులు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో ఉలుందూరుపేట సమీపంలోని బోడీ గ్రామానికి చెందిన సప్పని కుమారుడు కృష్ణన్ (37), వచ్చాబి కుమారుడు నాగరాజన్ (52) బుధవారం వైర్ పనులు చేస్తున్నారు. నిర్మాణం కోసం తీసిన వైర్ ఒకటి పైన ఉన్న హైఓల్టేజ్ విద్యుత్ లైన్‌కు తగిలింది. దీంతో విద్యుదాఘాతంతో కృష్ణన్, నాగరాజన్ అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న త్యాగదుర్గం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కళ్లకురిచ్చి ప్రభుత్వ వైద్య కళాశాల ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## రూ.50 లక్షల మోసం

**తిరువొత్తియూరు:** చెన్నైలో ఆడిటర్ వద్ద ఇద్దరు వ్యక్తులు రూ.50 లక్షలు మోసం మోసం చేశారు. చెన్నై పురసైవాక్కంకు చెందిన పవన్‌కుమార్ (35) ఆడిటర్. ఇతను తిరుచ్చి జిల్లా తిరుచ్చి క్రైమ్ విభాగంలో బుధవారం ఒక ఫిర్యాదు చేశాడు. అందులో జూలై, 2019లో స్నేహితుడు ద్వారా సేలం జిల్లా మాసి నాయకన్‌పట్టికి చెందిన శంకర్‌బాబు తిరుపూర్ జిల్లా మూలనూరుకు చెందిన కృష్ణప్రకాష్ అనే ఇద్దరు పరిచయమయ్యారు. వీరు తిరుచ్చి నంబర్ ఒకటి టోల్‌గేట్ ప్రాంతంలో వ్యాపారం చేస్తున్నారు. ఈ క్రమంలో మా సంస్థలో పెట్టుబడి పెడితే 15 శాతం వడ్డీ ఇస్తామని చెప్పడంతో నమ్మి పలు విడతలుగా రూ.50 లక్షలు సంస్థలలో పెట్టుబడి పెట్టాను. కానీ వారు చెప్పినట్టుగా లాభంలో తనకు వాటా ఇవ్వలేదు పైగా ఇచ్చిన నగదును తిరిగి ఇవ్వలేదు. తనను బెదిరించారని వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నాడు. దీంతో శంకర్ బాబు, కృష్ణప్రకాష్ కోసం పోలీసులు గాలిస్తున్నారు.

## విల్లుపురంలో రాతి శాసనాలు లభ్యం


లభ్యమైన రాతి శాసనం

**అన్నానగర్:** విల్లుపురం కైలాసనాథర్ ఆలయ మైనింగ్ ఛాంబర్‌లో గురువారం కొత్తగా మరికొన్ని రాతి శాసనాలను అధికారులు గుర్తించారు. వివరాలు.. పురావస్తు శాఖ ఆధ్వర్యంలో విల్లుపురం కైలాసనాథర్ ఆలయంలో శాసనాలపై బుధవారం క్షేత్రస్థాయి సర్వే నిర్వహించారు. ఆలయంలో ఇప్పటి వరకు 3 శాసనాలను మాత్రమే గుర్తించగా.. ఇప్పుడు కొత్తగా మరికొన్ని శాసనాలు ఉన్నట్లు హిందూ ధార్మిక దర్మాదాయ శాఖ విల్లుపురం జోనల్ జాయింట్ కమిషనర్ శివకుమార్, విల్లుపురం పండితుడు అన్నా ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల చరిత్ర విభాగం ప్రొఫెసర్‌లు జరిపిన అధ్యయనంలో వెల్లడైంది. కైలాసనాథర్, తిరుపతీశ్వరం ఆలయాల్లో దీపాలంకరణకు ఏర్పాట్లు చేసినట్లు 12వ శతాబ్దానికి చెందిన సాంబవరాయ రాజు రసనారాయణ సాంబవరాయన్ శాసనం పేర్కొంది. ఈ పట్టణాన్ని జనన్నాథ చతుర్వేది మంగళంగా పిలిచినట్లు కూడా ఈ శాసనంలో పేర్కొన్నారు. దీంతో ఈ ఆలయం మొదటి రాజరాజన్ కాలంలో నిర్మించబడిందని స్పష్టమవుతోంది. దీని పక్కనే తరువాతి పాండ్య రాజు సుందర పాండ్యన్ శాసనం ఉంది. ఈ శాసనంలో విల్లుపురం అనే పేరు చెక్కి ఉన్నట్లు అధికారులు తెలిపారు.

## శతాధిక వృద్ధుడికి అరుదైన శస్త్రచికిత్స

**వేలూరు:** రాణిపేటకు చెందిన మునస్వామి (103) ఈయన గతంలో వ్యవసాయం చేసేవారు. గత నెలలో ఈయన కుడి కాలు రక్త నాళాల్లో బ్లాక్ ఏర్పడడంతో తీవ్ర ఇబ్బందులు పడేవారు. దీంతో కుటుంబ సభ్యులు మునస్వామిని వేలూరు అడుక్కంబరైలోని ప్రభుత్వాసుపత్రిలో చికిత్స నిమిత్తం చేర్పించారు. ఆపరేషన్ చేసి కుడికాలు మోకాలు వరకు తీసేయాలని నిర్ణయించారు. దీంతో ఆసుపత్రిలోని ఐదు విభాగాలకు చెందిన వైద్య నిపుణులు మునస్వామి కుడి కాలును ఆపరేషన్ ద్వారా తొలగించారు. ప్రస్తుతం మునస్వామి ఆరోగ్యంగా ఉన్నాడని ఆసుపత్రి డీన్ పాపాత్తి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మునస్వామికి 103 సంవత్సరాలు వయస్సు కావడంతో ఆపరేషన్ చేయడంలో పలు సమస్యలు వచ్చాయన్నారు. వాటిని అధిగమించి అరుదైన ఆపరేషన్‌ను విజయవంతం చేసినట్లు వెల్లడించారు.

### శ్రీవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తి


ఆలయం వెలుపల కుటుంబసభ్యులతో జడ్జి మంజుల

**తిరుమల:** తిరుమల శ్రీవారిని గురువారం తమిళనాడు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆర్.ఎన్ మంజుల కుటుంబసభ్యులతో కలిసి దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా అధికారులు లడ్డూ, ప్రసాదాలు అందజేశారు.

● న్యూ-ఏజ్ థియేటర్

# ఒక సాయంత్రం




'ఇలా మాత్రమే' అనుకుంటే ఏం చేయలేము. 'ఇలా కూడా' అనుకున్నప్పుడే ప్రయోగాలు చేయగలుగుతాం. 'ది ఏజ్ ఆఫ్ ప్రిజన్' ప్రయోగశీలతకు అద్దం పట్టే ప్లే...

కొన్నిసార్లు మన చుట్టూ ఉన్న సమాజమే జైలర్ పాత్ర పోషిస్తుంది. ఏం మాట్లాడాలి? ఎలా మాట్లాడాలి? ఎక్కడికి వెళ్లాలి, ఎలా వెళ్లాలి....ఇలా సమస్త విషయాలను అప్రకటిత ఆంక్షలుగా ప్రకటిస్తుంది. అందులో అనివార్యంగా ఖైదీలు కాకతప్పదు. 'ది ఏజ్ ఆఫ్ ప్రిజన్'లో ఇద్దరు ఖైదీలు ఈ కోవకే చెందిన వారు.

ఈ ప్లేలోని 'ఫేస్‌లెస్ జైలర్' నిత్యజీవితంలో మనకు ఎక్కడో ఒకచోట కనిపించి ఉండవచ్చు.

ఆ ఇద్దరు ఖైదీల పేర్లు ఒకటి, రెండు. బ్లాక్‌బాక్స్‌లో ఉన్న వారు విచారణ కోసం ఎదురు చూస్తుంటారు. వారు ఏ నేరం చేశారు? అనేదాంట్లో స్పష్టత లేదు. వారికి ఉన్న ఏకైక అభిరుచి.... అతిగా ఆలోచించడం.


'ది ఏజ్ ఆఫ్ ప్రిజన్' ప్లే ను రంగస్థలం ముందు ఉన్న సీట్లలో కూర్చొని మాత్రమే చూడనక్కర్లేదు. ఇంట్లో కూర్చొని, సౌకర్యవంతంగా లేటెస్ట్ ఓటీటీ షోలాగే చూడవచ్చు. ఆన్‌లైన్ ద్వారా ప్రపంచం నలుమూలల నుంచి నాటకాన్ని వీక్షించే వెబ్‌ప్లాట్‌ఫామ్‌ను ఏర్పాటు చేసింది ముంబైకి చెందిన అల్బాజ్ థియేటర్. 48 గంటల వ్యవధిలో మనకు నచ్చిన 'ప్లే'ను ఎన్నిసార్లయిన చూడవచ్చు. తాజా ప్లే 'ది ఏజ్ ఆఫ్ ప్రిజన్' యూనిక్ హైబ్రిడ్ లైవ్ వర్చువల్ ఫార్మట్. మ్యూజిక్, లైట్స్, రకరకాల మూమెంట్స్‌తో ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. ఈ 'ప్లే'కు అంకిత్ వర్మ రచన చేసి దర్శకత్వం వహించాడు. కొత్తదనాన్ని ఇష్టపడే ముంబైకి చెందిన యామిని జోషి, ఇవితలు 'అల్బాజ్ థియేటర్'ను ప్రారంభించారు.

'ఇది ఎన్నో లేయర్స్‌తో కూడిన శక్తిమంతమైన నాటకం' అంటుంది యామిని జోషి.

'మనం నాటక రూపంలో అనుకున్నది వేరు. అది ప్రేక్షకులకు అర్థమయ్యేలా చెప్పడం వేరు. ఇది కాస్త కష్టమే' అంటున్న రష్మిత నాటకంలోని సంక్లిష్ట భావాలను సరళంగా ప్రేక్షకులకు చేరువ చేయడంలో విజయం సాధించింది. ఇక వర్మ విషయానికి వస్తే 'ఫిల్మ్‌కు పని చేస్తున్న భావన రానీయకుండా మూడు కెమెరాల మధ్య పనిచేయడం అనేది పెద్ద సవాలు' అంటాడు. అయితే ఆ సవాలులో సక్సెస్ అయ్యాడు.

'ఆర్టిస్టులుగా మాకు లైవ్‌పెర్ఫార్మెన్స్ విలువ తెలుసు. అయితే రకరకాల కారణాల వల్ల థియేటర్‌కు వెళ్లే అవకాశం చాలామందికి ఉండకపోవచ్చు. ప్రతి ఒక్కరికీ థియేటర్ అందుబాటులో ఉండాలనేది మా కల. ఎక్కడ నుంచి చూసినా థియేటర్ నుంచి చూసిన భావనే కలగాలి' అంటున్నారు రష్మిత, వర్మలు.

● ఇంగ్లిష్ ఇడియమ్




**ఏ స్లాప్ ఆన్ ది రిస్ట్**

మనం ఏదైనా ప్రశ్నకు తప్పు జవాబు చెప్పినప్పుడు, ఏదైనా తప్పు చేసినప్పుడు చిన్నగా మందలించడంలాంటి సందర్భంలో ఉపయోగిస్తారు.

**సీ త్రూ రోజ్-కలర్డ్ గ్లాసెస్**

'ఒక విషయానికి సంబంధించి అనుకూల అంశాలను మాత్రమే చూడడం'...ఇలాంటి సందర్భంలో ఉపయోగిస్తారు.

**హెడ్ స్టార్ట్**

ఒక పోటీ లేదా రేసుకు సంబంధించి ఒక వ్యక్తికి మొదట్లో కలిగే అడ్వాంటేజ్ విషయంలో వాడుతారు. ఉదా: ఇఫ్ వుయ్ లివ్ ఎర్లీ వుయ్ కెన్ గెట్ ఏ హెడ్‌స్టార్ట్ ఆన్ ది హాలిడే ట్రాఫిక్.

● సక్సెస్ స్టోరీ



# బేకింగ్ భాటియా

**తినగ తినగ వేము తీయనుండు. మరి తీయటి కేకు తినగ తినగ ఏం అనిపించును? శివేష్ మాటల్లో చెప్పాలంటే 'మనకు కూడా చేయాలనిపించును' ఢిల్లీకి చెందిన శివేష్ భాటియా సెల్ఫ్-టాట్ బేకర్, రైటర్, స్టార్ ఇన్‌ఫ్లూయెన్సర్. 27 సంవత్సరాల శివేష్ తాజాగా 'ఫోర్బ్స్ 30 అండర్ 30 ఏషియా-2023' జాబితాలో చోటు సంపాదించాడు...**

శివేష్ వాళ్ల నానమ్మ కేకులు ఎంత బాగా తయారు చేస్తుందంటే వర్ణించడానికి మాటలు చాలవు. ఆమె తయారు చేసిన కేకులే మళ్లీ నడిచి రావాలి. ఆమె అన్ని రకాల కేక్‌లను బ్రహ్మాండంగా బేక్ చేసేది.

నానమ్మ చేసే పసందైన కేకులను చూడగా, చూడగా...మరోవైపు స్వీడిష్ బ్లాగర్ లిండా లొమెని బ్లాగులలో కేక్ మేకింగ్ గురించి చదవగా చదవగా...

'నేనెందుకు ట్రై చేయకూడదు?' అనుకున్నాడు శివేష్.

పదహారు సంవత్సరాల వయసులో ప్రయాణం మొదలు పెట్టాడు. 'ఇది చేయాలి' అని ఒక ముందస్తు ప్రణాళిక ప్రకారం వెళ్లకుండా అప్పటికప్పుడు తాను ఫీలైంది చేసేవాడు. ఆరోజు కాస్త ఎండ ఎక్కువగా ఉంటే లెమన్ కేక్, క్విక్‌గా కావాలంటే బేసిక్ చాక్లెట్ కేక్, సమయం బాగా ఉన్నప్పుడు లేయర్‌కేక్ తయారుచేస్తాడు.

కేక్ మేకింగ్‌లో సక్సెస్ అయిన తరువాత తాను తయారుచేసిన కేకుల ఫొటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేయడం మొదలుపెట్టాడు.

'దయచేసి రెసిపీ తెలియజేయండి' అంటూ బోలెడు ఈమెయిల్స్ వస్తూ ఉండేవి.

వాటికి సమాధానాలు ఇస్తుండేవాడు. అయితే రాను రాను అది కష్టంగా మారింది. దీంతో బ్లాగింగ్ మొదలు పెట్టాడు. బేకింగ్‌కు అవసరమైన మైదా, కోకా పౌడర్, ఎగ్స్‌లాంటి ప్రాథమిక ఇన్‌గ్రేడియెంట్స్‌తో పాటు ఫ్యాన్సీ ఇన్‌గ్రేడియెంట్స్ గురించి రాసేవాడు.

'బేక్ విత్ శివ' బ్లాగ్ పాపులర్ కావడంతో కొత్త పరిచయాలు ఏర్పడ్డాయి. కొత్త విషయాలు తెలుసుకొనే అవకాశం ఏర్పడింది.

'మీ బ్లాగు చదివి నేను సొంతంగా కేకు తయారు చేశాను' అంటూ కుప్పలు, తెప్పలుగా ఈమెయిల్స్ వచ్చేవి. మరోవైపు బేకరీలు శివేష్ తయారుచేసిన సరికొత్త కేకులను మెనూలోకి తీసుకువచ్చేవి. ఇదంతా చూసిన తరువాత...

'ఫరవాలేదు. నాలో సరుకు ఉంది' అనుకునేవాడు శివేష్.

ఇంతకీ శివేష్ విజయ రహస్యం ఏమిటి?

సూపర్ ఈజీ ఫార్ములా. అంటే...ఎవరికి వారు 'ఇది మనం కూడా తయారు చేసుకోవచ్చు' అనిపించడం.

'విజువల్ పార్ట్'కు ప్రాముఖ్యత ఇవ్వడం. అంటే...కళ్లతోనే తినేసేలా చేయడం. ఈ ఫొటోల కోసం ఫ్యాన్సీ కెమెరాలను కాకుండా తన దగ్గర ఉన్న ఐప్యాడ్, ఐఫోన్ కెమెరాలను ఉపయోగించేవాడు.

'ఇష్టమే రకరకాల ప్రయోగాలు చేయిస్తుంది. ఒక ప్రయోగం మరో ప్రయోగానికి దారి చూపుతుంది. ఆ ప్రయోగాల ఫలితమే గొప్ప విజయం అవుతుంది. ప్రాబ్లమ్ అనే డోర్‌ను చూసి పక్కకు వెళ్లవద్దు. దాన్ని తెరుచుకొని వెళితే కొత్త ప్రపంచం కనిపిస్తుంది' అంటున్నాడు 27 సంవత్సరాల శివేష్ భాటియా.




## ఈ పుస్తకాలు హాటు కేకులు

ఆ పుస్తకాలు హాటుకేకుల్లా అమ్ముడు పోయాయి... అంటుంటారు. అయితే శివేష్ రాసిన 'బేక్ విత్ శివేష్' 'డిసర్ట్స్ ఫర్ ఎవ్రీ మూడ్' 'ఎగ్‌లెస్ బేకింగ్ విత్ శివేష్' 'ఏ కుక్ బుక్ ఫర్ స్పెషల్ డేస్, స్పెషల్ పీపుల్: ఫ్రమ్ శివేష్ విత్ లవ్' లాంటి పుస్తకాలు నిజంగానే హాటుకేకుల్లా అమ్ముడయ్యాయి. 'ఏ కుక్ బుక్ ఫర్ స్పెషల్ డేస్' పుస్తకం పిల్లలను దృష్టిలో పెట్టుకొని రాసింది. అలస్లైవ్‌లు ఆకట్టుకుంటాయి. ఈ పుస్తకం ఆవిష్కరణ సభలో వక్త అయిన ప్రముఖ చెఫ్ అమృతి ఆనంద్ ఇలా అన్నారు: 'శివేష్ యుమ్మీ...సింపుల్ అండ్ ఈజీ'

'హాటు హాటుగా కేక్ చేయడం ఎంత ఇష్టమో హాయిగా పుస్తకాలు రాయడం కూడా అంతే ఇష్టం' అంటున్నాడు పొలిటికల్ సైన్స్‌లో పట్టా పుచ్చుకున్న శివేష్. 'మీ పుస్తకాలు మా ఇంట్లోకి వచ్చిన తరువాత బేకరీలకు వెళ్లడం తగ్గిపోయింది' అని శివేష్‌తో అంటుంటారు ఎంతోమంది.

● టెక్.. టాక్



## టోజో గోల్డెన్ ఎక్స్‌ఐ వైర్‌లెస్ ఇయర్‌బడ్స్

● బ్రాండ్: టోజో మోడల్: ఎక్స్‌ఐ ● యాక్టివ్ నాయిస్ కన్సిలేషన్ ● స్పెషల్ ఫీచర్: స్వెట్ ప్రూఫ్, వాటర్ ప్రూఫ్ ● బ్లూటూత్: 5.3 ● బ్యాటరీ:500 ఎంఏహెచ్ ● కలర్: బ్లాక్



## ఫర్ మూవీ డైస్

ఫర్ మూవీ డైస్ అనేది పోర్టబుల్ ఎల్ఈడీ డీఎల్‌పీ ప్రొజెక్టర్. దీన్ని సులభంగా ఒక చోటు నుంచి ఇంకో చోటుకి తీసుకెళ్లవచ్చు.

● ఆప్టికల్ రిజల్యూషన్: 1920X1080 పిక్సెల్స్ ● బ్లూటూత్: 4.0 డైమెన్షన్స్: 155X125X60 ఎంఎం బరువు: 2.2 కేజీ ● బ్యాటరీ: 16,000 ఎంఏహెచ్ ● ఐఆర్ రిమోట్ కంట్రోల్ ● ఆప్టికల్ అడ్జస్ట్‌మెంట్స్: ఆటోమెటిక్ కీస్టోన్ కరెక్షన్, ఆటోమెటిక్ ఫోకస్

## వాట్సాప్ (ఆండ్రాయిడ్ అండ్ ఐవోఎస్) మెసేజ్ ఎడిట్ చేయడానికి...

1. ఎడిట్ చేయాలనుకున్న మెసేజ్‌ను సెలెక్ట్ చేసుకోవాలి.
2. మెసేజ్ కాంటెక్స్ట్ మెనూ(ఐవోఎస్)లో 'ఎడిట్'ను సెలెక్ట్ చేసుకోవాలి. ఆండ్రాయిడ్: స్క్రీన్ టాప్‌రైట్ కార్నర్‌లోని త్రీ-డాట్ మెనూ.
3. న్యూ మెసేజ్‌ను 'టెక్స్ట్ ఫీల్డ్'లోకి ఎంటర్ చేయాలి.
4. ఎడిటెడ్ మెసేజ్ సేవ్ చేయడానికి గ్రీన్ చెక్ మార్క్ బటన్ నొక్కాలి.

● గేమింగ్




ఎనిమిది సంవత్సరాల తరువాత రీమేక్‌గా వస్తున్న ఫస్ట్ పర్సన్ యాక్షన్-అడ్వెంచర్ గేమ్....సిస్టమ్ షాక్ ఈ నెల 30న విడుదల అవుతుంది. 2072లో సైబర్‌పంక్‌లోని స్పేస్ స్టేషన్‌లో జరిగే గేమ్ ఇది. ప్లేయర్ చేయాల్సింది...'శోధన్' అనే దుష్టశక్తితో కూడిన కృత్రిమమేధస్సును అడ్డుకోవడం. త్రీడీ ఎన్విరాన్‌మెంట్‌లో మల్టీ లెవెల్ స్పేస్ స్టేషన్‌లో పజిల్స్‌ను సాల్వ్ చేస్తూ, శత్రువులను ఎదుర్కొంటూ ముందుకు సాగాలి.

కథ విషయానికి వస్తే...అనామధేయుడైన హ్యాకర్ (ప్రొటాగనిస్ట్) ప్రత్యర్థులకు పట్టుబడతాడు. అతడిని స్పేస్ స్టేషన్‌కు తీసుకువెళతారు. ఈ హ్యాకర్ ఆరునెలలు కోమాలోకి వెళ్లిపోతాడు. కోమా నుంచి బయటికి వచ్చిన తరువాత గేమ్ మొదలవుతుంది.

ఇంజిన్: అన్ రియల్ ఇంజిన్ 4 జానర్: యాక్షన్-ఎడ్వెంచర్

ప్లాట్‌ఫామ్స్: విండోస్, మాక్ వోఎస్, ప్లేస్టేషన్ 4, ప్లే స్టేషన్ 5, ఎక్స్‌బాక్స్ వన్, ఎక్స్‌బాక్స్ సిరీస్ ఎక్స్/ఎస్.

# సినిమా



● రామ్‌చరణ్

## వి మెగా పిక్చర్స్ ప్రారంభం

''నూతన ప్రతిభావంతులను ప్రోత్సహించాలనే ఆలోచనతో 'వి మెగా పిక్చర్స్' బ్యానర్ ప్రారంభిస్తున్నాం'' అని హీరో రామ్‌చరణ్ అన్నారు. 'యూవీ క్రియేషన్స్' నిర్మాణ భాగస్వామి విక్రమ్‌రెడ్డి, రామ్‌చరణ్ కలిసి 'వి మెగా పిక్చర్స్' పై నిర్మించనున్న కొత్త సినిమాల వివరాలు త్వరలో వెల్లడి కానున్నాయి. ''విలక్షణమైన, సరికొత్త ఆలోచనలను ఆవిష్కరించేలా ఈ బ్యానర్‌పై సినిమాలను నిర్మించబోతున్నాం. ప్రతిభావంతులను ఇండస్ట్రీకి పరిచయం చేస్తాం'' అన్నారు రామ్‌చరణ్. ''వి మెగా పిక్చర్స్' ప్రయాణాన్ని ప్రారంభించటం మాలో తెలియని ఓ ఆనందాన్ని కలిగిస్తోంది. ప్రతిభ ఉన్న నటీనటులు, రచయితలు, దర్శకులు, సాంకేతిక నిపుణులతో కలిసి 'వి మెగా పిక్చర్స్' అసోసియేట్ అవుతుంది. ప్రేక్షకులకు కథ చెప్పడంలో సరికొత్త ఒరవడిని తీసుకు రావాలనుకుంటున్నాం. సినీ ఇండస్ట్రీ హద్దులను చెరిపేయడమే లక్ష్యం'' అన్నారు విక్రమ్. ఈ సంగతి ఇలా ఉంచితే.. రామ్‌చరణ్ నిర్మాతగా మారడం ఇది తొలిసారి కాదు. చిరంజీవి హీరోగా నటించిన 'ఖైదీ నంబరు 150', 'సైరా: నరసింహారెడ్డి', 'ఆచార్య', 'గాడ్‌ఫాదర్' చిత్రాలకు రామ్‌చరణ్ ఓ నిర్మాతగా ఉన్న సంగతి గుర్తుండే ఉంటుంది. మరోవైపు నటుడిగా రామ్‌చరణ్ ప్రస్తుతం 'గేమ్ ఛేంజర్' సినిమా చేస్తున్నారు.



● అదితీ రావ్
● సన్నీ లియోన్

## కాన్స్‌లో 'కెన్నెడీ'కి ఆదరణ

ఫ్రాన్స్‌లో జరుగుతున్న 76వ కాన్స్ చలన చిత్రోత్సవాల్లో మెరిశారు సన్నీ లియోన్. అనురాగ్ కశ్యప్ దర్శకత్వంలో రాహుల్ భట్, సన్నీ లియోన్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'కెన్నెడీ'. కాన్స్ చలన చిత్రోత్సవాల్లో ఈ సినిమా ప్రీమియర్‌ను ప్రదర్శించింది యూనిట్. 'కెన్నెడీ' పూర్తయిన తర్వాత వీక్షకుల నుంచి ఐదు నిమిషాలకు పైగా స్టాండింగ్ ఒవేషన్ చిత్ర యూనిట్‌కు దక్కినట్లు తెలిసింది. ఇక కాన్స్ రెడ్ కార్పెట్‌పై సన్నీ లియోన్ నడవడం ఇదే తొలిసారి కావడం విశేషం. ''కాన్స్ చలన చిత్రోత్సవాల్లో ఇండియన్ సినిమాను రిప్రజెంట్ చేయడం చాలా గౌరవంగా ఉంది'' అన్నారు సన్నీ లియోన్.

**సన్నీకి హెల్ప్ చేసిన అనురాగ్**

కాన్స్ రెడ్ కార్పెట్‌పై పొడవాటి గౌనులో సన్నీ లియోన్ మెరిశారు. అయితే నడుస్తున్నప్పుడు ఆ గౌను ఆమె షూలో చిక్కుకోవడంతో ఇబ్బందిపడ్డారు. పక్కనే ఉన్న అనురాగ్ కశ్యప్ ఈ విషయాన్ని గ్రహించి సన్నీకి హెల్ప్ చేశారు. అలాగే మౌనీ రాయ్, అదితీరావ్ హైదరీలు కూడా రెడ్ కార్పెట్‌పై నడిచారు. కాన్స్ చలన చిత్రోత్సవాల్లో ఇండియన్ పెవిలియన్‌లో 'లయనీస్' సినిమాను ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇందులో అదితీ రావ్ హైదరి, సంధు ముఖ్య తారలు.



● అనురాగ్, రాహుల్

## దీపావళికి జపాన్



● కార్తీ

కార్తీ హీరోగా నటిస్తున్న అడ్వెంచరస్ థ్రిల్లర్ ఫిల్మ్ 'జపాన్'. అనూ ఇమ్మాన్యుయేల్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో సునీల్, విజయ్ మిల్టన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. రాజు మురుగన్ దర్శకత్వంలో డ్రీమ్ వారియర్ పిక్చర్స్ పతాకంపై ఎస్ఆర్ ప్రకాశ్‌బాబు, ఎస్ఆర్ ప్రభు నిర్మిస్తున్నారు. గురువారం (మే 25)న కార్తీ బర్త్ డే. ఈ సందర్భంగా 'జపాన్' సినిమా గ్లింప్స్ వీడియోను విడుదల చేసి, ఈ సినిమాను దీపావళికి రిలీజ్ చేస్తున్నట్లుగా చిత్ర యూనిట్ ప్రకటించింది.

## మహేశ్ మాటలు సంతోషాన్నిచ్చాయి - అనురాగ్ రెడ్డి



● సుమంత్ ప్రభాస్, శరత్, చంద్రు మనోహరన్, అనురాగ్ రెడ్డి

''మహేశ్‌బాబుగారు 'మేమ్ ఫేమస్' సినిమా చూసి గొప్పగా మాట్లాడటం చాలా ఆనందాన్ని ఇచ్చింది. ఈ మూవీ విడుదల కాకముందే సుమంత్ ప్రభాస్‌తో మరో సినిమా చేయాలని మహేశ్‌గారు ముందుకు రావడం మజా అనిపించింది.. ఆయన ధైర్యానికి హ్యాట్సాఫ్'' అన్నారు నిర్మాత అనురాగ్ రెడ్డి. సుమంత్ ప్రభాస్ హీరోగా నటించి, దర్శకత్వం వహించిన చిత్రం 'మేమ్ ఫేమస్'. అనురాగ్ రెడ్డి, శరత్, చంద్రు మనోహరన్ నిర్మించిన ఈ సినిమా నేడు రిలీజ్ అవుతోంది. ఈ సందర్భంగా సుమంత్ ప్రభాస్ మాట్లాడుతూ– ''మా గురించి మహేశ్ బాబుగారి ట్వీట్ చదువుతున్నప్పుడు నమ్మలేకపోయాను. నా తర్వాతి సినిమాని అనురాగ్, శరత్‌గార్లతో కలసి మహేశ్ గారు నిర్మిస్తామని చెప్పడం అద్భుతం అనిపించింది'' అన్నారు. ''మా సినిమా ప్రీమియర్స్ అన్నీ ఫుల్ అయిపోయాయి. కొత్తవారితో చేసిన సినిమాకి ఇంత మంచి రెస్పాన్స్ రావడానికి కారణమైన అందరికీ థ్యాంక్స్'' అన్నారు శరత్ చంద్ర. ''మహేశ్ బాబుగారి మాటలు గొప్ప స్ఫూర్తిని ఇచ్చాయి'' అన్నారు చంద్రు మనోహరన్.

## మెన్ టూ మహిళలకూ నచ్చుతుంది - దర్శకుడు శ్రీకాంత్ జి. రెడ్డి



● మౌర్య, బ్రహ్మాజీ, శ్రీకాంత్

''మెన్ టూ' చిత్రంలో మేం ఎక్కడా మహిళలని తిట్టలేదు. ఈ సినిమా పురుషులకే కాదు.. మహిళలకు కూడా నచ్చుతుంది. ఈ చిత్రం బాగా రావటానికి కారణమైన నిర్మాతలు, మౌర్యలకు థ్యాంక్స్'' అని దర్శకుడు శ్రీకాంత్ జి. రెడ్డి అన్నారు. నరేష్ అగస్త్య, బ్రహ్మాజీ, హర్ష చెముడు, సుదర్శన్, మౌర్య సిద్ధవరం, కౌశిక్ ఘంటశాల, రియా సుమన్, ప్రియాంక శర్మ ప్రధాన తారాగణంగా నటించిన చిత్రం 'హ్యాష్‌ట్యాగ్ మెన్ టూ'. శ్రీకాంత్ జి. రెడ్డి దర్శకత్వంలో మౌర్య సిద్ధవరం నిర్మించిన ఈ చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా మౌర్య సిద్ధవరం మాట్లాడుతూ– ''హిలేరియస్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన చిత్రమిది. మా సినిమా విడుదలకు కారణమైన మైత్రీ మూవీస్ సంస్థకి థ్యాంక్స్'' అన్నారు. ''మగవాళ్లని ఆడవాళ్లు ఏ విధంగా వేధిస్తారు? అనేది 'హ్యాష్‌ట్యాగ్ మెన్ టూ' చూసి తెలుసుకోవచ్చు'' అన్నారు నటుడు బ్రహ్మాజీ. చిత్ర సహనిర్మాత శ్రీమాన్, నటీనటులు ప్రియాంక శర్మ, నరేష్ అగస్త్య, కౌశిక్ మాట్లాడారు.

## స్పై డ్రామా



● అరవింద్ కృష్ణ, కిరణ్, రాజ్ మదిరాజు, మహేశ్


ప్రతాప్ పోతన్, ఊర్వశీ రాయ్, అలీ రెజా, అరవింద్ కృష్ణ, రాజ్ మదిరాజు ప్రధాన పాత్రల్లో నటించిన స్పై థ్రిల్లర్ ఫిల్మ్ 'గ్రే'. 'ద స్పై హూ లవ్డ్ మి' అనేది ఉపశీర్షిక. రాజ్ మదిరాజు దర్శకత్వంలో కిరణ్ కాళ్లకూరి నిర్మించిన ఈ చిత్రం నేడు విడుదల కానుంది. ఈ సందర్భంగా రాజ్ మదిరాజు మాట్లాడుతూ– ''కొన్నేళ్ల క్రితం దేశంలో రెండేళ్ల వ్యవధిలో దాదాపు పదిమంది న్యూక్లియర్ సైంటిస్టులు మాయమైపోయారు. గతంలో కూడా కొన్నిసార్లు ఇలా జరిగింది. ఫారిన్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీస్ ఆపరేషన్స్ వల్లే ఇలా జరుగుతుందనే వార్తలు ఉన్నాయి. వీటి నుంచి పుట్టిన ఐడియానే 'గ్రే' మూవీ. 40 ఏళ్ల తర్వాత బ్లాక్ అండ్ వైట్‌లో వస్తున్న చిత్రం కూడా ఇదే. పీవీఆర్ పిక్చర్స్ ఈ మూవీ రిలీజ్ చేస్తోంది'' అన్నారు. ''గ్రే' పర్‌ఫెక్ట్ స్పై మూవీ. మా బ్యానర్లో మరో మూడు ప్రాజెక్ట్స్ ఉన్నాయి'' అన్నారు కిరణ్. ''గ్రే' సినిమాను ప్రేక్షకులు ఆదరించాలి'' అన్నారు అరవింద్ కృష్ణ. ఈ చిత్రానికి సహనిర్మాత: మహేశ్.

## అసత్య ప్రచారం వద్దు - సుధాకర్



ప్రముఖ నటుడు సుధాకర్ అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్నారని, ఐసీయూలో చికిత్స తీసుకుంటున్నారనే వార్త ప్రచారంలోకొచ్చింది. అయితే ఆ వార్తల్లో వాస్తవం లేదని స్పష్టం చేశారు సుధాకర్. ఈ విషయంపై సుధాకర్ ఓ వీడియోను విడుదల చేశారు. ''అందరికీ నమస్కారం. నా ఆరోగ్యం గురించి వచ్చే తప్పుడు వార్తలను నమ్మవద్దు. అసత్య ప్రచారం చేయవద్దు. నేను చాలా సంతోషంగా ఉన్నాను'' అని పేర్కొన్నారు సుధాకర్. ఇక హీరోగా, హాస్యనటుడిగా, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా తెలుగు, తమిళ భాషల్లో సుధాకర్ దాదాపు ఐదు వందల చిత్రాలకు పైగా నటించారు. నాలుగైదు సినిమాలను నిర్మించారు కూడా.

## మళ్ళీ పెళ్లితో పెద్ద హిట్ సాధిస్తాం - వీకే నరేశ్



''పెళ్లనేది పవిత్రమైనది. దాన్ని గౌరవించాలనే కోణంలో 'మళ్ళీ పెళ్లి' సినిమా చేశాం. యువతరంతో పాటు అన్ని వయసుల వారికీ కనెక్ట్ అయ్యే కథ ఈ చిత్రంలో ఉంది. పెద్ద హిట్ సాధిస్తామనే నమ్మకం ఉంది'' అన్నారు వీకే నరేశ్. ఆయన హీరోగా నటించి, నిర్మించిన చిత్రం 'మళ్ళీ పెళ్లి'. ఎమ్మెస్ రాజు దర్శకత్వం వహించారు. నరేశ్‌కి జోడీగా పవిత్రా లోకేష్ నటించిన ఈ సినిమా నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా గురువారం వీకే నరేశ్ విలేకరులతో మాట్లాడుతూ– ''మా అమ్మగారు (విజయ నిర్మల) తన ఆలోచనలను సినిమాల్లో చూపించాలని కృష్ణగారితో కలసి 1972లో విజయకృష్ణ మూవీస్‌ని స్థాపించారు. ఈ బేనర్ స్థాపించి 50 ఏళ్లు. నా సినీ జీవితం ప్రారంభించి కూడా యాభై ఏళ్లు. ఈ సమయంలో హీరోగా 'మళ్ళీ పెళ్లి' సినిమా చేయడం నా అదృష్టం. ఈ సినిమా వినోదంతో పాటు షాకింగ్‌గా ఉంటుంది.. నటుడిగా థ్రిల్‌గా ఉంది. పదికోట్ల మందిలో వందమంది కూడా బిజీగా ఉండరు. ఇక సినిమాలకు వస్తే.. పది మంది హీరోలే బిజీగా ఉంటారు. నేను హీరోగా హిట్స్ ఇచ్చాను, క్యారెక్టర్ ఆర్టిస్టుగా చేశాను. ఇప్పుడు మళ్లీ హీరోగా చేస్తున్నాను. విజయకృష్ణ మూవీస్ లాంటి పెద్ద బ్యానర్‌ని మళ్లీ తీసుకురావడం, కృష్ణ-విజయ నిర్మలగార్ల వారసత్వాన్ని కాపాడటం, ఒక మంచి ఎంటర్‌టైనర్ ఇవ్వడం.. ఇవన్నీ నిర్మాతగా నాకు పెద్ద బాధ్యత. ఈ విషయంలో రాజుగారిని నమ్మాను'' అన్నారు.

**స్టాక్ మార్కెట్లు**

| దేశీ సూచీలు | | విదేశీ సూచీలు (భారత కాలమానం ప్రకారం రాత్రి 11.30 గంటలకు) | | | | బులియన్ (రూ.ల్లో) ముంబై |
|---|---|---|---|---|---|---|
| సెన్సెక్స్ ▲ | నిఫ్టీ ▲ | నాస్‌డాక్ | 12,684 | ▲ | 200 | బంగారం (99.9 స్వచ్ఛత) |
| 99 | 36 | డోజోన్స్ | 32,643 | ▽ | 157 | 60,361 ▽ 319 |
| 61,873 | 18,321 | ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 7,571 | ▽ | 56 | బంగారం (99.5 స్వచ్ఛత) |
| | | డాక్స్ | 15,794 | ▽ | 48 | 60,119 ▽ 318 |
| | | హాంగ్‌సెంగ్ | 3,201 | ▽ | 3 | వెండి (కేజీ) |
| | | నికాయ్ | 30,801 | ▲ | 118 | 70,285 ▽ 844 |

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫన్' చూడండి

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్



# 30 రోజుల్లో పునరుద్ధరణ ప్రణాళిక ఇవ్వండి

గో ఫస్ట్‌కు డీజీసీఏ సూచన




న్యూఢిల్లీ: కార్యకలాపాల పునరుద్ధరణకు సంబంధించిన ప్రణాళికను 30 రోజుల్లోగా సమర్పించాలంటూ విమానయాన సంస్థ గో ఫస్ట్‌కు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) సూచించింది. అందుబాటులో ఉన్న విమానాలు .. పైలట్లు ..ఇతర సిబ్బంది, నిర్వహణ ఏర్పాట్లు, నిధులు .. వర్కింగ్ క్యాపిటల్, లీజుదార్లతో ఒప్పందాలు తదితర వివరాలు అందులో పొందుపర్చాలని డీజీసీఏ పేర్కొన్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ప్రణాళికను సమీక్షించిన తర్వాత డీజీసీఏ తగు నిర్ణయం తీసుకోవచ్చని వివరించాయి. ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్న గో ఫస్ట్ మే 2న స్వచ్ఛందంగా దివాలా పరిష్కార ప్రక్రియ చేపట్టాలంటూ నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ)లో దరఖాస్తు చేసుకున్న సంగతి తెలిసిందే. ముందుగా మే 3, 4 తారీఖుల్లో రద్దు చేసిన విమాన సేవలను ఆ తర్వాత మరిన్ని రోజులకు పొడిగించింది. ఈలోగా సర్వీసుల నిలిపివేతపై డీజీసీఏ షోకాజ్ నోటీసు జారీ చేసింది. దీంతో మారటోరియం వ్యవధిని ఉపయోగించుకుని పునరుద్ధరణ ప్రణాళికను సమర్పించేందుకు సమయం ఇవ్వాలంటూ గో ఫస్ట్ తన సమాధానంలో కోరింది. మరోవైపు లీజుదార్లు వ్యతిరేకిస్తున్నప్పటికీ.. గో ఫస్ట్ దివాలా పరిష్కార పిటిషన్‌ను అనుమతించాలని ఎన్‌సీఎల్‌టీ తీసుకున్న నిర్ణయాన్ని సమర్థిస్తూ మే 22న జాతీయ కంపెనీ లా అప్పిలేట్ ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌ఏటీ) ఉత్తర్వులు జారీ చేసింది.

## లెక్సస్ కారు @ రూ.2.39 కోట్లు




హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: లగ్జరీ కార్ల తయారీలో ఉన్న జపాన్ సంస్థ లెక్సస్.. తాజాగా భారత్‌లో కొత్త ఎల్‌సీ 500హెచ్ మోడల్‌ను పరిచయం చేసింది. నాలుగు సీట్లు ఉన్న ఈ లగ్జరీ కూపే ధర రూ.2.39 కోట్లు. గ్లాస్ బ్లాక్ మెటాలిక్ ఫినిష్, 3డీ మెషీన్ టెక్స్చర్‌తో అలాయ్ వీల్స్, 12.3 అంగుళాల టచ్ స్క్రీన్ డిస్‌ప్లే, 3.5 లీటర్, 6 సిలిండర్, మల్టీ స్టేజ్ హైబ్రిడ్, లీటరుకు 12.3 కిలోమీటర్ల మైలేజీ, 264 కిలోవాట్ పవర్ ఏర్పాటు ఉంది. గరిష్ట వేగం గంటకు 250 కిలోమీటర్లు. గంటకు 100 కిలోమీటర్ల వేగాన్ని 5 సెకన్లలోనే చేరుకుంటుంది. పనోరమిక్ వ్యూ మానిటర్, రేర్ క్రాస్ ట్రాఫిక్ అలర్ట్, 10 ఎయిర్‌బ్యాగ్స్, కార్బన్ ఫైబర్ రీ-ఇన్‌ఫోర్స్‌డ్ ప్లాస్టిక్స్ రూఫ్, డైనమిక్ హ్యాండ్లింగ్ సిస్టమ్, వేరియేబుల్ గేర్ రేషియో స్టీరింగ్, డ్రైవ్ స్టార్ట్ కంట్రోల్, వెహికిల్ డైనమిక్స్ ఇంటిగ్రేటెడ్ మేనేజ్‌మెంట్, ఈబీడీతో ఏబీఎస్, బ్రేక్ అసిస్ట్ సిస్టమ్, ట్రాక్షన్ కంట్రోల్ సిస్టమ్, వెహికిల్ స్టెబిలిటీ కంట్రోల్, హిల్ స్టార్ట్ అసిస్ట్ వంటి భద్రతా ఫీచర్లు జోడించారు. భారత్‌లో హైదరాబాద్ సహా ఏడు నగరాల్లో లెక్సస్ షోరూంలు ఉన్నాయి.

## సీఐఐ కొత్త ప్రెసిడెంట్‌గా దినేశ్‌కు బాధ్యతలు



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి గాను (2023-24) భారతీయ పరిశ్రమల సమాఖ్య సీఐఐ కొత్త ప్రెసిడెంట్‌గా టీవీఎస్ సప్లై చెయిన్ సొల్యూషన్స్ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ ఆర్ దినేశ్ బాధ్యతలు స్వీకరించారు. బజాజ్ ఫిన్‌సర్వ్ సీఎండీ సంజీవ్ బజాజ్ స్థానంలో ఆయన ఎన్నికయ్యారు. అలాగే, ఎర్న్‌స్ట్ అండ్ యంగ్ ఇండియా చైర్మన్ రాజీవ్ మెమాని సీఐఐ వైస్ ప్రెసిడెంట్‌గా ఎన్నికయ్యారు. గురువారం జరిగిన సీఐఐ నేషనల్ కౌన్సిల్ సమావేశంలో 2023-24కు గాను కొత్త ఆఫీస్-బేరర్లను ఎన్నుకున్నారు.

# చివర్లో బౌన్స్‌బ్యాక్

- సెన్సెక్స్ 99 పాయింట్లు అప్
- 61,873 వద్ద ముగింపు
- నిఫ్టీ 36 పాయింట్లు ప్లస్



ముంబై: రోజంతా నష్టాల మధ్యే కదిలిన దేశీ స్టాక్ మార్కెట్లు బౌన్స్‌బ్యాక్ సాధించాయి. వెరసి సెన్సెక్స్ 99 పాయింట్లు లాభపడి 61,873 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 36 పాయింట్లు బలపడి 18,321 వద్ద స్థిరపడింది. మే నెల డెరివేటివ్స్ ముగింపు నేపథ్యంలో తొలి నుంచీ మార్కెట్లు ఆటుపోట్లకు లోనయ్యాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 61,934 వద్ద గరిష్టాన్ని, 61,485 దిగువన కనిష్టాన్ని తాకింది. ఈ బాటలో నిఫ్టీ 18,338-18,202 పాయింట్ల మధ్య ఊగిసలాడింది. ప్రధానంగా చివరి అర్ధగంటలో ఇన్వెస్టర్లు కొనుగోళ్లకు దిగడంతో మార్కెట్లు నష్టాలను వీడి లాభాల్లో నిలిచాయి.

**రియల్టీ అప్**

ఎన్ఎస్ఈలో ప్రధానంగా రియల్టీ, ఎఫ్ఎంసీజీ, కన్జ్యూమర్ డ్యూరబుల్స్ 1-0.5 శాతం మధ్య పుంజుకోగా.. పీఎస్‌యూ బ్యాంక్స్ 0.5 శాతం నీరసించాయి. నిఫ్టీ దిగ్గజాలలో బజాజ్ ఆటో, అదానీ ఎంటర్, ఎయిర్‌టెల్, ఐటీసీ, దివీస్, ఐషర్, టాటా కన్జ్యూమర్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, బ్రిటానియా, కొటక్ బ్యాంక్, అదానీ పోర్ట్స్, అపోలో హాస్పిటల్స్ 3-1% మధ్య ఎగశాయి. అయితే విప్రో, టాటా మోటార్స్, ఇండస్‌ఇండ్, యూపీఎల్, హిందాల్కో, సన్ ఫార్మా, హెచ్‌డీఎఫ్‌సీ, హెచ్‌యూఎల్, కోల్ ఇండియా 1.2-0.5 శాతం మధ్య డీలా పడ్డాయి.

**చిన్న షేర్లు ఓకే**

బీఎస్ఈలో మిడ్, స్మాల్ క్యాప్స్ 0.3 శాతం స్థాయిలో బలపడ్డాయి. ట్రేడైన షేర్లలో 1,802 లాభపడితే.. 1,687 నష్టపోయాయి. నగదు విభాగంలో విదేశీ ఇన్వెస్టర్లు రూ. 589 కోట్లు, దేశీ ఫండ్స్ రూ. 338 కోట్లు ఇన్వెస్ట్ చేశారు. గత 3 రోజుల్లో ఎఫ్‌పీఐలు రూ. 2,291 కోట్ల విలువైన స్టాక్స్ కొనుగోలు చేసిన సంగతి తెలిసిందే. కాగా.. విదేశీ మార్కెట్లో బ్రెంట్ చమురు బ్యారల్ 1.2 శాతం క్షీణించి 77.47 డాలర్లకు చేరింది. డాలరుతో మారకంలో రూపాయి 7 పైసలు తగ్గి 82.75ను తాకింది.

## మాంద్యంలోకి జర్మనీ ఎకానమీ




బెర్లిన్: యూరోప్‌లో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థను కలిగిన జర్మనీ మాంద్యంలోకి జారిపోయింది. 2023 మొదటి త్రైమాసికంలో (జనవరి-మార్చి) దేశ స్థూల దేశీయోత్పత్తి 0.3 శాతం క్షీణించినట్లు ఫెడరల్ స్టాటిస్టికల్ ఆఫీస్ గణాంకాలు పేర్కొన్నాయి. 2022 చివరి త్రైమాసికం అంటే అక్టోబర్-డిసెంబర్ మధ్య దేశ జీడీపీ 0.5 శాతం క్షీణించింది. వరుసగా రెండు త్రైమాసికాల్లో ఆర్థిక వ్యవస్థలో వృద్ధిలేకపోగా క్షీణత నమోదయితే దానిని ఆ దేశం మాంద్యంలోకి జారినట్లు పరిగణించడం జరుగుతుంది. అధిక ధరలు వినియోగంపై తీవ్ర ప్రభావం చూపుతున్నట్లు ఎకనమిస్టులు పేర్కొంటున్నారు. ఏప్రిల్‌లో ద్రవ్యోల్బణం ఏకంగా 7.2 శాతంగా ఉంది. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ద్రవ్యోల్బణంపై తీవ్ర ప్రభావం చూపుతోంది.

## ఎల్‌ఐసీ జూమ్

క్యూ4లో ఆకర్షణీయ ఫలితాలు సాధించిన ఎల్‌ఐసీ షేరు 2 శాతం వృద్ధితో రూ. 604 వద్ద ముగిసింది. ఒక దశలో రూ. 616వరకూ ఎగసింది. దీంతో కంపెనీ మార్కెట్ విలువ రూ. 6,357 కోట్లు బలపడి రూ. 3,81,777 కోట్లకు చేరింది. ఎన్ఎస్ఈ, బీఎస్ఈలలో కలిపి 55.4 లక్షల షేర్లు ట్రేడయ్యాయి.

## పటిష్టంగా భారత బ్యాంకుల లాభదాయకత

- ఆస్తుల నాణ్యతలోనూ మెరుగు
- ఎస్అండ్‌పీ రేటింగ్స్ అంచనా



న్యూఢిల్లీ: భారత బ్యాంకుల లాభదాయకత ఆరోగ్యకర స్థాయిలో స్థిరపడుతుందని, ఆస్తుల (రుణాలు) నాణ్యత మెరుగుపడడం కూడా కొనసాగుతుందని అంతర్జాతీయ రేటింగ్ ఏజెన్సీ ఎస్అండ్‌పీ రేటింగ్స్ అంచనా వేసింది. "భారత బ్యాంకుల లాభాలు ఇక మీదట ఆరోగ్యంగానే ఉంటాయి. ప్రభుత్వరంగ బ్యాంకుల మొండి బకాయిల భారం గణనీయంగా పెరిగిన దగ్గర్నుంచి, గత ఏడేళ్లలో ఈ రంగం ఎంతో మెరుగుపడింది" అని ఎస్అండ్‌పీ గ్లోబల్ రేటింగ్స్ క్రెడిట్ అనలిస్ట్ దీపాలిసేత్ ఛాబ్రియా తెలిపారు. రుణ వసూళ్లు బలంగా ఉన్నాయని, భారత బ్యాంకులు దశాబ్ద కాలంలో మెరుగైన ఫలితాలను చూపిస్తున్నాయని ఎస్అండ్‌పీ రేటింగ్స్ పేర్కొంది. క్రెడిట్ వ్యయాలు తక్కువగా ఉండడం, అధిక నికర వడ్డీ మార్జిన్ల నుంచి ప్రయోజనం పొందడం వల్ల భారత బ్యాంకింగ్ రంగం ప్రయోజనం చూస్తున్నట్టు తెలిపింది. వ్యవస్థ అంతటా ఆస్తులపై సగటు రాబడులు (ఆర్ఓఏ) 1.2 శాతంగా 2022-23లో ఉంటాయని, 2023-24లో 1.1 శాతంగా ఉండొచ్చని అంచనా వేసింది. కొత్తగా వచ్చే ఎన్‌పీఏలు తక్కువగానే ఉన్నట్టు తెలిపింది. మాఫీ చేసిన రుణాలు వసూలు అవుతుండడంతో వాటి లాభాలు పెరుగుతున్నట్టు పేర్కొంది. భారత్ బలమైన ఆర్థిక పనితీరు బ్యాంకింగ్ రంగానికి సానుకూలమని ఎస్అండ్‌పీ రేటింగ్స్ అంచనా వేసింది. 2026 వరకు భారత్ ఏటా 6-7 శాతం స్థాయిలో వృద్ధిని చూస్తుందని, ప్రపంచంలో వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల్లో ఒకటని తెలిపింది.

## ఈ దేశాల నుంచి స్టార్టప్‌ల్లోకి పెట్టుబడులు.. పన్ను లేదు




న్యూఢిల్లీ: అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్ తదితర 21 దేశాల నుంచి అన్‌లిస్టెడ్ భారత స్టార్టప్‌ల్లోకి వచ్చే పెట్టుబడులపై ఏంజెల్ ట్యాక్స్ వర్తించదని కేంద్ర ఆర్థిక శాఖ ప్రకటించింది. సింగపూర్, నెదర్లాండ్స్, మారిషస్ నుంచి వచ్చే పెట్టుబడులకు ఈ అవకాశం కల్పించలేదు. ఆస్ట్రేలియా, జర్మనీ, స్పెయిన్ ఆస్ట్రియా, కెనడా, చెక్ రిపబ్లిక్, బెల్జియం, డెన్మార్క్, ఫిన్లాండ్, ఇజ్రాయెల్, ఇటలీ, ఐస్ లాండ్, జపాన్, కొరియా, రష్యా, నార్వే, న్యూజిలాండ్, స్వీడన్ ఏంజెల్ ట్యాక్స్ మినహాయింపు జాబితాలో ఉన్నాయి. అన్‌లిస్టెడ్ కంపెనీల్లోకి వచ్చే విదేశీ పెట్టుబడులను ఏంజెల్ ట్యాక్స్ పరిధిలోకి తీసుకొస్తూ బడ్జెట్‌లో ప్రతిపాదించారు. అనంతరం కొన్ని రకాల విదేశీ ఇన్వెస్టర్ల తరగతులను మినహాయించాలంటూ పరిశ్రమ నుంచి వినతులు రావడంతో.. ప్రత్యక్ష పన్నుల కేంద్ర మండలి తాజా ఆదేశాలు జారీ చేసింది. ఈ నోటిఫికేషన్ ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వచ్చినట్టు పేర్కొంది.

## వొడాఫోన్ ఐడియా నష్టాలు తగ్గాయ్

క్యూ4లో రూ. 6,419 కోట్లు




న్యూఢిల్లీ: మొబైల్ టెలికం కంపెనీ వొడాఫోన్ ఐడియా గత ఆర్థిక సంవత్సరం(2022-23) చివరి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జనవరి-మార్చి(క్యూ4)లో నికర నష్టాలు తగ్గి రూ. 6,419 కోట్లకు పరిమితమయ్యాయి. అంతక్రితం ఏడాది (2021-22) ఇదే కాలంలో రూ. 6,513 కోట్ల నష్టం ప్రకటించింది. మొత్తం ఆదాయం సైతం 3 శాతం పుంజుకుని రూ. 10,507 కోట్లకు చేరింది. కాగా.. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి నికర నష్టం పెరిగి రూ. 29,298 కోట్లను తాకింది. 2021-22లో రూ. 28,234 కోట్ల నష్టం ప్రకటించింది. మొత్తం ఆదాయం రూ. 38,490 కోట్ల నుంచి రూ. 42,134 కోట్లకు బలపడింది. క్యూ4లో వెచ్చించిన రూ. 560 కోట్లతో కలిపి గతేడాదిలో పెట్టుబడి వ్యయాలు రూ. 3,360 కోట్లకు చేరాయి. 2022 డిసెంబర్‌కల్లా రూ. 2,28,890 కోట్లుగా నమోదైన స్థూల రుణభారం మార్చికల్లా రూ.2,09,260 కోట్లకు తగ్గింది. క్యూ4లో ఒక్కో వినియోగదారునిపై సగటు ఆదాయం(ఏఆర్‌పీయూ) రూ. 124 నుంచి బలపడి రూ. 135ను తాకింది. సబ్‌స్క్రయిబర్ల సంఖ్య 7 శాతం తగ్గి 22.59 కోట్లకు చేరింది. కంపెనీలో ప్రభుత్వ వాటా 33.1 శాతంగా నమోదైంది. స్పెక్ట్రమ్ వాయిదాలు, ఏజీఆర్ బకాయిలపై వడ్డీని ఈక్విటీగా మార్పుచేసి ప్రభుత్వానికి జారీ చేయడంతో రుణ భారం తగ్గినట్లు కంపెనీ వెల్లడించింది.

వొడాఫోన్ ఐడియా షేరు ఎన్ఎస్ఈలో 0.7 శాతం బలపడి రూ. 7 వద్ద ముగిసింది.





## షార్జా మాస్టర్స్ టోర్నీ విజేత అర్జున్

ఆరంభ రౌండ్లలో తడబడ్డా... చివర్లో అనూహ్యంగా పుంజుకున్న తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ షార్జా మాస్టర్స్ అంతర్జాతీయ చెస్ టోర్నీలో చాంపియన్‌గా అవతరించాడు. గురువారం ముగిసిన ఈ టోర్నీలో నిర్ణీత తొమ్మిది రౌండ్ల తర్వాత అర్జున్ 6.5 పాయింట్లతో అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. చివరి రౌండ్‌లో తెల్లపావులతో ఆడిన అర్జున్ 27 ఎత్తుల్లో నోదిర్‌బెక్ యాకుబోయెవ్ (ఉజ్బెకిస్తాన్)పై గెలిచాడు. ఎనిమిదో రౌండ్ తర్వాత మరో ఏడుగురితో కలిసి అర్జున్ సంయుక్తంగా ఆధిక్యంలో ఉన్నాడు. అయితే తొమ్మిదో రౌండ్‌లో అర్జున్ గెలుపొందగా... మిగతా ఆరుగురు ప్లేయర్లు తమ గేమ్‌లను 'డ్రా' చేసుకోవడంతో అర్జున్‌కు టైటిల్ ఖరారైంది. భారత్‌కే చెందిన దొమ్మరాజు గుకేశ్ ఆరు పాయింట్లతో మరో ఏడుగురితో కలిసి సంయుక్తంగా రెండో స్థానంలో నిలిచాడు. అయితే మెరుగైన టైబ్రేక్ స్కోరు ఆధారంగా ర్యాంకింగ్‌ను వర్గీకరించగా గుకేశ్‌కు రెండో ర్యాంక్ లభించింది. విజేతగా నిలిచిన అర్జున్‌కు 10 వేల డాలర్లు (రూ. 8 లక్షల 27 వేలు) ప్రైజ్‌మనీగా లభించాయి.


## ఫైనల్లో కాదు సెమీస్‌లోనే...

- ఒకే పార్శ్వంలో అల్‌కరాజ్, జొకోవిచ్
- ఫ్రెంచ్ ఓపెన్ 'డ్రా' విడుదల



పారిస్: టెన్నిస్ సీజన్ రెండో గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఫ్రెంచ్ ఓపెన్ 'డ్రా' వివరాలను గురువారం విడుదల చేశారు. పురుషుల సింగిల్స్‌లో డిఫెండింగ్ చాంపియన్ రాఫెల్ నాదల్ గాయం కారణంగా తొలిసారి ఫ్రెంచ్ ఓపెన్‌కు దూరమయ్యాడు. ఈ నేపథ్యంలో ఈసారి కొత్త చాంపియన్ అవతరిస్తాడా లేక మాజీ విజేత జొకోవిచ్ మూడోసారి ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్ గెలుస్తాడా వేచి చూడాలి. పురుషుల సింగిల్స్ 'డ్రా' ప్రకారం టాప్ సీడ్, ప్రపంచ నంబర్‌వన్ అల్‌కరాజ్ (స్పెయిన్), మూడో సీడ్ జొకోవిచ్ (సెర్బియా) ఒకే పార్శ్వంలో ఉన్నారు. దాంతో వీరిద్దరు ఫైనల్లో కాకుండా సెమీఫైనల్లోనే తలపడే అవకాశముంది. మరో పార్శ్వం నుంచి రెండో సీడ్ మెద్వెదెవ్ (రష్యా), నాలుగో సీడ్ కాస్పర్ రూడ్ (నార్వే), ఆరో సీడ్ హోల్గర్ రూనె (డెన్మార్క్), ఎనిమిదో సీడ్ జానిక్ సినెర్ (ఇటలీ)లలో ఇద్దరు సెమీఫైనల్ చేరుకుంటారు. మహిళల సింగిల్స్‌లో డిఫెండింగ్ చాంపియన్ ఇగా స్వియాటెక్ (పోలాండ్)కు టాప్ సీడింగ్ కేటాయించారు. గత ఏడాది రన్నరప్ కోకో గాఫ్ (అమెరికా)కు ఆరో సీడ్ దక్కడంతో క్వార్టర్ ఫైనల్లో ఆమెకు స్వియాటెక్ ఎదురయ్యే చాన్స్ ఉంది. ఆదివారం ఫ్రెంచ్ ఓపెన్ టోర్నీ మొదలవుతుంది.

## భారత్‌కు రెండో గెలుపు


అరైజీత్ సింగ్

సలాలా (ఒమన్): జూనియర్ ఆసియా కప్ పురుషుల హాకీ టోర్నీలో డిఫెండింగ్ చాంపియన్ భారత జట్టుకు రెండో విజయం దక్కింది. జపాన్‌తో గురువారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో టీమిండియా 3-1 గోల్స్ తేడాతో గెలిచింది. భారత్ తరఫున 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అరైజీత్ సింగ్ (36వ ని.లో), శ్రద్ధానంద్ తివారీ (39వ ని.లో), ఉత్తమ్ సింగ్ (56వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. జపాన్ జట్టుకు కుంపే యసుదా (19వ ని.లో) ఏకైక గోల్ అందించాడు.

# చెన్నైని 'ఢీ'కొట్టేదెవరు?

నేడు రెండో క్వాలిఫయర్‌లో గుజరాత్ టైటాన్స్‌తో ముంబై ఇండియన్స్ పోరు

రాత్రి గం. 7:30 నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం


హార్దిక్ పాండ్యా
రోహిత్ శర్మ

అహ్మదాబాద్: ఐపీఎల్‌లో ఇది సెమీస్ కానీ సెమీస్‌లాంటి మ్యాచ్. డిఫెండింగ్ చాంపియన్ గుజరాత్ టైటాన్స్‌కు ఇంకో చాన్సుండదు. ముంబై వరుసగా మరోమ్యాచ్ గెలుపొందక తప్పదు. ఈ నేపథ్యంలో ఐపీఎల్‌లో మేటి జట్ల మధ్య శుక్రవారం రెండో క్వాలిఫయర్ లో ఆసక్తికర పోరు జరుగనుంది. ఈ టోర్నీలో ఎవరి గడ్డపై వారు గర్జించారు. ఇప్పుడు గుజరాత్ గడ్డపై జరిగే మ్యాచ్ కావడంతో తప్పకుండా టైటాన్స్‌కు అనుకూలతలు ఉంటాయి. అయితే ఐదుసార్లు చాంపియన్ అయిన ముంబైకి ఇదేమంత ప్రతికూలం కానేకాదు. పైగా 'ఇంపాక్ట్ ప్లేయర్' రాకతో అంతా మారింది. ఏదైనా సాధ్యమే... ఏకపక్షం మాత్రం కానేకాదు! ఇంకా చెప్పాలంటే ఈ సీజన్‌లో రెండు జట్లూ చేజింగ్‌లో సత్తా చాటుకొని ఆరేసి మ్యాచ్‌ల్లో నెగ్గాయి.

**గుజరాత్ గర్జించాల్సిందే**

లీగ్ దశ పాయింట్ల పట్టికలో 'టాప్' లేపిన గుజరాత్ టైటాన్స్ చివరకు తొలి క్వాలిఫయర్‌లో నాలుగుసార్లు చాంపియన్ అయిన చెన్నై ధాటికి బోల్తా పడింది. ఇప్పుడు ఏకంగా ఐదుసార్లు విజేత ముంబై ఇండియన్స్‌ను ఎదుర్కొనేందుకు సిద్ధమైంది. ఓపెనింగ్‌లో సాహా నిరుత్సాహపరుస్తున్నా... స్టార్ ఓపెనర్ గిల్ తన మెరుపు ఇన్నింగ్స్‌లతో చెలరేగుతున్నాడు. బెంగళూరుతో ఆఖరి లీగ్‌లో 'ఇంపాక్ట్' చూపిన విజయ్ శంకర్ గత మ్యాచ్‌లో తేలిపోయాడు. కెప్టెన్ హార్దిక్ పాండ్యా పేలవ ఫామ్‌కు ముగింపు పలికి ఈ మ్యాచ్‌లో పరుగుల ధమాకా సృష్టిస్తే జట్టు విజయానికి ఢోకా ఉండదు. ఎందుకంటే మిగతా పని కానిచ్చేందుకు మిల్లర్, తెవాటియా, రషీద్ ఖాన్ ఉండనే ఉన్నారు.

**ఆఖరి దశలో ముంబైకి ఎదురుందా?**

గత కొన్ని సీజన్లను పరిశీలిస్తే ముంబై ఇండియన్స్ ఆఖరి దశలో శివాలెత్తుతోంది. తమ ఆఖరి లీగ్ మ్యాచ్‌లో 200 పైచిలుకు పరుగుల లక్ష్యాన్ని 18 ఓవర్లలోనే ఛేదించింది. ఎలిమినేటర్‌లో లక్నోను చిత్తు చేసింది. పటిష్టమైన బ్యాటింగ్, వైవిధ్యమైన బౌలింగ్ కలగలిసిన రోహిత్ సేనను ఢీకొట్టడం అంత సులభం కాదు. గ్రీన్, సూర్యకుమార్, టిమ్ డేవిడ్ అసాధారణ స్థాయిలో హిట్టింగ్ చేయగలరు. ఓపెనింగ్‌లో ఇషాన్-రోహిత్ శర్మ 'పవర్‌ప్లే' మెరుపులు మెరిపిస్తే మిగతా 'రన్స్'రంగాన్ని మిడిలార్డర్ చూసుకుంటుంది. బౌలింగ్ సంచలనం ఆకాశ్ మధ్వాల్ ఇప్పుడు ముంబై ఆదనపు బలమైంది. ఇతనితో పాటు జోర్డాన్, బెహ్రెన్‌డార్ఫ్, పీయూశ్ చావ్లాలు ప్రత్యర్థి బ్యాటర్ల పనిపడతారు.

**పిచ్, వాతావరణం**

అహ్మదాబాద్‌లో ఉష్ణోగ్రత 43 డిగ్రీలకు చేరడంతో పిచ్‌పై పగుళ్లు రాకుండా కవర్లు పరిచారు. పేస్, బౌన్స్‌కు అనుకూలమని పిచ్ క్యూరేటర్ అన్నారు. నిలదొక్కుకుంటే బ్యాటర్లకు కలిసొచ్చే పిచ్ ఇది. వర్ష సూచన లేదు.

**తుది జట్లు (అంచనా)**

ముంబై ఇండియన్స్: రోహిత్ శర్మ (కెప్టెన్), ఇషాన్ కిషన్, గ్రీన్, సూర్యకుమార్, తిలక్ వర్మ, టిమ్ డేవిడ్, నేహాల్ వధేరా, జోర్డాన్, హృతిక్ షోకీన్, పీయూశ్ చావ్లా, బెహ్రెన్‌డార్ఫ్, ఆకాశ్ మధ్వాల్.

గుజరాత్ టైటాన్స్: హార్దిక్ పాండ్యా (కెప్టెన్), సాహా, శుబ్‌మన్ గిల్, షనక, మిల్లర్, విజయ్ శంకర్/మోహిత్ శర్మ, రాహుల్ తెవాటియా, రషీద్ ఖాన్, షమీ, నూర్ అహ్మద్, షమీ.

**3** ఐపీఎల్ టోర్నీలో ముంబై, గుజరాత్ మధ్య మూడు మ్యాచ్‌లు జరిగాయి. రెండింటిలో గుజరాత్, ఒక మ్యాచ్‌లో ముంబై గెలిచాయి.

**6** ఐపీఎల్‌లో ముంబై ఆరుసార్లు ఫైనల్ చేరి ఐదుసార్లు విజేతగా నిలిచి, ఒకసారి రన్నరప్‌తో సరిపెట్టుకుంది. గతేడాది ఫైనల్ చేరిన తొలిసారే గుజరాత్ చాంపియన్‌గా నిలిచింది.

## శ్రీకాంత్ జోరు...

ప్రపంచ ఐదో ర్యాంకర్‌పై విజయం


శ్రీకాంత్


ప్రణయ్



సింధు

కౌలాలంపూర్: వ్యక్తిగత విదేశీ కోచ్‌ను నియమించుకున్న తర్వాత భారత స్టార్ షట్లర్, ఆంధ్రప్రదేశ్ క్రీడాకారుడు కిడాంబి శ్రీకాంత్ ఆటతీరులో మార్పు కనిపిస్తోంది. మలేసియా మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్-500 టోర్నీలో ప్రపంచ 23వ ర్యాంకర్ శ్రీకాంత్ క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. ప్రపంచ 5వ ర్యాంకర్ కున్లావుత్ వితిద్‌సర్న్ (థాయ్‌లాండ్)తో గురువారం జరిగిన పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రపంచ మాజీ నంబర్‌వన్ శ్రీకాంత్ 21-19, 21-19తో అద్భుత విజయం సాధించాడు. 45 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో శ్రీకాంత్ రెండు గేముల్లోనూ ఒకదశలో వెనుకబడి పుంజుకున్నాడు. కున్లావుత్‌పై శ్రీకాంత్‌కిదే తొలి గెలుపు కావడం విశేషం. గతంలో కున్లావుత్‌తో ఆడిన మూడుసార్లూ శ్రీకాంత్ వరుస గేముల్లో ఓడిపోవడం గమనార్హం.

**ఆల్ ఇంగ్లండ్ చాంపియన్‌పై నెగ్గిన ప్రణయ్**

భారత నంబర్‌వన్ హెచ్ఎస్ ప్రణయ్ మరో గొప్ప విజయంతో క్వార్టర్ ఫైనల్ బెర్త్ ఖరారు చేసుకున్నాడు. తొలి రౌండ్‌లో ప్రపంచ ఆరో ర్యాంకర్‌ను ఓడించిన ప్రణయ్ ప్రిక్వార్టర్ ఫైనల్లో ఈ ఏడాది ఆల్ ఇంగ్లండ్ చాంపియన్, ప్రపంచ 11వ ర్యాంకర్ షి ఫెంగ్ లీని బోల్తా కొట్టించాడు. 70 నిమిషాలపాటు జరిగిన మ్యాచ్‌లో ప్రపంచ తొమ్మిదో ర్యాంకర్ ప్రణయ్ 13-21, 21-16, 21-11తో షి ఫెంగ్ లీపై గెలిచాడు. నిర్ణాయక మూడో గేమ్‌లో స్కోరు 7-5తో వద్ద ప్రణయ్ వరుసగా తొమ్మిది పాయింట్లు నెగ్గి 16-5తో ఆధిక్యంలోకి వెళ్లాడు. ఈ ఆధిక్యాన్ని కాపాడుకొని విజయాన్ని ఖాయం చేసుకున్నాడు. భారత్‌కే చెందిన లక్ష్య సేన్ 14-21, 19-21తో ఎన్జీ కా లాంగ్ అంగస్ (హాంకాంగ్) చేతిలో ఓటమి చవిచూశాడు.

**సింధు వరుసగా 13వసారి...**

మహిళల సింగిల్స్‌లో భారత స్టార్, ప్రపంచ మాజీ చాంపియన్ పీవీ సింధు క్వార్టర్ ఫైనల్లోకి అడుగుపెట్టింది. ప్రిక్వార్టర్ ఫైనల్లో 13వ ర్యాంకర్ సింధు 21-16, 21-11తో ప్రపంచ 28వ ర్యాంకర్ అయా ఒహోరి (జపాన్)పై గెలిచింది. తొలి గేమ్‌లో ఆరంభంలోనే 4-0తో ముందంజ వేసిన సింధు వెనుదిరిగి చూడలేదు. రెండో గేమ్‌లోనూ ఆమెదే పైచేయిగా నిలిచింది. ఒహోరిపై సింధుకిది వరుసగా 13వ విజయం కావడం విశేషం. నేడు జరిగే క్వార్టర్ ఫైనల్స్‌లో జాంగ్ యి మాన్ (చైనా)తో సింధు; నిషిమోటో (జపాన్)తో ప్రణయ్; క్రిస్టియన్ అడినాటా (ఇండోనేసియా)తో శ్రీకాంత్ తలపడతారు.

## హారిక గేమ్ 'డ్రా'



నికోసియా (సైప్రస్): మహిళల గ్రాండ్‌ప్రి సిరీస్ చెస్ టోర్నీలో భారత గ్రాండ్‌మాస్టర్ ద్రోణవల్లి హారిక ఖాతాలో ఏడో 'డ్రా' చేరింది. తాన్ జోంగ్యి (చైనా)తో శుక్రవారం జరిగిన తొమ్మిదో రౌండ్ గేమ్‌ను హారిక 74 ఎత్తుల్లో 'డ్రా' చేసుకుంది. తొమ్మిదో రౌండ్ తర్వాత హారిక 5.5 పాయింట్లతో మరో ఇద్దరితో కలిసి సంయుక్తంగా అగ్రస్థానంలో ఉంది.

## భారత జట్టుకు మరో ఓటమి

అడిలైడ్: ఆస్ట్రేలియా పర్యటనలో భారత మహిళల హాకీ జట్టుకు మరో ఓటమి ఎదురైంది. తొలుత ఆస్ట్రేలియా సీనియర్ జట్టుతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 0-2తో కోల్పోయిన భారత్... ఆస్ట్రేలియా 'ఎ' జట్టుతో గురువారం జరిగిన తొలి మ్యాచ్‌లో 2-3 గోల్స్ తేడాతో ఓడిపోయింది. ఆసీస్ 'ఎ' తరఫున అలైస్ అర్నాట్ (18వ ని.లో) ఒక గోల్ చేయగా... రూబీ హారిస్ (20వ, 35వ ని.లో) రెండు గోల్స్ సాధించింది. భారత్ జట్టుకు సలీమా టెటె (40వ ని.లో), సంగీత కుమారి (54వ ని.లో) ఒక్కో గోల్ అందించారు. ఈ రెండు జట్ల మధ్య సిరీస్‌లోని చివరిదైన రెండో మ్యాచ్ శనివారం ఇదే వేదికపై జరుగుతుంది.

## క్లుప్తంగా...

### సీఎం జగన్ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం

**బీజేపీ నేత భానుప్రకాష్‌రెడ్డి**

సాక్షి, న్యూఢిల్లీ: పార్లమెంటు నూతన భవనం ప్రారంభోత్సవానికి హాజరుకావాలన్న ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు ఏపీ బీజేపీ నేత భానుప్రకాష్‌రెడ్డి చెప్పారు. ప్రారంభోత్సవానికి దూరంగా ఉండాలని భావించే వారిది దుష్ట ఆలోచన అని పేర్కొన్నారు. ఢిల్లీలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఉండే సంబంధమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కేంద్ర పెద్దలకు మధ్య ఉంటుందని చెప్పారు. కేంద్రానికి ఎలాంటి సీక్రెట్ అజెండాలు ఉండవన్నారు. ఏపీ ప్రజలకు కేంద్ర ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

### 74 యూఎల్బీల్లో డ్రోన్ మ్యాపింగ్

- తాడేపల్లిగూడెం, రేపల్లెల్లో ఫీల్డ్ సర్వే
- రీసర్వే యాప్‌లో వివరాల నమోదు
- అవసరమైనచోట రోవర్‌తో మ్యాపింగ్
- అర్బన్‌లో మొత్తం 50 లక్షల ఆస్తులు

సాక్షి, అమరావతి: పట్టణాల్లో ఆస్తుల రీసర్వే వేగం పుంజుకుంది. జూలై చివరి నాటికి రెండు పట్టణ స్థానికసంస్థల్లో (యూఎల్బీల్లో) నూరు శాతం మ్యాపింగ్, ఆస్తుల వివరాల నమోదు, ఆస్తుల హక్కుపత్రాల పంపిణీ వంటి పనులు పూర్తిచేయాలని మున్సిపల్ అధికారులు భావిస్తున్నారు. రాష్ట్రంలోని 123 యూఎల్బీల్లో సుమారు 50 లక్షల ఆస్తులను సర్వే చేసి, వివరాలు నమోదు చేయాల్సి ఉంది. ప్రస్తుతం 74 యూఎల్బీల్లో డ్రోన్ సర్వేతో ఇమేజ్ మ్యాపింగ్ పూర్తిచేశారు. వాతావరణం అనుకూలించక పోవడంతో కొన్నిచోట్ల పనులు ఆలస్యమవుతున్నట్టు తెలుస్తోంది. మ్యాపింగ్ పూర్తయిన చోట ఆ వీడియో మ్యాప్‌లను ల్యాబ్‌లో పరిశీలించి, సమగ్రంగా వివరాలున్న 15 యూఎల్బీల్లో ఫీల్డ్ సర్వే చేపడుతున్నారు. ఇప్పటికే తాడేపల్లిగూడెం, రేపల్లె యూఎల్బీల్లో ఫీల్డ్ సర్వే పనులు మొదలయ్యాయి. సర్వే వివరాలు సక్రమంగా ఉంటే ప్రత్యేకంగా రూపొందించిన మొబైల్ యాప్‌లో నమోదు చేస్తారు. ఫిర్యాదులుంటే వాటిని పరిగణనలోకి తీసుకుని యజమానులకు నోటీసులు జారీచేసి విచారిస్తారు. ప్రస్తుతం మ్యాపింగ్ జరుగుతున్న ప్రాంతాల్లో కొన్ని భవనాలకు చెట్లు అడ్డంగా ఉండడంతో ఆ ప్రాంతాలకు డ్రోన్లు వెళ్లలేని పరిస్థితి ఉంది. అటువంటి భవనాల మ్యాపింగ్‌ను జీపీఎస్ రోవర్లతో చేయనున్నారు.


### వైవీయూలో పీహెచ్‌డీ ప్రవేశాలకు దరఖాస్తులు

**జూన్ 12వ తేదీ వరకు గడువు**

కడప ఎడ్యుకేషన్: యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ నిర్వహించే జాతీయస్థాయి పరిశోధక పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థుల నుంచి పీహెచ్‌డీలో ఫుల్‌టైం ప్రవేశాలకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు యోగివేమన విశ్వ విద్యాలయం వీసీ ఆచార్య వైపీ వెంకటసుబ్బయ్య తెలిపారు. యూజీసీ-నెట్/యూజీసీ-సీఎస్ఐఆర్/ సెట్- సీఈఈడీలో ఫెలోషిప్/స్కాలర్‌షిప్‌కు అర్హత సాధించిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులన్నారు. దరఖాస్తు స్వీకరణకు గడువు జూన్ 12వ తేదీకి ముగుస్తుందని తెలిపారు.దరఖాస్తు ఫారాలను yvu.edu.in వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. రిజిస్ట్రేషన్ కోసం జనరల్ విద్యార్థులకు రూ. 2 వేలు, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ విద్యార్థులు రూ.1,300 చెల్లించాలని చెప్పారు. వైఎస్సార్ జిల్లా కడపలోని యోగివేమన విశ్వవిద్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. రిజిస్ట్రేషన్ విధానం, ప్రతిభను అనుసరించి ఎంపికలుంటాయని తెలిపారు. వివరాలకు 7989208188, 8317532040 నంబర్లలో సంప్రదించాలని వెంకటసుబ్బయ్య తెలిపారు.

### సీబీఐ అంటే చేతగాని సంస్థ కాదు

- కొన్ని పత్రికల తీరుపై ఎంపీ జీవీఎల్ మండిపాటు



ఎంవీపీ కాలనీ (విశాఖ తూర్పు): మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు దర్యాప్తు విషయంలో సీబీఐ తీరును కొన్ని మీడియా సంస్థలు విమర్శించడంపై బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు మండిపడ్డారు. గురువారం విశాఖలోని పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. సీబీఐ అంటే చేతగాని సంస్థ అనుకుంటున్నారా అంటూ ఆయా మీడియా సంస్థలపై మండిపడ్డారు. ఎప్పుడు ఏది చేయాలో ఆ సంస్థ అధికారులకు తెలుసన్నారు. సీబీఐ రాజ్యాంగ బద్ధమైన సంస్థ అని, దాన్ని అడ్డుకోవడం ఎవరి వల్లా కాదని స్పష్టం చేశారు. సొంత ప్రయోజనం కోసం కొన్ని సంస్థలు అవినాశ్‌రెడ్డి అరెస్ట్‌పై అత్యుత్సాహం చూపుతున్నాయన్నారు. అవినాశ్‌రెడ్డి ఇంటికి సీబీఐ బృందం బయలుదేరింది, దారిలో ఉంది, కొద్దిసేపట్లో అరెస్ట్ చేయనుంది వంటి వార్తల ప్రచారం ఆయా సంస్థల దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. కొన్ని పత్రికలు వాటికున్న ఉత్సాహంతో సీబీఐ కేసులో అవినాశ్‌రెడ్డిని ఎందుకు అరెస్ట్ చేయలేకపోతున్నారు, అరెస్టుకు ఆయన సహకరించడం లేదా, సీబీఐకి చేతకావడం లేదా అంటూ వార్తలు ప్రచురించడాన్ని ఆయన ఖండించారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం బీజేపీ ప్రభుత్వం ఏపీకి పెద్దఎత్తున సాయం అందిస్తోందని జీవీఎల్ చెప్పారు.

---

జాతీయ రహదారుల నిర్మాణంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మరోసారి తన సత్తాను చాటింది. 2022-23లో జాతీయ రహదారుల నిర్మాణంలో దేశంలోనే ఆంధ్రప్రదేశ్‌ను అగ్రస్థానంలో నిలిపింది. ఈ మేరకు జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ(ఎన్‌హెచ్‌ఏఐ) నివేదిక వెల్లడించింది. కేంద్ర జాతీయ రహదారుల శాఖ నిధులతో రాష్ట్ర ఆర్ అండ్ బీ శాఖ చేపట్టే రహదారుల నిర్మాణంలోనూ దేశంలో ఏపీ రెండోస్థానంలో నిలిచింది. తద్వారా ఎన్‌హెచ్‌ఏఐ రహదారుల నిర్మాణంలో, కేంద్రం నిధులతో ఆర్ అండ్ బీ శాఖ ఆధ్వర్యాన రోడ్ల నిర్మాణంలోనూ ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో ఉండటం ప్రాధాన్యతను సంతరించుకుంది. రోడ్ల నిర్మాణాలకు గరిష్టంగా నిధులు రాబట్టడంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాధించిన విజయానికి ఇది నిదర్శనంగా నిలుస్తోంది. సాక్షి, అమరావతి



# ఎన్‌హెచ్ నిర్మాణాల్లో ఏపీ టాప్

## 2022-23లో అత్యధికంగా 845 కి.మీ. నిర్మాణం

**ఆర్‌అండ్‌బీ ద్వారా ఎన్‌హెచ్‌లనిర్మాణంలోనూ రికార్డు**

**నాలుగేళ్లలో రూ.23,471.92 కోట్లు నిధులు రాబట్టిన రాష్ట్ర ప్రభుత్వం**

**టీడీపీ ఐదేళ్లలో సాధించింది కేవలం రూ.10,661 కోట్లే..**

### ఆర్‌అండ్‌బీ ద్వారా నిర్మాణాల్లోనూ రెండోస్థానం

కేంద్ర జాతీయ రహదారులు, రవాణా శాఖ నిధులతో రాష్ట్ర ప్రభుత్వం నిర్మించే రహదారుల్లోనూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తన సమర్థతను నిరూపించుకుంది. రాష్ట్రంలో జాతీయ రహదారుల అభివృద్ధికి వరుసగా నాలుగో ఏడాది కూడా కేంద్రం నుంచి రికార్డు స్థాయిలో నిధులను సాధించింది. 2022-23 వార్షిక ప్రణాళికలో రాష్ట్రానికి రూ.12,130 కోట్లు రాబట్టింది. కేంద్ర ప్రభుత్వం ఏటా ఆర్థిక సంవత్సరం ప్రారంభంలో వార్షిక ప్రణాళిక కింద ఆమోదించిన నిధులతో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న రహదారుల ప్రాజెక్టులను పరిశీలిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వ పనితీరు పట్ల సంతృప్తి చెందితేనే ఆ మేరకు ఆర్థిక సంవత్సరం ఆఖరులో నిధులు మంజూరు చేస్తుంది. రాష్ట్రంలో జాతీయ రహదారుల నిర్మాణంపై రాష్ట్ర ప్రభుత్వ పనితీరుతో పూర్తి సంతృప్తి చెందినందున రికార్డు స్థాయిలో వార్షిక ప్రణాళిక నిధులను కేంద్రం మంజూరు చేసింది. ఉత్తరప్రదేశ్ తర్వాత అత్యధికంగా ఆంధ్రప్రదేశ్‌కే నిధులు మంజూరు చేయడం విశేషం. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంలో 2014-19 వరకు భాగస్వామిగా ఉన్నప్పటికీ నాటి టీడీపీ ప్రభుత్వం పెద్దగా నిధులు రాబటలేకపోయింది. ఐదేళ్లలో టీడీపీ సర్కారు కేవలం రూ.10,661 కోట్లు మాత్రమే తీసుకువచ్చింది. కానీ, కేంద్ర ప్రభుత్వంలో భాగస్వామి కానప్పటికీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జాతీయ రహదారుల నిర్మాణానికి రికార్డుస్థాయిలో నిధులు తీసుకురావడం విశేషం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఒక్క 2022-23లోనే రూ.12,130 కోట్లు సాధించింది. మొత్తం నాలుగేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రికార్డు స్థాయిలో రూ.23,471.92 కోట్లు సాధించడం ప్రాధాన్యతను సంతరించుకుంది. 2019 జూన్ నాటికి రాష్ట్రంలో 6,861.68 కి.మీ.మేర జాతీయ రహదారులు ఉండేవి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత కొత్తగా 1,302.04 కి.మీ. మేర జాతీయ రహదారులను నిర్మించింది. దాంతో 2023 మార్చి నాటికి రాష్ట్రంలో 8,163.72 కి.మీ.మేర జాతీయ రహదారులు ఉన్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలో పారిశ్రామిక, తీర ప్రాంతాలు, ఎకనామిక్ జోన్లు, పర్యాటక ప్రదేశాలను అనుసంధానిస్తూ రహదారుల అభివృద్ధి జోరందుకుంది.

### బీజేపీ పాలిత రాష్ట్రాల కన్నా మిన్నగా...

ఎన్‌హెచ్‌ఏఐ 2022-23లో దేశవ్యాప్తంగా 6,003 కి.మీ. మేర రహదారులను నిర్మించింది. అందులో అత్యధికంగా 845 కి.మీ.మేర జాతీయ రహదారుల నిర్మాణంతో ఆంధ్రప్రదేశ్ మొదటిస్థానంలో నిలిచింది. రెండో స్థానంలో ఉత్తరప్రదేశ్ (740 కి.మీ.), మూడో స్థానంలో మధ్యప్రదేశ్ (524 కి.మీ.), నాలుగో స్థానంలో జార్ఖండ్ (442 కి.మీ.), ఐదో స్థానంలో కర్ణాటక (419 కి.మీ.) నిలిచాయి. బీజేపీ పాలిత రాష్ట్రాల కంటే కూడా ఆంధ్రప్రదేశ్‌లో అత్యధికంగా జాతీయ రహదారులను నిర్మించడం ప్రాధాన్యతను సంతరించుకుంది. రాష్ట్రంలో కొత్త జాతీయ రహదారుల్లో 56శాతం హైబ్రిడ్ యాన్యుటీ విధానం (హెచ్‌ఏఎం)లో, ఈపీసీ విధానంలో 35శాతం, ఐటం రేట్ విధానంలో 8శాతం, బీవోటీ విధానంలో ఒక శాతం నిర్మించినట్లు ఎన్‌హెచ్‌ఏఐ వెల్లడించింది. ఇక ప్రాజెక్టు నిర్మాణ విలువలో కూడా అత్యధికంగా 68 శాతంతో హెచ్‌ఏఎం విధానంలోనే నిర్మించారు.

---

## ఆ కానిస్టేబుల్‌ను కొనసాగించడం వృథా

**తప్పనిసరి పదవీ విరమణ ఉత్తర్వులను సమర్థించిన హైకోర్టు**

సాక్షి, అమరావతి: విధి నిర్వహణలో నిర్లక్ష్యం, విధులకు డుమ్మా కొట్టడం, మద్యం తాగి విధులకు హాజరు కావడం నిత్యకృత్యంగా మారిన ఓ పోలీస్ కానిస్టేబుల్ తప్పనిసరి పదవీ విరమణకు ఆదేశాలిస్తూ ఉన్నతాధికారులు జారీ చేసిన ఉత్తర్వులను హైకోర్టు సమర్థించింది. ఆ పోలీసు తన దుష్ప్రవర్తన, వివరీత నడవడిక ద్వారా ప్రభుత్వ ఉద్యోగికి నిర్దేశించిన అన్ని నియమాలను ఉల్లంఘించారని, అలాంటి వ్యక్తి అభ్యర్థనలను ఏ రకంగానూ పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. అందువల్ల తప్పనిసరి పదవీ విరమణకు ఆదేశాలిస్తూ ఉన్నతాధికారులు జారీ చేసిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ పోలీస్ కానిస్టేబుల్ దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టేస్తున్నట్టు తెలిపింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు ఇటీవల తీర్పు వెలువరించారు. తూర్పు గోదావరి జిల్లా కాకినాడ ఏపీఎస్పీలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న వై.బాలకృష్ణను వివిధ కారణాల రీత్యా 2010లో తొలగిస్తూ కాకినాడ ఏపీఎస్పీ కమాండెంట్ ఉత్తర్వులు జారీ చేశారు. దీనిపై బాలకృష్ణ ఏపీఎస్పీ డీఐజీకి అప్పీల్ చేసుకోగా.. బాలకృష్ణ సర్వీస్, అతని కుటుంబ పరిస్థితులను పరిగణనలోకి తీసుకున్న డీఐజీ అతనిపై కనికరం చూపారు. సర్వీసు నుంచి తొలగిస్తూ ఇచ్చిన ఉత్తర్వులను సవరించి తప్పనిసరి పదవీ విరమణగా మారుస్తూ 2011లో ఉత్తర్వులు జారీ చేశారు. వీటిపై బాలకృష్ణ డీజీపీ ముందు రివిజన్ పిటిషన్ దాఖలు చేసుకోగా.. ఆధారాలను పరిశీలించిన డీజీపీ తప్పనిసరి పదవీ విరమణకు డీఐజీ ఇచ్చిన ఉత్తర్వులను సమర్థిస్తూ 2012లో ఉత్తర్వులిచ్చారు. దీనిపై బాలకృష్ణ హోం శాఖ ముఖ్య కార్యదర్శికి క్షమాభిక్ష పిటిషన్ సమర్పించారు. ఆ పిటిషన్‌ను ముఖ్య కార్యదర్శి 2016లో తిరస్కరించారు. డీఐజీ, డీజీపీ, ముఖ్య కార్యదర్శులు జారీ చేసిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ బాలకృష్ణ 2020లో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తనను తిరిగి విధుల్లోకి తీసుకోవడంతో పాటు జీతం బకాయిలు, ప్రయోజనాలన్నింటినీ చెల్లించేలా ఆదేశించాలని కోరారు. ఈ వ్యాజ్యంపై విచారణ జరిపిన జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు ఏడేళ్ల సర్వీసులో 8 శిక్షలకు గురైన ఉద్యోగి ప్రభుత్వ ఉద్యోగిగా కొనసాగేందుకు అర్హుడు కాదని తేల్చారు. అతని పిటిషన్‌ను కొట్టేస్తున్నట్టు తీర్పులో పేర్కొన్నారు.

## జూన్‌లో ఏపీఎల్-2 క్రికెట్ పోటీలు

- 22 నుంచి జూలై 3 వరకు నిర్వహణ
- విశాఖలో పురుషుల లీగ్.. విజయనగరంలో ఉమెన్స్ లీగ్ మ్యాచ్‌లు
- ఫైనల్స్‌ను విశాఖలో నిర్వహిస్తాం
- ఏసీఏ రాష్ట్ర కార్యదర్శి గోపీనాథ్‌రెడ్డి



కదిరిలో మీడియాతో మాట్లాడుతున్న ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.ఆర్.గోపీనాథ్‌రెడ్డి

కదిరి: ఏపీఎల్(ఆంధ్ర ప్రీమియర్ లీగ్)సీజన్-2 క్రికెట్ పోటీలను జూన్ 22 నుంచి జూలై 3వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.ఆర్.గోపీనాథ్‌రెడ్డి వెల్లడించారు. విశాఖపట్నంలో పురుషుల లీగ్ మ్యాచ్‌లు, విజయనగరంలో ఉమెన్స్ లీగ్ మ్యాచ్‌లు జరుగుతాయని చెప్పారు. ఫైనల్స్ రెండూ విశాఖపట్నంలో ఫ్లడ్‌లైట్ల వెలుతురులో నిర్వహిస్తామని తెలిపారు. గురువారం ఆయన శ్రీసత్యసాయి జిల్లా కదిరిలో లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఏపీఎల్ సీజన్-2లో సీనియర్ క్రికెటర్లతో పాటు అండర్-19 ఆటగాళ్లు కూడా పాల్గొంటారని చెప్పారు. ఈ మ్యాచ్‌లను జాతీయ స్పోర్ట్స్ చానల్స్ ప్రత్యక్ష ప్రసారం చేస్తాయని తెలిపారు. లీగ్‌లో మొత్తం 21 మ్యాచ్‌లు నిర్వహిస్తామని.. ఒక్కో జట్టు ఆరు మ్యాచ్‌లు ఆడాల్సి ఉంటుందన్నారు. గ్రామీణ క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికి తీసేందుకు ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తోందన్నారు. కడప, మంగళగిరి క్రికెట్ స్టేడియాలకు త్వరలోనే ఫ్లడ్‌లైట్లు అమర్చనున్నట్లు తెలిపారు. పులివెందులలో నిర్మిస్తున్న క్రికెట్ స్టేడియానికి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే రూ.10 కోట్లకు పైగా నిధులు ఖర్చు చేసిందని పేర్కొన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఏపీలో క్రికెట్ క్రీడాకారులకు పెన్షన్‌తో పాటు ఉచిత వైద్య సదుపాయం ఉందని చెప్పారు. ఐపీఎల్‌లో ఆంధ్ర జట్టుపై మీడియా ప్రశ్నించగా.. వచ్చే ఏడాది కాకపోయినా భవిష్యత్‌లో ఆంధ్ర జట్టు కచ్చితంగా ఉంటుందన్నారు. అనంతరం ఆయన్ను అనంతపురం క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు మద్దా రామలింగారెడ్డితో పాటు పలువురు జర్నలిస్టులు సన్మానించారు.

---

## విలువ ఆధారిత ఉత్పత్తులతో ఆరోగ్యం

- మంత్రి గుడివాడ అమర్‌నాథ్
- ఎంపీ సత్యవతితో కలిసి అనకాపల్లి ఆర్ఏఆర్ఎస్‌లో ఇంక్యుబేషన్ సెంటర్‌కు శంకుస్థాపన
- చెరకు, చిరుధాన్యాలు, పనస ఉత్పత్తుల ఎగుమతులకు అవకాశం



శంకుస్థాపన చేస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ సత్యవతి, జేసీ జాహ్నవి, రీసెర్చ్ డైరెక్టర్ ప్రశాంతి

అనకాపల్లి టౌన్: విలువ ఆధారిత ఉత్పత్తులు తీసుకోవడం ద్వారా ఆరోగ్యకరంగా జీవించవచ్చని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చెప్పారు. జిల్లా కేంద్రం అనకాపల్లిలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం (ఆర్ఏఆర్ఎస్) ఆవరణలో ఇంక్యుబేషన్ (బెల్లం, చిరుధాన్యాలు, పనస) సెంటర్‌కు గురువారం ఎంపీ డాక్టర్ బి.వి.సత్యవతితో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైమ్ మినిస్టర్స్ ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్ (పీఎంఎఫ్ఎంఈ)లో భాగంగా కేంద్ర ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమలశాఖ సహకారంతో ఈ ఇంక్యుబేషన్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. వ్యవసాయ ఉత్పత్తులతో పాటు వాటి ఆధారిత ఉత్పత్తులు కూడా ఈ సెంటర్ ద్వారా ఇతర రాష్ట్రాలకు, విదేశాలకు ఎగుమతి కానున్నాయని తెలిపారు. చెరకు, చిరుధాన్యాలు, పనస ప్రత్యేక విభాగాలు ఏర్పాటు చేస్తారని చెప్పారు. ఎంపీ భీశెట్టి వెంకటసత్యవతి మాట్లాడుతూ ఇంక్యుబేషన్ సెంటర్‌కు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.3 కోట్లు విడుదల చేసినట్లు తెలిపారు. అందులో రూ.కోటితో భవనం నిర్మించి, మిగిలిన నిధులతో చెరకు, పనస, చిరుధాన్యాల ఉత్పత్తుల తయారీకి యంత్రాలను కొనుగోలు చేస్తామని చెప్పారు. ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం మరో రూ.30 లక్షలు విడుదల చేసినట్లు తెలిపారు. విలువ ఆధారిత ఉత్పత్తులు, చిరుధాన్యాలు, చెరకులో ఆధునిక పద్ధతులపై పుస్తకాలను డాక్టర్ ప్రశాంతి, ఎంపీ సత్యవతి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విశ్వవిద్యాలయం డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ ఎల్.ప్రశాంతి, జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి, ఉద్యానవనశాఖ జిల్లా అధికారి ప్రభాకర్, జిల్లా వ్యవసాయ శాఖ జేడీ మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

## కుదుటపడుతున్న శ్రీలక్ష్మి ఆరోగ్యం

- త్వరలోనే క్రిటికల్ కేర్ యూనిట్ నుంచి ప్రత్యేక గదికి
- పూర్తిగా మెరుగైతే డిశ్చార్జి చేసే అవకాశం
- తల్లివద్దే ఉంటూ బాగోగులు చూసుకుంటున్న ఎంపీ అవినాశ్‌రెడ్డి
- అవినాశ్‌ను దోషిగా చిత్రీకరిస్తున్నారన్న కేఏ పాల్



మీడియాతో మాట్లాడుతున్న కేఏ పాల్

సాక్షి ప్రతినిధి, కర్నూలు: ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి మాతృమూర్తి శ్రీలక్ష్మి ఆరోగ్యం క్రమంగా మెరుగవుతోంది. ఆమె ఆరోగ్యంపై విశ్వభారతి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి యాజమాన్యం గురువారం హెల్త్ బులెటిన్ విడుదల చేసింది. మూడు రోజులతో పోలిస్తే శ్రీలక్ష్మి ఆరోగ్య పరిస్థితి మెరుగుపడింది. అల్ట్రా సౌండ్ స్కానింగ్ చేస్తే అనారోగ్య సమస్యలు కన్పించలేదు. వాంతులు తగ్గాయి. ప్రస్తుతం ఆమె నోటి ద్వారా ఆహారం తీసుకుంటున్నారు. బీపీని నియంత్రించేందుకు అమినోట్రోప్స్ మందులు వాడేవారు. ఇప్పుడు వాటిని నిలిపేశారు. ఆ మందులు లేకుండానే బీపీ నిలకడగా ఉంది. త్వరలోనే క్రిటికల్ కేర్ యూనిట్ నుంచి గదిలోకి మార్చనున్నారు. గుండెలో రెండు రక్తనాళాలు బ్లాక్ అయ్యాయని పరీక్షల్లో తేలింది. వీటికి చికిత్స అందించే ప్రయత్నాలు వైద్యులు చేస్తున్నారు. తన తల్లి శ్రీలక్ష్మి ఆరోగ్యం మెరుగవుతోందని వైద్యులు చెప్పడంతో అవినాశ్ ధైర్యంగా ఉన్నారు. ఆరు రోజులుగా ఆందోళన చెందుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలకు ఉపశమనం లభించినట్టయింది.

**అవినాశ్‌ను దోషిగా చిత్రీకరిస్తున్నారు: కేఏ పాల్**

ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ గురువారం విశ్వభారతి ఆస్పత్రికి వచ్చి శ్రీలక్ష్మిని పరామర్శించారు. ఆమె ఆరోగ్యం మెరుగుపడాలని ప్రార్థనలు చేశారు. అవినాశ్‌ను ఓదార్చారు. ఆ తర్వాత మీడియాతో మాట్లాడారు. తాను టర్కీకి వెళ్లాల్సి ఉందని.. బుధవారం వైఎస్ వివేకానందరెడ్డి సోదరి విమలమ్మ ప్రెస్‌మీట్ చూశానని చెప్పారు. విమలమ్మ, వైఎస్ కుటుంబానికి దైవభక్తి ఎక్కువన్నారు. విమలమ్మ మాటలు తన గుండెలను తాకాయన్నారు. అవినాశ్ తల్లిని చూడాలని కర్నూలుకు వచ్చానన్నారు. వివేకా హత్యలో అవినాశ్‌కు ఎలాంటి సంబంధం లేదని, ఆయన నేరానికి పాల్పడలేదన్నారు. కానీ అతన్ని దోషిగా చిత్రీకరించే ప్రయత్నం జరుగుతోందన్నారు. అవినాశ్‌కు న్యాయం జరగాలని ప్రార్థిస్తున్నానని చెప్పారు. ఆస్పత్రిలో అవినాశ్‌ను నేను ముక్కుసూటిగా అడిగా.. 'ఈ కేసుతో నాకు ఎలాంటి సంబంధం లేదు. సీబీఐ ఎప్పుడు పిలిచినా వెళుతున్నా. కొందరు నన్ను దోషిగా చూపించాలని అనుకుంటున్నారు' అని అవినాశ్ ఆవేదన వ్యక్తం చేశారన్నారు. వివేకాకు కచ్చితంగా న్యాయం జరగాల్సిందేనని, ఆయన ఆత్మ ఘోషిస్తోందని, అలా అని నిర్దోషిని దోషిగా చూపించకూడదని అన్నారు. ఎందుకంటే తాను కూడా ఇలాంటి బాధను అనుభవిస్తున్నా అన్నారు. శ్రీలక్ష్మి సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని, సీబీఐ విచారణ నిష్పాక్షికంగా జరిగి న్యాయం జరగాలని అందరూ ప్రార్థించాలన్నారు.

**ఆస్పత్రి వద్దే నేతలు, కార్యకర్తలు**

శ్రీలక్ష్మి ఆరోగ్యం బాగుండాలని కాంక్షిస్తూ ఆరు రోజులుగా వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు ఆస్పత్రి వద్దే ఉన్నారు. గురువారం ఆర్టీసీ చైర్మన్ దుగ్గాయపల్లి మల్లికార్జునరెడ్డి, ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, హఫీజ్‌ఖాన్, డాక్టర్ సుధాకర్, ఆర్థర్, సుధీర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి శ్రీలక్ష్మిని పరామర్శించారు. బుధవారం రాత్రి పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పరామర్శించారు.

---





విద్యుత్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించడం కోసం కేంద్రం ఫాస్టర్ అడాప్షన్ ఆఫ్ మాన్యుఫాక్చరింగ్ ఆఫ్ ఎలక్ట్రిక్ వెహికల్స్ (ఎఫ్ఏఎంఈ) పథకాన్ని తీసుకొచ్చింది. ఇందుకోసం 2019-22 మధ్య మూడేళ్ల కాలానికి ఫేమ్ పథకంలో రూ.10 వేల కోట్లను కేటాయించింది. మన రాష్ట్రంతో పాటు దేశవ్యాప్తంగా 14 రాష్ట్రాలు ఈ పథకం ద్వారా ఎలక్ట్రిక్ వెహికల్స్ (ఈవీ)లను ప్రోత్సహించడానికి ప్రత్యేక విధివిధానాలను రూపొందించాయి. ఈ పథకాన్ని 2024 మార్చి 31 వరకూ పొడిగిస్తున్నట్టు కేంద్రం ఈ ఏడాది జనవరిలో ప్రకటించింది. దీనిద్వారా ప్రైవేట్ ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోలుపై ట్యాక్స్ బెనిఫిట్స్ ఇస్తోంది. ద్విచక్ర వాహనాలకు కిలోవాట్‌కు రూ.15 వేలను, త్రిచక్ర, నాలుగు చక్రాల వాహనాలకు రూ.10 వేలను, బస్సులకు రూ.20 వేలను రాయితీగా అందిస్తోంది. దీంతో ఏపీలో దాదాపు 22 వేలు, దేశవ్యాప్తంగా 4 లక్షల విద్యుత్ వాహనాల విక్రయం జరిగింది. కానీ సబ్సిడీని కుదిస్తున్నట్టు ప్రకటించి తాజాగా కేంద్రం పెద్ద షాక్ ఇచ్చింది.

**భారీ షాక్ ఇది**

# ఈ-బైక్ కొనాలంటే.. త్వరపడండి!

**ఈ నెలాఖరు తర్వాత విద్యుత్ వాహనాల రాయితీల్లో మార్పులు**

- ప్రస్తుతం వాహన ధరలో 15 శాతం నుంచి 40 శాతం సబ్సిడీ ఇస్తున్న కేంద్రం
- జూన్ 1 తరువాత కొనుగోలు, రిజిస్ట్రేషన్ చేసిన వాహనాలకు 15 శాతమే రాయితీ
- వాహన ధర ఎక్కువగా ఉంటే గరిష్టగా రూ.10 వేల వరకే సాయం

సాక్షి, అమరావతి: ఈ-బైక్ కొనాలనుకుంటున్నారా. అయితే, త్వరపడండి. ఈ ఏడాది జూన్ 1వ తేదీ తర్వాత రిజిస్టర్ అయ్యే ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలపై వర్తించే ఫేమ్-2 (దేశంలో ఎలక్ట్రిక్ వాహనాల తయారీకి ప్రోత్సాహం) పథకం కింద అందించే సబ్సిడీని తగ్గించాలని కేంద్ర భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖ నిర్ణయించింది. ప్రస్తుతం ఈ బైక్స్‌పై 15 శాతం నుంచి 40 శాతం వరకూ సబ్సిడీ లభిస్తుండటంతో వీటిని కొనుగోలు చేయడానికి వాహనదారులు ఆసక్తి చూపిస్తున్నారు. కాగా.. కేంద్ర నిర్ణయంతో ఇకపై వాహన ధరలో కేవలం 15 శాతం లేదా కిలోవాట్ అవర్ (కేడబ్ల్యూహెచ్)కు రూ.10 వేలు ఏది తక్కువైతే అది మాత్రమే సబ్సిడీగా లభించనుంది.

### పెట్రోల్ వాహనాలతో పోలిస్తే 4.9 శాతమే

నిజానికి అంతర్జాతీయంగా ఈవీల శాతం పెట్రోల్ వాహనాలతో పోలిస్తే 20 శాతంగా ఉంది. మన దేశంలో ఇది కేవలం కేవలం 4.9 శాతం మాత్రమే. కనీసం అంతర్జాతీయ బెంచ్ మార్క్‌ను చేరుకునే వరకైనా రాయితీలను కొనసాగిస్తే మంచిదనే వాదనలు మార్కెట్ వర్గాల నుంచి వినిపిస్తున్నాయి. అయితే భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖ కొన్ని నెలల క్రితమే దీని గురించి చెప్పుకొచ్చింది. రానున్న నాలుగేళ్లలో 1 మిలియన్ ఈవీ అమ్మకాల లక్ష్యాన్ని చేరుకోనున్నామని, ఆ తర్వాత సబ్సిడీని కొనసాగించలేమని స్పష్టం చేసింది. కానీ ఒక లీటర్ పెట్రోల్ 2.3 కిలోల కాలుష్యాన్ని విడుదల చేస్తుంది. ఈవీల కొనుగోలు తగ్గితే 2030 నాటికి 1 మిలియన్ కర్బన ఉద్గారాలను (కాలుష్యం) తగ్గించాలనే లక్ష్యాన్ని చేరుకోలేకపోవచ్చని పర్యావరణ శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

---

## మెడికల్ ప్రొఫెసర్ల బదిలీలకు గ్రీన్‌సిగ్నల్

- షెడ్యూల్ విడుదల చేసిన ప్రభుత్వం


సాక్షి, అమరావతి : వైద్య విద్య శాఖలో ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్ల బదిలీలకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రిన్సిపాళ్లు, బోధనాస్పత్రుల సూపరింటెండెంట్లతో కలసి డైరెక్టరేట్ మెడికల్ ఎడ్యుకేషన్ బదిలీల ప్రక్రియను నిర్వహిస్తారు. ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్ల బదిలీల పర్యవేక్షణకు అదనపు డీఎంఈ నేతృత్వంలో, అసిస్టెంట్ ప్రొఫెసర్ల బదిలీల పర్యవేక్షణకు జాయింట్ డైరెక్టర్ నేతృత్వంలో రెండు వేర్వేరు కమిటీలను నియమించింది. ఈ మేరకు ప్రభుత్వం గురువారం విడుదల చేసిన బదిలీల ప్రక్రియ షెడ్యూల్ ఇలా ఉంది.

**ఐదేళ్ల సర్వీస్ పూర్తి చేస్తే..**

- ఒకే కేంద్రంలో ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసిన ఉద్యోగుల జాబితా ఈ నెల 26న (శుక్రవారం) విడుదలవుతుంది.
- దీర్ఘకాలంగా ఒకే కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల జాబితాను ఈ నెల 27న (శనివారం) డీఎంఈ ప్రకటిస్తారు.
- దీర్ఘకాలంగా పనిచేస్తున్న ఉద్యోగుల జాబితాపై అభ్యంతరాలను ఈ నెల 28 (ఆదివారం) వరకు స్వీకరిస్తారు.
- బదిలీల కోసం దరఖాస్తులను ఈ నెల 26 నుంచి 30 వరకు స్వీకరిస్తారు.
- బదిలీల కోసం వచ్చిన దరఖాస్తుల జాబితా, దీర్ఘకాలిక ఉద్యోగుల జాబితాలపై అభ్యంతరాలను వైద్య కళాశాలల ప్రిన్సిపాళ్లు మే 31న డీఎంఈకి సమర్పిస్తారు.
- బదిలీల కోసం దరఖాస్తు చేసిన వారిలో అర్హులైన ఉద్యోగుల జాబితా, అందుబాటులో ఉన్న ఖాళీల వివరాలను జూన్ 2న ప్రకటిస్తారు.
- ఆ జాబితాలపై అభ్యంతరాలను జూన్ 3 వరకు స్వీకరిస్తారు.
- అభ్యంతరాల పరిశీలన, పరిష్కారం జూన్ 5న చేపడతారు.
- వైద్య ప్రొఫెసర్ల బదిలీల కౌన్సెలింగ్‌ను జూన్ 6, అసోసియేట్ ప్రొఫెసర్ల బదిలీల కౌన్సెలింగ్ జూన్ 7న, అసిస్టెంట్ ప్రొఫెసర్ల బదిలీల కౌన్సెలింగ్ జూన్ 8, 9 తేదీల్లో చేపడతారు.

## రైలుకింద పడి తల్లీపిల్లల అఘాయిత్యం

- తల్లి, కుమారుడు మృతి.. కుమార్తె పరిస్థితి విషమం
- కుటుంబ కలహాలే కారణమని భావిస్తున్న రైల్వే పోలీసులు



మృతి చెందిన శ్రీదేవి సత్యప్రభ, త్రిభువన్ (ఫైల్)

తాడేపల్లిగూడెం : రైలుకింద పడి తల్లీపిల్లలు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన గురువారం రాత్రి పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో చోటుచేసుకుంది. ఈ ఘటనలో తల్లి, కొడుకు అక్కడికక్కడే మృతిచెందగా, కుమార్తె తీవ్రంగా గాయపడింది. వివరాలివీ.. తాడేపల్లిగూడెం పట్టణంలోని శేషమహల్ థియేటర్ వద్ద గుత్తి శివాంజనేయులు కుటుంబం ఉంటోంది. ఈయనకు భార్య శ్రీదేవి సత్యప్రభ (38), కుమారుడు త్రిభువన్ (18), కుమార్తె అమృత (16) ఉన్నారు. ఇంట్లో ఏం జరిగిందో తెలీదుగానీ శ్రీదేవి సత్యప్రభ, త్రిభువన్, అమృత గురువారం రాత్రి పాతూరు సుబ్రహ్మణ్యస్వామి గుడి ఎదురుగా కొత్తగా నిర్మించిన రైల్వే భవనం వద్ద రైలుకింద పడి ఆత్మహత్యాయత్నం చేశారు. విజయవాడ వైపు వెళ్తున్న ఒక రైలుకు ఎదురుగా వెళ్లి త్రిభువన్ అక్కడికక్కడే మరణించాడు. కుమారుడు చనిపోయిన వెంటనే తల్లి సత్యప్రభ, కుమార్తె అమృత అదే మార్గంలో వెళ్తున్న తిరుమల ఎక్స్‌ప్రెస్‌కు ఎదురుగా వెళ్లి ఆత్మహత్యాయత్నం చేశారు. ఈ ప్రమాదంలో సత్యప్రభ అక్కడికక్కడే మరణించగా, అమృతకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న తాడేపల్లిగూడెం రైల్వే పోలీసులు అమృతను ఆసుపత్రికి తరలించారు. ఆత్మహత్యకు దారితీసిన కారణాలు తెలియడంలేదు. కుటుంబ కలహాలుగా రైల్వే పోలీసులు భావిస్తున్నారు. మరోవైపు.. శివాంజనేయులు.. ఆసుపత్రిలో కుమార్తె వెంట ఉన్నాడు. సత్యప్రభ పుట్టింటి వారు వస్తేగానీ కారణాలు తెలిసే అవకాశంలేదని రైల్వే ఎస్ఐ కె.హరిబాబు చెబుతున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkatuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenahalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangal Media Pvt Ltd, 22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No TNTEL/2008/25943